
వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 6 సంచిక : 9 హైదరాబాద్ 86 సెప్టెంబర్ 2008 పేజీలు : 56 రు. 10



* ఫోకస్ : మారుతున్న హైదరాబాద్
  ఐదు వ్యాసాలు
* చిరంజీవి ప్రజాసేవ
* పరాధీనభారతం - నిన్న, నేడు
* కొత్త ఖనిజ విధానం
* అర్థశాస్త్ర బోధన - అవసరమైన అంశాలు

వీక్షణానికి మీ చేయూతనందించండి !

ఆరు సంవత్సరాలుగా ప్రతినెలా మీతో సంభాషిస్తూ, సమకాలీన రాజకీయార్థిక, సామాజిక పరిణామాలపై కొత్త ఆలోచనలను, వైవిధ్యపూరితమైన చర్చను ప్రోత్సహిస్తూ, మీ ఆదరణ చూరగొంటూ వస్తున్న వీక్షణం తన ఆర్థికస్థితిని కూడ మీతో పంచుకోదలచుకుంటున్నది.

వీక్షణం ఇప్పుడు నడుస్తున్న పద్ధతిలో, పెరుగుతున్న న్యూస్ ప్రింట్ ధరలు, ప్రింటింగ్ ఖర్చులు, కార్యాలయ నిర్వహణ, పోస్టింగ్ వంటి ఖర్చులన్నీ కలుపుకుంటే ఒక్కొక్క ప్రతికి ఉత్పత్తివ్యయం రు. 14 గా ఉంటున్నది. కాగా ప్రతి సంచికకూ చందాదారులు చెల్లించేది రు. 10. అందులో పోస్టేజి ఖర్చులు మినహాయిస్తే వాస్తవంగా చెల్లిస్తున్నది రు. 9 కన్న తక్కువ. పత్రిక విడిప్రతిని దుకాణాలలో కొనుక్కునేవారు రు. 10 చెల్లించి కొనుక్కున్నపటికీ, ఏజెంట్ కమిషన్ పోగా వారి నుంచి పత్రికకు అందేది ఒక్కొక్క ప్రతికి రు. 6 మాత్రమే. అంటే పత్రిక ఒక్కొక్క ప్రతి చందాదారుల విషయంలో రు. 5 లోటుతో, విడిప్రతి కొనుగోలుదారుల విషయంలో రు. 8 లోటుతో నడుస్తున్నదన్నమాట. పత్రిక ఎన్ని ప్రతులు ఎక్కువ అమ్మకమైతే అంత ఎక్కువగా లోటు పెరుగుతుందన్నమాట. ప్రస్తుతానికి ప్రతినెలా రు. 25,000 లోటుతో పత్రిక నడుస్తున్నది. ఏ పత్రిక అయినా తన ఉత్పత్తి వ్యయాన్నంతా పాఠకులనుంచే రాబట్టడం జరగదు. ఉత్పత్తివ్యయంలో కొంతభాగాన్ని ధరగా నిర్ణయించి మిగిలిన భాగాన్ని వ్యాపార ప్రకటనల రూపంలో సేకరించడం ఆనవాయితీ. ఎన్ని ఖర్చులు పెరిగినా గత నాలుగు సంవత్సరాలుగా ధరనుగాని, వార్షిక చందాను గాని పెంచలేదని, వీక్షణంకు ఇప్పటివరకూ ప్రభుత్వ ప్రకటన తప్ప ఇతర ప్రకటనలు కూడా ఎక్కువగా రావడం లేదని మీకు తెలుసు. వీక్షణం ను నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ సంస్థ సర్వేలు చేయడం ద్వారా సంపాదించిన నిధులను వీక్షణం కొరకు ఖర్చుపెడుతున్నది. ఆ పరిస్థితి ఇంకా ఎక్కువ కాలం కొనసాగే అవకాశం లేదు.

ఈ పరిస్థితిలో వీక్షణంను ఆదుకొని, ఆర్థికవనరులను కల్పించి, మనుగడను సుస్థిరం చేయవలసింది మీరే. ఇది మీ పత్రిక, దీన్ని కాపాడుకోవడం, పది కాలాలపాటు నిలిచేలా చూడడం మీ బాధ్యత.

అందుకోసం

- పాఠకులందరూ చందాలు కట్టవచ్చు.
- ప్రతి చందాదారూ మరొకరిని చందాదారుగా చేర్పించవచ్చు, లేదా మిత్రులొకరికి వీక్షణం సంవత్సర చందా కానుకగా ఇవ్వవచ్చు.
- మీ గ్రామంలో, పట్టణంలో మీకు తెలిసిన దుకాణదారు వీక్షణం తెప్పించేలా, సక్రమంగా బకాయిలు చెల్లించేలా చూడవచ్చు.
- మీకు తెలిసిన వారెవరయినా వ్యాపార ప్రకటనలు ఇవ్వగలిగిన స్తోమత, అధికారం కలిగి ఉంటే వారిద్వారా వీక్షణంకు ప్రకటనలు ఇప్పించవచ్చు.

వీక్షణంను ఆదుకొండి

తెలుగునాట ఇటువంటి పత్రిక ఇది ఒక్కటే, దీని మనుగడకు, విస్తరణకు మీ చేయూతనందించండి

చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120	మూడు సంవత్సరాల చందా	రు. 350
ఐదు సంవత్సరాల చందా	రు. 550	పది సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495, ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com
సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

వీక్షణం 86

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సెప్టెంబర్ 2008
సంపుటి : 6
సంచిక : 9

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120
3 సంవత్సరాల చందా	రు. 350
5 సంవత్సరాల చందా	రు. 550
10 సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
reachcdrc@yahoo.com

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
98482 49695

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

నిజంగా ప్రజారాజ్యమేనా?

ముప్పై సంవత్సరాలుగా తెలుగు చిత్రసీమలో అఖండ విజయాలు సాధిస్తూ లక్షలాది మంది ప్రజల హృదయాలలో స్థానం సంపాదించుకున్న నటుడు చిరంజీవి రాజకీయరంగంలో ప్రవేశించారు. ఆగస్ట్ 17న హైదరాబాద్‌లో పత్రికా సమావేశంలోనూ, ఆగస్ట్ 26న తిరుపతిలో బహిరంగ సభలోనూ ఆయన అనుసరించబోయే రాజకీయ విధానాలు, పార్టీ పేరు, పతాకం మొదలైనవన్నీ ప్రజల ముందుకు వచ్చాయి. బడుగు, బలహీన వర్గాల ప్రయోజనాల కోసమే ప్రజారాజ్యం పార్టీ పనిచేస్తుందని, సామాజిక న్యాయసాధనే తన లక్ష్యమని ఆయన ప్రకటిస్తున్నారు. సామాజిక న్యాయసాధన అనే ప్రజా ఆకాంక్షను వ్యక్తీకరిస్తూ ఒక కొత్త రాజకీయపక్షం రాష్ట్రంలో ఆవిర్భవించడం ఆహ్వానించదగిన పరిణామమే. అయితే ఇప్పుడున్న రాజకీయ పక్షాలన్నీ కూడ ఇటువంటి ఉదాత్తమైన ఆదర్శాలను ప్రకటిస్తూనే, వాటి చాటున దారుణమైన ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయి. సమాజంలో కొనసాగుతున్న అసమానతలను, దోపిడీ పీడనలను యథాతథంగా ఉంచడానికే ప్రయత్నిస్తున్నాయి. పిడికెడు మంది నాయకులు దేశ దేశాల సంపన్నులకు తాబేదార్లుగా మారి, తమ సంపదలను పెంచుకోవడానికి ఉన్న రాజమార్గంగా రాజకీయాలు మారిపోయాయి. ఈ నేపథ్యంలో కేవలం ప్రకటిస్తున్న ఆదర్శాల ఆధారంగా మాత్రమే ఒక రాజకీయపార్టీని అంచనా వేయడం అసాధ్యం. ఆ ఆదర్శాలను అమలులోకి తేవడానికి ఆ పార్టీ ఎటువంటి మౌలిక కృషి చేస్తున్నదనేది, దాని ఆచరణ ప్రణాళిక ఏమిటనేది గీటురాయి కావాలి. కాని ప్రజారాజ్యం పార్టీ ఇప్పుడే జన్మించింది గనుక, దానికి ఆచరణ ఏమీలేదు గనుక ఈ గీటురాయి మీద పరీక్షించడం సాధ్యం కాదు. అందువల్లనే అనేకమంది వ్యాఖ్యాతలు ప్రజారాజ్యం పార్టీని అంచనా కట్టడంలో గందరగోళ పడుతున్నారు. అయితే పార్టీగా ప్రజారాజ్యంకు ఆచరణ అనుభవం లేకపోవచ్చుగాని, వ్యక్తులుగా ప్రజారాజ్యం నిర్వాహకులందరికీ గత ఆచరణ ఉంది. తిరుపతి సభలో పార్టీ నిర్మాత స్వయంగా చేసిన ప్రకటనలున్నాయి. వాటి ఆధారంగా కొన్ని నిర్ధారణలకు వచ్చే అవకాశం ఉంది. సామాజిక న్యాయం, అవినీతి నిర్మూలన, సుపరిపాలన, బడుగువర్గాల అభ్యున్నతి వంటి మాటలు మన సమాజంలో అత్యంత అవసరమయినవేగాని ఏ అర్థమూ లేనంతగా అరిగిపోయాయి. ఆ మాటల దిశలో కొత్తపార్టీ నిర్మాతకు గాని, ఆ పార్టీలోకి కప్పలతక్కెడలా దూకుతున్న ఇతర రాజకీయనేతలకు గాని ఉన్న చరిత్ర శూన్యమో, స్వల్పమో మాత్రమే. మరి వ్యక్తిగత ఆచరణలోని ఆ లోపాలను భవిష్యత్తులో ఆ పార్టీ నాయకులు ఎలా దిద్దుకుంటారో వేచి చూడవలసి ఉంది. ఇక అంతకన్న ముఖ్యంగా చిరంజీవి హైదరాబాద్‌లోనూ తిరుపతిలోనూ చేసిన ప్రకటనలు, ఆయనలోని సినిమా నటుడినే ప్రదర్శిస్తున్నాయి గాని రాజకీయ విజ్ఞుడిని కాదు. ఇవాళ తెలుగు సమాజంలోని మౌలిక సమస్యల ప్రస్తావన ఆయన ఉపన్యాసంలో ఉండవలసినంతగా లేదు. గ్రామీణ, వ్యవసాయ సంక్షోభం గురించి ప్రస్తావించారు గాని, ఆ సమస్యల పరిష్కారానికి అత్యవసరమైన భూసంస్కరణల గురించీ, భూ సంబంధాల మార్పు గురించీ ప్రస్తావనలేదు. ప్రత్యేక ఆర్థిక మండలాల గురించీ, ప్రభుత్వం భూములను సంపన్నులకు కట్టబెట్టడం గురించీ ఆహ్వానించదగిన ప్రస్తావన చేశారు గాని, ప్రపంచీకరణ ఫలితంగా వచ్చిన సమస్యల ప్రస్తావన లేదు. విదేశాలలో మౌలిక సౌకర్యాల గురించి మెచ్చుకోలుగా ప్రస్తావించడం ద్వారా తన అభివృద్ధి నమూనా ప్రపంచీకరణ నమూనానేనని చెప్పకనే చెప్పారు. నిరుద్యోగాన్ని తొలగించడానికి తమ పార్టీ చేయబోయే కృషి గురించి ప్రస్తావనే లేదు. తెలంగాణ గురించి, నక్సలైట్ల గురించి, ఎస్ సి వర్గీకరణ గురించి చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ వైఖరిలోని అసమగ్రతకు, అస్పష్టతకు, అపరిపక్వతకు అద్దం పడుతున్నాయి. ఆయన ఉపన్యాసం హాజరయిన లక్షలాది సినిమా అభిమానులకు సంతృప్తినిచ్చిందేమో గాని, ఆ ఉపన్యాసంలో ప్రస్తావనకు వచ్చిన సహస్రవృత్తుల సమస్తజీవులకు గాని, నిష్పాక్షిక పరిశీలకులకు గాని సంతృప్తినివ్వలేదు. సినిమానటుడు రాజకీయవాదిగా మారే పరిణామక్రమంలో ఇవి సహజమైన తప్పటడుగులే అనుకున్నా, అవి 'ప్రజారాజ్యం' నిజమైన బడుగువర్గాల, ప్రత్యామ్నాయ రాజకీయాలను తెలుగు సమాజ జీవితంలోకి తీసుకువస్తుందనే ఆశాసూచికలు కావు. వీ

మళ్లీ 'స్వతంత్ర కాశ్మీర్' చర్చ

జమ్మూ కాశ్మీర్ లో మళ్లీ ఒకసారి ప్రజాగ్రహ జ్వాలలు రగులుతున్నాయి. అరవై సంవత్సరాలుగా ఆరని కుంపటిలా మండుతున్న ప్రజా అసంతృప్తికి ఈసారి ఆజ్యం పోసింది అమర్‌నాథ్ ఆలయ సంస్థకు వంద ఎకరాల అటవీ భూమిని కట్టబెడుతూ మే చివరి వారంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం. చూడడానికి చాల చిన్న నిర్ణయంగా కనబడినా ఈ పరిణామం మూడు నెలలుగా జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తోంది. మళ్లీ ఒకసారి 'స్వతంత్ర కాశ్మీర్' ఆలోచనలు వ్యక్తం కావడానికి దారి తీసింది. భూమి కేటాయింపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఒకవైపు పర్యావరణ వాదులు, మరొకవైపు ప్రధానస్రవంతి రాజకీయ పక్షాలు, 'ఆజాద్ కాశ్మీర్' కోరుకునే పక్షాలు కూడా ఆందోళన ప్రారంభించాయి. ఆ ఆందోళనకారుల మీద శ్రీనగర్‌లో జరిగిన కాల్పులలో ఆరుగురు యువకులు మరణించడంతో ప్రజల ఆగ్రహావేశాలు పెరిగిపోయాయి. మరొకవైపు జమ్మూలో భూకేటాయింపును సమర్థిస్తూ ఆందోళనలు జరగడంతో మత ఉద్రిక్తతలు కూడా మొదలయ్యాయి. భూ కేటాయింపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఐక్య సంఘటన ప్రభుత్వంలో భాగస్వామి అయిన పిడిపి మద్దతు ఉపసంహరించుకుంది. భూ కేటాయింపును వెనక్కి తీసుకున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీలో పడిపోయి చివరికి రాజీనామా చేయవలసి వచ్చింది. రాష్ట్రంలో ప్రస్తుతం గవర్నర్ పాలన సాగుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆందోళనకారులతో చర్చలు జరుగుతున్నప్పటికీ ప్రతిరోజూ కాశ్మీర్ లోయలోనూ జమ్మూలోనూ నిరసన ప్రదర్శనలు, పోలీసు కాల్పులు జరుగుతున్నాయి. కాశ్మీర్ ప్రజల స్వాతంత్ర్యాకాంక్ష మళ్లీ మరింత పెద్ద ఎత్తున వ్యక్తమవుతోంది. ఎప్పుడూ భారతదేశంలో అంతర్భాగం కాని ప్రత్యేక అస్తిత్వంతో విలసిల్లి, ఎప్పుడూ మత ఘర్షణలకు కూడా తావివ్వని కాశ్మీర్‌లో కొంతభాగం ఇటు భారతదేశం, మరికొంతభాగం అటు పాకిస్తాన్ ఆక్రమించుకుని పన్నుతున్న కుట్రలు, కుహకాలు, సాగిస్తున్న మారణకాండ కాశ్మీరీ ప్రజల జీవనస్వేచ్ఛను, శాంతిభద్రతలను భగ్నం చేస్తున్నాయి. ఇలా అల్లకల్లోలమవుతున్న కాశ్మీర్ ప్రజలకు సానుభూతి ప్రకటించడం భారత ప్రజల బాధ్యత.


దొంగల దోపిడీలో భూమి

ప్రత్యేక ఆర్థిక మండలాల పేరుతో వందల, వేల ఎకరాల భూమిని ఆక్రమించడానికి వ్యాపారవేత్తలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను బ్లాక్ మెయిల్ చేస్తున్న దృశ్యం ఒకవైపు. ఆ భూసంతర్పణ కార్యక్రమంలో అన్ని రాజకీయపక్షాలూ పోటీపడుతున్న దృశ్యం మరొకవైపు. తమ జీవనాధారమైన పంటభూములను పోగొట్టుకుంటున్న రైతులు, వ్యవసాయం రద్దయిపోవడంతో ఉపాధి పోగొట్టుకుంటున్న కూలీలు, వ్యవసాయాధార చేతివృత్తుల శ్రామికులు లక్షలాదిగా అంచులలోకీ, నిరాశ్రితత్వంలోకీ నెట్టివేయబడుతున్నారు. నిర్వాసితులవుతున్నారు. ఈ దుర్మార్గ చరిత్రలో గుర్తించవలసిన పరిణామాలు కొన్ని ఇటీవల జరిగాయి. భారత పారిశ్రామివేత్తల కూటమి అసోఛామ్ ప్రధానమంత్రికి సమర్పించిన విజ్ఞాపనపత్రంలో ఉక్కు పరిశ్రమ విస్తరించాలంటే అన్ని రాష్ట్రాలలోనూ ఒకేరకమైన భూకేటాయింపు విధానం ఉండాలని కోరింది. చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఒరిస్సా రాష్ట్రాలలో ప్రజల ప్రతిఘటనను ఎదుర్కోవాలంటే ఇటువంటి ఉమ్మడివిధానం అవసరమని, ఖనిజ వనరులు జాతీయ ఆస్తి కాబట్టి స్థానిక ఆటంకాలు ఉండగూడదని అసోఛామ్ అంది. అంటే తమ దోపిడీ నిరాటకంగా సాగడానికి వీలు కల్పించమని కోరిందన్నమాట. మరొకపక్క పశ్చిమ బెంగాల్‌లో సింగూర్‌లో చిన్నకార్ల ఉత్పత్తి కోసం టాటాలకు ఇస్తున్న వెయ్యి ఎకరాల భూమిలో నుంచి తమ భూమి వెనక్కి ఇవ్వాలని, టాటాలకు ఇవ్వడానికి తాము నిరాకరిస్తున్నామని 400 ఎకరాల రైతులు ఆందోళన సాగిస్తున్నారు. నిజానికి టాటాల కార్ల పరిశ్రమకు అంత భూమి అవసరం కూడా లేదు. కాని నిరసనకారుల అభ్యంతరాలను తోసివేస్తూ, భూమి సేకరించడానికి, పారిశ్రామికవేత్తలకు ఇవ్వడానికి రైతుల అనుమతి అక్కరలేదని ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య అంటున్నారు. రైతులకు భూమిని వెనక్కి ఇచ్చే ప్రశ్నే లేదంటున్నారు. ఈలోగా ఇలాగే ఆందోళనలు జరుగుతుంటే తమ పరిశ్రమను అక్కడి నుంచి ఎత్తేస్తామని రతన్ టాటా బెదిరిస్తున్నారు. 'అక్కడినుంచి ఎత్తేస్తే మా రాష్ట్రానికి రండి, మీరడిగినంత భూమి ఇస్తాం' అని ఆంధ్రప్రదేశ్‌తో సహా ఎన్నో రాష్ట్ర ప్రభుత్వాలు ఎర్రతివాచీ ఆహ్వానం పలుకుతున్నాయి. అధికారంలో ఉన్న పార్టీ రంగు ఏమిటనే దానితో నిమిత్తం లేకుండా అన్ని రాజకీయ పార్టీలు, టాటాల వంటి పారిశ్రామిక, వ్యాపారవేత్తలు కలిసి దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్న సామెతగా భూమిని చాపగా చుట్టి ఆక్రమిస్తున్నారు. కాళ్లకింద నేల తొలుచుకుపోతున్న ఈ దారుణ స్థితిని ప్రతిఘటించడం ఇవాళ ఆలోచనాపరుల కర్తవ్యం.

నియంత పతనం

పాకిస్తాన్ సైనిక పాలకుడు జనరల్ పర్వేజ్ ముషారఫ్ ఎట్టకేలకు తన పదవి వదులుకుని ఏ దేశానికి ప్రవాసం పోవాలా అని ఆలోచిస్తున్నాడు. 1999లో సైనిక కుట్ర ద్వారా అధికారం చేజిక్కించుకుని, రెండుసార్లు రాజ్యాంగాన్ని తాత్కాలికంగా రద్దుచేసి, తనను తాను ప్రధానమంత్రిగా, దేశాధ్యక్షుడిగా ప్రకటించుకుని, సైనిక శాసనం అమలు చేసిన ముషారఫ్ కు చివరికి నియంతలందరికీ పట్టిన గతే పట్టబోతోంది. అసమానతలు, పేదరికం, నిరుద్యోగం, అవిద్య, అభివృద్ధి రాహిత్యాలతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్‌లో ప్రజల కనీసావసరాలు తీరకపోయినా, అమెరికా బంటుగా యుద్ధోన్మాద రాజ్యాన్ని నడిపిన చరిత్ర ముషారఫ్ ది. ప్రజాసంక్షేమానికి వెచ్చించవలసిన నిధులను యుద్ధ సన్నాహాలకు, ఖరీదయిన రక్షణ సామాగ్రి కొనుగోళ్లకు ఖర్చు చేస్తూ పాకిస్తానీల నిత్యజీవిత సమస్యలను పరిష్కరించకుండా దుర్మార్గ పాలన సాగించిన ఘనత ముషారఫ్ ది. ఇటు భారతదేశంలో పాలకులు పాకిస్తాన్ బూచి చూపి ప్రజల కళ్లుకప్పినట్టుగానే, అక్కడా భారతదేశపు బూచిని చూపుతూ తన అధికారాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకున్నాడు ముషారఫ్. తన మాటకు ఎదురు చెప్పిన రాజకీయ నాయకులను, న్యాయవాదులను, న్యాయమూర్తులను, పాత్రికేయులను నిర్బంధిస్తూ, దేశంలో ఎమర్జెన్సీ విధిస్తూ విచ్చలవిడి నియంతృత్వాన్ని అమలు చేశాడు. కాని మేల్కొన్న ప్రజాశక్తి ముందు నియంతృత్వం తలవంచక తప్పలేదు. ఆ సైనిక నియంత పదవి వదులుకోవడం మాత్రమే కాదు. ఏ మిత్ర దేశంలో తల దాచుకోవాలా అని వెతుక్కునే స్థితి వచ్చింది. ఉప ఖండంలోని ఇతర దేశాలలో లాగనే ప్రస్తుతానికి మరొక పాలకవర్గ ముఠానే అధికారానికి వచ్చి ఉండవచ్చు. నిజమైన ప్రజాధికారం నెలకొని ఉండకపోవచ్చు గాని, నిరంకుశాధికారాన్ని ప్రజలు ఎల్లకాలం సహించబోరనే పాఠాన్ని పాకిస్తాన్ నేర్పుతోంది. వీ

లోపలి పేజీల్లో...



ఫోకస్ : మారుతున్న హైదరాబాద్

ఎక్కడయినా మార్పు అనివార్యమే, సహజమే. హైదరాబాద్ కూడ అటువంటి అనివార్యమైన, సహజమైన మార్పులనే అనుభవిస్తూ ఉండాలి. కాని ఈ మార్పులతో అనివార్యమైన మార్పులేవో, హైదరాబాద్ ప్రజలకు సంబంధం లేకుండా, హైదరాబాద్ ప్రజల అవసరాల కొరకు కాకుండా, మరెవరి అవసరాలకోసమో, మరెవరి ప్రభావంతోనే వస్తున్న మార్పులేవో తెలియని అస్పష్టత కూడ ఉంది. అసలు ఈ మార్పుల దిశ ఏమిటి, ఈ మార్పుల స్వభావం ఏమిటనే విషయాలలో కూడా ఉండవలసినంత స్పష్టత ఉండడం లేదు.

'వీక్షణం'లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.


– సంపాదకులు

చందాదారులకు విజ్ఞప్తి!

ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.


మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.

– సర్క్యులేషన్ మేనేజర్
9949391028




- **న్యాయం కథలు** – ఎం.వి. తిరుపతయ్య – ఎం.వి. పబ్లికేషన్స్ – 66 పేజీలు, 1/8 డెమీ, రు. 70, ప్రతులకు : నవోదయ బుక్ హౌస్, 3-3-865, ఆర్య సమాజ్ మందిర్ ఎదురుగా, కాచిగూడ క్రాస్ రోడ్స్, హైదరాబాద్ – 500 027
- **భాగ్యనగరం** – నార్ల చిరంజీవి – సాహితీమిత్రులు ప్రచురణ – 100 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : నవోదయ, కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ – 2. ఫోన్ : 0866 – 2573500
- **హిరణ్యరాజ్యం** – రాయలసీమ ఫ్యాక్షనిజం చారిత్రక నేపథ్యం పరిణామక్రమం – వేంపల్లి గంగాధర్ – శ్రీ పి.టి. వీరారెడ్డి ఫౌండేషన్ ప్రచురణ – 102 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : డా. డి. ఆదర్శ్‌రెడ్డి, చైర్మన్, శ్రీ పి.టి.వీరారెడ్డి ఫౌండేషన్, 21/460, పి.పి. వీధి, 7 రోడ్స్, కడప – 516 001. ఫోన్ : 08562 –242909; విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, దిశా పుస్తక కేంద్రం, నవోదయ బుక్‌హౌస్
- **పోయేదేమీలేనోళ్లం** – కవితా సంకలనం – ప్రత్తిపాటి మల్లేశ్వరరావు (శంబుక) – శంబుక స్మారక కమిటీ ప్రచురణ, 71 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు : పి. నవజీవన్, నిడమర్రు (పో) మంగళగిరి – 522 503; మైత్రీ బుక్‌హౌస్, మణిబుక్‌స్టాల్, సహచర బుక్‌హౌస్, సమాంతర బుక్‌హౌస్
- **అమ్మా నానలు** – నానీలు – రుద్రంగ్ రమేశ్ – 88 పేజీలు, 1/8 డెమీ, రు. 40, ప్రతులకు : ఆర్.పి. బుక్ బైండింగ్, 1-9-129/23/సి/33, రామాలయం వీధి, రాంనగర్, హైదరాబాద్; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో
- **ఖండాంతరాల మీదుగా...** – నిఖిలేశ్వర్ – 102 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : నిఖిలేశ్వర్, 2-2-647/185/1/ఎ, శారదనగర్, (బాగ్ అంబర్‌పేట్), హైదరాబాద్ – 500 013; విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, నవోదయ బుక్‌హౌస్, సహచర బుక్‌మార్క్, మైత్రీ బుక్‌హౌస్
- **వాకపల్లి బాధితులకు న్యాయం జరిగేనా?** – ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం ప్రచురణ – 90 పేజీలు, 1/8 డెమీ, రు. 15, ప్రతులకు : ప్రొ. ఎస్. శేషయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, ప్లాట్ నెం.49, విద్యుత్‌నగర్, అనంతపురం
- **రాగింగ్ మనకొద్దు** – డి. నటరాజ్ – బోధిసత్త్వ పుస్తకాలు ప్రచురణ – 56 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు : డి. నటరాజ్, 9-31-6/2, షణ్ముఖప్లాట్స్, కూరగాయల మార్కెట్టు ఎదురుగా, పిఠాపురంకాలనీ, విశాఖపట్నం – 530 003. ఫోన్ : 0891 – 2509273; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
- **వీక్షణం** – బి. హనుమారెడ్డి – ప్రకాశం జిల్లా రచయితల సంఘం ప్రచురణ – 188 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : బి. హనుమారెడ్డి, అధ్యక్షులు, ప్రకాశం జిల్లా రచయితల సంఘం, రాజా పానగల్ రోడ్, ఒంగోలు – 523 002. సెల్ : 9440288080
- **ఇనుప ఖనిజ ఎగుమతులెందుకు** – ఇనుప ఖనిజ ఎగుమతి వ్యతిరేక కమిటీ ప్రచురణ – 40 పేజీలు, 1/8 డెమీ, రు. 5, ప్రతులకు : మణి బుక్‌స్టాల్, సండేమార్కెట్, నెల్లూరు – 1; మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ – 2




'వీక్షణం' మాస పత్రిక ఆగస్టు – 2008 సంపాదకీయం ఆశ్చర్యాన్ని కలుగజేసింది. అణుఒప్పందం మీద పార్లమెంట్‌లో విశ్వాస పరీక్షలో ఓడిందెవరు? అని ప్రశ్నించి, 'దేశ ఆర్థిక వ్యవస్థకు, రాజకీయ సార్వభౌమత్వానికి, ప్రజారోగ్యానికి, వనరుల మళ్ళింపుకూ దారితీయగల, ప్రమాదకర ప్రభావం వేయగల అణువిద్యుత్తు ఉత్పత్తి విషయంలో ఈ మూడు పక్షాల(కాంగ్రెసు, బి.జె.పి, వామపక్షాలు) ఆలోచనా వొక్కటే' అని సూత్రీకరిస్తూ 'కాంగ్రెస్, బి.జె.పిల వైఖరుల గురించి ఎవరికీ భ్రమలు లేకపోవచ్చును గాని, విశ్వాస పరీక్ష విషయంలో సోమ్‌నాథ్ చటర్జీ తీసుకున్న వైఖరి, అణుఒప్పందాన్ని వ్యతిరేకించనక్కర్లేదని జ్యోతిబసు చేసిన వ్యాఖ్య, విశ్వాస పరీక్ష ముగియగానే అణుఒప్పందం చాలా చిన్న విషయమని నీలోత్పల్‌బసు చేసిన వ్యాఖ్య వామపక్షాల డొల్లతనాన్ని కూడా చూపుతున్నాయి' అని వివరించింది.

ఈ సంపాదకీయం అణుఒప్పందం వల్ల దేశ ఆర్థిక, రాజకీయ సార్వభౌమత్వానికి భంగకరమని, వనరుల తరలింపు, ప్రజారోగ్యానికి హాని చేయడంలో తోడ్పడుతుందని గ్రహించినందుకు సంతోషం! అంత తీవ్రమైన అంశం మీద 'కొండంత రాగం తీసి గోరంత పదం చెప్పారని' గేలి చేస్తూ, పేలవంగా సంపాదకీయాన్ని ప్రారంభించడం విచారకరం. ఈ అంశం మీద తీవ్రంగా స్పందించి, యుపిఎకు మద్దతును ఉపసంహరించినందుకు, వామపక్ష రాజకీయ పార్టీలు పాలక వర్గాల నుండి, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్య వాదుల ప్రోద్బలంతో తీవ్ర ప్రచారదాడిని ఎదుర్కొంటున్నారు. అణుఒప్పందాన్ని వ్యతిరేకించే వాళ్ళంతా దేశ ద్రోహులు, జాతి వ్యతిరేకులు, ప్రగతి నిరోధకులు అనే స్థాయిలో సాగుతోంది. ఈ సమయంలో ప్రగతిశీల పత్రికయిన 'వీక్షణం' కూడా వామపక్షాల మీద దాడి చేయడం, "ఈ మూడు పక్షాల ఆలోచనా వొక్కటే!"అని సూత్రీకరించడం ఎవరికి తోడ్పడుతుంది? ఏ వర్గాలకు సంతోషం కలుగజేస్తుంది? ఈ సంపాదకీయులకున్నంత పరిజ్ఞానం లేకనో, ఆలస్యంగా జ్ఞానోదయం అయిన కారణంతోనో, వామపక్షాలు యుపిఎకు మద్దతును మొత్తానికి ఉపసంహరించు కున్నాయి. ఈ దేశ ఆర్థిక, రాజకీయ, విదేశాంగ విధానాలను అమెరికాకు దాసోహం చేసే అణు ఒప్పందం ఆమోదంలో తాము భాగస్వాములు కారాదని, ఆ చారిత్రక పాపం తమకు అంటరాదని భావించి తప్పుకున్నాయి. బిజెపి కూడా తెలివిగానే వ్యవహరించింది. ఈ పార్టీల జండాలు, ఎజెండాలు మనకు నచ్చకపోవచ్చుగాక, ఒక చారిత్రక సందర్భంలో, ఈ దేశ ప్రజలకు తాము బాధ్యులమని గుర్తించి ప్రవర్తించిన వాటిని ఆమేరకయినా అభినందించాలి! దానికి భిన్నంగా వ్యవహరించిన సోమ్‌నాథ్ చటర్జీ పార్టీ వేటుకు గురయ్యారు. ఒక పార్టీగా సిపిఎం విధానాన్ని పరిగణనలోకి తీసుకోవాలి కాని, ఒకరిద్దరు వ్యక్తుల ప్రకటనలను ఆధారం చేసుకోవడం విజ్ఞత కాదు. వామపక్షాలు తమ డాక్యుమెంట్లలో, తీర్మానాలలో, బహిరంగ వ్యాసాలలో తాము ఇంకా బలహీనంగానే వున్నామని ప్రకటిస్తూనే వున్నాయి. గత ఏడు దశాబ్దాల పైగా తమ తమ పద్ధతుల్లో, సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ, భూస్వామ్య విధానాలకు ఏక మొత్తంగా దోపిడికి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి పోరాటాలు చేస్తున్నాయి. ఆ క్రమంలో ఎన్నో తప్పొప్పులు చేస్తూ విలువయిన త్యాగాలు చేస్తూ శ్రమిస్తున్నాయి. పోలీసుల లాఠీ ఛార్జిలలో ప్రతిరోజు తలలు పగలకొట్టుకుంటూ, కాళ్ళు చేతులు విరక్కొట్టుకుంటూ, జైళ్ళలో బందీలవుతూ, చిత్రహింసలపాలవుతూ, ప్రత్యర్థుల చేతుల్లో హత్యలకు గురవుతూ, ఎన్‌కౌంటర్లు, కాల్పులలో బలవుతూ, వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రజల పట్ల తమ నిబద్ధతను చాటుకొంటున్నారు.

ఇక పాలక వర్గాల ఆలోచనా విధానం ఎలా వుంది? కోట్లు గుమ్మరించి ఓట్లు సంగ్రహించి అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకుని రాజకీయాలను ఖరీదయిన జూదంగా మార్చేసారు. సిద్ధాంతాలను ఎప్పుడో అటకెక్కించేసారు. ఈ దారిద్ర్యాన్ని నిర్మూలించడం పాలకుల ఎజెండాలో లేదని అటు నేతలకు తెలుసు, ఇటు ప్రజలకు తెలుసు! ఈ అవగాహన మధ్యలో చొచ్చుకు వచ్చి ప్రజలను శాశ్వతంగా విముక్తం చేసి, సోషలిస్టు స్వర్గాన్ని వాగ్దానం చేస్తున్న వామపక్షాలంటే పాలకులకు హడల్! ప్రజలు మేల్కొని వాళ్ళ వెంట నడుస్తారని, తమ దోపిడి కోటలు కూలగొట్టి, ఆక్రమిస్తారని వొకటే భయం! గత చరిత్రలో అలా జరగడం వలన, చరిత్ర పునరావృతం అవుతుందేమోనని కలవరపాటు! అందుకే పాలకులు తమకున్న అపార ప్రతీఘాత విప్లవానుభవాల నుండి పాచికలు ప్రయోగిస్తూనే వుంటారు. తమ పాలనకు తక్షణం సవాలుగా మారిన వారి మీదనే తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తారు. అది భూమి, జాగాలు పంచమనే పట్టణ పేదల పోరాటం కావచ్చు, బాక్సైట్ తవ్వకం వద్దనే అన్నల ఆయుధ పోరాటం కావచ్చు, తమ కార్యాచరణకు అడ్డుపడే వారి మీదనే వాళ్ళు ఉక్కుపాదం మోపుతారు! వీర విప్లవ సిద్ధాంతాలు వల్లిస్తూ పోరాడే ఎర్ర జెండాల మీద దుమ్ము పోసే వారి మీద ఆదరణ చూపుతారు. పరస్పర హననాన్ని బాగా ప్రోత్సహిస్తారు. ఒకరి మీద ఒకరిని బాగా రెచ్చగొడతారు. అది ఏ రూపంలో నయినా వుండవచ్చు. వర్గపోరాటం కాదు వర్ణపోరాటం అంటూ మార్క్సిజాన్ని తిరగదోడే రచనలు చేసే మేధావులకు ప్రపంచస్థాయి అవార్డులు ఇస్తారు. దేశవిదేశాల్లో ఉపన్యాసాలు ఏర్పాటు చేస్తారు. కులసంఘాలు పెట్టుకుంటే మహానేతలంటూ కుర్చీలు వేస్తారు. వామపక్షాల మధ్య ఐక్యత ఎదగకుండా, పరస్పర దాడులకు పాల్పడుతుంటే, తమ అధికారం పదిలంగా వుందని నిశ్చింతగా వుంటారు.

ఇహ వర్తమాన సందర్భంలోకి వస్తే, దేశ సార్వభౌమత్వానికి గొడ్డలి పెట్టులాంటి అణు ఒప్పందాన్ని ఎదుర్కొవడంలో దేశ భక్తియుత, ప్రజాతంత్ర ప్రగతిశీల శక్తులన్నీ ఏకం కావలసిన సమయమిది. బ్రహ్మాండమయిన రాజకీయ, ఆర్థిక, సాధన సంపత్తులతో, అమెరికన్ సామ్రాజ్యవాద అండదండలతో వామపక్షాల మీద ప్రచార దాడికి పాలకులు తెగబడుతున్నారు. 'వీక్షణం'లాంటి ప్రగతిశీల పత్రిక తన శక్తి సామర్థ్యాలను వామపక్షాలను తెగనాడడంలో ఉపయోగించక (ప్రగతిశీలురుగా ప్రకటించుకున్న కొందరు ఇదే పనిగా పెట్టుకున్నారు) దేశ ప్రజలందరి ఉమ్మడి శత్రువయిన అమెరికన్ సామ్రాజ్యవాదం మీద, దాని తాబేదార్లమీద వినియోగించాలి.

చివరాఖరుగా ఒక మాట – 'వీక్షణం' మాస పత్రికలో ప్రజారచయితలు, మేధావుల రచనల సరసన పాలక వర్గాలను అడ్డుగోడలుగా సమర్థించే ఉండవల్లి అరుణ్ కుమార్ (ఆగస్టు '08) వ్యాసాన్ని ప్రచురించారంటే, సంపాదకుల వీక్షణం ఎటు ప్రసరిస్తోందన్న అనుమానం వేస్తోంది. ఇప్పటికయినా తమ దృష్టి దోషాన్ని సరిచేసుకుని, అందరూ ఆదరిస్తున్న 'వీక్షణం' మాసపత్రికను చెత్తబుట్టలాగా మార్చవద్దని మనవి!

– **దినకర్** (ఈమెయిల్ ద్వారా)

అణు ఒప్పందం – వామపక్షాల వైఖరి వంటి చర్చనీయాంశాలలో ఏది సరైన వాదనో పాఠకుల విజ్ఞతకే వదిలేస్తున్నాం. కాని, తమకు నచ్చని అభిప్రాయాలను 'చెత్తబుట్ట'గా భావించే దృక్పథం వీక్షణంకు లేదని సవినయంగా తెలియజేయదలచు కున్నాం. మూడు సంవత్సరాలుగా ప్రతి సంచికలోను ఫోకస్ అనే ప్రధానాంశం మీద భిన్న దృక్పథాల, ఆలోచనల, వాదనల వేదికగా నిలవడం వీక్షణం ఎంచుకున్న పని. గతంలో ఫోకస్ రచయితల జాబితా చూస్తే అన్ని రాజకీయ భావజాలాల ప్రతినిధులు, వ్యాఖ్యాతలు ఉన్నారని తెలుస్తుంది. 'సంపాదకుల వీక్షణానికి' రచయితల అభిప్రాయాలతో ఏకీభావం ఉండనవసరం లేదని ప్రతి సంచికలోను వేసే ప్రకటన కూడా దినకర్ చూస్తున్నట్టు లేరు.

– **సం.**

'**వీ**క్షణం' ఆగస్ట్ 2008 సంచికలో ఉండవల్లి అరుణ్‌కుమార్ వ్యాసం తాము చేసినదేమిటో చెప్పుకోకుండా, ప్రతిపక్షాలను హేళన చేసినట్టుగా ఉంది. అటువంటి వ్యాసాలకు వీక్షణంలో స్థానం ఇవ్వడం అవసరమా?

– **నాగేశ్వరాచారి,** అనంతపురం

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సి.పి.ఎస్.)పై ఎ.పి.ఎన్.జి.ఒ. వారు సంక్షిప్తంగా సమాచారంతో చిన్న పుస్తకాన్ని ప్రచురించారు. అయితే పెన్షన్ ఎలా పుట్టింది? ఎప్పటి నుండి అమలులో ఉంది. దాని ఆవశ్యకత, పెన్షన్ ప్రైవేటీకరించడంపై ప్రభుత్వం ఎందుకు ఇంత శ్రద్ధ చూపిస్తోంది? ఈ సి.పి.ఎస్. ఏయే దేశాలలో అమలులో ఉంది? ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థ ఎలా వుంది? దీనిద్వారా ఉద్యోగులకు లాభమా? నష్టమా మొదలైన విషయాలతో వ్యాసం ప్రచురించాలని కోరుతున్నాను.

– **వి.వి. రవికుమార్,** గుంటూరు

తెలుగు పత్రికా రంగంలో ఒక ప్రత్యేకమైన ఒరవడినీ, అనేకమైన విషయాలను పూసగుచ్చినట్టు సమాచారాన్ని అందిస్తున్నందుకు అభినందనలు.

– **ఈశ్వరప్ప,** ఎమ్మిగనూరు

'**వీ**క్షణం' ఒక సామాజిక బాధ్యత గల పత్రికగా నిత్యం చైతన్యంతో అన్ని

(మిగతా 34వ పేజిలో)

కోస్టల్ కారిడార్ వద్దు

కోస్టల్ కారిడార్ పేరుతో జరుగుతున్న భూసేకరణను వెంటనే ఆపాలంటు జూలై 21న ప్రకాశం జిల్లాకు చెందిన వేటపాలం మండలం పుల్లరిపాలెం, నాయునిపాలెం, పందిళ్లపాలెం, చినగంజాం మండలం మోటుపల్లి తదితర గ్రామాల నుండి మత్స్యకారులు, ఆక్వారైతులు, చిన్న, సన్నకారు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి కలక్టరేట్‌ను ముట్టడించారు. వాన్‌పిక్ కింద చేపట్టిన భూసేకరణను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు సిపిఎం, సిపిఐ ఎంఎల్ (న్యూ డెమాక్రసీ), ఇతర ప్రజాసంఘాల నాయకులు నాయకత్వం వహించారు. తమ జీవనాన్ని, తమ వృత్తులను ధ్వంసం చేసే అభివృద్ధిని ఎట్టిపరిస్థితులల్లో ఒప్పుకోవాలని కలెక్టర్‌కు స్పష్టం చేశారు.

లంచం రూపేణా ఆదాయం

ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ఇండియా (టి.ఐ.ఐ.), సి.ఎం.ఎస్. ఇండియా సంస్థలు 2007లో దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో పలు ఆసక్తికరమైన నిజాలు వెలుగుచూశాయి. రెవెన్యూ అవినీతిలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని ఈ సర్వేలో బయటపడింది. మన పొరుగురాష్ట్రం కర్ణాటక ఈ రకమైన అవినీతిలో రెండవ స్థానంలో ఉంది. రెవెన్యూ అవినీతి బాధితులంతా నిరుపేదలు, రైతులు, దళితులు, బడుగు బలహీనవర్గాలకు చెందినవారే. భూమి రికార్డుల కోసం వెళ్లే సామాన్య రైతులు, ఆదాయ, కులధృవీకరణ పత్రాల కోసం వెళ్లే విద్యార్థులు రెవెన్యూ అవినీతి కారణంగా అష్టకష్టాలు పడుతున్నారు.

తనకే నష్టం వస్తే

పంచాయతీరాజ్ శాఖ మంత్రి జె.సి. దివాకర్‌రెడ్డి సోదరుడు జె.సి. ప్రభాకరరెడ్డి జూలై 28న హైదరాబాద్‌లో రవాణాశాఖ కమిషనర్ కార్యాలయం వేదికగా తన దివాకర్ ట్రావెల్స్ బస్సులను సీజ్ చేసినందుకు వీరంగం చేశారు. రవాణాకు మాత్రమే అనుమతులున్న దివాకర్ ట్రావెల్స్ బస్సులను వాణిజ్య రవాణాకు వాడటం, సరైన పర్మిట్లు లేకపోవడం, స్టేజీ క్యారియర్లుగా నడుపుతుండటం వంటి అభియోగాలు ఉన్నాయి. వీరితో పాటు కాళేశ్వరీ, శ్రీసాయి, మాధవి, సంగీత, ఓమర్, సహారా ట్రావెల్స్‌కు చెందిన మొత్తం పన్నెండు బస్సులను రవాణాశాఖ అధికారులు అదే రోజు సీజ్ చేశారు. ఈ సందర్భంగా జె.సి. ప్రభాకరరెడ్డి తన అనుచరులతో రవాణాశాఖ కార్యాలయంలో అధికారులపైకి దూసుకెళ్లారు. రికార్డులను నేలకేసి కొట్టి, రవాణాశాఖ కమిషనర్ రేమండ్ పీటర్ సమక్షంలో అనుచితంగా వ్యవహరించారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. తదనంతర పరిణామాలలో మంత్రి, ఆయన సోదరుడు పత్రికాముఖంగా క్షమాపణలు తెలియజేయడంతో ఈ వివాదం సద్దుమణిగింది.

గౌతమీ ఎక్స్‌ప్రెస్‌లో అగ్ని ప్రమాదం

సికిందరాబాద్ నుంచి కాకినాడ వెళుతున్న గౌతమీ ఎక్స్‌ప్రెస్ జూలై 31 రాత్రి వరంగల్ జిల్లా కేసముద్రం దాటుతుండగా అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 30 మంది చనిపోయారు. మృతులలో మహిళలు, పిల్లలే ఎక్కువగా ఉన్నారు. కొందరు మంటలు అంటుకుని మరణిస్తే, మరికొందరు పొగ వల్ల ఊపిరాడక చనిపోయారు. అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఈ ప్రమాదం జరగడం వల్ల సహాయ చర్యలు వెంటనే అందడం కష్టమయింది. అయిదు బోగీలు పూర్తిగా దగ్ధమైపోయాయి. ఎస్.9, ఎస్.10 బోగీలు ముందుగా మంటల్లో చిక్కుకోగా ఆ మంటలు ఎస్.13 బోగీ వరకు విస్తరించాయి. ఈ అగ్ని ప్రమాదానికి వేగంగా వెళుతున్న బోగీ కింద నుంచి నిప్పురవ్వలు చెలరేగడమే కారణమని రైల్వే అధికారులు అనగా, ఫోరెన్సిక్ నిపుణులు దీనినే ధృవపరిచారు. అగ్ని ప్రమాదానికి కారణమయ్యే సామగ్రిని ప్రయాణికులు వెంట తీసుకుపోవడం వల్ల కూడా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

దొంగతనం పేరిట హత్య

రంగారెడ్డి జిల్లా పెద్దముల్ మండలం బుద్దారం గ్రామంలో మాల కులానికి చెందిన బేగరి శ్రీనివాస్‌ను అగ్రవర్ణాలకు చెందినవారు హత్యచేశారని మాల మహానాడు అధ్యక్షుడు కారెం శివాజీ ఆరోపించారు. ఆరుగురు సభ్యులతో కూడిన మాలమహానాడుకు చెందిన నిజనిర్ధారణ కమిటీ ఆగస్ట్ 8న బుద్దారం గ్రామంలో పర్యటించింది. శ్రీనివాస్‌పై దొంగతనం నేరం మోపి, అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి చిత్రహింసలకు గురిచేసి హతమార్చారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల నుంచి భిన్నమైన కథనం వినబడింది. తనకు రావలసిన డబ్బులకోసం పటోళ్ల గోపాల్ రెడ్డి దగ్గరికి అడగడానికి పోతే ఈ దారుణం జరిగిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 2004 నుండి 2008 జూన్ వరకు దళితులపై జరిగిన అత్యాచారాల్లో మన రాష్ట్రం నాలుగవ స్థానంలోను, గిరిజనులపై జరిగిన అత్యాచారాల్లో మూడవ స్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. గడచిన నాలుగేళ్లలో మన రాష్ట్రంలో ఎస్.సి., ఎస్.టి. లపై అత్యాచారాలకు సంబంధించి 13,477 కేసులు నమోదయ్యాయి.

అతివృష్టి - అనావృష్టి

వ్యవసాయ పనులకు గత నెలవరకు వర్షాలు లేవనుకుంటుండగా ఆగస్ట్ రెండవ వారంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురిసాయి. ఈ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా వందమందికి పైగా మరణించారు. హైదరాబాద్‌లోనే 14 మంది వర్షం వల్ల సంభవించిన ప్రమాదాల్లో మరణించారు. ఐదు లక్షల ఎకరాల్లో పంటలు మునిగిపోగా వందలాది చెరువులకు గండ్లుపడ్డాయి. ఇది ఇలా ఉంటే ఎరువుల కోసం రైతుల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో ఎరువుల కోసం జరిగిన తొక్కిసలాటల్లో ఇద్దరు రైతులు చనిపోయారు.

'మీకోసం' యాత్ర ముగిసింది

'మీకోసం' పేరుతో రాష్ట్రంలో 117 రోజులపాటు 23 జిల్లాలను చుట్టుముట్టిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎన్. చంద్రబాబునాయుడు ఆగస్ట్ 15న అనంతపురంలో తన యాత్రను ముగించారు. 'మీకోసం' పర్యటన వలన తన ఆత్మస్థైర్యం, విశ్వాసం పెరిగిందనీ, రాబోయే ఎన్నికల్లో తామే గెలుస్తామనీ ముగింపు సభలో ఆయన పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే చేపట్టదలచుకున్న అభివృద్ధి పనుల గురించి వివిధ రంగాల వారికి హామీల వర్షం కురిపించారు. వీ

ప్రజలకు సేవ చేయడం కోసమే రాజకీయాలలోకి వస్తున్నామని చెప్పుకునేవారు సమాజం వాస్తవిక స్థితిని గుర్తించాకే నిర్ణయం తీసుకోవాలనీ, ప్రజలకు సేవ అనేది చాలా లోతైన వ్యవహారమనీ అంటున్నారు **కె.జి కన్నబిరన్**

చిరంజీవి - ప్రజాసేవ

చిట్టచివరికి చిరంజీవి రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఎంతో మంది రాజకీయవేత్తలు, కొత్తగా రాజకీయాల్లోకి ప్రవేశించాలనుకునేవారు, రాజకీయరంగంలో తమకంటూ ఒక స్థానం కల్పించుకునే ఈ రోజు కొరకు ఎదురుచూస్తూ ఉన్నారు. ఇవాళ్టి మార్కెట్ ఆధారిత రాజకీయాలలో రాజకీయవాది కావాలంటే ఆదర్శాలు ఏమీ ఉండనక్కర లేదు. చిరంజీవి కూడా చాలా స్పష్టంగానే తాను పేదలను ఆదుకునే రాబిన్‌హుడ్ కాబోనని చెప్పేశారు. ఉన్నవాడి దగ్గర లాక్కుని లేనివాడికి ఇచ్చే మనిషి కూడా కాబోడు. అదృష్టవశాత్తు ఎవరు ఎవరిని దోచుకోవాలో, పేదవాడికి సాంత్వన ఇవ్వాలోలేదో మార్కెట్టే నిర్ణయిస్తుంది. పాలన ఎట్లా ఉండాలో, రాజకీయాలు ఎట్లా ఉండాలో మార్కెట్టే నిర్ణయిస్తుంది. ఈ మార్కెట్ ఆధారిత రాజకీయాలలో నేను పేదప్రజలకు సేవ చేస్తాను అనే ఒక మాట మాత్రం రాజకీయ వాదులందరూ అనక తప్పదు. రాజకీయాలన్నీ పేదలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. పేదలే మన సమాజంలో అత్యధిక సంఖ్యాకులని చిరంజీవికి జీవితానుభవం ద్వారానే తెలుసు. ఆ పేద ప్రజలకే ఓట్లు వేసే హక్కు ఉన్నదని కూడా ఆయనకు తెలుసు. మిగిలిన ప్రతిఒక్క రాజకీయవేత్తలాగానే చిరంజీవి కూడా చాలా జాగ్రత్తగా పేదలకో, దళితులకో, స్త్రీలకో సాధికారిత కల్పిస్తానని అనడం లేదు. వాళ్లకు సాధికారిత కల్పిస్తాను అంటే తన అధికారాన్ని తగ్గించుకోవడమే అవుతుంది. ఆయనకు చాలా మంది సలహాదారులు ఉన్నారు. కొంతమంది సంపాదించుకునే వాళ్లు, కొంతమంది అవకాశవాదులు, మరికొందరు ఆలోచనాపరులు, కొందరు బోలుసరుకులు. ఆయనతో పాటు అన్ని ఛాయల ఎరుపు మనుషులు గులాబి నుంచి మాసిపోయిన ఎరుపు దాకా ఉన్నారు. ఈ మాసిపోయిన ఎరుపు మనుషులలో కల్తీలేని పాతకాలపు అద్భుతమైన కమ్యూనిస్టుల వారసులూ ఉన్నారు. కాంగ్రెస్ రాజకీయాలలో తలపండిన ఆయారాంలు, గయారాంలు ఉన్నారు. వీరందరూ రాజకీయంగా ఎవరు గెలిస్తే వారికి అంటిపెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నవాళ్లు. వీరిలో కొందరు రాజకీయ విశ్లేషణలో నిష్ణాతులు. ఓట్ల ప్రచారంలో వారిని వాడుకోవచ్చుగాని, తరువాత వారెందుకూ పనికిరారు. మరికొందరు విద్యావేత్తలు హిందూ పురాణాలలో చెప్పిన సంప్రదాయిక రుషుల స్థానాన్ని ఆక్రమించుకోవాలనుకుంటారు. కాని ఆ రుషులకున్నంత జ్ఞాన సంపద లేనివారు. ఒకవేళ చిరంజీవే గెలిస్తే ప్రభుత్వం నిర్మించడానికి అవసరమైనంత సంఖ్య లేకపోతే బయటి నుంచి మద్దతు ఇవ్వడానికో, లేదా ఆయనతో పాటు కలిసిపోవడానికో సిద్ధంగా ఉన్నవారు చాలామంది ఉన్నారు. ఎవరిని బయటే ఉంచి మద్దతు తీసుకోవాలో, ఎవరిని లోపలికి రానిస్తే సమస్య ఉండదో సలహాదారులు తెలుసుకుంటూ ఉండాలి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు లోతుపాతులు బాగా తెలిసిన నీలం సంజీవరెడ్డి ఒక మాట అనేవారు, 'పాలన ప్రశాంతంగా సాగాలంటే చెన్నారెడ్డి మంత్రివర్గంలో ఉండాలి, వి.బి.రాజు బయటే ఉండాలి' అని. చిరంజీవి సలహాదారులు కౌటిల్యుడు తయారుచేసిన విధి నిషేధాల జాబితాను చిరంజీవికి ఇవ్వాల్సి ఉంటుంది.

సినిమా నటుడు రాజకీయాలలోకి ప్రవేశించడం అనేది తప్పనిసరి విజయానికి రాజమార్గమేమీ కాదు. పూర్తి కాలపు రాజకీయవేత్తలు కావాలంటే రాజకీయాలతోనూ, రాజకీయ భావజాలంతోనూ ఎంతో కొంత సంబంధం ఉండాలి. మంచి రాజకీయవేత్తలుగా వికసించిన న్యాయవాదులు ఎంతోమంది ఉన్నారు. మన రాష్ట్రంలోనే రాజకీయ వేత్తలుగా మారిన వైద్యులు ఎందరో ఉన్నారు. కాని నటులు ఎక్కువమంది లేరు. ఇప్పటికి అయితే ఒక్కరే ఉన్నారు. అదీ ఎన్.టి. రామారావు. ఆయన నమశక్యం కానంత మంచివాడు. న్యాయాన్యాయాల విచక్షణ కూడా ఉండేది. పాపం ఆయనకు రాకూడని చావు వచ్చింది. వృద్ధాప్యంలో సహచర్యాన్ని కోరుకునే సాహసం చేశాడు గనుక ఆయనను తోసేసారు. అధికార దళారీల అనుమతి లేకుండా అధికారాన్ని పంచుకుందామనుకుంటే ఎవరూ క్షమించరు. ఆయన తాను నటించిన పాత్రలన్నీ తనలో సంలీనం చేసుకుని అలా నటించారు. కాని రాజకీయాలలోకి ఎన్.టి.ఆర్. ప్రవేశానికి చిరంజీవి ప్రవేశానికి వాళ్లు నటులు కావడం ఒక్కటే పోలిక. అప్పుడూ ఇప్పుడూ కూడా రాజకీయాలు దిగజారిపోయి ఉన్నాయి. వచ్చిన సంక్షోభాలను అధిగమించడానికి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి అధికారాలు చేజిక్కించుకున్నారు. ఇవాళ ఏర్పడిన సంక్షోభం పూర్తిగా భిన్నమైనది. రాష్ట్రాల మంత్రివర్గాలు ఆమె రాజకీయాలలో ఆటబొమ్మలుగా మారి ఆమె నిరంకుశత్వం పెరిగిపోయింది. వ్యాపార, శ్రామిక వర్గాలలో ఆమె నియంతగా మారిపోతున్నదనే భయం పెరిగింది. ఆమె మీద అటు న్యాయస్థానాల లోను, ఇటు బయట ప్రజాస్వామ్యం కొరకు పోరాటాలు జరిగాయి. కాని ఇప్పుడు మనను పాలిస్తున్నది రాజ్యాంగం కాదు ప్రపంచీకరణ. మన రాజ్యాంగం చెప్పిన ఆర్థిక విధానం కాదు. మిల్టన్ ఫ్రీడ్‌మన్ చెప్పిన ఆర్థిక తత్వశాస్త్రం. రాజ్యాంగపు ఆర్థిక సూత్రాలు రాజ్య ఆదేశిక సూత్రాలలో ఉన్నాయి. ఈ ఆర్థిక విధానానికి లక్ష్యం ఏమిటో రాజ్యాంగపు ప్రవేశికలో పొందుపర్చడం జరిగింది. చిరంజీవికి సమయం దొరికి రాజ్యాంగాన్ని చూసినప్పుడు దాంట్లో ఏమున్నదో అర్థమౌతుందనుకుంటాను. ఇప్పటికి అయితే రాజ్యాంగం అంటే న్యాయవాదుల విధి నిషేధాలు చెప్పే పుస్తకమని అనుకుంటూ ఉంటాడు. ప్రజలకు సేవ

అధికార మార్పిడి జరిగిందేకాని సామాన్యులకు స్వాతంత్ర్యం రాలేదనీ, రెండవ స్వాతంత్ర్య పోరాటం ప్రారంభించాల్సిన పరిస్థితులు ఉన్నాయనీ తరిమెల నాగిరెడ్డి స్మారకోపన్యాసంలో వివరిస్తున్నారు **వి. హనుమంతరావు**

పరాధీనభారతం - నిన్న, నేడు

1947లో మన దేశానికి 'స్వతంత్రం' వచ్చింది. స్వతంత్రం వచ్చిందనే దానికన్నా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు దేశ పాలనను కాంగ్రెస్ పార్టీ నేతలకు అప్పగించి నిష్క్రమించారనటం వాస్తవానికి దగ్గరగా ఉంటుంది. ఇలా అనటం సత్యదూరమేమీకాదు. ఎందుకంటే మనం రెండో స్వాతంత్ర్య పోరాటం ప్రారంభించాలని నాయకులే అంటున్నారు. అంటే 1947లో పూర్తి స్వాతంత్ర్యం రాలేదని అంగీకరించినట్లే కదా. అయితే ఒకరకంగా చూస్తే స్వతంత్రం వచ్చిందనవచ్చు. అది దేశాన్ని పాలించడానికి కాంగ్రెస్ నాయకులకు స్వతంత్రం వచ్చింది. సామాన్యులకు కాదు. ఆర్థిక స్వతంత్రం అసలేకాదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి అన్నట్లు మనదేశం బ్రిటిష్ కాలనీ నుంచి అమెరికా కాలనీగా మారింది. నేడు దేశం పరిస్థితి చూస్తే ముఖ్యంగా 1991లో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల నాటి నుంచి దేశ పరిణామాలను అధ్యయనం చేస్తే నాగిరెడ్డి 'తాకట్టులో భారతదేశం' పుస్తకంలో ఎటువంటి హెచ్చరిక చేసారో, సరిగ్గా అలాగే జరిగిందని, జరుగుతోందని, జరగబోతోందని. ఆ దుష్పరిణామాలు ఆ పుస్తకం రాయక ముందుకాలం నుంచే జరుగుతూ వచ్చాయని విదితమవుతుంది.

నాగిరెడ్డి గొప్పేమిటని ఎవరైనా అనవచ్చు కాని ఆయన మార్క్సిస్ట్ సిద్ధాంతం ఆధారంగా ప్రజలనాడిని పట్టి భవిష్యత్తును అంచనా వేయగలిగే రాజకీయార్థిక జ్యోతిష్యుడు. ఆ పుస్తకం చదువుతుంటే ఇవాళ మనం చూస్తున్న పరిణామాలను ఆయన సుమారు నాలుగు దశాబ్దాల క్రితమే ఎలా చెప్పగలిగారా అని ఆశ్చర్యం కలుగకమానదు. ఆ విశేషాన్ని మీతో పంచుకోవడమే నా ఈ ఉపన్యాస లక్ష్యం.

ముందుగా అధికారమార్పిడి జరిగిన 1947 నుంచి చరిత్రలోకి జారిపోయిన గత అరవై సంవత్సరాల్లో ఏం జరిగిందో క్లుప్తంగా నెమరువేసుకుందాం. దేశం నుంచి పరాయి పాలకులు వెళ్లిపోవాలి. మనలను మనమే పరిపాలించుకోవాలి. మన సహజవనరులను మనమే వినియోగించుకొని మన కాళ్లమీద మనమే నిలబడగలగాలి. స్వతంత్రంగా బతకాలి. స్వతంత్ర పోరాట లక్ష్యాలివి. వాటిని సాధించామా?

- తెల్లదొరలు పోయి నల్లదొరలు వచ్చారు.
- బ్రిటిష్ సామ్రాజ్యవాదులను పంపించేశాం. అమెరికన్ సామ్రాజ్య వాదులకు ఎర్రతివాచీ పరిచి మరీ ఆహ్వానిస్తున్నారు.
- మన సహజ వనరులను తరలించుకపొమ్మని బహుళజాతి సంస్థలను ఆహ్వానిస్తున్నాం.
- సంస్థానాలు పోయాయి. సెజ్‌ల పేరుతో కొత్తరకం సంస్థానాలు అవతరించాయి.
- బెంగాల్ కరువులో 30 లక్షల మంది మరణించారు. తిండి గింజలు లేకపోవడం వల్ల కాదని, నల్లబజారు వ్యాపారులే కారణమని అమర్త్యసేన్ అన్నారు. ఈ రోజున అలాంటి కరువులు లేవు. ఇబ్బడి ముబ్బడిగా పండించే శక్తి సంపాదించుకొన్నాం. అయినా తిండి

చేయడం అని ఇవాళ ఆయన చేస్తున్న ప్రకటన ఎంత తీవ్రమైనదో ఆయనకు రాజ్యాంగం మీద ప్రమాణ స్వీకారం చేసిన తరువాత అర్థమౌతుంది. నటుడిగా పదివీ విరమణ చేసిన తరువాత కాలం గడపడానికి ఒక సాధనంగా రాజకీయాలను భావించడం కుదరదనీ, రాజకీయాలంటే అధికార సంబంధాలనీ, కులసమీకరణలనీ, దుష్పరి పాలన ద్వారా సంపాదించే సంపద అనీ అప్పుడు అర్థమవుతుంది. పాలన అంటే ఫ్లై ఓవర్లు, విశాలమైన రోడ్లు, కార్లు కాదు. ప్రధానంగా పేదలైన ప్రజలకు సేవచేయడం అనేది చాలా లోతైన వ్యవహారం.

మ్యాకవెల్లి ప్రిన్స్ రాయడానికి కారణమైన ఇటాలియన్ సమాజ పరిస్థితులకు వర్తమాన భారత సమాజానికి పోలిక ఉన్నట్టు కనిపిస్తుంది. అప్పటి ఇటాలియన్ సమాజం గురించి ఆయన ఏమని రాశాడంటే, 'ఈ సమాజం దారుణమైన రాజకీయ అవినీతికి, నైతికి పతనానికి, బలి అయిపోయింది. పాత పౌర సంస్థలన్నీ మరణించాయి. క్రౌర్యం, హత్య ప్రభుత్వపు సాధారణ కార్యక్రమాలు అయిపోయాయి. పరస్పర విశ్వాసం, నిజాయితీ చిన్నపిల్లల పాతకాలపు అలవాట్లు అయిపోయాయి. తెలివైన మనుషులు వాటిని పెదాల మీద కూడా ఉచ్చరించడం లేదు. విజయానికి బలప్రయోగం, మోసకారితనం సాధనాలుగా ఉన్నాయి. అబద్ధం, కుటిలత్వం వ్యాఖ్యానించడానికి వీలు లేనంత విచ్చలవిడిగా సాగుతున్నాయి. స్వార్థపరత్వం నగ్నంగా నిరలంకారంగా తనకు తానే సమర్థనగా ఊరేగుతోంది. ఇది ఒక సమాజమని చెప్పదలిస్తే అక్రమ సంతానపు దుస్సాహసికుల సమాజం అని చెప్పాలి. న్యాయం నుంచి, చట్టంనుంచి, దూరమైన మనిషి జంతువులకన్నా హీనంగా మారిపోతాడని అరిస్టాటిల్ చెప్పిన మాటలు ఈ సమాజం రుజువు చేస్తోంది.' ఆ ఇటాలియన్ సమాజంతో మన సమాజాన్ని పోల్చడం చాలా కఠినంగా కనబడవచ్చు. కాని, చెప్పదల్చుకున్న విషయం బలంగా చెప్పడానికి అది ఉపయోగపడుతుంది. ప్రజలకు సేవ చేయడం కోసమే రాజకీయాల లోకి ప్రవేశిస్తున్నామని చెప్పుకునే మనుషులు ఈ సమాజం వాస్తవిక స్థితిని గుర్తించిన తరువాతనే ఆ నిర్ణయం తీసుకోవాలి.

(చిరంజీవి పత్రికా సమావేశానికి తక్షణ ప్రతిస్పందనగా ఆగస్ట్ 18న రాసినది)

గింజలను దిగుమతి చేసుకొంటున్నాం. అప్పుడు కరువుతో చనిపోతే ఇప్పుడు రుణభారంతో ఆత్మహత్యలు చేసుకొంటున్నారు.

- అప్పుడు రైతులు తమ పంట నుంచి మంచి విత్తనాలను సేకరించుకొని తర్వాత పంటకు వాటిని సమకూర్చుకొన్నారు. సంప్రదాయ ఎరువును వినియోగించారు. ఇప్పుడు బజారుకు వెళ్లి విత్తనాలు, ఎరువులు కొనుక్కుంటే గాని పండించటం సాధ్యం కావడంలేదు. పురుగుల మందులు అదనంగా వాడాల్సివస్తోంది.
- అప్పుడు పరిశ్రమలు లేవు. దేశాభివృద్ధికి, ఉద్యోగ వసతికి పరిశ్రమలు కావాలన్నాం. పరిశ్రమలొచ్చాయి. కాని పారిశ్రామికీకరణ పెరిగిన కొద్దీ ఉపాధి కల్పన తగ్గిపోతోంది.
- అప్పుడు పక్క గ్రామాలకు, దగ్గరలో పట్టణాలకు నడిచి పోవాల్సి వచ్చేది. ఇప్పుడు రవాణా సౌకర్యాలు ఎంత ఇబ్బడిముబ్బడిగా పెరిగాయంటే పాదచారులు రోడ్డు మీద నడవడానికి వీలులేదు. వాహనాలు పెరిగి పెరిగి, చమురు ధర పెరిగి రవాణా వ్యవస్థ స్తంభించే పరిస్థితి ఏర్పడింది.
- అప్పుడు బడులే ఉండేవి కావు. భూస్వాములు గ్రామాల్లో పాఠశాలలను ఏర్పాటు కానివ్వలేదు. ఇప్పుడు కావాల్సినన్ని పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు వెలిశాయి. కాని బడుల్లో పిల్లలు డ్రాపవుట్ అవుతున్నారు. ఒకటో క్లాసులో నూరుమంది చేరితే, కాలేజీ చదువు స్థాయికి వచ్చేసరికి కేవలం పది శాతం మంది మాత్రమే మిగులుతున్నారు. ఆ కొద్ది మందికి కూడా ఉపాధి కరువైంది.
- అప్పుడు గ్రామాలకు వైద్య సౌకర్యాలే ఉండేవికావు. లోకల్ ఫండ్ ఆసుపత్రులున్నా అన్ని రోగాలకు ఎర్రనీళ్లే (కార్మినిటివ్ మిక్చర్) దిక్కు. ఇప్పుడు కూడా అవసరమైన మేరకు కాకపోయినా వైద్యసౌకర్యాలు విస్తరించాయి. అయితే డాక్టర్లుండరు. ఉంటే నర్సులుండేవారు. ఇద్దరూ ఉంటే మందులుండవు. ప్రభుత్వం ఈ సౌకర్యాలను కల్పించి, విస్తరించటం పోయి, ఈ శాఖ కార్యక్రమాలకు నీళ్లొదులుకొని, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి ప్రజలను బలి ఇస్తోంది.
- అప్పుడు విదేశీ వస్తువులు బహిష్కరణ, ఇప్పుడు వాటికోసం వెంపర్లాట.
- అప్పుడు బడ్జెట్లు లక్షల్లో ఉంటే ఇప్పుడు లక్షల కోట్లలో ఉంటున్నాయి. అయితే డబ్బులేక కేటాయింపులు పూర్తిగా ఖర్చుకావు. ఆ కేటాయింపుతో ఏమి సాధిస్తామని అన్నారో, సాధించారా అనే ప్రశ్నకు సమాధానం లేదు.
- అధికారమార్పిడి జరగకముందు ఏ జమీందారులు, భూస్వాములు గ్రామాల్లో తిరుగులేని పెత్తనం వెలగబెట్టారో, వారంతా ఇప్పుడు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొని గ్రామాల్లో ఏ సంస్థనైనా – అది సహకార సంస్థ కావచ్చు, పంచాయితీ, మండల, జిల్లా పరిషత్తులు కావచ్చు.
- వాటిని స్వాధీనం చేసుకొని తమ పెత్తనాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో అప్పుడూ ఇప్పుడూ ఆ వర్గానిదే పెత్తందారీ. ఈ పరిణామం పాలకుల ఆశీస్సులతోనే జరుగుతోంది.
- మొన్న మొన్ననే మనం 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ నూట యాభై ఏళ్ల సంబరాలు జరుపుకొన్నాం. అదే సమయంలో అమెరికా అణ్వస్త్రాలతో కూడిన యుద్ధనౌకను చెన్నై పోర్టులోకి ఆహ్వానించాం.
- అప్పుడు ప్రధానంగా రాజకీయం, పాలనాధికారాలే సామ్రాజ్యవాదుల చేతుల్లో ఉండేవి. ఇప్పుడు దేశ ఆర్థిక జీవనం మీద కూడా వారు పట్టు సాధించారు. కాదు, మన పాలకులే వారికి అధికారం కట్టబెట్టారు. ఇది అధికారమార్పిడి జరిగిన నాటి నుంచి జరుగుతోందని నాగిరెడ్డి తన పుస్తకంలో రాశారు.
- ప్రపంచ రాజకీయాల్లో అలీన విధానమనే కొత్త ఆలోచనను మన దేశం అందించగా, ఇప్పుడు దానిని ఏడు నిలువుల లోతున పాతేసి, అమెరికా విషకౌగిలిలో ఇమిడిపోతున్నాం.

క్లుప్తంగా ఇదీ నేటి భారతచిత్రం. ఎందుకిలా పరిస్థితి దిగజారిపోతోంది? జవాబు అసలు మూలంలోనే అంటే స్వతంత్రం అనబడే పరిణామంలోనే ఉంది. నాగిరెడ్డి అంటారు కదా –

'గున్నార్ మిర్థల్ పేర్కొన్నట్టుగా – వలస అధికార వ్యవస్థ శిథిలమైన స్వతంత్ర జాతీయ ప్రభుత్వాలు ఆవిర్భవించినంత మాత్రాన ఈ మాజీ వలసల్లో దానంతటదే ఒక బృహత్తర సాంఘిక ఆర్థిక మార్పు సంభవించిందని అర్థం కాదు. నేటి దక్షిణాసియా దేశాల్లో ఆర్థిక, సామాజిక పరిస్థితులు – వలస పాలనావ్యవస్థ విచ్ఛిన్నం కావటానికి పూర్వం ఉన్న పరిస్థితులకంటే పెద్దగా భిన్నంగా ఏమీ లేవని గుర్తుంచుకోవాలి. (ఏషియన్ డ్రామా – గున్నార్ మిర్థల్)

అయినా, మనదేశం వలస పాలన నుంచి విముక్తి అయ్యిందని జాతీయ నాయకులు ప్రజలను వంచించారు. రాజకీయ బానిసత్వం ముగిసింది. ఆర్థిక బానిసత్వం ప్రారంభమైంది. ఈ బానిసత్వం 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాతనే కాదు, అధికార మార్పిడి జరిగిన ఆరు నెలల్లోనే ప్రధాని నెహ్రూ ఒక ప్రకటన చేస్తూ 'ఆర్థిక నిర్మాణంలో ఆకస్మికమైన ఎట్టిమార్పులూ ఉండవు' అన్న ప్రకటనను నాగిరెడ్డి తన పుస్తకంలో ఉదహరించారు. 1948 ఏప్రిల్ 6న విదేశీ పెట్టుబడిదారుల భయాలను, సందేహాలను తొలగించడానికి ఈ విషయాన్ని అధికారికంగా భారత ప్రభుత్వం ఆమోదించిన ఆర్థిక విధాన పత్రంలో చేర్చింది. ఆయుధ సామాగ్రి, రైల్వేలు, విద్యుత్ చార్జీ తప్ప 'మిగిలిన పారిశ్రామికరంగం అంతా సాధారణంగా ప్రైవేట్ పెట్టుబడికి అవకాశముంటుంది'. ఈ తీర్మానంతో జతపరచిన వివరణ పత్రంలో 'భారత పారిశ్రామికరంగంలో విదేశీ పెట్టుబడికి, పరిశ్రమలకు సంపూర్ణ స్వేచ్ఛ ఇవ్వాలని' స్పష్టం చేసింది. ఇదే నెహ్రూ 1947కు ముందు 'విదర్ ఇండియా' అనే పుస్తకంలో ఏం చెప్పాడో నాగిరెడ్డి ఉదహరించారు. 'విదేశీ ప్రభుత్వం స్థానంలో దేశీయ ప్రభుత్వం స్థాపించబడిన తర్వాత కూడ పాత దోపిడీ ప్రయోజనాలను ముట్టకుండా ఉన్నట్లయితే అది స్వాతంత్రం నీడగా కూడా ఉండబోదు'.

సహాయం

ఈ రోజున కాంగ్రెస్ ప్రభుత్వం తన దైనందిన కార్యకలాపాలను నిర్వర్తించటం కోసం, ప్రణాళిక అమలు కోసం విదేశీ సహాయం లేనిదే ముందుకు ఒక్క అడుగు కూడా వెయ్యలేక పోతోందంటే, సర్వం ప్రైవేటీకరణ చేస్తోందంటే దానికి పునాదులు 1948లోనే పడ్డాయని నాగిరెడ్డి పుస్తకం చదివిన వారికెవరికైనా స్పష్టమవుతుంది. 'ముష్టికోసం యాచించడమే భారతదేశపు మౌలిక సూత్రంగా ఉంది' అని అన్నారు నాగిరెడ్డి. ఈ ముష్టికి ముద్దుపేరే 'సహాయం'. నేడు ఈ సహాయం ప్రపంచ బ్యాంక్ ద్వారా మిలియన్ల డాలర్ల రుణసహాయం పేరుతో దేశంలో వచ్చిపడుతోంది. మన రాష్ట్రాన్నే మాజీ ముఖ్యమంత్రి

చంద్రబాబు ప్రపంచ బ్యాంక్‌కు హారతి పళ్లెంలో పెట్టి నైవేద్యం పెట్టిన విషయం, అదే విధానాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కొనసాగించటం గత పద్దెనిమిది సంవత్సరాలుగా చూస్తున్నాం. ఈ పరిణామాన్ని నాగిరెడ్డి ఆనాడే గ్రహించారు. ఆయన ఏమన్నాడో చూద్దాం, 'రెండవ ప్రపంచ యుద్ధానంతరం సామ్రాజ్యవాదులు తమ పాతతరహా ప్రత్యక్ష వలసపాలనను, దోపిడీని విధిగా మార్చుకోవాల్సి వచ్చింది. 'ఆర్థిక సహాయం' ద్వారా లేదా ప్రత్యక్ష పెట్టుబడుల వంటి ఇతర పద్ధతుల ద్వారా ఆయా దేశాలను తమ సరుకులకు మార్కెట్‌గా, తమ పెట్టుబడులకు, దిగుమతికి మార్గాలుగా (ఔట్‌లెట్స్) ఎంచుకొన్నారు. వివిధ రూపాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడిని ఎగుమతి చేయడానికి సామ్రాజ్యవాదులు అనుసరించే పథకాలలో అతి ముఖ్యమైనవాటిలో 'సహాయం' రూపంలో పెట్టుబడిని ఎగుమతి చేయడం ఒకటి'. ఈ సహాయం వర్ధమాన దేశాలకు ఎటువంటి కీడు కలిగిస్తుందో అమెరికా అధ్యక్షుడు కెన్నడీ 1961లోనే కుండ బద్దలుకొట్టినట్లు చెప్పాడు. 'ప్రపంచ వ్యాప్తంగా తన పలుకుబడిని అధిపత్యాన్ని నిలుపుకోవడానికి అమెరికా అనుసరించే ఒక పద్ధతే విదేశీ సహాయం. ఈ సహాయం అనేకానేక దేశాలను పతనం కాకుండా కమ్యూనిస్టు శిబిరంలోకి వెళ్లకుండా నిలబెడుతుంది'. సహాయం పొందుతున్న దేశాలపై 'పలుకుబడిని, పెత్తనాన్ని కొనసాగించడానికి' ఒక సాధనమన్నమాట. థెరెస్సా హెయిటర్ ప్రపంచబ్యాంక్ సహాయం పొందుతున్న ఓవర్‌సీస్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేసిన కాలంలో తన అనుభవం ఆధారంగా 'ఎయిడ్ ఈజ్ ఇంపీరియలిజం' అనే పుస్తకంలో రాస్తూ 'వెనుకబడిన దేశాలకు చేస్తున్న ఈ సహాయం ఆ దేశాల అభివృద్ధిని గిడసబార్చి వక్రమార్గాలు పట్టిస్తుంద'ని చెప్పింది. షరతులతో కూడిన ఆర్థిక సహాయం వలన పొందిన వస్తువుల ధరలు ఇతర చోట కొన్న వాటికన్నా సాధారణంగా అధికంగా ఉంటాయి. ఈ సహాయం సామ్రాజ్యవాద దేశాలకు, ప్రైవేట్ కంపెనీలకు చెందిన సరకుల దేశాంతర మార్కెట్‌ను విస్తరింపచేస్తుంది. 'ఈ కంపెనీలు మరింత లాభదాయకంగా నడపడానికి వీలుగా రహదారులు, ఓడరేవులు, శిక్షణ సంస్థలు వంటి సదుపాయాలను (ఆయా దేశాల్లో) కల్పించుకోవడానికి ఈ సహాయం ఒక సాధనం. ఈ రోజున మన రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లో ప్రపంచబ్యాంక్ మౌలిక సౌకర్యాల కల్పనకు విరివిగా రుణసహాయం ఎందుకు చేస్తుందో థెరెస్సా అనుభవాల వెలుగులో అర్థం చేసుకోవాలి. విస్తృతంగా ఆపై ఉదాహరణలను, అనుభవాలను ఎందుకు ఉటంకిస్తున్నదంటే సామ్రాజ్యవాదుల నుంచి భారతదేశం స్వీకరిస్తున్న సహాయంతో ఇతరులపై అంత ఎక్కువగా ఆధారపడి ఏ దేశమూ బలమైన, శక్తివంతమైన దేశంగా రూపొందిన ఉదాహరణలు చరిత్రలో మనకు ఎక్కడా కనిపించవు' అని నాగిరెడ్డి స్పష్టం చేశారు. మరైతే ఏం చెయ్యాలి? ఈ ప్రశ్నకు లెనిన్ ఇలా సమాధానమిచ్చారు. 'వాస్తవంలో ఆర్థికంగా, ఆర్థిక వనరులరీత్యా, మిలిటరీ రీత్యా సామ్రాజ్యవాదులపై ఆధారపడి ఉంటూనే, పైకి రాజకీయంగా స్వతంత్ర దేశాలుగా చలామణి అయ్యే రాజ్యాలను – ఆయా పీడిత దేశాలలో ఉన్నత వర్గాల సహాయంతో సృష్టించడం ద్వారా సామ్రాజ్యవాదులు చేస్తున్న మోసాన్ని ఎండగట్టాలి'.

ఇంతకూ అది నిజంగా సహాయమేనా? సహాయం అంటే అభివృద్ధి చెందిన దేశాలు, మనలాంటి దేశాలు ఆర్థిక ఇబ్బందుల్లో వున్నాయని వేల కోట్లు ఊరకనే, ఉచితంగా మన ఒడిలో పడేయటంలేదు. అలాగే అది వొట్టి సహాయమూ కాదు. అది మరో రకం సహాయం. అది రుణం అన్నపుడు రుణాన్ని, వడ్డీని తిరిగి చెల్లించాలి. ఈ రుణం డబ్బురూపంలో మనకివ్వరు. ఏ పథకంకోసం రూపొందిస్తారో, ఆ పథకానికి కావాల్సిన యంత్రాలను, సరుకుల రూపంలో ఇస్తారు. ఆ యంత్రాలు, సరుకులు ఆ రుణంలో ప్రైవేట్‌రంగం తన లాభం తాను తీసుకొని అమ్ముతుంది. ఆ యంత్రాలు కూడా ఆ దేశపు ఓడల్లో రవాణా చేస్తుంది. కాగా ఆ దేశం మనకు సహాయం చేయటంలేదు. మనమే ఆ దేశానికి సహాయం చేస్తున్నామన్నమాట. ఇందుకు సంబంధించిన సమస్త సమాచారాన్ని తన పుస్తకంలో పొందుపరిచారు. 1969లోనే చిలీ దేశ విదేశాంగ మంత్రి అమెరికా అధ్యక్షుడు నిక్సన్‌తో మాట్లాడుతూ 'అమెరికా ప్రైవేట్ పెట్టుబడుల ఫలితాలు ఉత్తర అమెరికా నుంచి దక్షిణ అమెరికాకు ద్రవ్య సహాయం అందుతుందని మనం మామూలుగా భావిస్తుంటాం కాని వాస్తవం ఇందుకు విరుద్ధంగా ఉంది. అదేమంటే దక్షిణ అమెరికాయే ఉత్తర అమెరికా అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుంది'. ఎవరు ఎవరికి సహాయం చేస్తున్నారో స్పష్టం అని అన్నారు నాగిరెడ్డి.

రుణాన్ని వడ్డీతో సహా చెల్లించాలని పైన చెప్పుకొన్నాం. ఏదైనా ప్రాజెక్ట్‌కు, పథకానికి రుణం ఇచ్చినప్పుడు ఆ రుణాన్ని ఒకే మొత్తంలో ఒకేసారి ఇవ్వరు. కంతులు కంతులుగా ఇస్తారు. రెండో కంతు రుణం ఇచ్చినప్పుడు మొదటికంతు మీద వడ్డీ, ఏమైనా సరుకులు యంత్రాలు సరఫరా చేస్తే వాటికి ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన డబ్బు అన్నీ మినహాయించుకొని మిగతాదే ఇస్తారు. ఇందువల్ల నికరంగా అందే సహాయం తగ్గుతూ వస్తుందని, ఇందువల్ల రుణభారం పెరుగుతూ వస్తుందని నాగిరెడ్డి సోదాహరణగా వివరించారు. ఉదాహరణకు 1966-67, 1970-71 మధ్య కాలంలో మొత్తం విదేశీ రుణంలో నికర సహాయం శాతం 75.08 నుంచి 44కు పడిపోయింది. అలాగే 1970-71లో మొత్తం విదేశీ రుణం రు. 769 కోట్లు అయితే అసలు వడ్డీ చెల్లింపులు మినహాయించగా నికరంగా చేతికి వచ్చిన రుణం రు. 334 కోట్లు మాత్రమే. ఈ విదేశీ రుణభారం ఈ రోజున 300 బిలియన్ డాలర్లకు పైనే ఉంది. అందుకే, ఆనాడే నాగిరెడ్డి అన్నారు 'సహాయం ప్రవాహం ప్రారంభమైందంటే ఇక దాన్ని ఆపజాలం'.

విదేశాలకు సరుకులు ఎగుమతి చేసి విదేశీ మారకం సంపాదించటం ద్వారానే విదేశీ రుణాలను తిరిగి చెల్లించగలుగుతాం. (ఈ చెల్లింపులు డాలర్లలోనే జరగాలి). అయితే ఎగుమతులు దిగుమతుల కంటే తగ్గినపుడు అంటే దిగుమతులు ఎగుమతులను మించిపోయినపుడు విదేశీ మారకం ఖాతాలో లోటు ఏర్పడుతుంది. 'ఈ పరిస్థితి వల్ల సహజంగానే రుణాలు స్వీకరించే దేశాలు లోటును పూడ్చుకోవడానికి వ్యవధిని కోరుతాయి. అంటే దీనర్థం రుణ సహాయం కోరడమే. విదేశీ ఫైనాన్స్ పెట్టుబడితో మనమిలా ఖాతా ఏర్పాట్లు పరాధీనం స్వభావం కావటంతో దిగుమతులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇవి భారత ఆర్థికాభివృద్ధి మీద తీవ్రమైన పరిమితులను విధిస్తున్నాయి. 'ఈ సందర్భంగా ఒకటి రెండు విషయాలను గమనంలో ఉంచుకోవాలి. సరళీకృత ఆర్థిక విధానం ప్రవేశపెట్టకముందు దిగుమతులు ఎంతగా పెరిగాయంటే వాటికి చెల్లింపులు చేయాలంటే డాలర్లలో చెల్లించాలి. మనవద్ద విదేశీ మారకం నిల్వలు దిగుమతులకు చెల్లించడానికి 15 రోజులకు మించిలేవు. ప్రపంచబ్యాంక్ ఈ సంక్షోభాన్ని అవకాశంగా తీసుకొని మేం సహాయం చేస్తామంటూ తాత్కాలిక సహాయం చేసి ప్రభుత్వంపై తన పట్టు బిగించింది. దీనర్థం ప్రపంచబ్యాంక్ 1991లోనే దేశంలో అడుగు పెట్టిందని కాదు. నాగిరెడ్డి తన పుస్తకాన్ని రాయడానికి

ముందు నుంచే ప్రపంచబ్యాంక్ దేశంపై పట్టు సంపాదించడానికి పావులు కదుపుతూనే ఉంది. ప్రపంచబ్యాంక్ కేవలం ఒక ముసుగు మాత్రమే. ముసుగు తొలిగిస్తే కనిపించే ముఖం అమెరికాదే. ఈ విషయం నాగిరెడ్డి ఆనాడే హెచ్చరించారు. 'మూడవ ప్రపంచదేశాల్లో చొరబడడానికి, ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలపై పెత్తనం సాధించడానికి, అమెరికా తాను స్వయంగా ఆర్థిక సాధనాలు ఉపయోగించడానికి కాక రానురాను అంతర్జాతీయ ద్రవ్య సంస్థలను సైతం మూడవ ప్రపంచ దేశాలలోనికి చొచ్చుకొని పోవడానికి ఎక్కువగా ఉపయోగించుకుంటోంది. ప్రపంచబ్యాంక్, అంతర్జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ, ఆసియా అభివృద్ధి బ్యాంక్ లాంటి అంతర్జాతీయ ద్రవ్య సంస్థలన్నీ అర్థఅధికార (సెమి-అఫీషియల్) స్వభావం కలిగిన అమెరికన్ సంస్థలే. ఈ ద్రవ్య సంస్థల్లో ఇతర దేశాలు కూడా సభ్య దేశాలుగా ఉన్నప్పటికీ తనకున్న బ్రహ్మాండమైన ఆర్థిక శక్తి మూలంగా అమెరికా ప్రధాన పాత్ర నిర్వహిస్తోంది. 'ఈ ఆర్థిక బలాన్ని ఉపయోగించుకొని పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టబోయే ముందుగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సమస్యలపై సలహాలివ్వడానికి, వివిధ పశ్చిమ దేశాల నుండి, అంతర్జాతీయ ద్రవ్య సంస్థల నుంచి వచ్చే సహాయాన్ని సమన్వయం చేయడానికి ప్రపంచబ్యాంక్ శాశ్వత ప్రతినిధి వర్గాన్ని మనదేశంలో నెలకొల్పింది. ఆ విధంగా ప్రపంచ బ్యాంక్ తన సహాయాన్ని స్వీకరించే దేశాల అంతరంగిక వ్యవహారాల్లో నిత్యం స్థిరంగా జోక్యం చేసుకొంటూ ఉంటుంది'. నేడు దేశంలో అక్షరాల జరుగుతున్నదిదే. మన రాష్ట్రంలో తరచుగా ప్రపంచబ్యాంక్ ప్రతినిధి వర్గాలు గ్రామాల్లో పర్యటనలు చేస్తూనే ఉన్నాయి. రాష్ట్ర అధికార బృందాలతో తరచుగా చర్చలు జరుపుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో కొన్ని శాఖల్లో పరిస్థితుల గురించి ఈ రాష్ట్ర ప్రజలకు తెలియనివి వారికి తెలుస్తాయి. చర్చల పేరుతో మన పరిపాలనా వ్యవస్థలో జోక్యం చేసుకొంటున్నాయి. పరోక్షంగా తమ అభిప్రాయాలను మన అధికారులపై రుద్దుతాయి. ఆ రోజున నాగిరెడ్డి ఆ అభిప్రాయాలను వ్యక్తపరిచినందుకు రాజకీయంగా విమర్శించిన వారు ఇప్పుడేమంటారో? సహాయం ఎంతగా పెరిగితే ఆయా దేశాల పరాధీనత అంతగా అధికమవుతుంది. పరాధీనత ఎక్కువైన కొద్దీ సహాయం ఇచ్చే దేశాల వైఖరి అంత కఠినంగా ఉంటుందని నాగిరెడ్డి అన్నారు.

పారిశ్రామికీకరణ – విదేశీ సహాయం

భారతదేశం స్వయం సమృద్ధం, స్వయం పోషకత్వం సాధించడం అగ్రరాజ్యాలకు, ముఖ్యంగా అమెరికాకు సుతారం ఇష్టంలేదు. టాటా ఉక్కు కర్మాగారం, ఏవో కొన్ని బట్టల మిల్లులు తప్ప అధికార మార్పిడి జరిగిన నాటికి భారతదేశం పారిశ్రామికంగా బాగా వెనుకబడిన దేశం. గుండుసూదులు కూడా దిగుమతి చేసుకొంటున్న పరిస్థితి. గాంధీజీ గ్రామస్వరాజ్యం కోసం కృషి చేయాలనుకొన్నా, పారిశ్రామికంగా అభివృద్ధి సాధించాలని ప్రధాని నెహ్రూ భావించి రెండవ ప్రణాళికలో ఆ ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. అయితే మనదేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందటం అగ్రరాజ్యాలకు ఇష్టంలేదు. తనకు కావాల్సిన సరుకులను భారతదేశం తనకు తానే తయారుచేసుకొనటం ప్రారంభిస్తే అభివృద్ధి చెందిన దేశాల్లో తయారయ్యే వస్తువులకు మార్కెట్ లభించదు. దేశం ఎపుడూ తమ మీద ఆధారపడి ఉండాలనేదే ఆ రాజ్యాల కోరిక. ఆ లక్ష్యంతో అభివృద్ధి చెందిన దేశాలు మొట్టమొదట పారిశ్రామికంగా దేశం అభివృద్ధి చెందకుండా ఉండాలని ప్రయత్నించాయి.

ఈ విదేశీ రుణ సహాయం గురించి ఆ రోజుల్లో ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త రంజిత దాస్‌గుప్త స్పందిస్తూ 'విదేశీ ప్రైవేట్ పెట్టుబడి, రుణాలు, గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం, అసమ వాణిజ్య సంబంధాలు, విచక్షణతో కూడిన సంతకాలు, నిర్బంధాలు, వాణిజ్య దిగ్బంధాలు – ఈ సాధనాల ద్వారానే భారతీయ మార్కెట్లపై కంట్రోల్‌ను చలాయిస్తోంది. దేశ రాజకీయ సార్వభౌమత్వాన్నే అతిక్రమిస్తోందని' అన్నారు. ఈ విదేశీ రుణ ప్రవాహం ఇవాళ, నిన్న ప్రారంభమైంది కాదు. ఆనాడే నాగిరెడ్డి ఇచ్చిన గణాంకాల ప్రకారం వివిధ దేశాలు, ప్రపంచబ్యాంక్ భారతదేశానికి రుణాలు, గ్రాంట్ల రూపంలో రు. 9171.3 కోట్లు కేటాయించగా, అందులో రు. 8063.4 కోట్లను వినియోగించుకుంది. 'విదేశీ రుణాలు, గ్రాంట్ల కోసం భారత ఆర్థిక వ్యవస్థ దాహం తీరనిది. ఈ దాహం పెరుగుదల రేటు అన్నింటికన్నా గొప్పది. విదేశీ సహాయం చొరబడని పద్దు గాని, శాఖగాని లేదు' అని నాగిరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ రోజున బిలియన్ల డాలర్ల పెట్టుబడులొచ్చినా ఇంకా కావాలంటోంది ప్రభుత్వం. వందుకోవటం కన్నా దండుకోవడం ప్రభుత్వానికి వాటంగా ఉన్నట్లు కనిపిస్తోంది. వారికి కావాల్సింది అధికార పీఠం. దేశం ఎట్లా పోతే వారికేం? ఈ రుణ ప్రవాహంలో సింహభాగం అమెరికా నుంచేననే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

మిలాఖత్ ఒప్పందాల విషయంపై ప్రస్తావించటం జరిగింది. దేశీయ పెట్టుబడిదారులు స్థాపించిన పరిశ్రమల్లో విదేశీ పారిశ్రామిక వేత్తలు ఈక్విటీ పెట్టుబడులు పెట్టడాన్ని మిలాఖత్ ఒప్పందం అని నిర్వచించుకోవచ్చు. దేశంలో కొన్ని సరుకులను ఉత్పత్తి చేయగలిగే టెక్నాలజీ లేకపోతే అవి అత్యవసర సరకులైతే దిగుమతి చేసుకోవచ్చు లేదా అటువంటి రంగాలలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించటం తప్పకపోవచ్చు. కాని ఎటువంటి వస్తువుల తయారీకి విదేశీ పెట్టుబడులు, విదేశీ పరిశ్రమలకూ ప్రభుత్వం మిలాఖత్ ఒప్పందాలను అనుమతించిందో చూడండి.

పశుగ్రాసం, బాల్‌పాయింట్ పెన్నులు, బిస్కట్‌లు, బీరు, బ్రాసరీలూ, మొక్కజొన్న పిండి, పింగాణీ సామాన్లు, సౌందర్య సాధనాలు ఎంబ్రాయిడరీ చేసిన వస్త్రాలు, పాదరక్షలు, నిల్వచేసే ఆహారం, పండ్ల రసాల ఎస్సెన్స్, చెంప పిన్నులు, పెదాల రంగు పెన్సిళ్లు, ఫోటో ఫ్రేములు, ఆటబంతులు, జిన్, స్టేషనరీ, రెడీమేడ్ దుస్తులు, టూత్‌పేస్ట్, ఐస్‌క్రీం, కుట్టు సూదులు, సేఫ్టీ పిన్నులు, సంతాన నిరోధక రబ్బరు తొడుగులు (కండోమ్స్), అద్దాలు, పండ్ల పొడి, డెంటల్ క్రీంలు, టాల్కం పౌడర్, షాంపులు, షేవింగ్ క్రీం, సిగరెట్లు, విద్యుత్ బల్బులు, పెన్నులు, సిరా, కాగితం మొదలైనవి. ప్రభుత్వమే నియమించిన దత్ కమిటీ ఇచ్చిన పట్టిక ఇది. ఈ పట్టికను నాగిరెడ్డి ఉదహరిస్తూ, 'పరిస్థితి ఇలా ఉండగా మన దేశం స్వయం పోషక ఆర్థిక వ్యవస్థ వైపుగా పురోగమిస్తుందని, దిగుమతులకు ప్రత్యామ్నాయం కలిగించబడుతుందని పాలకులు మనల్ని నమ్మమంటున్నారు' అంటూ ఎద్దేవ చేశారు. ఇలాంటి ఉత్పత్తులు దేశంలోనే తయారవుతుండగా, విదేశీ పెట్టుబడిదారులు దేశీయ పారిశ్రామిక వేత్తలతో మిలాఖత్ అవటం వెనుకున్న దురుద్దేశ్యం స్పష్టం. మెలమెల్లగా ఆ పరిశ్రమల్లో తమ ఈక్విటీని పెంచుకొని, మొత్తం పరిశ్రమనే కబళించటం. నేడు సరిగ్గా అదే జరుగుతోంది. వారి లాభాలు విదేశాలకు తరలివెళతాయి.

(మిగతా వచ్చే సంచికలో...) వీ

ఆదివాసులు రక్తతర్పణ చేసి సాధించుకున్న హక్కులను బహుళజాతి కంపెనీల లాభాల కోసం కాలరాయడంలో భాగంగానే నూతన జాతీయ ఖనిజ విధానం వచ్చిందని అంటున్నారు **ఎం. నాగరత్నం**

కొత్త ఖనిజ విధానం

దేశంలో యు.పి.ఎ. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త ఖనిజ విధానం అడవి బిడ్డల గుండెల్లో చిచ్చుపెట్టనున్నది. ఆదివాసుల జీవన విధానాన్ని, సంస్కృతి సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను బుగ్గిపాలు చేయనున్నది. ప్రభుత్వం బయటకు ఎన్ని తీయటి మాటలు చెబుతున్నా, చివరకు జరిగేది అదే అని గత అనుభవాలు తెలియజేస్తున్నాయి.

నూతన జాతీయ ఖనిజ విధానాన్ని కేంద్ర మంత్రి వర్గం ఇటీవల ఆమోదించింది. రాబోయే ఆరేళ్లలో గనులరంగంలో అయిదు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల (విదేశీ మారక ద్రవ్యం) ను ఆకర్షించడం, పదిలక్షల ఉద్యోగాలు కల్పించడం లక్ష్యాలను అందులో పొందుపర్చారు. ఖనిజ అభివృద్ధి నియంత్రణ చట్టంలో సవరణలు చేసి, గనుల కంపెనీ యజమానులకు అడ్డుగా ఉన్న నిబంధనలను తొలగించి, అడవిని బహుళజాతి కంపెనీల అడ్డాగా మార్చివేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ విధానం ద్వారా మార్గం సుగమం చేయనున్నది. దీంట్లో భాగమే విశాఖ మన్యంలో జిందాల్, ఆన్‌రాక్, రస్-అల్-ఖైమా వంటి బహుళజాతి కంపెనీలకు బాక్సైట్ గనుల తవ్వకాలు ధారదత్తం చేసింది.

ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గడ్, జార్ఖండ్ లలో ఖనిజ తవ్వకాలు ఆదివాసుల మనుగడను ఇప్పటికే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఆదివాసుల మనోగతాన్ని పట్టించుకోని పాలకులు విలువైన సహజ వనరులను సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకొన్నాయి. ఇదంతా వెనుకబడిన ఆదివాసుల జీవితాల్లో వెలుగు నింపడానికి జరుగుతున్న అభివృద్ధి అంటోంది ప్రభుత్వం. వాస్తవంగా చరిత్రలో గనుల తవ్వకాల ద్వారా లాభపడిందీ, లాభపడుతున్నదీ సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులే తప్ప ఆదివాసులు మాత్రం కాదు. ఒరిస్సాలో బాక్సైట్ గనుల తవ్వకాలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాహుల్‌గాంధీ ప్రకటన చేశారు. అక్కడి డోంగ్రియా తెగ ఆదివాసులకు అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. మన రాష్ట్రంలో రాహుల్‌గాంధీ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా బాక్సైట్ తవ్వకాలకు అనుమతులిచ్చి పాలకవర్గాల కుటిల నీతిని చాటుకుంటోంది. అభివృద్ధి కోసం అంటూ ఆదివాసీ బతుకులను పణంగా పెడుతూ సామ్రాజ్యవాదుల ప్రయోజనాలే ధ్యేయంగా పని చేస్తూ వారి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది.

అంధకారంలో ఆదివాసుల భవిష్యత్తు

ఖనిజ పరిశ్రమ భారీ ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని ప్రభుత్వం చాటుకుంటోంది. వాస్తవానికి అలా జరగడం లేదని వివిధ సర్వేలు, అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. ఖనిజ తవ్వకాల వలన పెద్ద ఎత్తున ఆదివాసులు నిరాశ్రయులు అవుతున్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో పేదరికం మునుపెన్నడూ లేని విధంగా పెరుగుతోంది. దేశవ్యాప్తంగా 150 జిల్లాలు అత్యంత వెనుకబడి ఉన్నాయన్నది ప్రభుత్వ ప్రకటన. వాటిలో 50 జిల్లాలు ఖనిజ నిక్షేపాల వెలికితీత జరుగుతున్నవే. ఖనిజ సంపద అసమానతలపై అధ్యయనం జరిపిన శాస్త్రీయ పర్యావరణ కేంద్రం (న్యూఢిల్లీ) ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఆర్థిక మనుగడ కోసం ఖనిజ నిక్షేపాలపైనే ఆధారపడుతున్న జార్ఖండ్, ఒరిస్సా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలు తలసరి ఆదాయ అభివృద్ధిలో ఇతర రాష్ట్రాల కన్నా బాగా వెనుకబడి ఉన్నాయి. దేశవ్యాప్తంగా గనులరంగంలో ఐదున్నర లక్షల మంది ఉపాధి పొందుతుంటే వారిలో మూడవ వంతు మందికి బొగ్గు గనులె బతుకుదారి చూపిస్తున్నాయి. దీనికి అనేకరెట్ల మంది ఆదివాసుల బతుకులు బుగ్గిపాలవుతున్నాయి.

దేశవ్యాప్తంగా ఖనిజ తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో 30-40 శాతం పైగా దట్టమైన అడవుల్లోనే ఉన్నాయి. ఖనిజ తవ్వకాల కోసం 1980 నాటి అటవీ పరిరక్షణ చట్టం కింద అటవీ అనుమతి పొందాల్సి ఉంటుంది. 1980-97 మధ్యకాలంలో ఏటా 19 అటవీ అనుమతులు మంజూరయ్యాయి. 1998-2005 మధ్యకాలంలో వాటి సంఖ్య ఏటా 216కు పెరిగింది. 1995-2005 మధ్యకాలంలో 74 వేల హెక్టార్ల అటవీ భూమిని సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు, పెట్టుబడిదారుల ఖనిజాల కోసం ధారదత్తం చేయడంతో మొత్తం అడవిని నాశనం చేసారు. గనుల తవ్వకాల మూలంగా నిర్వాసితుల సమస్య తీవ్రమవుతోంది. 1951-90 మధ్యకాలంలో 25 లక్షల మంది ఆదివాసులు మైనింగ్ తవ్వకాల వలన నిర్వాసితులయ్యారు. కాలుష్యం వ్యర్థాలు పరిస్థితిని మరింత దిగజార్చుతున్నాయి. దేశంలోని 96 శాతం బొగ్గుగనులు 80 శాతం ఇతర ఖనిజ నిల్వలు ఆదివాసీ ప్రాంతాల్లోనే ఉన్నాయి. 90 శాతం బాక్సైట్ ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లలోని ఆదివాసీ ప్రాంతాల్లోనే నిక్షిప్తమై ఉంది. ఒరిస్సాలో అత్యధికంగా గనుల తవ్వకం కొనసాగుతున్న కిరండొల్ జిల్లాలో 60 శాతం పైగా ఆదివాసులు దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నారు. పర్యావరణం తీవ్రంగా దెబ్బతిన్నది. ప్రజలు వివిధ దీర్ఘకాలిక అనారోగ్యాల బారినపడి కొట్టుమిట్టాడుతున్నారు.

ఖనిజ తవ్వకాల విషయంలో ఈ ప్రభుత్వ విధానం సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల, స్వదేశీ కార్పొరేషన్‌ల యజమానులకు లాభం చేకూర్చేదిగా ఉంది. అడవిలో వీరి ఆధిపత్యానికి అడ్డులేకుండా ఉపయోగపడేదిగా ఉంది. విలువైన భూములన్ని మౌలిక సదుపాయలను ప్రభుత్వరంగ సంస్థలను చివరకు అణు ఖనిజాలను కూడా సామ్రాజ్య వాదులు ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదులు నిర్ణయించిన ధరలకే – బహుళజాతి కంపెనీలకు ధారదత్తం చేస్తోంది. విదేశీ పెట్టుబడులను పెంచడం, ఖనిజ అన్వేషణ తవ్వకాలకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచి పోషించడం 1993 నాటి జాతీయ ఖనిజ విధాన లక్ష్యాలు, 1957 నాటి అభివృద్ధి – నియంత్రణ చట్టాన్ని సవరించి ఆ విధానాన్ని రూపొందించారు. దాన్ని ఆ విధంగా 100 శాతం సామ్రాజ్యవాదుల పెట్టుబడులకు అనుమతించడంతో అల్యూమినా, ఉక్కు, బొగ్గు రంగాలపై విపరీతమైన ప్రభావం ఏర్పడింది.

1993 విధానం ద్వారా రాబడికి సంబంధించిన లక్ష్యాలను చేరుకోలేకపోతున్నట్టు పంచవర్ష ప్రణాళిక మధ్యంతర సమీక్ష సందర్భంగా ప్రణాళిక సంఘం గుర్తించింది. దీనిపై 2005 సెప్టెంబర్‌లో ప్రణాళికా సంఘం సభ్యుడు అన్వరుల్ హోదా అధ్యక్షతన అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పటు చేశారు. ఆ కమిటీ కొత్త విధానం ముసాయిదాను 2006 జూలైలో ప్రభుత్వానికి అందజేసింది. కేంద్ర మంత్రివర్గం ప్రస్తుతం నూతన జాతీయ ఖనిజ విధానానికి ఆమోద ముద్ర వేసింది.

దశాబ్దం కింద విశాఖజిల్లా అనంతగిరి మండలం వలసి – నిమ్మలపాడు ప్రాంతంలోని కాల్సైట్ గనులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బిర్లా పెర్క్యూలస్ కంపెనీకి లీజ్‌కిచ్చింది. స్థానిక ఆదివాసులు, ప్రజా స్వామిక సంఘాలు, మేధావులు, మావోయిస్టులు, సమతా వంటి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఈ లీజుకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగింది. సమతా వేసిన ఈ వ్యాజ్యంపై సుప్రీంకోర్టు మెజారిటీ ధర్మాసనం 1997లో చారిత్రాత్మకమైన తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని 5వ షెడ్యూలు పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో గల ఆదివాసీ భూములను స్వాధీనం చేసుకొనే హక్కు ప్రభుత్వానికి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ ప్రాంతాల్లోనే ఖనిజ నిక్షేపాలు అపారంగా ఉండటం గమనార్హం. నూతన జాతీయ ఖనిజ విధానంలో ఈతీర్పును పేర్కొంటూనే వక్రీకరించారు. ఆదివాసులకు తగు నష్టపరిహారం ఇచ్చి సంపూర్ణ జీవితాన్ని ప్రసాదించాలన్నది తీర్పు సారంశం అని భాష్యాలు చెప్పారు. సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల సూపర్ లాభాల కోసం ఆదివాసులు రక్తతర్పణం చేసి సాధించుకున్న హక్కులను తుంగలో తొక్కుతున్నారనడానికి ఈ నూతన జాతీయ ఖనిజ విధానమే నిదర్శనం. మరొకవైపు ప్రభుత్వం 2006 అటవీ హక్కుల గుర్తింపు చట్టం తీసుకువచ్చి ఆదివాసులకు పూర్తి హక్కును దాఖలు పరుస్తున్నట్టు చెప్పుతున్నాయి. దీనికి పూర్తి భిన్నంగా ఈ రోజు నూతన జాతీయ ఖనిజ విధానాన్ని తీసుకువచ్చి అడవిలో గనుల కంపెనీల తవ్వకానికి ప్రభుత్వం బాటలు వేస్తోంది.

కొత్త ఖనిజ విధానం ప్రకారం – గని కంపెనీల (బహుళజాతి సంస్థలు) ప్రయోజనాలు తీర్చే పాత్రకే ప్రభుత్వం పరిమితం కానున్నది. నూతన ఆర్థిక విధానాలకు అనుగుణంగా ఖనిజాన్వేషణ వెలికితీతల్లో అనుసంధానకర్తగా వ్యవహరించడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని అందులో తెలిపారు. అంటే ప్రభుత్వం అన్ని అధికారాలనూ గని కంపెనీల యజమానులకు అప్పజెప్పి, వాటిపై ఉన్న ఆంక్షలన్నింటిని ఎత్తివేసి సామ్రాజ్యవాదుల ఇష్టారాజ్యంగా చెలామణి కావాలన్నమాట! గనుల కంపెనీలకు రాయితీలు ఇవ్వడానికి అనుసరిస్తున్న విధి విధానాల జాప్యానికి కారణాలను కొత్త విధానంలో సమీక్షించారు. ఒక కంపెనీ పెట్టుకొనే దరఖాస్తు 77 డెస్కుల మీదుగా వెళ్తుందని, అందుకు దాదాపు ఏడాది సమయం పడుతుందని తెలిపారు. అయితే దీన్ని బట్టి సునాయసంగా లీజులు పొందేందుకు మార్గం సుగమం చేయాలని దీనిపై త్వరితంగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల్లో పెరుగుతున్న పేదరిక నిర్మూలనకు విధానాలు రూపొందించని పాలకులు, ఆ ప్రాంతాల్లో పెరుగుతున్న పేదరికానికి మూలమైన గని కంపెనీల ప్రయజనాలు ఈడేర్చడానికి మాత్రం అర్రులు చాస్తున్నాయి.

గనుల వల్ల నిర్వాసితులయ్యే ప్రజలు అన్ని విషయాలు తెలుసుకొని, స్వేచ్ఛగా స్వతంత్రంగా తమ అంగీకారం తెలిపే వరకు ఖనిజ తవ్వకాలు ప్రారంభించకూడదని ప్రపంచబ్యాంక్ గని పరిశ్రమల సమీక్ష నివేదిక (ఇ.ఇ.ఆర్. – 2004) స్పష్టం చేసింది. వాస్తవంగా అదే ప్రపంచబ్యాంక్ తన ఆర్థిక విధానాలు అమలులో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా గనుల తవ్వకాలు చేపట్టి కొనసాగిస్తున్నది. అక్కడ నిర్వాసితుల అంగీకరంతో ప్రమేయం లేకుండానే గనుల తవ్వకాలు జరుపుతున్నది. తవ్వకాల వల్ల నిర్వాసితులవుతున్న ప్రజల ఆవేదనను నిర్దాక్షిణ్యంగా అణిచివేస్తోంది. గని కంపెనీల యాజమాన్యం ప్రజల ప్రయోజనాలు దెబ్బతీస్తున్నయనడానికి ప్రపంచ వ్యాప్తంగా గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాపోరాటాలే తెలియజేస్తున్నాయి. తరచుగా స్థానికుల ప్రమేయం లేకుండానే వారి భూమిని ఉపయోగించుకుంటున్నారనీ, వారి జీవన ప్రమాణాలు పడిపోకుండా చూడాల్సిన బాధ్యత కంపెనీలపై ఉందని మాత్రమే ఖనిజ విధానంలో పేర్కొన్నారు. ఇది చెబుతూనే యాభై హెక్టార్లలోపు లీజులకు ప్రజాభిప్రాయసేకరణ జరిగిన ప్రతిసారి కంపెనీ యాజమాన్యం ప్రభుత్వంతో కుమ్మక్కై పోలీసుల సాయంతో జనం నోరు నొక్కేస్తున్నారు. తమ ప్రాంతంలో బాక్సైట్ రిఫైనరీ ఏర్పాటు చేయవద్దని, విజయనగరం జిల్లా ఎస్.కోటలో 96 శాతం ప్రజలు తేల్చిచెప్పారు. ఇలాంటి పరిస్థితిలో ప్రతిపాదనలు విరమించుకోవాలనే సిఫార్సు కొత్త విధానంలో ఎక్కడా చేయలేదు. గనుల కంపెనీల విషయంలో ప్రభుత్వ జవాబుదారీతనం, విద్యుత్తు, రవాణా తదితర మౌలిక వసతుల కోసం ఆ కంపెనీలకు ప్రభుత్వం కల్పించే సబ్సిడీలు, ఖనిజ పరిశ్రమల నీటి అవసరాలు, అవి వదిలే కార్బన్ వాయువుల వల్ల వాటిల్లే కష్టనష్టాల వంటి అనేక కీలకాంశాలపై నూతన జాతీయ ఖనిజ విధానంలో మౌనం వహించి సామ్రాజ్యవాదులపై పాలకవర్గాల కున్న భక్తి భావాలను చాటుకున్నారు. అయినా ఇలాంటి కుటిల విధానాలను ప్రజలు సహించి ఊరుకోవడం లేదనడానికి కళింగనగర్, నందిగ్రాంలు ఉదాహరణలు మాత్రమే. దేశ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను ధ్వంసం చేయనిరీతిలో ఖనిజ విధానంలో తగు మార్పులు – చేర్పులు చేయవల్సిన అవసరం ఉంది. పాలన యంత్రాంగం విజ్ఞతాయుతంగా వ్యవహరించి, ఈ దిశలో తక్షణం ముందడుగు వేయాలి. వీ

వలసకాలం నాటి విధానాలతోనే నేటికీ కొనసాగుతున్న పోలీస్ వ్యవస్థను పౌరుల అదుపులోకి తీసుకువచ్చే సంస్కరణల ద్వారానే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయగలమని అంటున్నారు **పటోళ్ల గోవర్ధన్‌రెడ్డి**

పోలీస్ వ్యవస్థ - సంస్కరణలు

పోలీస్ వ్యవస్థ

భారతదేశంలో పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం 1857 తిరుగుబాటు. అంతవరకు మధ్యయుగాల నాటి పోలీస్ పద్ధతులనే కొంత మార్చి తమకనుకూలంగా బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ ఉపయోగించుకుంది. 1861లో బ్రిటిష్ పార్లమెంట్ ఆమోదించడంతో భారత పోలీస్ చట్టం అమలులోకి వచ్చింది. ఇక 1861 నుంచి నేటి వరకు పోలీసుల పని విధానం ఈ చట్టం పునాదిగానే కొనసాగుతోంది.

భారతదేశంలో 1857 లాంటి మరో తిరుగుబాటు రాకుండా, ప్రజలు ఐక్యం కాకుండా పోలీసు వ్యవస్థ ద్వారా భయోత్పాతాన్ని, బీభత్సాన్ని సమాజంలో నిరంతరం సృష్టించాలన్నదే వలస పాలకుల విధానం. ప్రజలను అణగదొక్కడమే వలస పాలన కాలం నాటి పోలీస్ వ్యవస్థ ప్రధాన లక్షణం. కాని 1947 స్వాతంత్రం తర్వాత కూడా ఇదే విధానం పోలీస్ పద్ధతిగా ఎడతెగకుండా కొనసాగుతోంది. 1950 జనవరి 26న భారత రిపబ్లిక్, ప్రజాస్వామ్య రాజ్యాంగం అమలులోకి వచ్చింది. సమాజంలో తీవ్రమైన ఆర్థిక, రాజకీయ, సాంఘిక మార్పులు వచ్చాయి. కాని పోలీస్ వ్యవస్థ విధానాలు, పద్ధతులు నేటికీ 1861 పునాదిగా, వలసపాలకుల నాటికి చెందినవిగానే ఉన్నాయి. 1860 నాటి భారత శిక్షాస్మృతి (ఐ.పి.సి.), 1871 నాటి భారత సాక్ష్యపు చట్టం అలాగే కొనసాగుతోంది. 1898 నాటి భారత నేరస్మృతి సి.ఆర్.పి.సి. చట్టం మాత్రమే 1973లో కొంత సవరణలకు గురయ్యింది. ఈ చట్టాల ప్రకారమే క్రిమినల్ జస్టిస్ విధానం కొనసాగుతోంది.

నేడు పోలీసులు ప్రజలపై, సమాజంపై వలస పాలన కాలం నాటి అణచివేత, చిత్రహింసలు, అవినీతి, అక్రమాలు, దుర్మార్గాలు, హత్యలు, మానభంగాలు, అత్యాచారాలు, తప్పుడు కేసులు, బీభత్సాలు, బలవంతపు వసూళ్లు మొదలైన అమానుషమైన అవమానాలను కొనసాగిస్తున్నారు. పోలీస్ వ్యవస్థ ప్రజాస్వామ్యయుతమైన అజమాయిషీ, జవాబుదారీ, బాధ్యత లేకపోవడం వల్ల పోలీస్ వ్యవస్థ అమానుషమైన, మొరటైన, వికృత వ్యవస్థగా మారిపోయిందని సాధారణ ప్రజల అభిప్రాయం.

భారతదేశంలో 1993లో ఏర్పాటైన జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు వచ్చే ఫిర్యాదులలో సుమారు యాభై శాతం వరకు పోలీసులు పాల్పడుతున్న మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించినవే. కాని మానవ హక్కుల కమిషన్‌లకు పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకునే అధికారం లేకపోవడంతో నమ్మకం కోల్పోతున్న ప్రజలు ఫిర్యాదులు చేయడం తగ్గిస్తున్నారు. పోలీసుల దుర్మార్గాలపై ఎక్కడా ఫిర్యాదు చేసే అవకాశం లేకపోవడంతో గత్యంతరం లేక తప్పనిసరి పరిస్థితుల్లో మానవ హక్కుల కమిషన్‌కు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు.

1997 నుండి 2002 వరకు పోలీసులపై పెద్ద సంఖ్యలో పౌరుల ఫిర్యాదులందాయి. మానవ హక్కుల కమిషన్‌కు పోలీసులపై నేరుగా ఎలాంటి చర్యలు తీసుకునే అధికారం లేదనే వాస్తవాన్ని గుర్తిస్తున్న ప్రజలు, పోలీసులపై ఫిర్యాదులు చేసినా ఉపయోగం ఉండదని మానుకుంటున్నారు. 2003-04లో పోలీసులపై 5,230 ఫిర్యాదులు రావడమే దీనికి నిదర్శనం.

స్త్రీలపై పోలీసుల అత్యాచారాలు

పోలీసులు అక్రమంగా, దుర్మార్గంగా నిస్సహాయ మహిళలను మానభంగాలకు గురిచేసిన ఘటనలు అసంఖ్యాకంగా ఉన్నాయి. 1978లో హైదరాబాద్‌లో సెకండ్ షో సినిమా చూసి ఇంటికి వస్తున్న దంపతులను పోలీసులు అడ్డగించారు. పోలీస్ స్టేషన్‌కు తీసికెళ్లి నిర్బంధించి రమిజాబీని పోలీసులు రేప్ చేశారు. ఆమె భర్తను లాకప్‌లో హింసించి హత్యచేశారు. ఉత్తర భారతంలో 1980లో మాయాత్యాగి అనే మహిళను పోలీసులు నిర్బంధించి రేప్ చేశారు. ఆమె భర్తను హత్య చేశారు. కర్ణాటకలో మధుర అనే యువతిని పోలీస్ లాకప్‌లో రేప్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ముజాఫర్‌నగర్‌లో పదుల సంఖ్యలో స్త్రీలు 1994 అక్టోబర్ నెలలో పోలీసులచే మానభంగానికి గురయ్యారు. ఇలాంటి ఘటనలు వేలసంఖ్యలో ఉన్నాయి.

బహిర్గతమైనవి, కానివి పోలీసుల అత్యాచారాలకు బలైన మహిళలు లక్షల సంఖ్యలో ఉన్నారు. పోలీస్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లే మహిళలను లోబర్చుకోవడం, లొంగదీసుకోవడం, పోలీస్ కేసులతో ఏదో రూపంలో సంబంధం ఉన్నదనే మహిళలపై పోలీసులు అసభ్యంగా ప్రవర్తించడం, లైంగిక వేధింపులకు గురిచేయడం జరుగుతున్నట్లు ఎన్నో ఫిర్యాదులు వెలుగుచూస్తున్నాయి. ఇవన్నీ రేప్‌తో సమానమే, స్త్రీలపై పోలీసుల అత్యాచారాల్లో భాగమేనంటూ పలు మహిళా సంఘాలు చేసిన ఫిర్యాదులు జాతీయ మహిళా కమిషన్ పరిశీలనలో ఉన్నాయి.

మరో వికృతమైన చర్య పోలీసుల సెక్స్‌వర్కర్లపై అత్యాచారాలు కొనసాగడం. వ్యభిచార గృహాలు రహస్యంగా నడుస్తున్నప్పటికీ పోలీసులకు వెంటనే తెలిసిపోతాయి. వ్యభిచార గృహాల్లోని వారిని పోలీసులు తమ అవసరాలకు వాడుకుంటారు. ఇంతకన్నా ముఖ్యంగా వ్యభిచార గృహాలు, ముఠాల నుండి నెలవారి అక్రమ మామూళ్లు పోలీసులు వసూలు చేసుకోవడం సాధారణమైనదే. ఈ పరిస్థితిని గుర్తించిన జాతీయ

మహిళా కమిషన్ వ్యభిచారాన్ని క్రిమినల్ కేస్‌గా కాకుండా, సివిల్‌కేస్‌గా మార్చాలని ఈ విధంగానైనా కొంత రక్షణ ఉండగలదని కేంద్ర ప్రభుత్వాని కి నివేదించింది. ఇప్పుడు ఈ సవరణ పార్లమెంట్ పరిశీలనలో ఉంది.

పోలీసుల తప్పుడు అహంభావాలు

కొన్ని దేశాల్లో సైనికపాలన వచ్చినట్లు, పోలీస్ పాలన రావాలని కొందరి పోలీసుల్లో పిచ్చి ఊహలున్నాయి. మంత్రులు, అయిదేళ్లు అధికారంలో ఉంటే, పోలీసులుగా తాము ముప్ఫైయేళ్ల వరకు అధికారంలో ఉంటామని, రిటైరయ్యేవరకు మమ్మల్నెవరూ ఏమీ చేయలేరని, కాదంటే కొంత దూర ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ మాత్రమే చేయగలరని పిచ్చి అహంభావం ఉంది. ఇది నిజమే, కాని దీనికి పరిష్కారం ఏమిటని ప్రజల ఆలోచన. 'దేశంలో మరెవరూలేని విధంగా పోలీసులు తమ తలలపై మూడు సింహాల గుర్తు ధరిస్తారని, కనిపించని నాలుగో సింహమే ఈ పోలీస్' అనే పరమ చెత్త డైలాగులు సినిమాల్లో సరేసరి. పోలీసులు ఇరవై నాలుగు గంటలు పనిచేయకుండా సామూహిక లీవు పెట్టి ఇంట్లో కూర్చుంటే, ఇక సమాజమంతా దోపిడీలు, హత్యలు, మానభంగాలు, రక్తపాతమే అంటూ కొందరి సొల్లువాగుడు. ఇరవై నాగులు రోజులు పోలీసులు సామూహిక లీవు పెట్టినా ఏమి జరగదు. పౌరదళాలు, స్వచ్ఛంద కార్యకర్తల ఆధ్వర్యంలో సమాజం మరింత ప్రశాంతంగా ఉండగలదు.

పోలీసుల అజమాయిషీ - జవాబుదారీతనం

ఎన్నో తప్పుడు అహంభావాలు ఉన్న పోలీసులు 'తమ పని విధానంలో ఎవరూ జోక్యం చేసుకోని విధంగా పూర్తి స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వాలని' బలంగా వాదిస్తారు. ఇప్పుడున్న విధంగానే పోలీసు వ్యవస్థ కొనసాగనిచ్చి పోలీసులకు స్వతంత్ర ప్రతిపత్తి పూర్తిగా కలిపిస్తే సమాజానికి అంతకు మించిన భయంకర ప్రమాదం మరేది ఉండదు. పోలీసుల అవినీతి, అక్రమాలు, హత్యలు, అత్యాచారాలు, అమానుషాలు, చిత్రహింసలు, దుర్మార్గాలకు అంతే ఉండదు.

1978లో భారతదేశంలో మొదటిసారిగా పోలీస్ వ్యవస్థను సమీక్షించడానికి 'జాతీయ పోలీస్ కమిషన్' ను ఏర్పాటు చేశారు. 1980-81లో జాతీయ పోలీస్ కమిషన్ సమర్పించిన ఎనిమిదవ అంతిమ నివేదికలో పోలీస్ వ్యవస్థ హత్యలు, అత్యాచారాలు, చిత్రహింసలు, అమానుష దుర్మార్గాలను కంట్రోల్ చేయడానికి ఒక ప్రత్యేక అధ్యాయాన్ని కేటాయించింది.

మానవ హక్కుల కమిషన్ ముందుకు వచ్చిన ఫిర్యాదులు

సంవత్సరం	మొత్తం ఫిర్యాదుల సంఖ్య	పోలీసులపై ఉన్న ఫిర్యాదుల సంఖ్య
1997-98	36670	14050
1998-99	40670	19233
1999-2000	50564	23837
2000-01	71556	32026
2001-02	69083	29534
2002-03	67354	23383
2003-04	71427	5230
2004-05	74401	15744

'ప్రజలపై నిఘా పెట్టడం, ప్రజలను అణచివెయ్యడం ప్రభుత్వానికి భద్రత కల్పించే విధంగా పోలీసు వ్యవస్థ ఉండాలి'

– ఇండియా పోలీస్ వ్యవస్థ రూపకల్పన సందర్భంగా విధానకర్తలకు బ్రిటిష్ ప్రభుత్వ సూచనలు 1860లో

'పోలీస్ బలగాలు అసమర్థమైనవి. వీటికి తగిన శిక్షణ, నిర్మాణం లేదు. పోలీస్ వ్యవస్థ అవినీతి అక్రమాలకు నిలయంగా మారింది. ప్రజలలో బీభత్సం సృష్టించి వారిని అణగదొక్కడం దీని సాధారణ లక్షణంగా కనిపిస్తోంది'

– ఫ్రైజర్ కమిషన్, 1903 బ్రిటిష్ ఇండియా

'దేశం మొత్తం మీద చట్టరహితంగా ఉన్న (ప్రభుత్వ) బలగం వ్యవస్థీకృత (బందిపోట్లు, దొంగలు, హంతక, మాఫియా) ముఠాలకు తీసిపోని విధంగా నేరాలు చేయటంలో ముందున్న విభాగాన్నే భారతదేశంలో పోలీసులు అని పిలుస్తారు'

– జస్టిస్ ఆనంద్ నారాయణ ముల్లా, అలహాబాద్ హైకోర్ట్, 1960

'తాము ఏమి చేసినాసరే, తమను ప్రశ్నించేవాళ్లెవరూ లేరు. తాము ఎలాంటి అధికార సంస్థలకు జవాబు చెప్పాల్సిన పనిలేదు అనే విధంగా పోలీసు అధికారుల పద్ధతి ఉంది'

– షా కమిషన్, 1978

'పాలనా విధానం ఇదే విధంగా కొనసాగితే చట్టబద్ధ పాలనకు వినాశకరమైన పనిముట్టుగా పోలీస్ వ్యవస్థ స్వాభావికంగా మారే ప్రమాదం ఉంది. అంతేకాదు నియంతృత్వ విధానాన్ని అమలు చేయడానికి దోహదశక్తి, ప్రజాస్వామ్యం పునాదులను విచ్ఛిన్నపరిచే విధ్వంసక శక్తిగా పోలీస్ వ్యవస్థ మారగలదు'

– పోలీస్ పరిశోధనా, అభివృద్ధి బ్యూరో 1979
(కేంద్ర ప్రభుత్వ హోంశాఖ అనుబంధ సంస్థ, న్యూఢిల్లీ)

అక్రమాలకు, తప్పుడు పనులకు పాల్పడే పోలీస్ అధికారులపై పౌరులు చట్టబద్ధమైన చర్యలు చేపట్టకుండా, వారికి రక్షణ కల్పిస్తున్న సి.ఆర్.పి.సి. చట్టంలోని సెక్షన్లు 132, 197లను తొలగించాలి.

– జాతీయ పోలీస్ కమిషన్, 1980

'పోలీసులు ప్రభుత్వ మాఫియాగా పరిగణించబడుతున్నారు'

– ఈనాడు సంపాదకీయం, 2005

'పోలీసులు లైసెన్స్‌డ్ గూండాలు'

– హైకోర్ట్, ఆంధ్రప్రదేశ్, 2006

'పోలీసులు సాధారణ పౌరులపైనే కాదు జడ్జీలపైన కూడ తప్పుడు కేసులు పెట్టగలరు'

– హైకోర్ట్, ఆంధ్రప్రదేశ్, 2006

'అమాయక పౌరులను వేధింపులకు గురిచేయడానికి కోర్టులను పోలీసులు ఆయుధంగా వాడుకుంటున్నారు'

– సుప్రీంకోర్టు

'పోలీస్ వ్యవస్థను తీవ్రమైన మార్పుల ద్వారా సంస్కరించి, పునర్నిర్మాణం చేయలేకపోతే, ఇప్పటికే కొనసాగుతున్న అనారోగ్యకరమైన వినాశకరధోరణులు మన సమాజాన్ని మింగేస్తాయి'

– కేంద్ర హోంశాఖ మంత్రి ఇంద్రజిత్ గుప్తా

జాతీయ పోలీస్ కమిషన్ పోలీసులను అజమాయిషీ చేయడానికి మూడు విధానాల జవాబుదారీతనం పోలీసు వ్యవస్థకు ఉండాలని సూచించింది.

1. పోలీసులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి.
2. పోలీసులు చట్టానికి జవాబుదారీగా ఉండాలి.
3. పోలీసులు హోంశాఖకు జవాబుదారీగా ఉండాలి.

ఇలాంటి అజమాయిషీ, జవాబుదారీ విధానం అమలు ద్వారానే పోలీసుల అమానుషచర్యలు, అత్యాచారాల నుండీ సాధారణ పౌరుల రాజ్యాంగబద్ధ హక్కులను కాపాడగలమని 1980-81లోనే జాతీయ పోలీస్ కమిషన్ స్పష్టం చేసింది.

ఎన్నికల ద్వారా పోలీస్ అథారిటీ

పోలీసులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలనే 1980-81 నాటి భారత జాతీయ పోలీస్ కమిషన్ మొదటి సూచన ఇప్పటికే పలు దేశాల్లో అమలు జరుగుతున్నది. అమెరికా, కెనడా, జపాన్, బ్రిటన్, స్వీడన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మొదలగు చాలా దేశాల్లో పోలీసుశాఖ, జైళ్లు జిల్లాస్థాయి నుండే ఎన్నుకోబడిన లేక నామినేట్ చేయబడిన పౌరుల అజమాయిషీలో ఉంటాయి. పోలీసులు పూర్తిగా జిల్లా స్థాయిలో పౌర నియంత్రణలో ఉంటారు. పట్టణ, నగర ప్రాంతాలలో పోలీసులు మున్సిపాలిటీ పాలకవర్గం, పౌరుల నియంత్రణలో ఉంటారు. పోలీసు అధికారులను నియమించడం, తప్పుచేసిన వారిని విచారించి సస్పెండ్ లేక డిస్మిస్ చేయడం లాంటివి ఈ పౌరుల అధికారం పరిధిలో ఉంటాయి. లాకప్‌లు, అరెస్ట్ అయిన నిందితులు ఈ పౌరుల అధికార పరిధిలో ఉండడం కనిపిస్తోంది.

జపాన్‌లో 'నేషనల్ పబ్లిక్ సేఫ్టీ కమిషన్' కు ఇలాంటి అధికారాలు న్నాయి. బ్రిటన్‌లో ప్రతి జిల్లా స్థాయిలో, మున్సిపాలిటీ నగరాల స్థాయిలో 'పోలీస్ అథారిటీ' గా ఉండే సుమారు తొమ్మిది నుండి పన్నెండు మంది వరకు గల పౌరుల అధికార పరిధిలో పోలీసులు ఉంటారు. కెనడాలో జిల్లా, మున్సిపాలిటీ, నగర స్థాయిలో ఉండే 'పోలీస్ సర్వీస్ అథారిటీ' అనబడే పౌరుల అధికార పరిధిలో పోలీసులు ఉంటారు.

ఇండియాలో ఈ క్రమంలోనే 1980-81లో జాతీయ పోలీస్ కమిషన్ ప్రతి జిల్లాకు ఒక 'డిస్ట్రిక్ట్ ఎన్‌క్వైరీ' అథారిటీని అదనపు సెషన్స్ జడ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఈ అథారిటీ పోలీసులపై పౌరులిచ్చే ఫిర్యాదులను, లాకప్పులో జరిగే హత్యలు, రేప్‌లను, పోలీసు కాల్పుల్లో జరిగే మరణాలపై విచారించి పోలీసులపై చర్యలు తీసుకునే అధికారాలు కలిగి ఉండాలని సూచించింది.

పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం

పశ్చిమ బెంగాల్‌లోను సాధారణ ప్రజలపై పోలీసుల అణచివేత, చిత్రహింసలు, లాకప్ హత్యలు, దుర్మార్గాలు ఇతర రాష్ట్రాల్లోలాగే కొనసాగుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో పోలీసులచే లాకప్‌లో హత్యకు గురైనవారు 1977 నుండి 2005 వరకు సుమారు 350 మందికి పైగా అనుమానితులున్నారని కోల్‌కతాకు చెందిన పౌరహక్కుల సంస్థ ప్రకటించింది. మానవహక్కుల కమిషన్‌కు పశ్చిమబెంగాల్‌లో లాకప్ హత్యలకు సంబంధించి 2000-01 లో 19, 2001-02లో 17 మంది, 2003-04లో 13 మంది బలయ్యారని ఫిర్యాదులు అందాయి.

మానవ హక్కుల కమిషన్‌కు అందిన ఫిర్యాదుల ప్రకారం పోలీస్ లాకప్‌లలో చిత్రహింసలకు మరణించిన వారి సంఖ్య

సంవత్సరం	దేశంలో మొత్తం సంఖ్య	ఆంధ్రప్రదేశ్‌లో	పశ్చిమ బెంగాల్‌లో
1997-98	189	20	సంఖ్య తెలియదు
1998-99	179	25	సంఖ్య తెలియదు
1999-2000	177	సంఖ్య తెలియదు	19
2000-01	127	సంఖ్య తెలియదు	9
2001-02	162	16	17
2002-03	183	సంఖ్య తెలియదు	సంఖ్య తెలియదు
2003-04	162	సంఖ్య తెలియదు	13
2004-05	136	సంఖ్య తెలియదు	సంఖ్య తెలియదు

ఆధారం : మానవ హక్కుల కమిషన్ రిపోర్ట్‌ల ప్రకారం

పోలీస్ వ్యవస్థపై సుప్రీం కోర్టు

1978లో నియమించబడిన 'జాతీయ పోలీస్ కమిషన్', రెబిరో కమిటీ, పద్మనాభయ్య కమిటీ, సోలిసొరబ్జి కమిటీ, 2003లో తుదినివేదిక ఇచ్చిన మాలిమత్ కమిటీ, జాతీయ మానవ హక్కుల కమిషన్ నివేదిక పోలీస్ వ్యవస్థ సంస్కరణల గూర్చి రికమండ్ చేశాయి. ఇద్దరు రిటైర్డ్ ఐ.పి.ఎస్. అధికారులు సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాం వేశారు. 2006లో అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు పోలీసు సంస్కరణల విషయమై తమ విధానాన్ని తెలియజేయాలని నోటీసులు పంపింది. చాలా రాష్ట్రాలు సరైన నిర్దిష్ట సమాధానం తెలియజేయలేదు.

జాతీయ పోలీస్ కమిషన్ తన తొలి నివేదికలో పౌరుల హక్కులను కాపాడడానికి, పోలీసుల అక్రమ దాష్టికాల నుండి ప్రజలను రక్షించడానికి, పోలీసులపై వచ్చే ఫిర్యాదులను విచారించి చర్య తీసుకోవడానికి రిటైర్డ్ జిల్లా సెషన్స్ జడ్జీల ఆధ్వర్యంలో 'జిల్లా విచారణ కమిటీలను' ఏర్పాటు చేయాలని నొక్కి చెప్పింది. పోలీసుల అక్రమాలపై విచారించి చర్య తీసుకోవడానికి ప్రతి జిల్లాకు 'విచారణ కమిటీ'లను రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో మరి కొందరు సభ్యులను నియమించి పూర్తికాలం పనిచేసే విధంగా చూడాలని సుప్రీం కోర్టు తన జడ్జిమెంట్‌లో పేర్కొన్నది.

వలసపాలన కాలం నాటి దుర్మార్గాలను, కౄరత్వాన్ని నేటికీ అలాగే కొనసాగిస్తున్న పోలీసు వ్యవస్థను పౌర కంట్రోల్‌లోకి తీసుకువచ్చే సంస్కరణల ద్వారానే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయగలం.

వివిధ దేశాలలో పౌరుల కంట్రోల్‌లో పోలీసులు

జపాన్ : జపాన్‌లో పోలీసులపై అధికారం, అజమాయిషీ కలిగిన 'జాతీయ ప్రజా భద్రతా కమిషన్' (ఎన్.పి.ఎస్.సి.) ఐదుగురితో కూడి ఉంటుంది. మూడు సంవత్సరాల పదవికాలం కలిగిన ఐదుగురు సభ్యులను జపాన్ పార్లమెంట్ క్యాబినెట్ నియమిస్తుంది. వీరు సాధారణ పౌర ప్రముఖుల నుండి, పార్లమెంట్‌లోని ప్రధాన పార్టీల నుండి, రిటైర్డ్ జడ్జీల నుండి నియమించబడుతారు.

బ్రిటన్ : బ్రిటన్‌లో ప్రతి మునిసిపాలిటీ నగరానికి, పట్టణానికి, కౌంటీకి ఒక పోలీస్ అథారిటీ ఉంటుంది. నిర్ణీత కాలానికి గాను పోలీస్ అథారిటీ సభ్యులు నియమించబడుతారు. తొమ్మిది మంది మొదలు 15 మంది వరకు సభ్యులుంటారు. ఈ అథారిటీలో ప్రజలచే ఎన్నుకోబడిన ముగ్గురు కౌంటీ లేక మునిసిపాలిటీ కౌన్సిలర్‌లు, ముగ్గురు మెజిస్ట్రేట్‌లు, ముగ్గురు స్థానికంగా నివసించే పౌరులు సభ్యులుగా

సూరపనేని హరిపురుషోత్తమరావు



ప్రముఖ సాహిత్య, సినీ విమర్శకుడు, మార్క్సిస్ట్ విశ్లేషకుడు, అనువాదకుడు, సూరపనేని హరిపురుషోత్తమరావు (హరి) జూలై 23 బుధవారం రాత్రి చనిపోయారు. ఆయన వయస్సు 73 ఏళ్లు. జ్ఞాపకశక్తి క్షీణించి కొంతకాలంగా చంద్రరాజేశ్వర రావు వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. మరణాంతరం కళ్లను దానం చేయాలనే ఆయన ఆకాంక్ష మేరకు ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రివారు ఆయన నేత్రాలను సేకరించారు. కృష్ణా జిల్లాలోని పాములపాడు గ్రామంలో 1935 అక్టోబర్ 15న జన్మించిన హరి యవ్వనంలోనే కమ్యూనిస్ట్ ఉద్యమాలవైపు ఆకర్షితులయ్యారు. ప్రజానాట్యమండలి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆయనకు సాహిత్యమన్నా, సినిమాలన్నా చాలా ఆసక్తి. ఎం.ఎ. తత్వశాస్త్రం చదివారు. 1964 తరువాత కొంతకాలం పాటు సినీరంగంలో పనిచేసిన ఆయన అభ్యుదయ రచయితల సంఘం (అరసం), ఇతర సాహిత్య సంఘాలతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. 1970 జూలై 4న ఆవిర్భవించిన విప్లవ రచయితల సంఘం (విరసం) వ్యవస్థాపక సభ్యుల్లో ఆయన ఒకరు. మహాకవి శ్రీశ్రీని విరసంలోకి తీసుకురావడంలో ఆయన పాత్ర ఉంది. హరి కొంతకాలం చీరాల కళాశాలలో అధ్యాపకునిగా పని చేశారు. ముప్పై ఏళ్ల కాలం పలు పత్రికల్లో సాహిత్య, చారిత్రక, సినిమారంగాలపై ఆసక్తికరమైన అంశాలు రాశారు. 'తారీఖులు - దస్తావేజులు' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆయన రాసిన వ్యాసాలకు ఎనలేని ఆదరణ లభించింది. గొప్ప సాహిత్య సృజనకారుడిగా తెలుగు సాహిత్యంలో ఎప్పటికీ నిలిచి ఉంటారు. వీ

నియమింపబడుతారు. పోలీసులపై వచ్చే ఫిర్యాదులను విచారించి చర్యలను తీసుకోవడం, సస్పెండ్, డిస్మిస్ చేయడం, పౌరులతో పోలీసుల విధులు సేవలు గూర్చి చర్చించి తగిన ఆదేశాలు ఇవ్వడం పోలీస్ అథారిటీ సభ్యులు చూసుకుంటారు.

పోలీస్ స్టేషన్‌లో పోలీసు కస్టడిలో లాకప్‌లలో ఉండే నిందితుల యోగక్షేమాలు, ఫిర్యాదులు చూడటానికి కొందరు పౌరులతో కూడిన ఇండిపెండెంట్ కమిటీని పోలీస్ అథారిటీ నియమిస్తుంది. ఇండిపెండెంట్ సభ్యులు పోలీస్ లాకప్పులను, సెల్స్‌ను ఇరవై నాలుగు గంటలు ఎప్పుడైనా సందర్శించి, కస్టడీలోని నిందితులతో ప్రత్యేకంగా రహస్యంగా మాట్లాడి, అవసరమైతే పోలీసులపై తగిన చర్యలకు పోలీస్ అథారిటీ సభ్యులకు సిఫారస్ చేస్తారు. పోలీస్ లాకప్ సెల్స్‌పై, కస్టడీలోని నిందితుల యోగక్షేమాలపై నిరంతర నిఘా ఉంటుంది. మన దేశంలో లాగ లాకప్ హత్యలకు, అనుమానితుల చిత్రహింసలకు బ్రిటన్‌లో అవకాశం లేని పరిస్థితులు కనిపిస్తున్నాయి.

పోలీసు అధికారుల ఎంపిక, హోదా

పైన ఉదరించిన దేశాల్లోనే కాదు ఇంకా మరో యాభై దేశాలకు పైగా ప్రభుత్వాలు ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల, పౌరుల నియంత్రణ, అధికారం కిందనే పోలీస్ వ్యవస్థ ఉంది. ఇదంతా ప్రజాస్వామ్యానికి గుర్తు మాత్రమే. భారతదేశంలో నియంతృత్వానికి, అమానుషత్వానికి ప్రతిరూపంగా ఉన్న పోలీస్ వ్యవస్థను పూర్తిగా పౌరుల, ప్రజల నియంత్రణ, అధికారం కిందకు తీసుకువచ్చే ప్రజాస్వామ్య సంస్కరణల కోసం ఉద్యమాన్ని నిర్మించాలి. నిరంకుశత్వానికి ప్రతిబింబాలైన ఐ.పి.ఎస్. అధికార వ్యవస్థను రద్దుచేయాలి. పౌరులకు భద్రత, ప్రజలకు రక్షణ ఇవ్వగలిగిన ప్రజాస్వామ్య పోలీస్ వ్యవస్థ కోసం, వలస పాలన కాలం నాటి నేడున్న పోలీస్ వ్యవస్థ రద్దు కోసం బలమైన సామాజిక ఉద్యమాన్ని నిర్మించాలి.

మన చారిత్రక కర్తవ్యం

1789 ఫ్రెంచ్ మహా విప్లవం నినదించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికగా ప్రజలే సార్వభౌమాధికారులుగా పరిగణించబడే రిపబ్లిక్ వ్యవస్థ, ఇప్పటికీ ఇంకా ప్రపంచంలోని చాలా దేశాల్లో ఆచరణలోకి రాలేదు. 1789 ఫ్రెంచ్ మహావిప్లవం కొనసాగింపే 1999 వెనిజులా 'బొలివేరియన్ రిపబ్లిక్' రాజ్యాంగం అనే చారిత్రక వాస్తవాన్ని మనం గుర్తించాలి. వెనిజులాలో ఒంబుడ్స్‌మెన్ లాంటి పౌర రక్షణాధికారులను ఓట్ల ద్వారా ప్రజలు ఎన్నుకుంటారు. ఇది హ్యూగోచావేజ్ నాయకత్వాన వెనిజులా ప్రజలు సైమన్ బొలివర్, చేగువేరాల ఉద్యమస్ఫూర్తితో సాధించుకున్న మహావిజయం.

భారతదేశంలో సాధారణ పౌరుల ప్రయోజనాలు కాపాడే ఒంబుడ్స్‌మెన్ వ్యవస్థను అమలులోకి తీసుకురావడం కోసం, 'ప్రజలే యజమానులు' అనే రిపబ్లిక్ వ్యవస్థను ఆచరణలో వాస్తవం చేయడం కోసం, పూర్తిస్థాయి ప్రజాస్వామ్యాన్ని సమాజంలో ప్రతిష్ఠించడం కోసం శక్తివంతమైన పౌర ఉద్యమాలను, ప్రజా ఆందోళనలను నిర్మించడం నేటితరం కర్తవ్యం. 'దిక్కున్న చోట చెప్పుకో', 'ఎవరికి చెప్తావో వెళ్లి చెప్పుకో', 'వారం తర్వార రా', 'తీరిక ఉన్నప్పుడు నీ ఫైల్ చూస్తాను', 'అవతల నాకు చాలా పనులున్నాయి, వెళ్లిపో!', 'ఫ్యాన్‌తో గెంటించ మంటావా? పోలీసును పిలిచి లోపల వేయించాలో చెప్పు', జాగ్రత్త! చెప్పానుగా, అర్థమయ్యిందా వెళ్లు! వెళ్లు!' ఇలాంటి మాటలు ప్రతిరోజూ ప్రభుత్వ కార్యాలయాల్లో లక్షలాది నిస్సహాయ ఒంటరి పౌరులపై నికృష్టంగా దాడిచేస్తుంటాయి.

నామీదే పై అధికారులకు ఫిర్యాదులు పంపుతావా? నన్నెవరూ ఏమీ చేయలేరు, నేను ఫైల్స్‌పై పెన్నుతో ఓ గీత గీసానంటే, ఇక నీ బతుకు రోడ్డుపాలవుతుంది, ఏమనుకుంటున్నావు అంటూ పౌరులను హేళన చేసే ప్రభుత్వ అధికారులు, పోలీసంటే ఏమనుకున్నారా? నా పవరేంటో చూడు, ఇలాంటి మాటలు నిత్యం ఎక్కడో ఒక చోట వినిపిస్తూనే ఉంటాయి. ప్రతి నిమిషం సాధారణ పౌరులను హేళన చేస్తుంటాయి. ఈ ఘోరాల నుండి దారుణాల నుండి నిస్సహాయ పౌరుల రాజ్యాంగ హక్కుల రక్షణకోసం పార్టీ రహిత ఎన్నికల ద్వారా కనీసం జిల్లా, మండల స్థాయికో ఒబుడ్స్‌మెన్‌ను ప్రజల ఓట్ల ద్వారా ఎన్నుకోవాలి. ఇందుకోసం పౌరుల్లో చైతన్యం, ప్రజాఉద్యమం నిర్మించే కర్తవ్యాన్ని ముందుకు తీసుకుపోవాలి. విస్తృత ప్రచారం ద్వారా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాలి. వీ

పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొనే నగర మాస్టర్‌ప్లాన్లు రూపొందుతాయనీ, పర్యావరణ అనుకూల విధానాలతో పౌరుల భాగస్వామ్యంతో హైదరాబాద్ ప్రణాళికను రూపొందించాలని అంటున్నారు **ఎం. వేదకుమార్**

ప్రజల ఆకాంక్షలు పట్టని మాస్టర్ ప్లాన్

ఓ నగరం అభివృద్ధి చెందాలంటే, సరైన రీతిలో ప్రణాళికాబద్ధంగా దాన్ని వృద్ధి చేయాల్సి ఉంటుంది. సరైన ప్రణాళిక లేకుండా, తాత్కాలిక అవసరాలను పరిగణనలోకి తీసుకుంటూ పోతే భవిష్యత్తులో ఎన్నో సమస్యలు ఎదురవుతాయి. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకునే ఆయా నగరాల వృద్ధికి మాస్టర్‌ప్లాన్‌లను రూపొందించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ప్లాన్‌ను రూపొందించేటప్పుడు కనీసం ఐదారు దశాబ్దాల తరువాతి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుంటారు. ప్లాన్ రూపకల్పనలో ప్రజలను, నిపుణులను కూడా భాగస్వాములుగా చేస్తారు. అవేవీ లేకుండా తాత్కాలిక అవసరాలను, అధికారంలో ఉన్న పార్టీనేతల స్వార్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తే దాని వల్ల మంచి కంటే చెడే ఎక్కువగా జరుగుతుంది. హైదరాబాద్ నగరానికి సంబంధించి హుడా ఇటీవల నోటిఫై చేసిన మాస్టర్‌ప్లాన్‌నే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

మాస్టర్‌ప్లాన్


రానున్న ఏళ్లలో నగరం ఏ రీతిలో, ఏ దిశలో ఎలా అభివృద్ధి చెందాలో వివరించే ప్రణాళికనే మాస్టర్‌ప్లాన్ అంటారు. భూవినియోగం, భవన నిర్మాణం, లే అవుట్లు, ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ రేషియోలకు సంబంధించిన జోనల్ రెగ్యులేషన్స్‌ను ఇందులో పేర్కొంటారు. భవిష్యత్తు అవసరాలను, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, వాటికి తగ్గట్టుగా మౌలిక వసతుల కల్పనకు తగు ఏర్పాట్లు చేస్తారు. భవిష్యత్తులో నగర విస్తరణ ఎలా ఉండాలో అది నిర్దేశిస్తుంది. ఒకసారి ఈ మాస్టర్‌ప్లాన్‌ను నోటిఫై చేస్తే ఇక అది చట్టంగా మారుతుంది. ఏ మాస్టర్‌ప్లాన్ విజయం అయినా రూపకర్తల అంకితభావం, అధికారంలో ఉన్నవారి నిబద్ధత, నిబంధనలు పాటించాలన్న ప్రజల అభిమతం మీదే ఆధారపడి ఉంటుంది. మాస్టార్‌ప్లాన్‌లో ఓ కీలకాంశం రీజనల్ ప్లానింగ్.

రీజనల్ ప్లానింగ్

నగరంకోసం రూపొందించే మాస్టర్‌ప్లాన్ ప్రభావం కేవలం నగరానికే పరిమితం కాదు. చుట్టుపక్కల జిల్లాలు మొదలుకొని దగ్గరి పట్టణాలతో సహా యావత్ రాష్ట్రం వరకూ ఆ ప్రభావం ఉంటుంది. ఒక ప్రాంతంలో లభ్యమయ్యే సహజ వనరులను, ఇతరత్రా సదుపాయాలను, మానవ నైపుణ్యాలను దృష్టిలో ఉంచుకొని అక్కడ వాటికి సంబంధించిన పరిశ్రమలను ఏర్పాటు చేయడం లాంటి అంశాలన్నీ ఈ రీజనల్ ప్లానింగ్ పరిధిలోకి వస్తాయి. మాస్టర్‌ప్లాన్ అమలు చేసే నగరాన్ని ఇతర పట్టణాలు ఏవిధంగా ప్రభావితం చేస్తాయో గమనించి, అందుకు తగ్గట్టుగా ఉభయపక్షాలూ లబ్ది పొందేలా ప్రణాళిక రూపొందించడమే రీజనల్ ప్లానింగ్. ఏదైనా నగరం తన అవసరాల కోసం సమీపంలోని మరో చిన్న పట్టణంపై ఆధారపడితే, ఆ నగరంలో చోటు చేసుకునే అభివృద్ధి ప్రభావం ఆ పట్టణంపై ఉంటుంది. అలాగే, ఆ పట్టణంలో చేపట్టే అభివృద్ధి ప్రణాళికల ప్రభావం నగరంపై కూడా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ నగరానికి మాస్టర్‌ప్లాన్ అమలుచేసే ముందు ఆ నగరంపై ప్రభావం చూపే ఇతర పట్టణాల అభివృద్ధి అవకాశాలనూ బేరీజు వేయాల్సి ఉంటుంది. ఉపాధి విషయానికే వస్తే, చుట్టుపక్కల ఇతర పట్టణాలను అభివృద్ధి చేయకుండా, నగరాన్ని మాత్రమే అభివృద్ధి చేస్తే వలసలు పెరిగే అవకాశం ఉంది. అలాగాకుండా, ఆయా పట్టణాల్లోని స్థానికులకు అక్కడి వనరులను, నైపుణ్యాలను బట్టి అక్కడికక్కడే ఉపాధి అవకాశాలను కల్పిస్తే అక్కడి నుంచి వలసలను తగ్గించవచ్చు. ఒక పట్టణం ఖనిజసంపదకు పేరు గాంచితే, మరో పట్టణం కళాకారుల కళానైపుణ్యానికి పేరుగాంచవచ్చు. ఒక పట్టణం మార్కెట్‌యార్డ్ లాంటి వాణిజ్య కార్యకాలాపాలకు పేరుగాంచితే, మరో పట్టణం ఇతరత్రా ఉత్పత్తులకు ప్రఖ్యాతి చెందవచ్చు. నగరం చుట్టుపక్కల చారిత్రక, పర్యాటక ప్రదేశాలు ఉంటే, వాటితో పాటు నగరం కూడా పర్యాటక కేంద్రంగా ప్రాచుర్యం పొందగలదు. నగర సమీపంలోని ఓ చిన్న పట్టణం గుండా నగరానికి నీటిని అందించే అవకాశం గల నది ప్రవహిస్తూ ఉండవచ్చు. ఇలాంటి పట్టణాలు నగర అభివృద్ధికీ దోహదం చేస్తాయి. వాటి అభివృద్ధితో నగరం వృద్ధి, అలాగే, నగరం వృద్ధితో వాటి అభివృద్ధి ముడిపడి ఉంటాయి.

ఒకే సంస్థపరిధిలో ఇంత స్థలమా?

హైదరాబాద్‌కు 400 ఏళ్లకు పైబడిన చరిత్ర ఉంది. ఆరంభంలో అది పటిష్ట ప్రణాళికతోనే మొదలైంది. వేల సంఖ్యలో ఉన్న జనాభా లక్షలకు చేరుకుంది. గ్రేటర్ హైదరాబాద్‌తో నగర జనాభా నాలుగైదు ఏళ్లలో కోటిని మించిపోయినా ఆశ్చర్య పోనక్కర్లేదు. ఒకప్పటి ఎంసిహెచ్ విస్తీర్ణం 172.6 చ.కి.మీ. ఆ ప్రాంతాన్నే సక్రమంగా నిర్వహించ లేకపోయిన అధికార యంత్రాంగం అంతకు మూడు రెట్ల స్థలాన్ని ఎలా నిర్వహించగలదో వారికే తెలియాలి. ఒకే కార్పోరేషన్ కింద ఇంత స్థలాన్ని ఉంచే బదులు, మరో రెండు కార్పోరేషన్లు ఏర్పాటు చేయడం



సమంజసమని నిపుణులు అంటున్నా అవేవీ పాలకవర్గాలకు పట్టలేదు. శివారు మునిసిపాలిటీలన్నింటినీ విలీనం చేసేసి గ్రేటర్‌ను ఏర్పాటు చేశారు. గ్రేటర్ వ్యామోహం అలాంటిది. దాని వెనుక దాగిన పాలకవర్గాల స్వార్థ ప్రయోజనాలు అలాంటివి.

రూపకల్పనకు పాతికేళ్లు

మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ (ఎంసిహెచ్)లో మాస్టర్‌ప్లాన్‌ల రూపకల్పన 1975 నుంచీ మొదలైంది. 1980 నుంచీ, మిగిలిన పట్టణ ప్రాంతానికి హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా) మాస్టర్ ప్లాన్‌లను రూపొందించడం ఆరంభించింది. 1994 నాటికి ఎంసిహెచ్, ఇతర మెట్రోజోన్‌లకు కలిపి హుడా 18 జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లను ప్రకటించింది. మొత్తానికి తుది ముసాయిదా రూపొందేసరికి పాతికేళ్ళు పట్టింది.

నోటిఫైకి ఎనిమిదేళ్లు

2000 నాటికి రూపుదిద్దుకున్న మాస్టర్ ప్లాన్‌ను 2003లో ఒకసారి, 2007లో మరోసారి ప్రజల నుంచి సలహాలు, అభ్యంతరాల కోసం ప్రకటించారు. అవన్నీ పూర్తయి నోటిఫై అయ్యేందుకు ఎనిమిదేళ్ళు పట్టింది. అందులోనూ ఎన్నో లొసుగులు. పారదర్శకత కరువు. ఎన్నో ముఖ్యమైన అంశాలను అసలుకే పట్టించుకోలేదు. సలహాలు, సూచనలు తెలిపేందుకు, అభ్యంతరాలు వ్యక్తం చేసేందుకు తగిన సమయం ఇవ్వలేదు. చివరకు నోటిఫై చేసేశారు.

ఇంత హడావుడి ఎందుకో

తాజాగా హుడా నోటిఫై చేసిన మాస్టర్‌ప్లాన్‌లో ప్రాథమికంగా ఉండాల్సిన ముందుచూపు కొరవడింది. ప్రజలను, ప్రజాసంఘాలను భాగస్వాములుగా చేయకుండా, వారి అభ్యంతరాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోకుండానే దాన్ని నోటిఫై చేశారు. అమెరికాలాంటి దేశాల్లో ఒక విధానం లేదా ప్రణాళిక అంటూ రూపొందాక, అధికారంలో ఏ పార్టీ ఉన్నా కూడా దానిలో ఎలాంటి మార్పూ పెద్దగా ఉండదు. మన దేశంలో, రాష్ట్రంలో అలాంటి పరిస్థితి లేదు. అధికారంలోకి ఏ పార్టీ వస్తే, అది తనకు, తన పార్టీ వారికి లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో మరో ఆరు లేదా ఎనిమిది నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ తదుపరి అధికారం లోకి వచ్చే పార్టీ మాస్టర్‌ప్లాన్ పట్ల ఎలాంటి ధోరణి అవలంబిస్తుందో తెలియదు.

ప్రజాభాగస్వామ్యం కరువు

మాస్టర్‌ప్లాన్ నోటిఫై చేయడానికి ముందు ఆ విషయంలో ప్రజలు, ప్రజాసంఘాలు వ్యక్తం చేసే అభ్యంతరాలూ, సలహాలూ, సూచనలనూ పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగం కూడా ఆ విషయాన్ని స్పష్టం చేసింది. ఈ విషయంలో అనుసరించాల్సిన విధి విధానాలను 73,74వ సవరణలు 11వ షెడ్యూల్ పేర్కొన్నాయి. ఎంసిహెచ్ యేతర హుడా ప్రాంతానికి గాను ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను ప్రదర్శిస్తున్నట్లుగా ప్రకటించిన ఎంఎ అండ్ యుడి దాని విషయంలో ప్రజల సలహాలు/అభ్యంతరాలను ఆహ్వానిస్తూ అందుకు 31 మే 2007 నుంచి 18 జూన్ 2007 వరకు (15 రోజులు) గడువునిచ్చింది. హుడా అప్పటి ప్రధాన కార్యాలయంలో మాత్రమే దీన్ని ప్రదర్శించారు. ప్రస్తుత భూ వినియోగం ప్రదర్శించకుండా, కేవలం మాస్టర్‌ప్లాన్ మ్యాప్‌లను మాత్రమే ప్రదర్శించారు. వివరణాత్మక బుక్‌లెట్‌లు మాత్రం అందుబాటులో లేకుండా పోయాయి. మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించిన సమాచారం అంతా కూడా కేవలం ఇంగ్లీష్‌లో మాత్రమే ఉండడం కూడా మరో ప్రధాన అంశం. దీనివల్ల తెలుగు, ఉర్దూ మాత్రమే తెలిసిన వారు మాస్టర్‌ప్లాన్‌లోని అంశాలను తెలుసుకోలేకపోయారు. హైదరాబాద్ లో తెలుగు, ఉర్దూ మాట్లాడేవారే అధికం. ఇలా ఓ పెద్ద వర్గాన్ని మాస్టర్ ప్లాన్ వివరాలు తెలుసుకోవడానికి దూరం చేయడం వెనుక ఉన్న 'మాస్టర్ ప్లాన్' ఏంటో అధికారులకు, పాలక పక్షానికే తెలియాలి.

పౌరసంస్థల అభ్యంతరాలు

మాస్టర్‌ప్లాన్‌ను నోటిఫై చేయడానికి ముందే, ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్, సారూప్యత కలిగిన ఇతర సంస్థలూ 2007 జూన్ 7న హుడా ప్రధాన కార్యాలయానికి వెళ్ళి తమ అభ్యంతరాలను వ్యక్తం చేశాయి. అంతకు ముందే అవి తమ అభ్యంతరాలను వివరిస్తూ ఎంఎ అండ్ యుడి కి ఓ వినతిపత్రాన్ని సమర్పించాయి. ఈ ప్రక్రియనంతా గమనించి వెంటనే కొన్ని అభ్యంతరాలను లేవనెత్తాయి.

ముఖ్యమైన అభ్యంతరాలు

- ఎంతో ముఖ్యమైన ఈ ప్రక్రియకు తగినంతగా ప్రచారం కల్పించ లేదు.
- ప్రజలు స్పందించేందుకు అతి తక్కువ సమయం (15 రోజులు) ఇచ్చారు. 2003లో ఇలా ఇచ్చిన గడువు మూడు నెలలు కావడం గమనార్హం.
- ఒకే ఒక్క చోట డిస్‌ప్లే చేయడం, హైదరాబాద్ వంటి పెద్ద నగరానికి సరిపోయేది కాదు.
- ప్రతిపాదిత మార్పులు, ప్రభావాలను అర్థం చేసుకొనేందుకు ఎలాంటి లిఖితపూర్వక సమాచారం లేకపోవడం
- ప్రస్తుత భూవినియోగ మ్యాపులను ప్రదర్శించకపోవడం
- అవుటర్ రింగ్ రోడ్డు (ఒఆర్ఆర్)కు సంబంధించి ఆయా పటాల్లో భారీ తప్పిదాలు చోటు చేసుకోవడం

ప్రజాసంఘాల స్పందన

మాస్టర్‌ప్లాన్‌కు స్పందించి

- ప్రస్తుత భూవినియోగ పటాలు లేకపోవడం
- అవుటర్ రింగ్ రోడ్డు మార్కింగ్‌లో అక్రమాలు
- అభివృద్ధి దశలపై స్పష్టత లేకపోవడం

లాంటి అంశాలపై ఎప్పటికప్పుడు ఎంఎ అండ్ యుడి కి వినతి పత్రాలను ఆయా సంఘాలు సమర్పించాయి.

మాస్టర్ ప్లాన్ అధ్యయనానికి, సమగ్ర ప్రాతినిథ్యం వహించేందుకు వీలుగా భావసారూప్యత కలిగిన వారి కోసం రెండు సార్లు డిస్‌ప్లే ప్రాంతాన్ని (హుడా ప్రధాన కార్యాలయం) సందర్శించే ఏర్పాట్లను ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ చేపట్టింది.

ప్రజాసంఘాల యత్నాల ఫలితాలు

మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాలు, సూచనలు వ్యక్తం చేసేందుకు గాను, బహిరంగ ప్రదర్శన గడవు తేదీని 11 జులై 2007 వరకు పొడిగించేందుకు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఎ అండ్ యుడి) అంగీకరించింది.

- నగరవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ మ్యాప్‌లను ప్రదర్శించేందుకు అంగీకరించింది.
- విస్తృత ప్రచారం కల్పించాల్సిందిగా హుడాను ఎంఎ అండ్ యుడి కోరింది.

రాజ్యాంగపరమైన ప్రక్రియను విస్మరించడం: ఆర్టికల్ 243 – పి (సి) ప్రకారం 'హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా' (హెచ్ఎంఎ)ను డీమార్క్ చేయాల్సి ఉంటుంది. రాజ్యాంగంలోని 243 – జెడ్ఇ ఆర్టికల్ కింద 'హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీ' (హెచ్ఎంపిసి)ని కూడా ఏర్పాటు చేయాల్సిఉంటుంది.

– ఈ విషయమై ఇప్పటికే ఎన్నో సార్లు రిమైండర్లు, వినతిపత్రాలు సమర్పించినా నేటికీ ఫలితం లేకపోయింది.

గ్రేటర్ హైదరాబాద్ – సరైన పరిష్కారమేనా?

సమతుల్య పట్టణాభివృద్ధిని సాధించడం తన లక్ష్యమని ప్రస్తుత ప్రభుత్వం పేర్కొంటున్నా ఆ దిశలో అది తీసుకుంటున్న చర్యలను చూస్తే మాత్రం అది నిజమేనా అనే సందేహంరాక మానదు. లక్ష్యం ఒకటైతే అందుకు భిన్నంగా ఆచరణ ఉంటోంది. రాష్ట్ర పట్టణ జనాభాలో మూడింట ఒక వంతు మంది హైదరాబాద్‌లోనే నివసిస్తున్నారు. ఇది అవాంఛనీయ ఎదుగుదలకు నిదర్శనం. రాష్ట్రంలో హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖపట్టణం మినహా ఇంచుమించు అన్ని పట్టణాల జనాభాలో ఎక్కువగా మార్పులు రాలేదు.

ఇలా ఎందుకు జరుగుతోంది?

లోపాలతో కూడుకున్న పాలసీల కారణంగా, ప్రభుత్వ, ప్రయివేటు రంగాలు తమ పెట్టుబడులను హైదరాబాద్, విశాఖపట్నం లాంటి నగరాల్లో పెట్టేందుకే ప్రాధాన్యం ఇస్తున్నాయి.

- మరో రెండు కార్పొరేషన్ల ఏర్పాటుకు యోచించే బదులు ఒకే గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయడం మరో ఘోర తప్పిదానికి నిదర్శనం.



- ప్రస్తుత కార్పొరేషన్ పరిమాణం, గత కార్పొరేషన్‌కు మూడు రెట్లు అధికం. ఈ విధమైన కేంద్రీకరణ అంతా కూడా రాష్ట్రంలో ఇతర పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధిని దెబ్బ తీస్తోంది.

ఏం చేయాలి?

మౌలిక వసతులపరంగా ఇప్పటికే పలు ఒత్తిళ్ళను ఎదుర్కొంటున్న హైదరాబాద్ గ్రేటర్ తాకిడికి కుప్పకూలకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. అదే విధంగా, పెట్టుబడులన్నీ ఒకేచోట కేంద్రీకృతం గాకుండా, ఇతర నగరాలు, పట్టణాల్లోనూ అధికంగా పెట్టుబడులు పెట్టేలా వాటిని 'కౌంటర్ మాగ్నెట్స్'గా వృద్ధి చేయాలి. ఆ దిశలో పెట్టుబడులను ప్రోత్సహించాలి.

ఇంతకూ మాస్టర్‌ప్లాన్ పరిస్థితి ఏంటి?

ప్రజలు, ప్రజాసంఘాల నుంచి వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో మాస్టర్‌ప్లాన్‌ను రివిజన్ చేయాలని నిర్ణయించారు. ఇతర ఏజెన్సీలు లేదా ప్రాజెక్ట్‌లు ఇచ్చిన చిన్నచిన్న వివరాల్లాంటి ఎన్నో అంశాలు అందులో ఉన్నాయి. ఒకే ఒక్కటి మినహా. ఆ ఒక్కటి ఏంటంటే – సీరియస్ అధ్యయనం, విశ్లేషణ. అవుటర్ రింగ్‌రోడ్డు, స్కై స్క్రాపర్ జోన్, హైరైజ్ జోన్, ఎంఆర్‌టిఎస్ (మెట్రోరైల్), జీవో నెం. 86, 'హైదరాబాద్ రివైజ్డ్ బిల్డింగ్ రూల్స్–2006' వంటివి మాస్టర్‌ప్లాన్ ప్రక్రియను అంతా నీరుగార్చేసి దాన్ని కాగితంపై అలంకారప్రాయంగా మార్చాయి. ఇప్పుడు ఇదే మాస్టర్‌ప్లాన్ నోటిఫై కూడా అయ్యింది. ఈ అంశాన్ని మరింత ఉన్నతస్థాయిలో చర్చించాల్సిన అవసరం ఉంది. అవసరమైతే అసెంబ్లీలో దీన్ని క్షుణ్ణంగా చర్చకు పెట్టాలి. ఆ తరువాతే తుదినిర్ణయం తీసుకోవాలి.

పెట్టుబడులు

ప్రతిపాదిత పెట్టుబడులకు మాస్టర్‌ప్లాన్‌ను ఏవిధంగా జోడించింది స్పష్టంగా లేదు.

వారసత్వ, చారిత్రక సంపద

మాస్టర్‌ప్లాన్ అమలు సందర్భంగా నగర వారసత్వ, చారిత్రక సంపద దెబ్బతినకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. నగర సంస్కృతిని అది ధ్వంసం చేయకుండా చూసుకోవాలి.

పౌర సదుపాయాలు

పౌర మౌలిక వసతుల అంశాన్ని ఏ విధంగా పరిష్కరించాలనే విషయాన్ని మాస్టర్‌ప్లాన్‌లో ప్రస్తావించలేదు.

భూ వినియోగం

- రెసిడెన్షియల్ ఏరియా కోసం 327 చ.కి.మీ సరిపోతుందని లెక్కించినప్పటికీ, అందుకు విరుద్ధంగా సుమారుగా 500 చ.కి.మీ.కు భూ వినియోగాన్ని పెంచారు.
- అవుటర్ రింగ్ రోడ్డు గ్రోత్ కారిడార్ వల్ల డెవలప్‌మెంట్ ఏరియాకు 300 చ.కి.మీ జత అయినప్పటికీ, అదంతా కూడా కన్జర్వేషన్ ల్యాండ్, ఫారెస్ట్ ల్యాండ్‌ల నుంచి తీసుకున్న భూమే. ఫలితంగా కన్జర్వేషన్ ఏరియా 1117 చ.కి. మీ నుంచి 300 చ.కి.మీ. తగ్గిపోయింది. ఇదెంతో తీవ్రమైన తగ్గుదల. దీనివల్ల పచ్చదనంతో కూడిన (గ్రీన్ కవర్) స్థలాల విస్తీర్ణం బాగా తగ్గిపోయి కాలుష్య స్థాయి పెరగడం లాంటి సమస్యలు ఏర్పడుతాయి.

అడవులు, జలాశయాలు కాగితాలపైనే!

ఫారెస్ట్ జోన్‌ను 88.4 కి.మీ.గా చూపిస్తున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు కోసం చిలుకూరు రిజర్వు ఫారెస్టు నుంచి, బొటానికల్ గార్డెన్ కోసం సేకరించిన స్థలాలు ఇందులో కలువలేదు. డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ ప్రకారం నాన్ ఎంసిహెచ్ ఏరియాలో జలాశయాల విస్తీర్ణం 84.3 చ.కి.మీ. ప్రతిపాదనల్లో మాత్రం ఆ ప్రాంతాన్ని 98.65 చ.కి.మీ.గా పేర్కొంటున్నాయి. మరోవంకన ప్రతిరోజూ జలశయాల భూములు అన్యాక్రాంత మవుతున్నాయని వార్తలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో అడవులు, జలాశయాలు లాంటివి కాగితాలపై కన్పిస్తున్నాయే తప్ప అంత విస్తీర్ణాల్లో నిజంగా అవి ఉండడం లేదు.

అధిక బహుళ అంతస్తుల భవనాలు

బహుళ అంతస్తుల నిర్మాణాలు కలిగి ఉండాలనే నిర్ణయం, ఇప్పటి పౌరసదుపాయాలపై ఎలాంటి దుష్ప్రభావం కనబరుస్తుందో మాత్రం ఆలోచించలేదు. తలెత్తబోయే సమస్యలపై, వాటి పరిష్కారంపై ఎలాంటి అవగాహన, ముందస్తు ప్రణాళిక లేకుండానే బహుళ అంతస్తుల భవనాలను అనుమతించడం మౌలిక వసతులపరంగా పెను సమస్యలను సృష్టించనుంది.

ఆయా జోన్లలో చిన్న చిన్న భవనాలను, ప్లాట్లను నిషేధించడం చూస్తుంటే, చిన్న స్థాయి యజమానులు తమ భూములను అతి తక్కువ రేట్లకు వాటిని విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నిబంధన వల్ల లబ్ది పొందేది శక్తివంతులైన బిల్డర్లు మాత్రమే. అవుటర్ రింగు రోడ్డు విషయంలో జరిగినట్లుగానే ఇందులోనూ స్థలం అంతా కూడా కొందరి వద్దే కేంద్రీకృతం అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది.

హై రైజ్ డెవలప్‌మెంట్ జోన్లు, స్కైస్క్రాపర్ జోన్‌ల విషయానికి వస్తే, నిజమైన అవసరాల కన్నా బయటి ఒత్తిళ్ళే అధికంగా ప్రభావితం చేసినట్లు కనిపిస్తోంది.

'ప్లానింగ్' ఎక్కువా? తక్కువా?

- హైదరాబాద్ మొదటి మాస్టర్‌ప్లాన్ 1980లో అమల్లోకి వచ్చింది.
- దాన్ని సవరించేందుకు 1994లో ఒకసారి, 2000లో, 2003లో మరోసారి హుడా ప్రయత్నించినా, దాన్ని ఆమోదింపజేయడంలో / నోటిఫై చేయడంలో మొన్నటి వరకూ హుడా విఫలమైంది. ఎంసిహెచ్ కేవలం జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లను మాత్రమే వాడుతూ వచ్చింది.
- ప్రస్తుత మాస్టర్‌ప్లాన్ ఒకప్పటి ఎంసిహెచ్ ఏరియా మినహా మిగిలిన హుడా ఏరియాకు మాత్రమే.
- ఎంసిహెచ్ (ఒకప్పటి) మాస్టర్ ప్లాన్‌ను ఐఐటి ఖరగ్‌పూర్ రూపొందిస్తోంది.
- హెచ్ఎండిఎలో చేర్చిన నూతన ప్రాంతాల (600 గ్రామాలు) మాస్టర్‌ప్లాన్ తయారీ కోసం ఇఒఐ కి పిలుపు.

మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు అధికార వర్గాలు ఎంత హంగామా చేసినప్పటికీ, అందులో ప్రజల భాగస్వామ్యం మాత్రం తగ్గిపోయింది.

హెచ్ఎండిఎ ఏరియాలో ఆరు మాస్టర్‌ప్లాన్‌లు!

మాస్టర్‌ప్లాన్ పరంగా దేశంలో ఎక్కడా లేని వింతలు భాగ్యనగరం లో చోటు చేసుకుంటున్నాయి. ఒకటి కాదు, రెండు కాదు. హెచ్ఎండిఎ ఏరియాలో ఏకంగా ఆరు మాస్టర్‌ప్లాన్‌లు ఉన్నాయి.

1. ఎంసిహెచ్
2. సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ (సిడిఎ)
3. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఏడిఎ)
4. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ (ఎస్.సి.బి.)
5. బుద్ధపూర్ణిమా ప్రాజెక్ట్ అథారిటీ (బి.పి.పి.ఎ.)
6. హుడా (ఎంసిహెచ్/ సిడిఎ/ కంటోన్మెంట్/హెచ్ఏడిఎ మినహా)
7. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఎ) (పైవన్నీ మినహాయించి)

ఇన్ని రకాల ప్రణాళికల నేపథ్యంలో, అసలు సమగ్ర ప్రణాళిక అంటూ ఒకటి లేకుండా, ఈ ప్రాంతాల మధ్య గల సంబంధాలు, అవి ఒకదానిపై ఒకటి చూపించే ప్రభావాలను సగటు పౌరుడు ఏ విధంగా అర్థం చేసుకోవాలి? పెద్ద పెద్ద ఆలోచనలు చేస్తూ, అదే సమయంలో దాని గురించిన సమాచారం ఎంతో తక్కువ ఇవ్వడం వెనుక ఉన్న మతలబు ఏమిటి? ఎంతో ప్రాధాన్యం ఉన్న, ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసే మాస్టర్ ప్లాన్‌ను ఎంతో గోప్యంగా ఉంచడమెందుకు? అందులో అవక తవకలను కప్పిపుచ్చుకోవడమెందుకు?

బయో కన్జర్వేషన్ ప్రాజెక్ట్

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ మంచినీటి జలాశయాల తీరపరీవాహక ప్రాంతాల్లో కాలుష్య కారక నిర్మాణాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం జీవో నెం. 111ను జారీ చేసింది. అందులో పేర్కొన్న బయో కన్జర్వేషన్ జోన్ నిబంధనలను తుంగలో తొక్కుతూ నూతన అంతర్జాతీయ విమానాశ్రయం రూపుదిద్దుకుంది. మూసీ కన్జర్వేషన్ ప్రాజెక్ట్, ప్రతిపాదిత సబ్ ప్రాజెక్టుల గురించి మాస్టర్ ప్లాన్‌లో ప్రస్తావించలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూసీ నదికి రెండు పక్కలా 500 మీటర్ల వరకూ ప్రత్యేక జోన్‌గా గుర్తించారు. ఆ మొత్తం ప్రాంతంలో ప్రతిపాదిత భూ వినియోగం గురించి ప్రకటించలేదు. ఉస్మాన్‌సాగర్ సమీపంలో స్పెషల్ బయో కన్జర్వేషన్ జోన్ పేరిట గుర్తించిన భూమిని భవిష్యత్తులో ఇతర అవసరాలకు ఉపయోగించకూడదని కూడా ఇప్పటికే ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి.

పట్టణ పేదలను పట్టించుకునే వారు కరవు

పట్టణ పేదల గృహనిర్మాణం కోసం మాస్టర్‌ప్లాన్‌లో ఎలాంటి ప్రతిపాదనలు లేవు. ఈ విధంగా వారిని విస్మరించడం మురికివాడలు

నెలకొనేందుకు దారి తీస్తుంది. మురికివాడల్లో ప్రజల పరిస్థితి దుర్భరంగా మారుతోంది. చిన్నా చితక ఉద్యోగాలు చేసుకునే వారికి అనువైన లోయర్ ఇన్‌కమ్ గ్రూప్ (ఎల్ఐజి) లేదా ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ (ఇడబ్ల్యుఎస్) గృహనిర్మాణ పథకాలకు సంబంధించి ప్రైవేటు లేఅవుట్‌లలో నిబంధనలు విధిస్తూ జీవోలు వచ్చినప్పటికీ, మాస్టర్‌ప్లాన్‌లో స్థలం అలొకేషన్ లేదు. వాటినెలా ఇస్తారనే విషయంలో స్పష్టత లేదు.

ఎవరికీ పట్టని బిడ్డ పర్యావరణ సుస్థిరత

పర్యావరణ సుస్థిరతకు ఇతర దేశాల్లో ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతీ చిన్న అంశాన్నీ పర్యావరణ దృష్టితో చూస్తున్నారు. మన దగ్గర మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మాస్టర్‌ప్లాన్‌లోనూ అదే ధోరణి. పర్యావరణ సుస్థిరతను పట్టించుకోలేదు. సాధారణ ప్రజానీకం నిత్యజీవితంలో ఇంధన సామర్థ్యాన్ని పెంచే ప్రతిపాదనలేవీ మాస్టర్‌ప్లాన్‌లో లేవు. పెద్ద పెద్ద బిల్డింగ్ ప్రాజెక్టులకు సంబంధించి ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ ప్రొసీజర్లకు గాను ఎలాంటి తనిఖీ నిబంధనలను చేర్చలేదు. గ్రీన్ జోన్లు అన్నీ శివార్లలో, అది కూడా భారీ కేంద్రీకరణతో కూడుకొని ఉన్నాయి. సాధ్యమైనంత వరకూ అవి నగరమంతటా ఏకరీతిలో విస్తరించి ఉంటేనే బాగుంటుంది. ఆశించిన ఫలితాలు దక్కుతాయి.

రవాణా : మెట్రోరైలు ప్రభావం

యావత్ నగరం అంతటా విస్తరించనున్న మెట్రోరైల్ సదుపాయం వల్ల ప్రజల ఆర్థిక, జీవన రీతుల్లో పెనుమార్పులు చోటుచేసుకోనున్నాయి. సగటున కిలోమీటర్‌కు ఓ స్టేషన్ ఉంటుంది. ఇలాంటి స్టేషన్లు 60-100 వరకు ఉంటాయి. స్టేషన్ ఉన్న ప్రతీ ప్రాంతంలోనూ కనీసం ఓ భారీ మాల్ వెలుస్తుంది. ఈ మాస్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థ వినియోగం అధికం కావచ్చు. ఫలితంగా అది పారిశుధ్యం, శబ్ద, పర్యావరణం లాంటి కొత్త సమస్యలకూ దారి తీయవచ్చు.

పాతవాటి సంగతి పక్కనబెట్టినా, కొత్తగా వృద్ధి చేస్తున్న ప్రాంతాల్లోనూ రోడ్లు, భద్రతాప్రమాణాలకు అనుగుణంగా లేవు. ప్రజారవాణా అవసరాలపై అంతగా దృష్టి పెట్టలేదు. అమీర్‌పేట్, కోఠి, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్ లాంటి కీలకప్రాంతాల్లో ప్రత్యేక టర్మినల్స్ కోసం చేసిన కేటాయింపులు ఏవీ లేవు.

జెఎన్ఎన్‌యుఆర్ఎం

రు. 20 వేల కోట్ల జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ (జెఎన్ఎన్‌యుఆర్ఎం) గురించి మాస్టర్‌ప్లాన్ ఏమాత్రం ప్రస్తావించలేదు. దానికి సంబంధించిన లిఖితపూర్వక డాక్యుమెంటేషన్ ఏదీ లేదు. నిజానికి ఈనిధులను పొందేందుకు ఎన్నో నిబంధనలున్నాయి. వాటిలో ముఖ్యమైంది మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీ. ఆ కమిటీని ఏర్పాటు చేయకుండానే అధికారయంత్రాంగం కాలం నెట్టుకొస్తోంది. ఏడేళ్లలో దశలవారీగా ఈ నిధులను ఖర్చు చేయాలి. సిటీ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను, మాస్టర్‌ప్లాన్‌ను వేర్వేరుగా భావిస్తున్నారు. అలాగాకుండా రెండింటినీ ఏకం చేయాలని, మాస్టర్‌ప్లాన్‌ను ఖరారు చేసేందుకు మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాలు చేసిన డిమాండ్‌ను అధికార వర్గాలు ఏనాడూ పట్టించుకోలేదు.

వలసల ప్రభావం

నగరానికి వలసలు కూడా ఏటా అధికమైపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం రాష్ట్రంలోని ఇతర చిన్న నగరాలు, పట్టణాలు సరైన రీతిలో వృద్ధి చెందకపోవడమే. దీని వల్ల జీవనోపాధి కోసం పక్కనే ఉన్న మహబూబ్‌నగర్ నుంచి మొదలుకొని సుదూరాన ఉన్న శ్రీకాకుళం దాకా ఎన్నో ప్రాంతాల నుంచి వలసలు పెరుగుతున్నాయి. దీన్ని నివారించేందుకు కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, గుంటూరు, నెల్లూరు, అనంతపూర్, కర్నూలు, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ లాంటి పట్టణాలను ప్రణాళికాబద్ధంగా వృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

ప్రజాసంఘాల డిమాండ్లు

- ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకున్న తరువాతే ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శక ప్రక్రియతో మాస్టర్‌ప్లాన్‌ను ఆమోదించాలి.
- నోటిఫై అయిన ప్రస్తుత మాస్టర్‌ప్లాన్‌ను తక్షణం నిలిపివేయాలి.
- శాస్త్రీయ అధ్యయనం (రీజనల్ ప్లానింగ్) అనంతరమే హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియాను తిరిగి నోటిఫై చేయాలి. ఈ అంశంపై సమాజంలోని అన్ని వర్గాలతో తిరిగి చర్చలు జరపాలి.
- జెఎన్ఎన్‌యుఆర్ఎం తో కుదుర్చుకున్న ఒప్పందంలోని నిబంధనలకు అనుగుణంగా, తక్షణమే మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీని, మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేయాలి.
- ఇప్పటివరకూ జరిగిన ఉల్లంఘనలతో సహా విస్తృత స్థాయిలో, నేటి పరిస్థితిని ప్రతిబింబించేలా (అప్‌డేటెడ్) ల్యాండ్ యూజ్ డేటాబేస్‌ను రూపొందించాలి.
- ఎంపిసి (మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీ) పర్యవేక్షణలో హెచ్ఎంఎ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా) మొత్తానికి ఒకే మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలి.

ప్రస్తుత కర్తవ్యం

మాస్టర్‌ప్లాన్ నోటిఫై అయినప్పటికీ, అందులో మార్పుచేర్పులకు ఇప్పటికీ అవకాశం ఉంది. మంత్రివర్గం, అసెంబ్లీ... ఇలా ఉన్నత స్థాయిలో దాని గురించి చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రజలు, ప్రజాసంఘాలు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇటీవలే అవుటర్ రింగ్‌రోడ్డు గ్రోత్ కారిడార్ కూడా నోటిఫై అయ్యింది. దీనిపై కూడా చర్చ కొనసాగిన తరువాతే, అవసరమైన మార్పులు చేసిన తరువాతే, దాన్ని తిరిగి నోటిఫై చేయాలి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా విధివిధానాల్లో మార్పుల్లేకుండా చూడాలి. అందుకోసం అవసరమైతే అన్ని రాజకీయపక్షాలతోనూ చర్చలు జరపాలి. అందరి ఆమోదం పొందాలి. అలా చేసినప్పుడే సుస్థిరతాభివృద్ధితో కూడిన మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు, దాన్ని పటిష్ఠంగా అమలు చేసేందుకూ వీలవుతుంది. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయా నగరాల మాస్టర్‌ప్లాన్‌లు రూపొందించడం ప్రపంచవ్యాప్తంగా ఆనవాయితీగా వస్తోంది. అదేవిధంగా హైదరాబాద్ మాస్టర్‌ప్లాన్‌ను కూడా పర్యావరణ స్నేహపూర్వకంగా రూపొందించాలి. వీ

ప్రమాదాలకు ఆలవాలంగా మారి మృత్యువు అంచున కనీస వసతులు లేకుండా బతుకుపోరాటం సాగిస్తున్న మురికివాడల ప్రజల స్థితిగతులను వివరిస్తున్నారు ప్రశాంత్

పాతనగరం మురికివాడలు

అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పక్కనుంచి జుమ్మేరాత్ బజార్‌వైపు నడుచుకుంటూ వెళితే కనిపించే దృశ్యాలన్నీ ఇంగ్లిష్ సినిమా 'గాడ్స్ మస్ట్‌బీ క్రేజీ'ని గుర్తుకు తెస్తాయి. వేట ఆధారంగా అడవుల్లో బతికే ఆదివాసుల జీవితాన్ని ఒకవైపు, పట్టణ ప్రాంతాలలో ధనికుల ఆవాసాల మధ్య సంపద కోసం అంతిమంగా అధికారం కోసం మనిషిని మనిషి చంపుకునే స్థితిని ఇంకోవైపు ప్రతిభావంతంగా దృశ్యమానం చేశాడా దర్శకుడు.

పాతనగరాన్ని చూస్తున్నప్పుడు అసెంబ్లీ అవతలివైపు నగరాన్ని, ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లిహిల్స్, హైటెక్ సిటీలను గుర్తుకు తెచ్చుకుంటే ఈ ప్రాంతాలన్ని ఒకే నగరంలో ఉన్నాయా అనిపిస్తుంది. అసెంబ్లీకి కుడివైపు నగరానికి ఎడమవైపు నగరానికి రెండు ప్రపంచాల తేడా ఉంది.

నగరం నిర్మాణంలో తమ రక్త మాంసాలను ధారపోసినవారు విస్మృతజనంగా మారిపోయారు. ఒక్క అల్లర్లు జరిగినపుడు మాత్రం పత్రికలూ, ప్రసార మాధ్యమాలు పదే పదే ప్రసారం చేయడం వల్ల 'ఓల్డ్ సిటీ' అన్న పేరు మాత్రం మనకు గుర్తుంటుంది. వీకెండ్స్‌లో పబ్‌లలో తాగిచిందులు వేసే విలాసవంతమైన జీవితాలు అనుభవిస్తున్న నేలమీదే ఇంకో చివరన పూటగడవక నేరప్రవృత్తిలోకీ, వ్యసనాలకు బానిసలవుతున్న యువతరమూ ఉంది.

శిథిలమైపోయి, క్రమంగా మట్టిలో కలిసిపోతున్న ప్రాచీన కట్టడాల మధ్య మనుషులూ, విలువైన ప్రాణాలూ వ్యసనాల బారినపడో, పూట గడవకో మృత్యు ఒడిలోకి చేరిపోవడం, ఉట్టి బాధ కలిగించడమే కాదు అనేక ప్రశ్నలనీ, సందేహాలనీ రేపుతుంది.

గత చరిత్రలో కలిసిపోయి, ఇప్పటి ఎం.ఎం.టి.ఎస్.గా దర్శన మిచ్చే ఖైరతాబాద్ బస్తీ అయినా, ఈరోజో రేపో కాంగ్రెస్ కార్యాలయం కోసం తీసుకోనున్న భీంరావ్ బాడా అయినా బస్తీలను సజీవమైన మనుషులు తిరిగే ప్రాంతంగా కాకుండా విలువైన భూమిగా, సరుకుగా చూసే దృష్టి వల్ల వచ్చిన దుర్మార్గం, దశాబ్దన్నర కాలపు ప్రపంచీకరణ ప్రయాణపు ఫలం.

2010లో దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న కామన్‌వెల్త్ క్రీడల కోసమో, ఢిల్లీ మాస్టర్ ప్లాన్ 2021 కోసమో మురికివాడలన్నింటినీ తొలగించే కార్యక్రమం ఇప్పటికే మొదలయ్యింది. ప్రతి రాష్ట్ర ప్రభుత్వానికి 'మురికివాడల విధానం' ఉండాలన్న దగ్గర మొదలై 'మురికివాడల నిర్మూలన విధానం' దాకా ప్రయాణించాం. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా మెట్రోపాలిటన్ నగరాల్లోని మురికివాడలు రెండురకాల ప్రమాదాలను ఎదుర్కొంటున్నాయి.

ఒకటి, నగరీకరణ క్లీన్ అండ్ గ్రీన్ పేరుతో చేస్తున్న నిర్ణయాల్లో భాగంగా ఆవాసాలన్ని కోల్పోవాల్సి రావడం. రెండోది, '90ల తర్వాత వచ్చిన సరళీకరణ విధానాల మూలంగా ఉపాధి రంగాలు దెబ్బతినడం వల్ల వచ్చిన ప్రమాదం. రెండు అని సాంకేతికంగా విభజించాం గాని రెండవదాని ఫలితంగా మొదటి క్రమం కొనసాగుతోంది.

'ఓల్డ్‌సిటీ'గా పిలవబడే పాత హైదరాబాద్‌లో దాదాపు 800 వరకు మురికివాడలున్నట్లు అంచనా. ప్రభుత్వ గణాంకాలను చూసినా 1962లో 106 మురికివాడల్లో 1,20,000 జనాభా ఉంటే, 1994లో 811 మురికివాడల్లో మూప్పై లక్షల జనాభా ఉంది. గడచిన ఈ పధ్నాలుగేళ్లు ఎంతగా జనాభా, మురికివాడలు పెరిగిపోయాయో ఊహించవచ్చు. చుట్టుపక్కల జిల్లాలైన నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయం కుంటుపడి ఉపాధి కోసం నగరానికి రావడం మూలాన మురికివాడల సంఖ్య తీవ్రంగా పెరుగుతున్నది. మరీ ముఖ్యంగా 1990ల తర్వాత వచ్చిన మార్పులు మురికివాడలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. మురికివాడల పరిశీలన కోసం పాతనగరంలోని 14 ప్రాంతాలను తిరిగితే దారుణమైన నిజాలు వెలుగులోకి వచ్చాయి.

చూడీబజార్ మొదలు అటు పురానాపూల్ అవతలి పిట్టలోళ్ల బస్తీదాక, జుమ్మేరాత్‌బజార్ నుంచి షా ఇనాయత్‌గంజ్ కోల్సావాడీ వరకు మురికిగుంటల్లాంటి రోడ్లమీద తిరుగుతున్నపుడు తాగి పడిపోయిన యువకులు, మురికిలో, మత్తులో పొర్లుతున్న వాళ్లు కనిపిస్తారు. కారణాలను వెతకకుండా ఆ వెనుక బాటుతనాన్ని గేలి చేయడం షరా మామూలయింది. 'హైదరాబాద్ నవాబ్స్' పేరుతో ఈ మధ్యకాలంలో వచ్చిన సినిమా పాత నగరంలో నివసించే ప్రజలను,

సంవత్సరం	మురికివాడలు	జనాభా
1962	106	1,20,000
1967	194	1,68,000
1972	282	3,00,000
1976	300	3,20,000
1977	తెలియదు	3,80,000
1978	377	4,00,000
1979	455	4,08,000
1981	470	5,40,000
1986	662	5,40,000
1994	811	30,00,000

ముఖ్యంగా ముస్లింలను, వాళ్ల వెనుకబాటుతనాన్ని గేలిచేస్తూ అవమానించే విధంగా చిత్రించారు. ఆ స్థితి ఉన్న మాట ఎంత నిజమో, అట్లా ఉండడానికి కారణాలు అవి అధికారవర్గాల స్వార్థ రాజకీయాల కారణాలన్నది కూడా అంతే నిజం.

పరిశీలన కోసం తిరిగిన బస్తీలు : 1) జుమ్మేరాత్ బజార్; 2) మంగళ్‌హాట్; 3) ధూల్‌పేట; 4) ఘోడేకా కబర్; 5) షా ఇనాయత్ గంజ్; 6) గోషామహల్; 7) పిట్టలోళ్ల బస్తి; 8) హనుమాన్‌బాడా; 9) దత్తాత్రేయ గుట్ట; 10) చుడీబజార్; 11) దిల్‌సుఖ్‌చౌరాయ్; 12) రహీంపురా; 13) కోల్సావాడి; 14) జియాగూడ.

ఈ బస్తీల్లో నివసించే వారంతా దినసరి కూలీలుగా, డ్రైవర్లుగా, హాకర్లుగా, చెత్తకాగితాలూ, ప్లాస్టిక్ వస్తువుల సేకరణ ఆధారంగా బతుకుతారు.

సిద్ధిఅంబర్ బజార్, బేగంబజార్, ముక్తార్‌గంజ్, చార్మినార్, జుమ్మేరాత్‌బజార్, మొండామార్కెట్ లాంటి వ్యాపార కేంద్రాల్లో హమాలీలుగా, రిక్షా పుల్లర్లుగా ఉపాధి పొందుతున్నారు. హమాలీ, రిక్షా నడపడం లాంటి పనులు పక్క జిల్లాలైన నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వలస వచ్చిన వాళ్లు చేస్తున్నారు. వీళ్లలో ఎక్కువగా దళితులు ఉన్నారు. డ్రైవర్లుగా, మోటార్‌ఫీల్డ్‌లో ఉండేవారంతా ప్రధానంగా ముస్లిం ప్రజానీకం.

వీళ్లంతా పాత హైదరాబాద్ వాసులు. వీళ్లు కాకుండా నిజాం కాలంలో వచ్చి నగరంలో స్థిరపడ్డ లోధీలు సీజన్ సమయంలో రాఖీలూ, పతంగులు, గణేష్ విగ్రహాల తయారు చేయడంతోపాటు అగరత్తుల తయారీని కుటీర పరిశ్రమ చేసుకుని జీవనం సాగిస్తారు. అయితే పెట్టుబడుల లేమి, విపరీతమైన ధరల పెరుగుదల వల్ల, ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి సహాయం లేకపోవడం మూలాన గుడుంబా తయారు చేయడాన్ని వృత్తిగా చేసుకున్నారు. మంగళ్‌హాట్, ధూల్‌పేట్, జుమ్మేరాత్ బజార్, ఘోడేకా కబర్ వంటి ప్రాతంల్లో లోధీలు అధికంగా నివసిస్తారు. ఈ ప్రాంతాల్లోనే గుడుంబా తయారీ కేంద్రాలు ఎక్కువగా ఉంటాయి. గుడుంబా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం వ్యాపారం సైతం ఈ ప్రాంతాల్లో జోరుగా సాగుతోంది.

నల్లబెల్లం రవాణాలోనే కొన్ని వందల మంది ఉపాధి పొందుతున్నారంటే ఆశ్చర్యం కలుగుతుంది. చెత్త కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు సేకరించి బతికే వారు సైతం వేల సంఖ్యలో ఉన్నారు. హనుమాన్‌బాడా, గోషామహల్, జుమ్మేరాత్‌బజార్, జియాగూడ మురికివాడల్లో ఒక్క మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర ప్రాంతం నుంచి వలస వచ్చిన కుటుంబాల సంఖ్య వెయ్యి దాకా ఉండొచ్చని అంచనా. దేవరకద్ర మండలం రాజమూరు గ్రామానికి చెందిన దాదాపు అయిదు వందల దళిత కుటుంబాలు హమాలిపని, రిక్షా తొక్కడం, దినసరి కూలీ ద్వారా ఉపాధి పొందుతున్నారు. తమ ప్రాంతంలో ఉన్న కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ నిండితే ఇక్కడకు రావలసిన అవసరం లేదని ఆ కుటుంబాలు అభిప్రాయపడుతున్నాయి. దినసరి కూలిపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలు చెప్పిన దాన్ని బట్టి 1990ల తర్వాత వలసలు పెరిగి, అదే సమయంలో నగరంలో ఉపాధి మార్గాలు పూర్తిగా దెబ్బతిన్నట్లు అర్థమవుతుంది. పదేళ్ల క్రితం నూటయాభై – రెండు వందలు ఉన్న ఇంటి అద్దె ఇప్పుడు ఏడు వందల దాకా పెరిగింది. విద్యుత్ బిల్లులు చెల్లించని కారణంగా విద్యుత్ శాఖ దాదాపు మెజారిటీ ఇళ్లకు కనెక్షన్‌లు తొలగించడంతో దొంగతనంగా వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇక విద్యా, వైద్యం, పారిశుద్ధ్యం సంగతి చెప్పనవసరంలేదు. గత దశాబ్దకాలంలో ఏ వార్షిక బడ్జెట్‌లోనూ మురికివాడల సంక్షేమం కోసం నిధులు కేటాయించలేదు; కేటాయింపులు చేసినా ఖర్చు చేయలేదు. ప్రభుత్వాధికారులు చెబుతున్న లెక్కల ప్రకారమే 2004–05 వార్షిక బడ్జెట్‌లో రు. 45 కోట్లు కేటాయించగా రు. 5 కోట్లు మాత్రమే వెచ్చించారు. ఇందులో అవినీతి పరుల జేబుల్లోకెంత వెళ్లాయో మనం ఊహించుకోవాలి. 2005–06 వార్షిక బడ్జెట్‌లో రు. 78 కోట్లు కేటాయించగా రు. 9.5 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అధికారులు చెబుతున్న దాన్ని బట్టే ఈ కేటాయింపుల్లో ఎక్కడా ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు, వైద్య పరికరాల కొనుగోలుకు, పాఠశాల భవనాల నిర్మాణాలకు ఒక్క పైసా కేటాయించలేదు.

మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ 1994 గణాంకాల ప్రకారం హైదరాబాద్ మొత్తంలో 811 మురికివాడల్లో దాదాపు ముప్ఫై లక్షల మంది నివసిస్తున్నారు. అంటే నగర జనాభాలో నలభై శాతంగా

బాగమ్మ (50) గోషామహల్, హాకర్, మహబూబ్‌నగర్
(బాణసంచా ప్రమాదంలో మృతి చెందిన శ్రీహరి తల్లి)

మాది మైబ్‌నగర్ జిల్లా దేవరకద్ర దగ్గర బండ్రవల్లె. బస్తిల ఉల్లిగడ్డలమ్ముత. ఇరవై ఏండ్ల సంది బస్తిలనే ఉంటున్నాం. ఒకప్పుడు బ్యారం బాగానే నడ్చేది. ఇప్పుడు మా అసోంటోల్లతోన ఎవరు గొంటరు? బ్యారం ఎల్తలేదు. పిల్లగాడు తొమ్మిది సదువుతుండే. కటికోల్ల ఇంట్ల బాణాలు పేలినప్పుడు సచ్చిపాయె. సందులల్ల ఎవ్వరింట్లో ఏం జేస్తున్నరో తెల్వది. మా పిల్లగాడు ఆ పని కొయ్యిందని నాకైతే తెల్వది. అందరు సిన్న సిన్న పిల్లలే సచ్చిపాయిరి. ఇసొంటివి ఎన్నిసార్లు జరిగినా ఎవ్వరు పట్టీసుకుంటలేరు. లోపల సందుల సిన్న రూముల మూడు కింటాల్ల మందుపెట్టింద్రట. ఏడికెల్లి బత్కుతరు. బయటికెల్లి గద్యపెట్టింద్రు. పెద్ద శబ్దం రాంగానే తలుపులు పగులగొడ్తె పిల్లలు తెల్లగ కోడిగుడ్ల లాక అయ్యి గర్మిల ఊరుక్కుంటొచ్చి ఒగలి మీద ఒగరు పడ్డరు. నాల్గేండ్ల సంది ఇట్లనే పేలి నల్గురు పిల్లలు సచ్చిపోయింద్రు.

వెంకట్రాములు (38), హమాలి, ముక్తార్‌గంజ్

నాది మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం రాజమూరు. పదో తరగతి ఫేలైనంక '89ల సిటీకొచ్చిన. అప్పటినుంచి గంజ్‌ల హమాలి పనిచేస్త. 93, 94ల దాకా ఫర్వాలేదు. చేతుల పైస ఆడేది. పదేండ్ల సంది ఎల్తలేదు. గంజ్‌ల చౌదరి దగ్గర పన్జేస్తం. పని శానకస్తి. వారంల రెండురోజులు చేస్తె మూడుదినాలు చెయ్యలేం. వారంల రెండుమూడు వందలొస్తయి. వొచ్చిన కొత్తల ఇంటి కిరాయి రెండొందలు ఉండేది. ఇప్పుడు ఏడొందలైంది. పిల్లలకు సాలెగూడు సమంగ లేదు. పొద్దుమాపు గుడంబ తాగినోల్ల లొల్లి, తాగి లారీల కిందపడ్తరు. సచ్చినోడు సస్తడు. మున్సిపలోలు కుక్కల్ని గుంజుకపోయినట్లే గుంజుకపోతరు. అన్ని రేట్లూ పెరిగినై కాని కూలి అంతనే ఉంది. దోమలు నెస్స ఉండై. ప్రతినెలల జ్వరం వస్తది. మల్లా ఉస్మానియాకే పోవాలే.

అఫ్జల్ (35) డ్రైవర్

నాది కిషన్‌బాగ్. పదేళ్ల నుంచి బేగంబజార్‌లో డ్రైవర్ పని చేస్తున్నాను. ఈ మధ్యే పని పోయింది. ముస్లింను అనగానే ఎవరూ పనిలోకి పెట్టుకోవడం లేదు. కారణం పెద్దకూర తింటామని, గుట్కాలు వేసుకుంటామని అంటున్నారు. సిటిలో రోజురోజుకు ముస్లిం డ్రైవర్లు తగ్గిపోతున్నారు. ఫీల్డ్‌లోకొచ్చిన మొదట్లో బాగానే ఉండేది. ఇప్పుడు ఇబ్బందిగా ఉంది. జీతాలు ఎక్కువగా పెరగలేదు. బయట మార్కెట్ల మాత్రం అన్ని ఖరీదైపోయాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో డ్రైవర్ ఉద్యోగానికి అప్లై చేసుకుంటే ముప్పై వేల లంచం అడుగుతున్నారు.

చెప్పవచ్చు. మొత్తంగా హైదరాబాద్ నగర అక్షరాస్యత 71 శాతం అయితే మురికివాడల అక్షరాస్యత 19 శాతంగా ఉంది.

మురికివాడలు ఎంత తీవ్రమైన ప్రమాదంలో ఉన్నాయో తెలుసుకోవాలంటే 2007 నవంబర్ 1న గోషామహల్‌లో జరిగిన బాణాసంచా పేలుడు సంఘటనను చెప్పుకుంటే అర్థమవుతుంది.

నవంబర్ 1న సాయంత్రం ఒక ఇంట్లో బాణసంచా తయారు చేస్తుడంగా పేలుడు సంభవించింది. చాలా చిన్న గదిలో దాదాపు మూడు క్వింటాళ్ల పేలుడు సామాగ్రి ఉన్నట్లు స్థానికులు చెప్పారు. బాణసంచా తయారీలో ఉన్న వాళ్లంతా పధ్నాలుగేళ్లలోపు వారే. గదిలో 15 మంది ఉండగా అందులో 12 మంది 7 నుంచి 14 ఏళ్లలోపు విద్యార్థులు. వీరంతా స్థానిక పాఠశాలల్లో చదువుకునేవారు. బడి వదిలిన తర్వాత బాణసంచా కర్మాగారానికి వెళ్లి వంద బాణాలు తయారు చేస్తే పది రూపాయలు ఇస్తారు. దాంతోబాటు కొన్ని బాణాలు ఇవ్వడంతో ఆశతో పనిలోకి వెళ్లారు. పేలుడు సమయంలో గది బయట గొళ్లం పెట్టారు. రహస్యంగా తయారు చేయడం వల్ల ఇలాంటి పద్ధతులు పాటిస్తారు. సంఘటన తర్వాత అందరినీ ఆసుపత్రిలో చేరిస్తే రెండు రోజులలోపే పదిహేనుమందిలో పధ్నాలుగు మంది చనిపోయారు. మరణించిన వారిలో ముగ్గురు అమ్మాయిలు ఒకే కుటుంబానికి చెందినవారు. సంఘటన అనంతరం అధికారులు తూ తూ మంత్రంగా ఎక్స్‌గ్రేషియా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇదే ప్రాంతంలో 2004లో బాణసంచా పేలి నలుగురు ముస్లిం విద్యార్థులు చనిపోయారు. వీళ్లంతా దినసరి కూలీలు, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారు. బస్తీవాసులైతే ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం కాదు, ఇలాంటి సంఘటనలు ముందు జరగకుండా చూడాలని, బాణసంచా తయారు చేసే కార్ఖానాలను తొలగించాలని అభిప్రాయపడుతున్నారు. చిన్న చిన్న ఇళ్లూ, సందులూ ఉండడంవల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాణసంచా కార్ఖానాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మృతులందరూ కింది కులాలకు చెందినవారు. ప్రమాదం జరిగినపుడు గది బయట గడియ పెట్టడంవల్ల మృతుల సంఖ్య పెరిగిందంటున్నారు. ఈ ప్రమాదంలో కార్ఖానా యజమాని నర్సింగ్ కూతురు జయశ్రీ (31) సైతం మరణించింది.

మృతుల వివరాలు : 1) శ్రీహరి (14) 9వ తరగతి, మాదిగ; 2) వెంకటేశ్ (14) చదువులేదు; 3) సాయికుమార్ (14) 9వ తరగతి; 4) అరవింద్ (14) 10వ తరగతి, కటిక; 5) పరశురాం (12) మరాఠీ; 6) నవీన్‌కుమార్ (13) గొల్ల; 7) శివలీల (11) 6వ తరగతి, గొల్ల; 8) మంజుల (14) 9వ తరగతి, గొల్ల; 9) వరలక్ష్మి (9) 4వ తరగతి, గొల్ల; 10) గణేశ్ (14) మరాఠీ; 11) గోపాల్ (14) 9వ తరగతి, మరాఠి. మృతి చెందిన ఇంకో విద్యార్థి పేరు తెలియలేదు.

గుడుంబా తాగడం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాల్లో, ఇతరేతర సంఘటనల్లో వారంలో ఒకరో ఇద్దరో చనిపోతుంటారని స్థానికుల అంచనా. చాలా సందర్భాల్లో గుడుంబా తాగి చనిపోయిన వాళ్లను మున్సిపాలిటి వాళ్లు తీసుకెళుతుంటారు. 1991లో ఒక స్వచ్ఛంద సంస్థ చేసిన పరిశోధనలో 87 శాతం ప్రజలు ఎలాంటి వైద్య సౌకర్యాలు పొందలేని స్థితిలో ఉన్నారని, మహిళల అక్షరాస్యత 25 శాతం ఉందని తేల్చింది. పరిశీలన కోసం తిరిగిన ఈ పధ్నాలుగు ప్రాంతాల మురికి వాడల్లో ఎక్కడా సరియైన మంచినీటి సౌకర్యం కాని, మరుగుదొడ్లు కాని లేవు. పాఠశాలలు, ఆసుపత్రుల విషయం చెప్పనవసరం లేదు. ప్రసూతి అవసరాల కోసం ఒక్క ఆసుపత్రి మాత్రం పనిచేస్తోంది.

1994 నాటికి నగరంలో 811 మురికివాడలుంటే ఇప్పటి వాటి సంఖ్య ఎంతో తేలాల్సి ఉంది. దేశవ్యాప్తంగా నగరాల్లో మురికివాడల సంఖ్య క్రమేణ పెరుగుతోంది. 1998 నాటికి ఢిల్లీలో 1100 మురికివాడలున్నాయి. మురికివాడలు ఎందుకు పెరుగుతున్నాయో ఆలోచించకుండా ప్రభుత్వం వాటిని తొలగించే చర్యలు మాత్రం వేగంగా తీసుకుంటోంది.

'క్లీన్ అండ్ గ్రీన్' పేరుతో, కాలుష్యం పేరుతో దేశవ్యాప్తంగా మురికివాడలను బలవంతంగా తొలగిస్తున్నారు. నిజానికి అసలు ఉద్దేశం మురికివాడల స్థలాలు విలువైనవి కావడంతో వాటిని పారిశ్రామిక వేత్తలకు ధారాదత్తం చేయడం. అందుకు న్యాయస్థానాలు కూడా వంత పాడటంతో పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. పారిశ్రామికవేత్తలు పర్యావరణ కాలుష్యం పేరుతో ఎగువ మధ్యతరగతి, సంపన్నవర్గాలు వేసే ప్రజా ప్రయోజనాల పిటిషన్‌లకు స్పందించినట్లుగా, ఆలోచించినట్లు గా ఆవాసాలులేని పేదల గురించి పట్టించుకునే స్థితిలో న్యాయస్థానాలు లేవు. ఢిల్లీలోని యమునా తీరంలో ఏళ్ల కొద్ది నివసిస్తున్న మూడు లక్షలమంది నిరుపేదలను యమునానది కాలుష్యమవుతోందని ఢిల్లీ ప్రభుత్వం మురికివాడలను ఖాళీ చేయించింది. దీన్ని ఆ రాష్ట్ర హైకోర్టు సైతం సమర్థించింది. కాలుష్య నియంత్రణ బోర్డ్ పరిశీలనలో తేలిందే మిటంటే మురికివాడల వల్ల యమునలో కలుస్తున్న వ్యర్థ పదార్థాల వలన నీటికాలుష్యం 0.33 శాతం మత్రమేనని.

హైదరాబాద్ నగరంలో సైతం ఒకవైపు బస్తీలు పెరుగుతుంటే ఇంకోవైపు ప్రభుత్వం వాటి సంక్షేమం గురించి పట్టించుకోకుండా ఆ స్థలాలపై కన్నేస్తోంది. ఆ స్థలాన్ని ఖాళీగా ఉంచారే తప్ప ఏ నిర్మాణాలు ఉండటానికి వీల్లేదని మన ప్రభుత్వాల ఉద్దేశం.

'లైఫ్ విల్ బి టూ షార్ట్ ఫర్ పీపుల్ టు టెల్ అబౌట్ ఇట్" అన్నాడు మార్క్వెజ్. పాత నగరం మురికివాడల్లోని ప్రజలు తమ జీవితాల గురించి, సుఖ దుఃఖాల గురించి ఏమీ సంభాషించకుండానే నిశ్శబ్దంగా నిష్క్రమిస్తున్నారు. నిత్య దరిద్రంలో, వేదనలో విలువైన ప్రాణాలను కోల్పోతున్నారు. ■

తన జీవితంతోపాటు నగరాన్ని అవలోకిస్తూ భిన్న భాషల, భిన్న జాతుల సమాహారంగా, ఉద్యమాల కేంద్రంగా ఉన్న జంట నగరాల గురించి మననం చేసుకుంటున్నారు **నిఖిలేశ్వర్**

రెండు మహానగరాలు - ఒక స్వగతం

జీవితమంతా ఈ హైదరాబాద్ మహానగరంలోనే నడుస్తున్న నేను, ఈరోజు వేగవంతమైన నగరాభివృద్ధిని చూసి జడుసుకుంటున్నాను.

అన్ని వైపులా భయంకరంగా విస్తరిస్తున్న ఈ నా మహానగరం ట్రాఫిక్ చక్రవ్యూహంలో బందీయై 'మహానరకం'గా రూపాంతరం చెందుతోంది.

మిత్రుడు లోకేశ్వర్ 'సలాం హైదరాబాద్' అని తన జీవితంతో ముడిపడిన హైదరాబాద్ చరిత్రను నవలీకరించగా, 32 సంవత్సరాల క్రితమే నేను 1976లో 'రెండు మహానగరాల మధ్య' శీర్షికన 'ఆంధ్రపత్రిక'లో ప్రతివారం 'వాలేకుం సలాం' చేసాను.

హైదరాబాద్‌కు 65 కిలోమీటర్ల దూరాన ఉన్న గ్రామం వీరెల్లి (వీరవల్లి), భోనగిరి తాలూకా, నల్లగొండ జిల్లాలో నేను జన్మించినా, ఒక సంవత్సరం శిశువుగా మా అమ్మతోపాటు ఈ మహానగరంలో కాలుమోపాను.

ఇక ఆనాటి నుంచి ఈ జంట నగరాలైన హైదరాబాద్ - సికిందరాబాద్‌లే నా జీవనాధారంగా నిలిచిపోయాయి. మా మేనమామ సురవరం నర్సింహ్మా రెడ్డి వ్యవసాయం సాగుతున్న ఆ రోజుల్లో వేసవి సెలవుల్లో మాత్రమే వీరెల్లి నా విడిది - అప్పుడప్పుడు ఛాడ - ముత్తిరెడ్డిగూడెంలోని తాతల దగ్గర కొన్ని రోజులు!

నా ప్రాథమిక విద్య సికిందరాబాద్, హైదరాబాద్ వీధి బళ్లల్లో పంతుల్ల బెత్తాల అదలింపుల కింద కొంతకాలం, ఆ తర్వాత హనుమాన్ టేక్డీ నుంచి ఇటు ముషీరాబాద్ జమిస్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎచ్.ఎస్.సి. దాకా...

పల్లెల నుంచి బతుకుదెరువు కోసం పట్నాలకు వలస వచ్చే పేద రైతుల జీవితాలను, వారి సంతతి భవిష్యత్తును నగరాలే నిర్ణయిస్తాయి. అనేక దశలు దాటుతూ, పట్నం మహానగరంగా పరిణతి చెందే క్రమంలో ఎన్నెన్ని ఆటుపోట్లు, సుఖదుఃఖాల, నవ్వుల - కన్నీళ్ల బతుకు పోరాటాలు దాగి ఉంటాయో అనుభవించిన వాళ్లకే తెలుసు.

శిశువుగానే నాన్నను కోల్పోయిన నేను, ఈ మహానగరంలో మా అమ్మ కాయకష్టం మీద పెరిగి పెద్దవాన్నై అక్షరాలు దిద్ది, అక్షరాల అర్చనలోనే ఉపాధ్యాయుడిగా, కవిగా, రచయితగా ఈ జీవితమంతా...

తొలి దశలో స్వాతంత్ర్యానికి పూర్వం, అటు సికిందరాబాద్ కంటోన్మెంట్ ఏరియా మారేడ్‌పల్లి, తిరుమలగిరి ప్రాంతాల్లో మిలిటరీ అధికారుల ఇళ్లలో బాల్యం గంతులేసింది.

విచిత్రంగా మళ్లీ ఇదే మారేడ్‌పల్లిలోని ఎ.ఒ.సి. సెంటర్ సైనిక శిక్షణ కేంద్రంలో నేను 1960 నుంచి 64 దాకా సివిలియన్ స్కూల్ మాస్టర్‌గా ఉద్యోగం ప్రారంభించి, నిజాం కళాశాలలో సాయంత్రం కళాశాలలో డిగ్రీ చదువుకొనసాగించాను.

ఇక అదే తొలి దశలో హైదరాబాద్ పాతబస్తీలో దూద్‌బావులి, బేగంబజార్, కోఠీ సుల్తాన్‌బజార్‌లలో 1948కు పూర్వం పట్నం బతుకులో గంతులేసాను.

హైస్కూల్ స్థాయిలో ముషీరాబాద్, బాకారం, దాయరా బస్తీల గల్లీలల్లో వివిధ వృత్తుల మధ్య సాగిన కుటుంబాలలోని దోస్తులతో - కుమ్మరి, చాకలి, బెస్త, గొల్ల, వడ్రంగి, గౌడ కులాల మిత్రుల మధ్య కాలమలా కరిగిపోయింది. జమిస్తాన్‌పూర్ హైస్కూల్ ముస్లిం విద్యార్థులతోపాటు ఇటు రాంనగర్ దాయరా బస్తీల ముస్లిం కుటుంబాల సాన్నిహిత్యం! ఇప్పుడున్న గాంధీనగర్‌లోని ఆనాటి సుక్కమోల్ల బావుల్లో మా వేసవి రోజులన్నీ ఈత కొడుతూ అన్నీ మరచి ఆనందించిన ఆ కాలమంతా తిరిగి రానేరాదు

ముషీరాబాద్‌లోని గౌరీశంకర్ గ్రంథాలయం నా సాహిత్య పిపాసను పెంచింది. కాంగ్రెస్ నాయకులు వెంకట్రామయ్య జోషీ నిస్వార్థ సేవ మాకు ప్రేరణ.

ఈ రెండు మహానగరాల మధ్య గుర్రపుబండ్లు (టాంగా) కానగీ (ప్రైవేట్) బస్సుల్లో తిరిగాను. రిక్షాలే ఆనాటి మనుషులతోలే మూడు చక్రాల ఆటోలు. హైదరాబాద్‌కు వలస వచ్చే వేలాది కుటుంబాలకు ఈ రిక్షాలే బతుకుదెరువు, ఆధారం ఆ రోజుల్లో.

'గంగా జమున సంస్కృతి'కి నెలవైన (గంగా-యమునా నదుల హిందూ-ముస్లిం సాంస్కృతిక జీవితానికి) ఈ దక్కనీ హైదరాబాద్‌లో మూసీకి ఆవల పేదరికం పక్కనే నవాబుల హవేలీలను మార్వాడీ సేట్ల కోఠీలను సన్నిహితంగా చూసాను.

చాంద్రాయన్‌గుట్ట (కేశవగిరి) పరిసరాల్లో నూనెమిల్లులు, బార్కాస్ బస్తీలోని హబ్షీల (ఆనాటి నిజాం సైన్యంలోని అబ్సీనియా, ఆఫ్రికన్ - అరేబియన్ సైనికులున్న దళాలు) నివాస స్థావరాలన్నీ తిరిగివచ్చాను. ఫలక్‌నుమా స్టేషన్ దగ్గరి కొండలపై కూచుని ఒక రోజంతా నేను - చెరబండరాజు పాడిన పాటలు గుర్తుకొస్తున్నాయి. షాలీబండాలోని గుండీల కార్ఖానా (బటన్ ఫ్యాక్టరీ) లో రోజుకు ఆరణాల కూలీతో తమ కౌమార దశనుంచి ఎదిగిన మా మేనబావల కుటుంబాలతో తిరిగాను.

ఇలా వివరిస్తూ నా గత జీవితంలోని ఈ మహానగరం వివిధ దశలను వ్యాఖ్యానిస్తూ పోతే ప్రస్తుతం ఈ పుటలు సరిపోవు.

ఇప్పటికే హైదరాబాద్ 418 సంవత్సరాల చరిత్రపై ఉర్దూ, ఇంగ్లిష్, తెలుగులో అనేక గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి.

గత రెండు దశాబ్దాలలో అంత వేగంగా పురోగమించి, ఫ్లై ఓవర్లు, వెడల్పైన రోడ్లు, ఆధునికమైన వాస్తు రూపాలతో మేడలు–ఆపార్ట్‌మెంట్లు అన్నిటిని మించి విపరీతంగా రోడ్లను ఆక్రమించేసిన కార్లు, బస్సులు, మోటార్ సైకిళ్లు, ఆటోలు – చివరికి పాదాచారులకు ఎక్కడా నడవలేని స్థితి. రోడ్లు దాటాలంటే ప్రాణగండమే మరి...!

1985లో నేను రాసిన 'నగరారణ్యం'లోని పంక్తులు – 'నాలుగు శతాబ్దాల నా మహానగరాన్ని' ఇలా వర్ణించాను – 'నేను నడక నేర్చుకున్న ఈ నగరంలో / విస్తరిస్తూ భయపెడుతున్నది అరణ్యం / భూమిని తొలుచుకొని ఆకాశంలోకి / చొచ్చుక పోతున్న రాక్షసి మేడలు / వెంటాడుతున్నాయి నలువైపులా / గురి చూసినన్ను...."

మన హైదరాబాద్ ఇతర ఖండాలలోని మహానగరాలు న్యూయార్క్ అట్లాంటా, లండన్, పారిస్, మాస్కో బీజింగ్, టోక్యోలతో పోటీపడకున్నా – ఇక్కడి భారత్‌లోని ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు మహానగరాలతో సమఉజ్జీటుగా ఏరోజుకారోజు 'ది హాపనింగ్ సిటీ' గా మన చుట్టూ... 'షహర్ బాకీ హై, మొహబ్బత్ కా నిశాన్ బాకీ హై' అనే నోస్టాల్జియాలో ప్రేమచిహ్నాలన్నీ శిథిలమైపోతున్నాయి.

అందుకే 32 సంవత్సరాల క్రితం నాటి 'రెండు మహానగరాల' కొన్ని పుటల్లోకి –

రెండు మహానగరాల మధ్య

మహానగరాల జీవితం ఆ దేశపు చరిత్ర – సంస్కృతితో పెనవేసుకొని ఉంటుంది. హైదరాబాద్ – సికిందరాబాద్ జంటనగరాల చరిత్ర కూడా అంతే! ఇవి లండన్ – పారిస్‌ల లాగా రెండు మహానగరాలు కాకపోవచ్చు. కాని ఆంధ్రదేశంలో మాత్రం ఇవి తప్పనిసరిగా రెండు మహానగరాలే. వీటి అడుగుజాడల్లోనే ఇటు వరంగల్ – హన్మకొండ, విజయవాడ – గుంటూరు జంటపట్నాలుగా పెరుగుతున్నాయి.

1976 నాటికే ఈ జంట మహానగరం వాస్తవంగా మహానగరాల కోవలోకి చేరిపోయింది. ఆంధ్రప్రదేశ్ అవతరించే వరకు ఇది అసఫ్‌జాహి వంశస్తుల బధ్ధకంతో నవాబీ పోకడల జీవితంతో బతికింది. గత ఇరవై సంవత్సరాలలో ఎక్స్‌ప్రెస్ బస్సులా పయనించింది. ఇప్పుడు సూపర్ డీలక్స్ వేగంతో పరుగెత్తడానికి ప్రయత్నిస్తోంది. అయితే, కలకత్తా ఢిల్లీ, బొంబాయి, మద్రాసు మహానగరాల్లా విస్తరించిపోయి, సిమెంట్ మేడల మహాఅరణ్యంలా, వెడల్పాటి రోడ్ల కొండ చిలువలా ఇంకా రూపం ధరించలేదు. ఈనాటికీ మహానగరం లోపల – వెలుపల సాధ్యమైనంతగా విస్తరిస్తూనే ఉంది.

హైదరాబాద్ – సికిందరాబాద్ నగరాల మారుమూలలోకి – లోతుల్లోకి నడవండి. మరోసారి నగర జీవితాన్ని కనుక్కోండి. మహానగరాలను ప్రతి ఐదేళ్లకోసారి 'రీ డిస్కవరీ' చేస్తూనే ఉండాలి. ఆ మాట కొస్తే ఈ మహానగరాన్ని తిరిగి దర్శిస్తే కొత్తముఖాలు, కొత్త భవనాలు కొత్త వీథులు ఎదురుపడతాయి.

మహానగరానికి వుండే హంగులన్నీ సంతరించుకుంది ఈనాడు ఒకనాటి భాగ్యనగరం. చుట్టూ భారీ పరిశ్రమలు, లోపల అనేక కార్యాలయాల యంత్రాంగాలు. నెలకొన్న సినిమా స్టూడియోలు – గ్లామర్ ప్రపంచపు మెరుపులు, విభిన్న సంస్కృతుల – భాషల సమ్మేళనంగా పెరిగిన కాస్మోపాలిటన్ జీవితవైఖరి. అనేక వైరుధ్యాల కూడలి. తెలుగు ప్రజలు – ముస్లిం, కాయస్త, మరాఠీ, కన్నడిగులు, పంజాబీ, తమిళ, మలయాళీ, బెంగాలీ, మార్వాడీ, సింధీ, పార్సీ, ఆంగ్లో ఇండియన్‌ల మిశ్రమ జాతి జీవితమే ఆంధ్రుల రాజధాని స్వరూపం. అయితే ప్రధానంగా హైదరాబాద్ హిందూ – ముస్లిం సంస్కృతికి, సికిందరాబాద్ ఆంగ్లో ఇండియన్ – కిరస్తానీ సంస్కృతికి నిలయాలు.

నాలుగు వందల సంవత్సరాల చరిత్ర పునాదులపై నిలుచుంది ఈ నగరం. ఒకనాడు తెలుగు సంస్కృతిని మింగి దక్కన్ ఇస్లాం సంస్కృతితో లావెక్కి ఈనాడు ఆధునిక మిశ్రమ సంస్కృతితో వాపు ఎక్కుతున్న ఈ నగరంలోకి ఆంధ్రదేశంలోని ఏ గ్రామవాసియైనా అడుగు పెడితే ఇక్కడి జీవితం హడలగొడుతుంది. అలవాటైతే మురిపిస్తుంది. దిక్కులేకపోతే వెనక్కి తరిమికొడుతుంది. అందువల్లే ఈ నగరం కూడా మిగతా మహానగరాల లాగే –

'నగరం అందని అందం తాగింది
నగరం విష విషాదంతో వూగింది
నగరం మృగమదంతో కొవ్వింది
నగరం పలగబడి నవ్వింది'

– రెంటాల గోపాలకృష్ణ

రెండు మహానగరాల జీవిత వైభవం కింద సామాన్యుల రెక్కలు ఇంకా ముక్కలవుతూనే ఉన్నాయి. పగలబడి నవ్వే ఉన్నతవర్గాల ఆధిపత్యం నగరంలోని మానవ సాగరంలోని శ్రామిక అమృతకలశంలో హాలాహలాన్ని ఒలికిస్తూనే ఉంది. అయినా మహానగరపు నిర్మాణం ఆకాశానికి ఎదుగుతూనే ఉంది.

ఎగిసే ఉద్యమాలు – పెల్లుబికే పోరాటాలు

మహోత్సవం – మహోద్రేకంతో నిండిన రోజులవి. 1948 ముగిసి రజాకార్ల పాశవిక చర్యలు చరమస్థాయి చేరుకుని కుక్కచావు చస్తున్న రోజులవి. అకస్మాత్తుగా సుల్తాన్‌బజార్ రోడ్లవెంబడి చైన్ మోటర్లు (టాంక్స్) గరగరమంటూ రోడ్డుకంకరను పెగలిస్తూ దూసుకు వస్తున్నాయి. నిజాం ఫ్యూడల్ పాలన – రజాకార్ల మతపిచ్చి నుంచి విముక్తి, స్వేచ్ఛా పతాకాన్ని అందజేయటానికి వస్తున్న యూనియన్ సైన్యాలు. ఆనాటి చిన్ననాటి ఉత్సాహం ఆ మిలిటరీ ట్రక్కులు – ట్యాంకుల చుట్టూ గంతులేస్తూ పడిన దృశ్యం ఈనాటికీ కళ్లముందే ఆడుతుంది.

నగరంలో నిజాం నిరంకుశత్వానికి విరుద్ధంగా టెలిగ్రాఫ్ ఆఫీస్‌లపై జెండాల నేగురవేసిన ఆ సమరోత్సాహం జైళ్లపాలై లాఠీదెబ్బల కింద ఎముకలు విరిగినా ఈ నగరం – ఈ ప్రాంతం స్వేచ్ఛగా అందరిదీ అనే భావన ఏనాటికైనా చెక్కుచెదరనిది.

ఆనాడే నగర కర్మాగారాల్లో చెదురుమదురుగా ప్రతిధ్వనించిన రైతాంగ పోరాట తిరుగుబాట్లు, తెలంగాణ రైతులు భూస్వామ్య జాగిర్దారీ దౌష్ట్యానికి వ్యతిరేకంగా లేవనెత్తిన తుపాకులు. నిజాంను అంతం

చేయాలని బాంబులు చేబట్టిన యువకులు. రహస్య జీవితాన్ని వరించి ప్రజావిముక్తి కోసం సర్వస్వం త్యజించిన విప్లవ వీరులు – ఈ నగర గత జీవిత పోరాటాలలోని అంతర్భాగాలు. ఒకానొకనాడు చుట్టూ నవనాడులతో ఫూపిరిపోసి – ఏనాటికైనా రక్తాన్ని ప్రసరింపచేసే స్నాయువుల్లాంటి గ్రామాల మధ్య బతికే మహానగరంలో ఆనాడు –

'పడింది – చీకటి! / నగరం మనస్సు రహస్య భూతగృహం తెరుస్తోంది / న్యాయ ధర్మసూత్రాలకు / నాలుక తెగిపోయింది / ఆకలి కడుపులపై కబంధుడాడే వికృత నృత్యం / కిటికీ లోపలనేమో కీచకుని జయోత్సవం / సీసాల నోళ్లు పొంగుతున్నై / తెల్లగుర్రాల (వైట్‌హార్స్) మద్యం ఆగింది / వెర్రికామం వీథుల్లో విహరిస్తున్నది / పిస్టల్ చేదాల్చిన చౌర్యం / మలుపుల్లో నిల్చొన్నది – / కోర్టుల చిట్టాల కింద / 'న్యాయం' పడి పూడింది / అడుగుల చప్పుడు రాత్రికి వినపడకుండా / నడిచే విప్లవకారుల నీడలు / దొంగకళ్లు చెంగు చెంగున దూకుతున్నాయి వెంబడించి.

... ...

ఎవరక్కడ? ఎక్కడ? ఎక్కడ? / జ్యోతి!? / వాస్తవాన్ని దహించండి! / రండి! రండి! ఎవరక్కడ? / ఆదర్శం నిర్మించండి!'

అనిసెట్టి

ఆదర్శాల నిర్మాణాల కోసం ఆ తర్వాత నగరంలో ఎన్నో ఉద్యమాలు చిన్నవి పెద్దవి ఉబికి వచ్చాయి. ముల్కీ – నాన్‌ముల్కీల గొడవల మధ్య నయాపూల్ వంతెన మీదుగా గుండు దూసుకుపోగా పరిగెత్తిన తెలంగాణ విద్యార్థులు, ప్రత్యేక తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన యువకులు – ఆ తర్వాత ఆదర్శాలు క్రమంగా అడ్డదారిన సంకుచితమైన పరిధిలో గోరీలు కట్టుకున్నాయి. ఇవన్నీ ఈనాడు ఈ మహానగరం చరిత్రలో భాగాలు. పాఠశాల చరిత్ర పుస్తకాల్లోకి ఇంకా ఎక్కని వాస్తవాలు. అయినా ప్రజల శాశ్వత రాజకీయ విముక్తికోసం సమతా పోరాటాలు పెల్లుబికి వస్తూనే ఉంటాయి.

('నాన్ ముల్కీ గోబ్యాక్' నినాదంతో ఆ రోజు అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్ ఎదుట గుమిగూడిన విద్యార్థులపై పోలీసులు బాష్పవాయువు ప్రయోగించి – ఆ తర్వాత ఫైరింగ్ ప్రారంభించేసరికి, ప్రాణాలు అరచేత పట్టి నయాపూల్ మీదుగా నేనుకూడా పరిగెత్తిన దృశ్యం ఈనాటికీ జ్ఞాపకం ఉంది.)

ఈనుతున్న భూమి – నడుస్తున్న జనం

రెండు మహానగరాలనే హైదరాబాద్ – సికిందరాబాద్‌ల మధ్య పెట్టుబడిదారీ వ్యవస్థ ఈనాడు సుస్థిరంగా ఉంది. చుట్టూ ఒకవైపు ఉప్పల్ దాటి – మరోవైపు సంగారెడ్డి వరకు, ఇంకోవైపు రామచంద్రా పురం – ఇటు బీబీనగర్ వరకు భారీ పరిశ్రమలు నెలకొన్నాయి. ఆధునిక జీవిత సౌఖ్యాలతో పారిశ్రామిక వాడల కాలనీలు విస్తరించాయి. అయినా నవాబుల ఫ్యూడల్ వాసనలు – పెత్తందారీ శిథిలాల నీడలు వెంటాడుతూనే ఉన్నాయి.

ఒకనాటి 'సలాం', 'ఆదాబ్', 'తస్లీం' – ఇవన్నీ 'మూసీకీ' ఆవల తరతమ బేధాలు చూపినా, ఈనాడు హుస్సేన్‌సాగర్‌కు ఈవల నమస్తేలతో – హల్లోలతో, నమస్కారాలతో, హై లతో ఇంకా సమసిపోని కులాలను – మతాలను వర్గాలను చూపుతూనే ఉన్నాయి.

గ్రీక్ – రోమన్ నాగరికత నిస్సారమైపోవడం వల్ల పతనమై పోయిందని, కిన్నేత్ క్లార్క్ అభిప్రాయం. అలాగే 1947లో బ్రిటిష్‌వాళ్లు వెళ్లిపోగానే లక్నోలో ఇస్లాం సంస్కృతి కూలిపోయింది. దక్కన్‌లో హైదరాబాద్‌లో అసఫ్‌జాహీ వంశస్థుల చివరి నిజాం గద్దెదిగగానే ఫ్యూడల్ వ్యవస్థ బద్ధలైపోయింది. అయినా గ్రామాల్లో ఫ్యూడల్ మనస్తత్వం దొరల మనసుల్లో – ప్రవర్తనలో మాత్రం నశించలేదు. ఏనాడో వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా వచ్చిన పోరాటం ఈనాటికి ఏదో ఒక ప్రయత్నపూర్వకమైన సంస్కరణగానైనా అధికార యంత్రాంగం ద్వారా ప్రవేశించింది.

ఒకనాడు స్వాతంత్ర్యానికి పూర్వం ఈ మహానగరంలో తెలంగాణ లోని పది శాతం మాత్రం ప్రజలు జీవించారు. ఈనాడు ఆంధ్రదేశంలోని అన్ని నగరాలలోని ముప్పై శాతం జనం ముఖ్యంగా ముఖ్య పట్నంలో ఎక్కువ శాతం, ఉనికిని కాపాడుకోడానికి పాటు పడుతున్నారు. యాంత్రిక మైన జీవితం ఎక్కడా వెళ్లనకుండా రేపటి భయంతో ఉన్నంతకాలం, మురికివాడలు నివాసయోగ్యం కాగలిగేవరకు, పేవ్‌మెంట్ల మీద – చెట్లనీడన, కూలుతున్న గోడలపంచన ఎలాంటి ఆధారాలులేని నిరాశ్రయులున్నంత కాలం ఈ కట్టడాలకు సీతారాంబాగ్ లాంటి పెద్ద దేవాలయాలకు–పాలరాతి వెంకటేశ్వర–మందిరాలకు సార్థకత ఉండదు.

'సండే టైమ్స్' పర్యాటక విలేకరి డేవిడ్ హోల్డన్ 1975లో భారతదేశం పర్యటించినప్పుడు ఒక మాటన్నారు – 'అపారమైన భూభాగం – అసంఖ్యాకులైన ప్రజలు, భారతదేశంలో ఈ రెండూ ఏనాటికీ తగ్గించబడని మూలపదార్థాలు. మొదటిది విముక్తం చేస్తుంటే – రెండోది అణచివేస్తున్నా, ఇవి రెండూ పరస్పరం శాశ్వతంగా ఒకదానిలో ఒకటి మార్పులేని బిగువైన స్థితిలో అమరివున్నాయి'.

మహానగరం లోపల ఎప్పుడూ అపారమైన భూభాగం ఉండదు. మన్ను లోపలికి లేదా మిన్నుపైకి వెళ్లవలసిందే జనం. అంతే తప్ప చిక్కడ్‌పల్లి, సుల్తాన్‌బజార్, కింగ్స్‌వే, మోండాబజార్‌లలో విస్తరించే అవకాశం లేదు. హోల్డన్ లానే మనం ఆశావాదులమే, పరస్పరం మార్పులేని శాశ్వతమైన ఇరుకైన స్థితిలో జీవించే విషయంలో! కాని ఇది కూడా ఎల్లకాలం కొనసాగదు. దీనికి చరిత్ర తార్కాణం. 1920 ఆ ప్రాంతాల్లో ఉప్పొంగిన మూసినది తిరిగి పరవళ్లు తొక్కకపోవచ్చు. కాని జన ప్రవాహపు ఉధృతం హెచ్చి అస్తిత్వపు పోరాటంలో విలువలు నశించవచ్చు. అందుకే గత శతాబ్దంలో వచ్చిన సాహిత్య – రాజకీయ ఉద్యమాలు జనజీవితపు గీటురాళ్లుగా – ప్రతిస్పందనలుగా నిలిచాయి, ఈ నగరంలోనే! ఏదో ఒక సందర్భంలో 'వాయుగుండంలో మహానగరం' అన్న ఆధునిక కవి చారిత్రక ఆశావాదంతో తన ప్రజలతోబాటే నడుస్తాడు – మహానగరాల మధ్య జీవించినా పల్లెసీమలలోనే ప్రజల ఫూపిరి సురక్షితమని భావిస్తాడు.

'మహానగరాన్ని నిర్మించిన / నిర్మిస్తున్న మనష్యుల / మమతలు తినేసిన ఉప్పు (కల్తీ) గాలి / అంతశ్చైతన్యాన్ని అంతం చేసి నవ్వుతున్న నగరం / పెరుగుతూంది.... / నిశ్చయంగా విస్తరిస్తూంది. / వాయిగుండంలో సమస్యలు వీచివీచి / మహానగరపు వీథుల్లో సుళ్ళుసుళ్లుగా / దివారాత్రుల శ్రమకి – సౌఖ్యానికి ఘర్షణ / దరిద్రానికి – ధనానికి అంతులేని సంఘర్షణ / 'కెలిడోస్కోప్' లోని చిత్రవిచిత్ర రంగులవలే / జీవితాల విభిన్న చిత్రాల / నూతన సృష్టికి జరుగుతున్న సంచలనం'

('నాలుగు శతాబ్దాల సాక్షిగా మహానగరం' నుంచి – రచయిత) వీ

ప్రభుత్వ రవాణా వ్యవస్థను దెబ్బతీసి, అడుగడుగునా అవినీతితో సమస్యల వలయంగా ఉన్న హైదరాబాద్‌కు మెట్రో రైల్‌ను సర్వరోగ నివారిణిగా చూపడం హాస్యాస్పదం అంటున్నారు **డా. సి. రామచంద్రయ్య**

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్

జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య

నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టం అవసరం ఎంతైనా ఉంది. జనాభా, వాహనాలు విపరీతంగా పెరుగుతున్న నగరాలలో కాలుష్యాన్ని, రద్దీని తగ్గించి వేగంగా తక్కువ ఖర్చుతో తమ గమ్యాలకు ప్రజలు చేరే విధంగా ప్రజా రవాణా వ్యవస్థను రూపొందించి కఠినంగా అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వాల పైన ఉంది. తద్వారా ప్రజారోగ్యం మెరుగుపడడం (కాలుష్యం తగ్గడం ద్వారా), ప్రజలకు సమయం ఆదా కావడం, కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఎక్కువ సమయం గడపడం (ఇప్పుడు ట్రాఫిక్ జామ్‌లలో అయినట్లు కాకుండా), వ్యక్తిగత, సామాజిక శాంతి మెరుగవడం వగైరా లకు ఆస్కారం ఏర్పడుతుంది. ఎక్కువ జనసాంద్రత, వాహనసాంద్రత ఉన్న నగరాలలో ప్రజారవాణాకు ప్రాధాన్యం కల్పించకపోతే నగర జీవనం దుర్భరమవుతుంది. ఇపుడు హైదరాబాద్‌లో జరుగుతున్నదిదే.

దీనికి పరిష్కారం మెట్రో రైల్ తప్ప మరొక మార్గం లేదని అధికారులు వాదిస్తున్నారు. అందుకనుగుణంగా చకచకా నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తున్నారు. ఈ మెట్రో రైల్ గురించి చర్చించే ముందు ఇపుడు నగరంలో ఉన్న ప్రజారవాణా పరిస్థితిని పరిశీలిద్దాం. తక్కువ దూరం వెళ్ళే ప్రయాణికులు నడిచి వెళ్లడానికే ఇష్టపడతారు. అందుకు ఆరు అడుగులకు తక్కువ లేకుండా పది నుంచి పదిహేను అడుగుల వరకు రోడ్ల వెడల్పును బట్టి ఇరువైపుల ఫుట్‌పాత్‌లు ఉండాలి. భారతదేశంలో తప్ప (కొంతవరకు ఢిల్లీ, ముంబాయి, కోల్‌కతా మినహా) ప్రపంచంలోని అన్ని నగరాలలోను పాదచారులకు అత్యంత ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. ఎక్కువమంది నడిచి వెళ్ళే చోట్ల మనుషులలో కూడా సామరస్యపూర్వక వాతావరణం ఎక్కువగా ఉన్నట్లు ఇటీవల పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఫుట్‌పాత్‌ల తర్వాత వీలైనన్ని ఎక్కువ మార్గాలలో సైకిళ్లలో వెళ్లడానికి అనువుగా రోడ్డును నిర్మిస్తారు. ఫుట్‌పాత్ పక్కన నాలుగు అడుగుల మేర సైకిళ్లకు దారి కల్పిస్తారు. ఇంధన వ్యయాన్ని, కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండ వ్యక్తిగత, ప్రజారోగ్యాన్ని పెంపొందించేవి సైకిళ్లమీద, నడిచి వెళ్లే ప్రయాణం. ప్రపంచమంతా వీటిని ప్రోత్సహిస్తున్నారు. హైదరాబాద్‌లో పరిస్థితేమిటి. అంతో ఇంతో ఉన్న ఫుట్‌పాత్‌లను కూడా రోడ్ల వెడల్పులో తీసేశారు. నడవడం, సైకిళ్లపై వెళ్లడం అత్యంత కష్టమైందిగా, ప్రమాదభరితమైందిగా అయిపోయింది. వీళ్లే ఎక్కువ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇది అనివార్య పరిస్థితి కాదు. రాజకీయ నాయకుల, అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలా జరుగుతోంది. హైదరాబాద్ ఏరియా ట్రాన్స్‌పోర్ట్ స్టడీ (హ్యాట్స్) పేరుతో నగర ట్రాఫిక్ సిస్టం మీద చాలా సమగ్రమైన అధ్యయనం 1983-88 మధ్య నాటి వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజ్‌లోని ప్రొ. రాఘవాచారి నాయకత్వంలో జరిగింది. ఆ అధ్యయన సిఫారసులు అనేకం అమలుకు నోచుకోలేదు. నగరంలోని 27 మార్గాలలో నాలుగు నుంచి అయిదు అడుగులకు తక్కువ లేకుండా ఫుట్‌పాత్‌లు ఉండాలని 'హ్యాట్స్' సూచించింది. పాదచారులు ఎక్కువగా నడుస్తుండిన మార్గాలవి. అప్పుడు రోజుకు 2,30,000 సైకిల్ ప్రయాణాలు జరుగుతున్నట్లు గుర్తించి 13 మార్గాలలో 120 కిలోమీటర్ల మేర సైకిల్ ట్రాక్స్ కల్పించాలని సిఫారసు చేసింది. ఇవేవి భారీ ఖర్చుతో కూడుకున్న పనులు కావు. ఆ వసతులు కల్పించకపోవడానికి ఇది బహుశా ఒక కారణమేనేమో.

ఇపుడు నగరంలో ప్రధానంగా రవాణా సదుపాయం కల్పిస్తున్నది ఆర్.టి.సి. బస్సులే. ప్రతిరోజూ దాదాపు ముప్పై లక్షల ప్రయాణాలు (ప్యాసెంజర్ ట్రిప్స్) ఈ బస్సుల ద్వారా జరుగుతున్నాయి. అందులో 53 శాతం ప్రయాణాలు 8 కిలోమీటర్లలోపు వరకు, 73 శాతం (మొత్తం మీద) 12 కిలోమీటర్లలోపు వరకు జరుగుతున్నాయి. ఆర్.టి.సి. బస్సులలో ప్రయాణాన్ని మెరుగుపరచడం బదులు గతంలో ఆ సంస్థను బలహీనం చేయడానికి జరగని ప్రయత్నం లేదు. ఇప్పటికీ కనీసం అయిదు వేల బస్సులు తిరగవలసిన నగరంలో మూడు వేల లోపే నడుస్తున్నాయి. ఫలితంగా బస్సుల్లో విపరీతమైన రద్దీ. ప్రజారవాణాలో వెళ్లాలనుకునే వాళ్లు కూడా బస్సులలో ఎక్కలేక స్వంత వాహనాలు బయటికి తీయవలసిన పరిస్థితి. దీనికితోడు పాత బస్సులను మార్చి కొత్త వాటిని కొనడానికి ప్రభుత్వం అనుమతించకపోవడం. నగర ట్రాఫిక్ వ్యవస్థలోని ఇతర లోపాలు – కనీసంగా అయిదు వేల మంది ట్రాఫిక్ పోలీసులు అవసరమైతే రెండు వేల మందితోనే పనులు జరిపించడం, ఎప్పుడు కూడా సరిగా పని చేయని సిగ్నళ్లు, పాదచారులు రోడ్డు దాటడానికి సరైన ఓవర్ బ్రిడ్జులు, సబ్‌వేలు లేకపోవడం. వీటికి తోడు ట్రాఫిక్ నియమాలు ఏ మాత్రం పాటించని వాహనదారులు. రాత్రికి రాత్రే రోడ్డు మీద వెలిసే ప్రార్థనా స్థలాలు హైదరాబాద్ ప్రత్యేకత. ఓటు బ్యాంక్, కూహనా లౌకిక వాద మతఛాందస రాజకీయాలతో వాటిని తొలగించడానికి సాహసించని పాలనా వ్యవస్థ ఈ నగరానికి

పట్టిన దౌర్భాగ్యం. ఇటీవల ఊపందుకున్న పరిణామం – మీడియా కోసం చేసే చిత్తశుద్ధిలేని, బాధ్యతారహితమైన తంతు రాస్తారోకోలు, ర్యాలీలు. వీటన్నిటి ఫలితమే నేడు నగరంలో నెలకొన్న అస్తవ్యస్థ ట్రాఫిక్ సమస్య. అవినీతితో నిండిన గుంతల రోడ్లు అదనపు బోనస్. ఇటీవల చాలా ప్రాచుర్యం పొందిన రవాణా – ఎం.ఎం.టి.ఎస్. రైళ్లు. ఫలక్‌నుమా నుండి, నాంపల్లి నుండి శేరిలింగంపల్లి వరకు నలభై కిలోమీటర్ల మేర ఇప్పుడున్న రైల్వే లైన్లపైన నడుస్తున్న రైళ్లు ఇవి. పనిరోజుల్లో రోజుకు దాదాపు ఒక లక్ష ఇరవై వేల మందిని రవాణా చేస్తున్నాయి. రైల్వే మంత్రిత్వశాఖతో సంప్రదించి ఈ ఎం.ఎం.టి.ఎస్. వ్యవస్థను బలోపేతం చేయాలనే చిత్తశుద్ధి, సంకల్పం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. పైన క్లుప్తంగా చర్చించిన వేటినీ ముట్టుకోకుండా మెట్రో రైలు మాత్రమే సర్వరోగ నివారణిగా ముందుకు రావడంలోని ఆంతర్యం ఏమిటి? ఈ మెట్రో ప్రాజెక్ట్ స్వరూపమేంటి? ఇది నిజంగా ప్రజారవాణా సమస్యలను తీరుస్తుందా?

మెట్రో రైల్ స్వరూపం

నగరంలోని మూడు ప్రధాన మార్గాలలో 71.16 కిలోమీటర్ల పొడవుతో మెట్రోరైలు మార్గాలు ప్రతిపాదించారు. 1) మియాపూర్ నుండి ఎల్.బి.నగర్; 2) జూబిలీ బస్ స్టేషన్ నుండి ఫలక్‌నుమా; 3) నాగోల్ నుండి శిల్పారామం. ఇది మొదటి దశ 2012 నాటికి పూర్తవుతుందని అధికారుల భరోసా.

మెట్రోరైల్ అనగానే భూగర్భంలో వెళ్లేదని చాలామంది అనుకుంటారు. (ఈ వ్యాసం చదివే వాళ్లు కూడా కొంతమంది అందులో ఉండవచ్చు) ఇతర దేశాలు చుట్టి వచ్చినవాళ్లు, ఢిల్లీలో కన్నాట్‌ప్లేస్‌లో మెట్రోరైలులో ప్రయాణించిన వాళ్లు అలా అనుకోవడం సహజం. ప్రపంచంలోని అనేక చోట్ల ప్రధాన భాగంలో భూగర్భంలోనికి వెళ్లి నగర వెలుపల శివార్లలో భూమిపై కాని, నేలమీదకాని, స్తంభాలపైన కాని రైళ్లు వెళతాయి. కాని, హైదరాబాద్‌లో భూగర్భ మార్గం అసలు లేదు. నగర నడిబొడ్డున కూడా 40–60 అడుగుల ఎత్తు వరకు నిర్మితమయ్యే స్తంభాలపైన రెండు సమాంతర రైలు లైన్లను నిర్మిస్తారు. రోడ్ల మధ్యలో ఫ్లై ఓవర్ల లాగా. ఈ మార్గాలలో 66 స్టేషన్లను నిర్మిస్తారు. అవి కూడ రోడ్డు మీదనే. మొదటి దశలో రోజుకు 16.38 లక్షల మందిని రవాణా చేస్తుందని, 2022కు పూర్తి కాబోయే రెండవ దశలో రోజుకు 26.76 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా. రెండవ దశలో ఏయే మార్గాలున్నాయో తెలియదు. ప్రాజెక్ట్ అంచనా 2005లో రు. 6000 కోట్లకు పైగా ఉంటే 2008 జూలైకి రు. 12000 కోట్లు దాటింది. ఈ ఖర్చులో 40 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా కాగా 60 శాతం ప్రైవేట్ కంపెనీ భరించి, ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించి, నడిపి ఆతర్వాత బదలాయించే విధంగా (బిల్డ్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్) రూపొందించినారు.

దేశంలోని, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలు అయిదు గ్రూప్‌లుగా (కంసార్టియం) ఏర్పడి ఈ ప్రాజెక్ట్ కోసం పోటీ పడ్డాయి. దేశంలోనే అత్యంత భారీ ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి)గా అధికారులు చెప్పేశారు. కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రు. 4000 కోట్లకు పైగా వయబిలిటి గ్యాప్ ఫండింగ్ (వి.జి.ఎఫ్.) ఇవ్వడానికి ముందుకొచ్చింది. ఇక మిగిలిందంతా ఫైనాన్షియల్ బిడ్స్ తెరిచి, తక్కువ కోట్ చేసిన గ్రూప్‌ను ఎంపిక చేసి పనులు అప్పగించడమే. ఎయిర్ కండీషన్డ్ బోగీలలో సుఖంగా ప్రయాణిస్తూ ప్రపంచశ్రేణి అనుభూతిని నగర ప్రజలు పొందడానికి ఇక ఎంతోకాలం వేచి ఉండనక్కరలేదు.

జూలై 23న తెరిచిన బిడ్లతో ఈ ప్రాజెక్ట్ అసలు స్వరూపం పూర్తిగా బహిర్గతమయింది. నగరంలోని ఈ ప్రాజెక్ట్ విమర్శకులు చాలా రోజులుగా వాదిస్తున్నదే. అతిపెద్ద పి.పి.పి. నుంచి అతి పెద్ద పి.పి. (పబ్లిక్ లేకుండా) గా అవతరించి పూర్తిస్థాయి రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌గా రూపాంతరం చెందినది. లోతుగా పరిశీలిస్తే బిడ్లు తెరవడం, ఎంపిక చేయడం ఒక తంతు మాత్రమేనని గ్రహించవచ్చు. ఎంపిక కాబోయే గ్రూప్‌కు మూడుచోట్ల 290 ఎకరాల భూమి, 34 స్టేషన్ల దగ్గర 34 ఎకరాల స్థలం, స్టేషన్లలో స్థలం వగైరాలు వాణిజ్యపరంగా అభివృద్ధి చేసుకోవడానికి ప్రభుత్వం ఇస్తున్నది. నిర్మాణ సమయంతో కలిపి 35 సంవత్సరాలు ఆ గ్రూప్ ఆ స్థలాలను అనుభవించవచ్చు. బయటికి తెలియని ఇంకెన్ని రాయితీలుంటాయో. ఇన్ని ప్రయోజనాలు ప్రభుత్వం చూపినప్పటికిని ఒక గ్రూప్ ఈ ప్రాజెక్ట్ వాణిజ్యపరంగా లాభసాటికాదని పోటి నుంచి నిష్క్రమించిందని వార్తలొచ్చాయి. ప్రాజెక్ట్‌ను దక్కించుకున్న సంస్థ ఏదో తెలుసా? హైదరాబాద్ శివార్లలో రియల్ ఎస్టేట్ రంగంలో ప్రముఖంగా ఉన్న మైటాస్ భాగస్వామిగా ఉన్న గ్రూప్. (అది సత్యం కంప్యూటర్స్ సంస్థకు చెందింది). ఆగ్రూప్‌లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖంగా ఉన్న నవభారత్, థాయిలాండ్‌కు చెందిన ఇటల్–థాయి,ఐ.ఎఫ్.ఎస్.ఎల్. అనే ఫైనాన్స్ కంపెనీలు ఉన్నాయి. అయినప్పటికీ మైటాస్‌దే ప్రధాన పాత్రగా చెప్పుకొంటున్నారు. అనుమానాలు రేకెత్తించే విధంగా మైటాస్ ప్రతిపాదనలున్నాయి. ప్రభుత్వవాటా అయిన రు. 4000 కోట్లకు పైగా మొత్తాన్ని తిరస్కరించడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వానికి రు. 30,000 కోట్లకు పైగా మొత్తాన్ని ఎదురు చెల్లించడానికి వాళ్లు సిద్ధపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా మెట్రో రైళ్లు నష్టాల్లో నడుస్తున్నాయి. ప్రజారవాణా కోసం ప్రభుత్వాలే వాటికి సబ్సిడీ ఇస్తున్నాయి. అంచనా వేసినంత మంది ప్రయాణీకులెప్పుడూ అందులో ఎక్కరు. నాలుగు సంవత్సరాల వ్యవధిలో రు. 12,000 కోట్ల అంచనాతో మొదలయ్యి పూర్తి కావచ్చేసరికి కనీసం ఎనిమిది సంవత్సరాలు, ఖర్చు రు. 20,000 కోట్ల వరకు చేరడం ఖాయం. అలాంటపుడు ప్రభుత్వానికీ ఇంత పెద్ద మొత్తం చెల్లించడం, ప్రాజెక్ట్ వ్యయాన్ని పూర్తిగా భరించి కూడా ఎలా సాధ్యం.

ప్రభుత్వం ఇస్తున్న భూముల ప్రాంతంలో వందల ఎకరాలను సేకరించడానికి మైటాస్ ప్రయత్నిస్తున్నట్లు వినికిడి. మియాపూర్ ప్రాంతంలో ఇప్పటికే ఈ సంస్థ వెంచర్లు చాలా ఉన్నాయి. ప్రభుత్వం చేసుకొనే ఒప్పందంలో పరోక్షంగా ఎలాంటి లొసుగులు కల్పిస్తున్నదో, తద్వారా ఈ భూములు మైటాస్ చాలా సంవత్సరాలు అనుభవించడానికి ఎలా సాధ్యమవుతుందో ఈ చిన్న ఉదాహరణ చూడండి. 'అంచనా వేసిన ప్రయాణికుల సంఖ్యలో ఒక శాతం తగ్గితే ప్రభుత్వానికి ఏమి చెల్లించకుండానే ఒప్పంద కాలం ఒక సంవత్సరం పెరుగుతుంది. అలా గరిష్టంగా ఆరు సంవత్సరాలు పెంచవచ్చు'. ఇది మచ్చుతునక మాత్రమే. ఒప్పందం సంతకాలు జరిగే సమయానికి ఇంకెన్ని రాయితీలు ప్రవేశిస్తాయో.

మా పరిష్కారాలు, సూచనలు

ఒకటిన్నర సంవత్సరాల క్రితం వివిధ పౌర సమాజ సంస్థలు, వ్యక్తులు కలిసి 'సిటిజన్స్ ఫర్ ఎ బెటర్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్ హైదరాబాద్' అనే ఒక పౌర వేదికనేర్పాటు చేసి కరపత్రాల ద్వారా, సదస్సులు, సెమినార్లు, చర్చలు, పత్రికా ప్రకటనలు మొదలగు అనేక మార్గాల ద్వారా నగరంలోని ప్రజారవాణా మెరుగుపరచేందుకు సూచనలు చేయడం జరుగుతోంది. ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించడం కూడ జరిగింది. వీటన్నిటి ముఖ్యసారాంశమేమంటే – తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో, దృఢమైన రాజకీయ సంకల్పంతో 'చేయవలసిన అనేక పరిష్కారాలు పూర్తి చేస్తే పరిస్థితులు చాలా మెరుగవుతాయి. అంతవరకు మెట్రోరైలు ఆపండి' అని. స్థూలంగా చూసినపుడు పౌరవేదిక సూచనలు రెండు భాగాలుగా ఉన్నాయి. 1. హైదరాబాద్ నగరంలో రవాణాను మెరుగుపరచడం; 2. నగరానికి తన చుట్టూ ఉన్న వెనుకబడిన జిల్లాలలోని పట్టణాలతో రవాణా బంధాన్ని బలోపేతం చేయడం ద్వారా ఆ జిల్లాల అభివృద్ధిని ప్రోత్సహించడం. నగరంలో ఇపుడున్న రైలు మార్గాలకు సమాంతరంగా రైల్వే లైన్లు నిర్మించడం ద్వారా ఎం.ఎం.టి.ఎస్. రైళ్ల సంఖ్యను పెంచి ప్రతి 5–10 నిమిషాలకొక రైలు నడపవచ్చు. సికిందరాబాద్ స్టేషన్లో రైళ్ల రద్దీని తగ్గించడం ద్వారా ఇపుడున్న రైల్వేలైన్ల మీద కూడ ఎక్కువగా ఎం.ఎం.టి.ఎస్. సర్వీసులను నడపవచ్చునని రైల్వే అధికారులు అంటున్నారు. ఎం.ఎం.టి.ఎస్. స్టేషన్లకు బస్సులను అనుసంధానం చేసి, ఒకే టికెట్‌తో రైలు, బస్సు ప్రయాణం చేసే విధంగా సౌలభ్యం కల్పిస్తే కొన్ని లక్షల మంది ప్రజా రవాణా వైపు మొగ్గుచూపుతారు. ఒక రైలు లైను నాంపల్లి స్టేషను దగ్గర అంతమవుతుంది. దానిని భూగర్భం ద్వారా కోఠి వరకు, ఆ తర్వాత భూమిపైన తీసుకెళ్లి మలక్‌పేట్ దగ్గర ఇప్పుడున్న కాచిగూడ–ఫలక్‌నుమా మార్గానికి అనుసంధానం చేయాలి. నగరం లోపల ఒక వలయాకార రైల్వే మార్గం నాంపల్లి–మలక్‌పేట–కాచిగూడ–సికిందరాబాద్–ఖైరతాబాద్–నాంపల్లి ఏర్పడుతుంది. మలక్‌పేటను ఒక చిన్న జంక్షన్‌గా వృద్ధి చేయాలి. అపుడు లక్డికాపూల్, నాంపల్లిల వైపు నుండి సికింద్రాబాద్, ఫలక్‌నుమాల వైపు వెళ్లేవాళ్లకు రైలు సౌకర్యం ఏర్పడుతుంది. మలక్‌పేట నుంచి ఎల్.బి.నగర్ వరకు కొత్త లైను ను పొడిగించవచ్చు. దానిని హయత్‌నగర్ వరకు తీసుకెళ్లాలి. ఈ కొత్త లైనును భూమి మీదనే నిర్మించవచ్చు. ఇపుడు అత్యంత రద్దీగా ఉన్న ఎల్.బి.నగర్–పటాన్‌చెరు మార్గానికి అపుడు రైలు మార్గం లింగంపల్లి వరకు ఏర్పడుతుంది. అటు ఇటుగా ఈ సూచనలు పైన ఉదహరించిన 'హ్యాట్స్' నివేదికలో చేయడం జరిగింది. పై చర్యలవలన రోడ్ల మీద రద్దీ తగ్గుతుంది.

నగరంలోని 150–200 కిలోమీటర్ల రోడ్లను బస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (బి.ఆర్.టి.ఎస్.)కు అనుకూలంగా నిర్వహిస్తే బస్సులు కూడ వేగంగా వెళతాయి. బి.ఆర్.టి.ఎస్. విధానంలో రోడ్డుమీద బస్సులకు ఒక మార్గాన్ని (డెడికేటెడ్ బస్ లేన్) వదులుతారు. ఆ మార్గంలో రవాణా బస్సులు, ఇతర అత్యవసర సర్వీసులు తప్ప ప్రైవేట్ వాహనాలు వెళ్లవు. తద్వారా రైలు మార్గాల సౌకర్యం లేని చోట బస్సు ప్రయాణం సులభమవుతుంది. ప్రపంచంలో 35 దేశాలలో ఈ విధానం అమలులో ఉంది. ఇండియాలో పూనె, ఢిల్లీ నగరాలలో కొంత ప్రయత్నం జరిగింది. ప్రణాళిక సరిగా చేయని కారణంగా అక్కడ కొన్ని విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా కార్ల వాడకందార్ల నుంచి. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని అహ్మదాబాద్‌లో పక్కాగా బి.ఆర్.టి.ఎస్. అమలుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. బి.ఆర్.టి.ఎస్. విధానంలో ముఖ్యంగా రోడ్లు వెడల్పుగా ఉన్న చోట ఖర్చు ఒక కిలోమీటర్‌కు ఐదు నుంచి పది కోట్ల రూపాయలు ఉంటుంది. పౌర సమాజం సూచిస్తున్న ఈ పరిష్కారాలకు శాస్త్రీయత ఉంది. నాంపల్లి నుంచి కోఠి వరకు భూగర్భ మార్గం తప్ప పై పరిష్కారాలకు ఖర్చు కూడా తక్కువే. మెట్రో రైలు ప్రాజెక్ట్‌తో పోలిస్తే పదో వంతే. ప్రభుత్వరంగంలోనే ప్రజారవాణా వ్యవస్థను నడపవచ్చు.

హైదరాబాద్ నుండి నాలుగు వైపుల వెళ్లుతూ ఇపుడు రైలు మార్గాలున్నాయి. మేడ్చల్, ఘట్‌కేసర్, హయత్‌నగర్, శంషాబాద్, పటాన్‌చెరు పట్టణాలు ఔటర్ రింగ్‌రోడ్డు (ఒ.ఆర్.ఆర్.)లో ఉన్నాయి. ఒ.ఆర్.ఆర్.లో భాగంగా ఒక 'రింగ్ రైలు' కూడా ఉంది. అంటే ఈ అయిదు పట్టణాలను కలుపుతూ ఒక రింగ్‌రైలు మార్గం భవిష్యత్తులో ఏర్పడుతుంది. ఈ అయిదు పట్టణాలను ప్రధాన కూడళ్లుగా అభివృద్ధి చేస్తే చుట్టుపక్కల జిల్లాలనుంచి వేగంగా ప్రయాణించే లోకల్ రైళ్ల ద్వారా ఈ పట్టణాలకు చేరుకొని, అక్కడ నగరంలోని రైళ్లలోకి మారవచ్చు. ఒక పటాన్‌చెరుకు మాత్రమే నేరుగా రైలు లేదు. లింగంపల్లి నుండి అక్కడికి రైలు మార్గం వేయడం కష్టమేమి కాదు. హైదరాబాద్ చుట్టుపక్కల 100–150 కిలోమీటర్లలో ఉన్న పట్టణాల నుండి నగరానికి ప్రతిరోజూ ప్రయాణించడం అపుడు సులభమవుతుంది. నగరం మీద ఒత్తిడి తగ్గడమే కాక ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తాయి. ఉదాహరణకు – శంషాబాద్, హయత్‌నగర్ ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి వల్ల ఉద్యోగవకాశాలు పెరిగితే కొత్తగా చేరే ఉద్యోగులకు ఇళ్ల సముదాయాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు మహబూబ్‌నగర్, నల్గొండలలో రావచ్చు. తద్వారా ఆ జిల్లాలు అభివృద్ధి చెందుతాయి. నగరానికి తన చుట్టూ ఉన్న ప్రాంతానికి (హింటర్‌లాండ్) పరస్పర బంధం కూడా బలపడుతుంది. కాని మెట్రో రైలు ప్రాజెక్ట్ నగరాన్ని తన చుట్టూ ఉన్న ప్రాంతంతో సంబంధాన్ని తెంచివేస్తుంది. ఉదాహరణకు – ఎం.ఎం.టి.ఎస్. రైళ్లలో చిరువ్యాపారులకు ఒక బోగీ ఉంటుంది. కాబట్టి వీటిలో చుట్టు పక్కల పట్టణాల నుండి తమ సరుకులు తెచ్చుకొని అమ్ముకోడానికి, నగరంలో కొని తీసుకెళ్లడానికి సౌలభ్యం ఉంటుంది. మెట్రో రైల్‌లో ఎక్కువ సామానుతో వెళ్లడానికి నిబంధన లెక్కువ. గ్రామీణులకు అదో కొత్త లోకం.

ఈ మెట్రో రైలు ప్రాజెక్ట్‌ను ఎందుకు వ్యతిరేకించాలి ?

'పౌర వేదిక' తరపున ఈ ప్రాజెక్ట్‌ను ఎందుకు వ్యతిరేకిస్తున్నామో ఇప్పటికే కొంత వివరణ వచ్చిందనుకుంటాను. ఈ వ్యాసం ఇప్పటికే పొడవైంది కాబట్టి క్లుప్తంగానే ముగిస్తాను. జాతీయ, బహుళజాతి నిర్మాణ కంపెనీలు, విదేశీ రైల్వే తయారీ కంపెనీలు, ముఖ్యంగా భారతదేశంలో వివిధ నగరాలలో ఈ ప్రాజెక్ట్‌లను ప్రోత్సహిస్తున్నాయి. వేల కోట్ల రూపాయల వ్యాపారాలు అందులో ఉన్నాయి. ప్రతి నగరానికి ఒక స్వరూపం, చరిత్ర, కొన్ని ప్రత్యేకతలు ఉంటాయి. హైదరాబాద్ ఢిల్లీల మధ్య ఎన్నో వ్యత్యాసాలున్నాయి. వాటికివేవి అక్కరలేదు. మెట్రోరైలు

బి.ఎస్.ఎ. స్వామి



బడుగు, బలహీనవర్గాల కోసం జీవితాంతం పోరాడిన జస్టిస్ బొజ్జా శ్రీ అచ్యుతానంద స్వామి జూలై 24న మరణించారు. జస్టిస్ స్వామి 1942 జూలై 11న తూర్పు గోదావరి జిల్లా అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలో జన్మించారు. బడుగుల న్యాయ పోరాటమూర్తిగా నిలిచే ఆయన న్యాయవాదిగా, న్యాయమూర్తిగా వారికోసం శ్రమించారు. హైకోర్టు న్యాయమూర్తిగా ప్రజాపక్షం వహిస్తూ అనేక తీర్పులిచ్చారు. గౌతు లచ్చన్నకు శిష్యుడిగా మెలిగారు. గౌతు లచ్చన్న ఆర్గనైజేషన్ ఫర్ వీకర్ సెక్షన్స్ (గ్లో) స్థాపించడంలో కీలక పాత్ర నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావుఫూలే సామాజిక న్యాయసంస్థను స్థాపించారు. పదవీవిరమణ తర్వాత ప్రత్యక్ష ఉద్యమాల్లో పాల్గొన్నారు. బలహీనవర్గాల సామాజిక వేదికలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన 'మన పత్రిక' కు సంపాదకుడిగా ఉన్నారు. ఈ పత్రిక ద్వారా రిజర్వేషన్లు, సామాజిక న్యాయాల ప్రాధాన్యతను ఎత్తిపట్టారు. తాను ఎంచుకున్న కార్యరంగంలోని బలహీనతలను బయటపెట్టడంలో జస్టిస్ స్వామి వెనుకాముందూ చూసేవారుకాదు. రాష్ట్ర స్థాయిలోని వివిధ సంఘాలు, సంస్థలలో సలహాదారుడిగా వ్యవహరించారు. వెనుకబడినవర్గాల ప్రజల అభ్యున్నతికి చేసిన కృషిలో ఆ వర్గాలకు చెందిన నాయకులందరినీ వారి వారి రాజకీయాలకు అతీతంగా అందరినీ కలుపుకొని ముందుకు నడిపారు. తనను వ్యతిరేకించే వారిని సైతం తనను ఒక వ్యక్తిగా, స్నేహితుడిగా అంగీకరించకుండా ఉండలేని పరిస్థితిని కల్పించిన వ్యక్తిత్వం జస్టిస్ బి.ఎస్.ఎ. స్వామి గారి సొంతం. వీ

లేకపోతే అది 'ప్రపంచశ్రేణి' నగరమే కాదన్నట్లు వాళ్ల తరఫున కన్సల్టెంట్లు, అధికారులు వాదిస్తున్నారు. మన ఎం.ఎం.టి.ఎస్. రైళ్లు, చెన్నై, బొంబాయిలలో లోకల్ రైళ్లు బ్రాడ్‌గేజ్ మీద కూడ వెళ్లుతూ రోజు లక్షలాది మందిని రవాణా చేస్తున్నాయి. కాని హైదరాబాద్ మెట్రో రైళ్లు స్టాండర్డ్‌గేజ్ (బ్రాడ్‌గేజ్ కంటె కొంచెం తక్కువ) మీద వెళతాయి. కారణం – విదేశీ రైల్వే తయారీదారులు స్టాండర్డ్ గేజ్‌లోనే కోచ్‌లను తయారు చేయడం. మెట్రోరైలు ఛార్జీలు చాలా ఎక్కువ. ఎం.ఎం.టి.ఎస్. రైలులో ఫలక్‌నుమా నుండి లింగంపల్లికి (39 కిలోమీటర్లు) రు. 8 అయితే మెట్రో రైలులో రెండు కిలోమీటర్లకు కనీస ఛార్జిగా రు. 8 నిర్ణయించారు. ప్రైవేట్ కంపెనీల ఆధ్వర్యంలో మెట్రోరైళ్లు నడుస్తాయి. అక్కడి వ్యాపారం, లాభాలకే పెద్దపీట. ప్రజారవాణాకు కాదు. శంషాబాద్ ఎయిర్‌పోర్టును జి.ఎం.ఆర్. ఎలా నిర్వహిస్తున్నదో చూస్తున్నాం కదా.

ఎత్తులో వెళ్లే మెట్రో కారిడార్లతో నగరం శాశ్వతంగా కళావిహీనం అవుతుంది. అనేక వారసత్వ కట్టడాలు, వాటి ప్రాంగణాలు (హెరిటేజ్ బిల్డింగ్స్, ప్రిసింక్ట్స్) కళావిహీనమవుతాయి. క్లాక్‌టవర్, అసెంబ్లీ భవనం, పబ్లిక్ గార్డెన్స్, మొజంజాహీ మార్కెట్, సాలార్‌జంగ్ మ్యూజియం మొదలైనవి). కొన్నివేల భవనాలను నేలమట్టం చేస్తే కాని మెట్రోలైన్ల, స్టేషన్ల నిర్మాణం సాధ్యంకాదు. దాదాపు యాభైవేల మంది చిన్న వ్యాపారస్తులు, చిన్న ఉద్యోగులు ఉపాధి కోల్పోతారని అంచనా. నగర చరిత్రలో భాగమైన బడిచావడి, సుల్తాన్‌బజార్ మార్కెట్లు ఇక కనుమరుగే. మెట్రో రైళ్లు వదిలే కాలుష్యంతో ఆ మూడు రోడ్లకిరువైపుల ఉన్న 320 కి పైగా ఆసుపత్రులు, కాలేజీలు, పాఠశాలలు, ప్రార్థనా మందిరాలు సతమతమవుతాయి. అపార్ట్‌మెంట్ వాసుల జీవితాలు దుర్భరమే.

నగర చరిత్రలోనే అత్యంత ఖరీదైన, భారీ ప్రాజెక్టును ఏ ఒక్క ప్రజాస్వామ్యయుత వేదికపైగాని, ప్రజాప్రతినిధులతో గాని, పౌరసమాజం తో గాని చర్చించకుండా, అనుమతించడం జరిగింది. సమాచార హక్కును కూడ గౌరవించకుండా ఏ విధమైన సమాచారాన్ని ఇవ్వకుండా అంతా తామే అన్నట్లు మెట్రోరైలు అధికారులు ప్రవర్తిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ప్రజలకు అంత మేలు చేసేదైతే దాని వివరాలను, అధ్యయనాలను అంత గోప్యంగా ఉంచాల్సిన అవసరమేముంది. నగరానికి ఇది ఒక వినాశకర ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్టుకు అనుమతులిస్తున్న తీరు భ్రష్టుపట్టిన, అవినీతిలో కూరుకుపోయిన రాజకీయ, పాలనా యంత్రాంగానికి నిదర్శనం. ఇది ఒక మెట్రో రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్. ఏ విధంగానైనా సరే దీన్ని నిరోధించి ఈ నగరాన్ని కాపాడాలి. వీ

(7వ పేజీ తరవాయి..)

కోణాలను అన్ని రంగాల్లోని అంశాలను స్పృశిస్తూ వర్తమాన అంశాల పట్ల సమస్యల పట్ల సమగ్ర విశ్లేషణాత్మక సాహిత్యాన్నందిస్తున్న సంపాదకవర్గానికి, సరైన సమయానికి పత్రికనందిస్తున్న సర్క్యులేషన్ మేనేజర్‌కు కృతజ్ఞతలు.

ఆగస్ట్ మాస సంచికలో ప్రచురించిన లియో హ్యూబర్‌మన్ రాసిన 'భావ ప్రచారం ఎలా జరగాలి' అనే వ్యాసంలో బోధనపై ఉపాధ్యాయుడికి మంచి ఉపన్యాసకుడిలా తన ప్రసంగ అంశంపై పట్టు, స్పష్టమైన అవగాహన ఉండాలనీ, విద్యార్థుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వారి భాగస్వామ్యంతో చర్చ పద్ధతి ద్వారా పాఠ్యాంశాన్ని బోధించాలని, మౌలిక అంశాల పట్ల తరగతి గదిలో చర్చను ప్రోత్సహించాలని ఒక మాదిరి పాఠం ద్వారా అర్థం చేయించారు.

ఎంత చిత్తశుద్ధి ఉన్నా, ఉద్యమాలు ఏవైనా, పాఠ్యాంశాలు ఏవైనా అంశాన్ని అర్థం చేయించడంలో వైఫల్యం చెందితే తరగతి గది నిస్తేజంగా ఉండడమే కాకుండా తరగతులకు వచ్చే వాళ్ల సంఖ్య తగ్గుతుందనీ, పాఠ్యాంశం అనేది కేవలం ఒక లక్ష్యం మాత్రమే కాదు అది విద్యార్థులను ఆలోచించేలా చేసే ఒక సాధనంగా ఉండాలని, ఉపాధ్యాయునికి ఒక మొదలు, ఒక మధ్య, ఒక ముగింపు ఉండాలని, ఉపాధ్యాయునికి నల్లబల్ల ఒక మంచి సాధనంగా ఉపయోగించాలని ఈ వ్యాసం కొనసాగింది.

మరొక మంచి అంశం మూల్యాంకన సమయంలో విద్యార్థులను వరసగా ప్రశ్నలడగరాదని దాని వలన తరగతిలోని వారు వారి వరస వచ్చినప్పుడు మాత్రమే స్పందిస్తారని ఎక్కడనైనా ఎవరినైనా అడగవచ్చు అని వారు భావిస్తే అందరూ అలర్ట్‌గా ఉంటారని చక్కని సందేశాన్నిచ్చిన వ్యాసాన్ని రాసినందుకు రచయితకు, ప్రచురించిన (పత్రిక) మీకు కృతజ్ఞతలు.

– **డా. ఎ. పున్నయ్య,** నల్లగొండ

మారుతున్న హైదరాబాద్ మార్పుల దిశనూ, స్వభావాన్నీ అర్థం చేసుకున్నప్పుడే ఈ దారి ఎటో తెలుస్తుందంటున్నారు **ఎన్. వేణుగోపాల్**

నగరం మార్పు ఎటు నుంచి ఎటు?

తెలుగువారి మహానగరం హైదరాబాద్ అతివేగంగా మారిపోతున్నదనేది ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్న విషయమే. హైదరాబాద్ నిన్న ఉన్నట్టుగా ఇవాళ ఉండడం లేదు. పాత రోడ్లు మారిపోతున్నాయి. పాత భవనాలు, ఇరానీ హోటళ్లు కనుమరుగవుతున్నాయి. పాతరోజుల్లో నగరానికి ప్రధాన కేంద్రాలుగా ఉండిన ఆబిడ్స్, కోఠీల స్థానంలో నగరం చుట్టూ కనీసం డజను కేంద్రాలు తయారయ్యాయి. అవి పాత కేంద్రాలకన్న ఎక్కువ మిరుమిట్లు గొలుపుతున్నాయి. గతంలో నగరం పొలిమేర అనిపించే ప్రాంతాలకు అవతల కనీసం ఇరవై ముప్పై కిలోమీటర్ల దూరం వరకూ నగరం విస్తరించింది. కొత్త, కొత్త కాలనీలు, లే ఔట్లు, సింగపూర్ సిటీ, మలేషియా సిటీ వంటి ఆధునిక సౌకర్యాల గేటెడ్ కమ్యూనిటీలు, పరిశ్రమల పేరు పెట్టుకున్న వ్యాపార సంస్థల సువిశాల ప్రాంగణాలు, సంపన్నుల ఫార్మ్ హౌజులు, విలాస కేంద్రాలు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, గోల్ఫ్‌కోర్సులు పెరిగిపోతున్నాయి. చెరువులు, కుంటలు, చెట్లు, కొండలు, ఉమ్మడిస్థలాలు తరిగిపోతున్నాయి. జనాభా విపరీతంగా పెరిగిపోతోంది. వాహనాలు లెక్కకు మిక్కిలిగా పెరిగిపోతున్నాయి. హింస, దోపిడీ, నేరాలు, సెటిల్‌మెంట్లు, మాఫియా కార్యకలాపాలు పెరిగిపోతున్నాయి. ఆకాశహర్మ్యాలు పెరిగిపోతూ ఎక్కడా ఆకాశం, దిగంతం స్పష్టంగా కనబడని స్థితి వస్తోంది. జల, వాయు, ధ్వని కాలుష్యాలతో జీవితం ధ్వంసమవుతోంది. మనుషుల మాటతీరు మారి పోతోంది. దుకాణాలలో సరుకులు, హోటళ్లలో ఆహార పదార్థాలు, చివరికి కూరగాయలు, పళ్లు కూడా మారిపోతున్నాయి. రోడ్లు వెడల్పవుతున్నాయి గాని ఫుట్‌పాత్‌లు ఇరుకయి, కరువైపోతున్నాయి. మురికివాడలు పెరిగిపోతున్నాయి. పౌరసౌకర్యాలు అడుగంటి పోతున్నాయి. రోడ్ల పక్కన చిల్లర సరుకులు, తినుబండారాలు అమ్ముకునే జనాభా తగ్గిపోతోంది.

జనాభాలోనూ, విస్తీర్ణంలోనూ, ఉపాధిలోనూ, రవాణా, వసతి, పౌరసౌకర్యాలు వంటి అంశాలలోనూ, సంస్కృతిలోనూ ఈ మార్పులు ప్రతి ఒక్కరికీ అనుభవంలోకి వస్తూనే ఉన్నాయి. కంటికి కనిపించే, చెవికి వినిపించే ఈ మార్పులకు తోడు కనబడని, అర్థం కాని మార్పులు కూడ ఏవో జరిగిపోయాయి, రోజురోజుకూ జరుగుతున్నాయి. ఎక్కడయినా మార్పు అనివార్యమే, సహజమే. హైదరాబాద్ కూడ అటువంటి అనివార్యమైన, సహజమైన మార్పులనే అనుభవిస్తూ ఉండాలి. కాని ఈ మార్పులతో అనివార్యమైన మార్పులేవో, హైదరాబాద్ ప్రజలకు సంబంధం లేకుండా, హైదరాబాద్ ప్రజల అవసరాల కొరకు కాకుండా, మరెవరి అవసరాలకోసమో, మరెవరి ప్రభావంతోనే వస్తున్న మార్పులేవో తెలియని అస్పష్టత కూడ ఉంది. అసలు ఈ మార్పుల దిశ ఏమిటి, ఈ మార్పుల స్వభావం ఏమిటనే విషయాలలో కూడా ఉండవలసినంత స్పష్టత ఉండడం లేదు. ఈ మార్పులలో అంకెలలో, పరిమాణాత్మకంగా పట్టుకోగల మార్పులనైతే వివరించడం, విశ్లేషించడం సులభం. కాని మానవ సంబంధాలలో, సంస్కృతిలో వస్తున్న మార్పులు చాల గుణాత్మకంగా జరుగుతున్నవి. వాటిని అర్థం చేసుకోవడంగాని, విశ్లేషించడం గాని కష్టమైన పని.

హైదరాబాద్‌లో జరిగిన మార్పులలో మొట్టమొదట చెప్పుకోవలసినది నగర వైశాల్యంలో వచ్చిన మార్పు. మొట్టమొదట 1591లో ఈ నగరం నిర్మించాలని మహమ్మద్ ఖులీ ఖుతుబ్ షా తలపోసినప్పుడు అప్పటి రాజధాని గోల్కొండ నుంచి ఇక్కడికి ఎంతమంది జనం తరలి వచ్చారో, తొలి హైదరాబాద్ రూపొందిన ప్రాంతంలోని మూసీతీరంలోని పల్లెలలో ఎంత జనాభా ఉండేదో తెలియదు. ఏడు గ్రామాల విస్తీర్ణంలో ఈ నగరం ఏర్పడిందని సమకాలిక కథనాలు చెపుతున్నాయి. అంటే బహుశా పదిహేను - ఇరవై వేల ఎకరాలకు మించని విస్తీర్ణంలో కావచ్చు. హైదరాబాద్‌ను 1652లో సందర్శించిన ఫ్రెంచి యాత్రికుడు టావెర్నియర్ అప్పటికి ఆ నగరం ఫ్రాన్స్‌లోని ఆర్లియన్స్‌తో సమానమైన వైశాల్యంలో ఉన్నదని రాశాడు. ఆ ఆర్లియన్స్ వైశాల్యం మూడున్నర శతాబ్దాల తర్వాత ఇప్పటికీ 30 చ.కి.మీ. (ఏడు వేల ఎకరాలు) దాటలేదు కనుక అప్పటి హైదరాబాద్ ప్రస్తుత చంచల్‌గూడ నుంచి చార్మినార్ వరకో, ఆ చుట్టుపట్లనో ఉండి ఉంటుందని ఊహించవచ్చు. అప్పటినుంచీ 1763 వరకూ కూడ హైదరాబాద్ రాజధానిగా లేదు. 1763 నుంచి 1948 దాకా హైదరాబాద్ రాజ్యానికి, 1948 నుంచి 1956 దాకా హైదరాబాద్ రాష్ట్రానికి, అప్పటినుంచి ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధానిగా సాగిన రెండున్నర శతాబ్దాల క్రమంలోనే హైదరాబాద్ క్రమక్రమంగా విస్తరిస్తూ చుట్టూ ఉన్న పల్లెలను తనలో కలుపుకుంటూ పెరుగుతూ వచ్చింది.

పెరిగిపోతున్న హైదరాబాద్ నగరానికి పౌరసౌకర్యాలు కలిగించాలని, నగరాన్ని ఆధునిక నగరంగా తీర్చిదిద్దాలని ఆలోచనలు సాలార్ జంగ్ సంస్కరణలలో (1853-1883) భాగంగా మొదలయ్యాయి. అప్పటివరకూ నగర వ్యవహారాలు చూసే బాధ్యత

కొత్వాల్ - ఎ - బల్దియా (నగర పోలీస్ కమిషనర్)కు ఉండగా, 1869లో ఆ పద్ధతి మార్చివేసి హైదరాబాద్ బోర్డ్, చాదర్‌ఘాట్ బోర్డ్ అనే రెండు పురపాలక సంస్థలను ఏర్పాటు చేశారు. అప్పటికి నగర జనాభా మూడున్నర లక్షలు, వైశాల్యం 55 చ.కి.మీ. ఈ రెండు సంస్థలను కలిపేసి 1933లో హైదరాబాద్ మునిసిపల్ చట్టం కింద ఒకే పురపాలక సంస్థగా మార్చేశారు. మళ్లీ 1950లో తెచ్చిన మరొక చట్టం ప్రకారం హైదరాబాద్‌కు, సికిందరాబాద్‌కు వేరువేరుగా రెండు పురపాలక సంస్థలను ఏర్పాటు చేశారు. 1955లో చేసిన మరొక చట్టం ద్వారా ఈ రెంటినీ కలిపేసి 1960లో హైదరాబాద్ నగర పాలక సంస్థ (ఎం.సి.ఎచ్.)ను ఏర్పాటు చేశారు. దానిలో వరుసగా ఇరుగు పొరుగు మునిసిపాలిటీలను కూడ కలుపుతూ వచ్చారు. మరొకవైపు హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా), ఖులీఖుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడ), సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ (సి.డి.ఎ.), హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (హాడా) వంటి సంస్థలు కూడ అనేకం పుట్టుకు వచ్చాయి. ఈ పరిణామాలన్నిటి కొనసాగింపుగా 2007 ఏప్రిల్‌లో గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జి.ఎచ్.ఎం.సి.)ని, 2008 ఆగస్ట్‌లో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎచ్.ఎం.డి.ఎ.)ని ఏర్పాటు చేశారు.

ఈ ఆగస్ట్ 24న ఏర్పడిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ తో హైదరాబాద్ వైశాల్యం 6,852 చ.కి.మీ.కు చేరింది. అంటే పుట్టిన నాడు ఇరవైవేల ఎకరాల లోపు ఉన్న నగరం ఇవాళ పదిహేడు లక్షల ఎకరాలకు విస్తరించింది. ఈ కొత్త హైదరాబాద్ తన చుట్టూ ఉన్న ఐదు జిల్లాలలోని 54 మండలాలను తనలో జీర్ణం చేసుకోబోతున్నది. 1975లో ఏర్పడిన హుడాను రద్దు చేస్తూ ఏర్పడిన ఎచ్.ఎం.డి.ఎ. కింద ప్రస్తుత హుడా పరిధితోసహా, కంటోన్మెంట్, హైదరాబాద్‌లోని 16 మండలాలు, రంగారెడ్డి జిల్లాలోని 22 మండలాలు, మెదక్ జిల్లాలోని 10 మండలాలు, నల్లగొండ జిల్లాలోని నాలుగు మండలాలు, మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు మండలాలు ఉంటాయి.

ఈ హైదరాబాద్ విస్తరణ వల్ల ఈ ప్రాంతంలోని వ్యవసాయ భూములు, ఉమ్మడి భూములు అడవులు, కొండలు, జలాశయాలు అన్నీ కూడ నగరంలో భాగం కాబోతున్నాయి. ఈ పెరిగిన విస్తీర్ణం వల్ల భూ వినియోగంలో ఎటువంటి మార్పులు రాబోతున్నాయనే అంశం, అందువల్ల ప్రజల జీవనోపాధికీ, ఆహార భద్రతకూ, పర్యావరణానికీ ఏమి జరుగనున్నదనే అంశం చాల లోతుగా పరిశీలించవలసినవి. హుడా తయారుచేసిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం 1980లో అప్పటి విస్తీర్ణంలో కేవలం 1.65 శాతం మాత్రమే గృహవసతికి ఉపయోగపడుతుండగా, వ్యవసాయం కింద 42.04 శాతం ఉండేది. ఖాళీ భూమిగా 41.43 శాతం ఉండేది. ఆ తర్వాత గణాంకాలలో వ్యవసాయం, సంరక్షణ అనే కొత్త వర్గీకరణ చేర్చి, ఖాళీ భూములు అనే వర్గీకరణను ఎత్తేశారు. ఈ కొత్త వర్గీకరణ ప్రకారం 1993లో వ్యవసాయం, సంరక్షణ భూవినియోగం 71.45 శాతంగా ఉంది. ఇది చూడడానికి పెరిగినట్టు కనబడుతున్నా విడదీసి చూస్తే ఇందులో 51.20 శాతం వ్యవసాయ వినియోగంగా, 36.98 శాతం ఖాళీ భూములుగా నమోదయి ఉంది. అలాగే గృహవసతి కింద 1980లో 1.65 శాతం ఉన్నదల్లా 1993 నాటికి 8.69 శాతానికి, 2000 నాటికి 12.66 శాతానికి పెరుగుతూ వచ్చింది. జలాశయాల కింద ఉన్న భూమి 1980లో 4.39 శాతంగా ఉన్నది. 1993లో 5.83 శాతానికి పెరిగి, 2000 నాటికి 4.98 శాతానికి పడిపోయింది. నిజానికి పెరుగుతూ వచ్చిన నగర వైశాల్యంతో పోలిస్తే మధ్యలో కనబడిన పెరుగుదల కూడ నిజమైన పెరుగుదల కాదు. ఈ గణాంకాలలో గుర్తించవలసిన అంశమేమంటే ఇందులో వ్యవసాయ వినియోగం కింద ఉన్న భూములు, ఖాళీ భూములుగా గుర్తించబడిన భూములు, అడవులు, జలాశయాలు అన్నీ కూడ భూబకాసురుల రియల్ ఎస్టేట్ దాహానికి బలి అయిపోతున్నాయి. ఈ భూబకాసురులలో రాజకీయ నాయకులు, బహుళజాతి సంస్థలు, పరిశ్రామాధిపతులు, వ్యాపారవేత్తలు, ఫార్మ హౌజుల యజమానులు, దేశదేశాల సంపన్నులు ఉన్నారు. ప్రభుత్వ విధానాలే ఆ స్వప్రయోజన పరులకు వేల ఎకరాల భూమిని అప్పగించడానికి అనుకూలంగా, సిద్ధంగా ఉన్నాయి. మరొకవైపు లక్షలాది పేద, మధ్యతరగతి కుటుంబాలు సరయిన గృహవసతి దొరకక అవస్థలు పడుతున్న స్థితి ఉంది. 1962లో నగరంలో 106 మురికివాడలు ఉండగా ఆ సంఖ్య 1979 నాటికి 445కు, 1994 నాటికి 811కు పెరిగింది. ప్రస్తుతం మురికివాడల సంఖ్య ఇందుకు రెట్టింపు అయినా అయి ఉండవచ్చు. నగరంలో మొత్తం జనాభా పెరుగుదల కన్న మురికివాడల జనాభా పెరుగుదల ఎక్కువ వేగంగా ఉందని పరిశీలనలు తెలుపుతున్నాయి. మురికివాడల జనాభా 1962లో పది శాతం ఉండగా, అది 1982 నాటికి 19 శాతానికి చేరింది. 1994 నాటికి 27 శాతానికి చేరింది.

వైశాల్యం తర్వాత పరిశీలించవలసినది జనసంఖ్యలో వచ్చిన మార్పు. హైదరాబాద్ అంటే ఏమిటని నిర్వచించడంలోనే ఆయా కాలాలలో వేరువేరు నిర్వచనాలు ఉన్నందువల్ల హైదరాబాద్ జనాభా అనేది కూడా ఆ నిర్వచనాలకు లోబడి అటూ ఇటూ మారుతూ ఉంటుంది. హైదరాబాద్‌లో జనగణన 1891లో మొదలయింది. అప్పటి నుంచి ఆయా నిర్వచనాలకు లోబడి హైదరాబాద్ జనాభా :

సంవత్సరం	జనాభా (లక్షల్లో)
1901	4.48
1911	5.02
1921	4.06
1931	4.67
1941	7.39
1951	11.31
1961	12.49
1971	17.96
1981	25.46
1991	43.44
2001	57.52
2007 (అంచనా)	92.00

ఈ జనాభా పెరుగుదలను కేవలం మనుషుల సంఖ్యగానే చూసినా ఒక పరిమాణాత్మక విస్ఫోటనం కనబడుతుంది. కాని అంతకన్న ముఖ్యంగా నగరంలోని జనాభా మార్పులలో భాగంగా భాషా, సామాజిక,

షీలా రాజ్



హైదరాబాద్ 'తెహజీబ్'ని, సమాజాన్ని నిష్పాక్షికంగా, నిర్భీతితో సాధికారికంగా చరిత్రకెక్కించిన పరిశోధకురాలు షీలారాజ్. భిన్న సంస్కృతికి నిలయమైన హైదరాబాద్ ఘనతకు తన పుస్తకాల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం కల్పించారు. 1940లో రాయ్ పృథ్వీరాజ్, సుమిత్రాబాయి దంపతులకు హైదరాబాద్‌లో జన్మించిన షీలారాజ్ హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ, పర్షియన్ భాషల్లో తన రచనలు వెలువరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఉర్దూ, హిస్టరీల్లో ఎం.ఎ. చేసిన షీలారాజ్ ఎస్.ఎన్.డి.టి. యూనివర్సిటీ (బొంబాయి) నుంచి 'సోషియో - ఎకనమిక్ అండ్ కల్చరల్ డెవలప్‌మెంట్ ఇన్ హైదరాబాద్ ఫ్రం 1869–1911' అనే అంశంపై పి.ఎచ్.డి. చేశారు. తర్వాతి కాలంలో ఈ థీసెస్ 'మీడివలిజం టు మాడర్నిజం' పేరిట 1987లో అచ్చయింది. ఆరో నిజాం మహబూబ్ అలీఖాన్ ట్రావెలాగ్ 'షాహీ షాది' పేరిట నవాబ్ ఖాన్‌దాన్‌లోని పెండ్లిళ్ల గురించి విపులంగా రాశారు. దివాన్–ఎ–మహబూబ్ పేరిట మహబూబ్ రాజ్ కవిత్వాన్ని సంకలనం చేశారు. పోర్ట్రెయిట్ ఆఫ్ యాన్ ఎరా 1996 పేరిట 1828–1896 నాటి నిజాం పాలనను అక్షరీకరించారు. హిందూ, ముస్లిం సంస్కృతి, చరిత్రకు సంబంధించిన ఎన్నో విలువైన వ్యాసాలు వెలువరించారు. 1970వ దశకంలో కొద్ది రోజులు మహబూబియా కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసినా వివాహానంతరం భర్త నారాయణ్ రాజ్‌తో పాటుగా బొంబాయికి వెళ్లి అక్కడే చరిత్ర బోధకురాలిగా పనిచేశారు. చనిపోయే వరకు చరిత్ర రచనలో, విషయాన్వేషణలో, సామాజిక చర్చల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆమె జూలై 17న గుండెపోటుతో హైదరాబాద్‌లో మరణించారు. హైదరాబాద్‌కు సంబంధించిన ముఖ్యంగా 19, 20వ శతాబ్దాల సామాజిక, సాంస్కృతిక చరిత్రను పర్షియన్, ఉర్దూ ఒరిజినల్ సోర్సెస్ ఆధారంగా పూర్తి ప్రామాణికంగా రాశారు. భారతీయ సంస్కృతి శాశ్వతంగా ఉండాలంటే హిందూ– ముస్లిం మైత్రి తప్పనిసరి అని ఆమె చెప్పేవారు. వీ

మత, కుల, ఉద్యోగవర్గ బృందాల నిష్పత్తిలో మౌలికమైన మార్పులు జరిగాయి. హైదరాబాద్ రాజ్యం కింద మరాఠీ, కన్నడ, తెలుగు భాషా ప్రాంతాలు ఉండేవి గనుక, పాలనాభాషగా ఉర్దూ ఉండేది గనుక అప్పటి రాజధాని హైదరాబాద్‌లో ఆ నాలుగు భాషా సమూహాలు తగినంత నిష్పత్తిలో ఉండేవి. పాలనాభాషగా ఉర్దూ ఉండడం వల్ల ఉర్దూలో విద్యావకాశాలు, బహిరంగ స్థలాలలో ఉర్దూ చలామణీ ఉండేవి. 1948 పోలీస్ చర్యతో హైదరాబాద్ రాజ్యం కూలిపోవడంతో, 1956లో మరాఠీ, కన్నడ జిల్లాలను పొరుగు రాష్ట్రాలకు బదలాయించడంతో హైదరాబాద్‌లో ఉర్దూ, మరాఠీ, కన్నడ భాషా బృందాల ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది. పాత మద్రాసు రాష్ట్రంలోని తెలుగు జిల్లాల నుంచి వలసలు, మొదట 1960లు, 70లలో ప్రభుత్వ రంగసంస్థల వల్ల, ఆ తర్వాత 1990ల నుంచి ఐటి సంస్థలవల్ల, ప్రపంచీకరణ వల్ల, బహుళజాతి సంస్థల వల్ల ఇతర భాషా ప్రాంతాలనుంచి వలసలు పెరిగిపోవడంతో ప్రస్తుత నగర జనాభాలో భిన్న భాషల సమూహాలకు స్థానం దొరికింది. ఉర్దూ ప్రాధాన్యత తగ్గి, ఇంగ్లిష్ ప్రాధాన్యత పెరిగింది.

అదే రకంగా పాత హైదరాబాద్‌లో పాలకవర్గంగా ఉన్న ముస్లిం మతస్తులు 1948 తర్వాత అభద్రతకు గురికావడంతో, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడంతో, జనాభా పొందికలో ఆ మేరకు మార్పులు వచ్చాయి. కుల సమూహాల, సామాజిక వర్గాల స్థానాన్ని అంకెలలో కచ్చితంగా చెప్పగలిగే జనగణన జరగడం లేదు గనుక ఆ విశ్లేషణ స్పష్టంగా చేయడం కుదరదు. కాని కచ్చితంగా హైదరాబాద్‌లో, హైదరాబాద్ రాజ్యంలో 1948కి ముందు, 1956కు ముందు ఉండడానికి అవకాశం లేని కుల సమూహాలు, కేవలం కోస్తాలో, ఉత్తరాంధ్రలో ఉన్న కుల సమూహాలు ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రధాన స్థానాలలో ఉన్నాయి.

అలాగే 1990ల మధ్య నుంచి హైదరాబాద్ ప్రపంచీకరణ ప్రయోగానికి వేదిక కావడంతో లెక్కలేనన్ని విదేశీ సంస్థలు, బహుళజాతి సంస్థలు తమ కార్యాలయాలను ఇక్కడ తెరిచి, వాటిలో ఉద్యోగులుగా ఇతర రాష్ట్రాల నుంచి, ఇతర దేశాలనుంచి కూడ వృత్తి నిపుణులను తీసుకువచ్చాయి. ఆ రకంగా గత పదిహేను సంవత్సరాలలో హైదరాబాద్ జనసంఖ్యలోని వివిధ భాషా, ప్రాంతీయ, సామాజిక వర్గ పొందిక గణనీయంగా మారిపోయింది.

బహుశా ఇరవయోశతాబ్ది తొలి రోజులవరకూ కూడ వ్యవసాయ ప్రధానమైన రాజ్యపు రాజధానీ నగరంగా, పాలక ఉద్యోగులు, మధ్యతరగతి ఉండే నగరంగా, భూస్వాముల విడిదిగా ఉండిన హైదరాబాద్ ఇరవయో శతాబ్ది మధ్య భాగంలో కొన్ని పరిశ్రమలను కూడ సంతరించుకుని కొంతవరకు కార్మికవర్గానికి కూడ నెలవయింది. 1956 నుంచి 1990ల దాకా పెద్ద ఎత్తున పెరిగిన పాలనా వ్యవస్థ వల్ల, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల పరిశ్రమలవల్ల నగర జనాభాలో ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు ఎక్కువ భాగాన్ని ఆక్రమించారు. విద్య, వైద్య, వినోద అవసరాల కోసం నగరానికి వచ్చే జనాభా కూడ పెరిగింది. కాని 1990ల తర్వాత, ప్రపంచీకరణ విధానాలలో భాగంగా పరిశ్రమల స్థానాన్ని సేవరంగం ఆక్రమించడంతో జనసంఖ్యలో నిష్పత్తులు తారుమారయ్యాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్, సినిమా, మీడియా, హోటళ్లు, రియల్ ఎస్టేట్ వంటి ఎంతో కొంత సంఘటితమైన రంగాలు మాత్రమే కాక, అసంఘటిత రంగాలెన్నో పుట్టుకు వచ్చాయి. నగరంలో ఉపాధి అవకాశాలు పెరిగాయి. పెరిగిన అవకాశాల కన్న ఎక్కువగా అవకాశాలు దొరకవచ్చుననే ఆశలు ఒకవైపునా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నం కావడంతో ఉపాధి వెతుకుతూ నగరానికి సాగే వలసలు మరొకపక్కనా నగర జనాభా పొందికను మార్చివేశాయి.

ఈ జనాభా పెరుగుదల సహజంగానే రవాణా సౌకర్యాల మీద ఒత్తిడిని పెంచుతుంది. మారిన హైదరాబాద్‌లో ముఖ్యంగా

చెప్పవలసినది రవాణా సౌకర్యాల్లో మార్పు. ఇటీవలి కాలంలో వాహనాల సంఖ్య విపరీతంగా పెరుగుతున్న నగరాలలో హైదరాబాద్ ఒకటి. హైదరాబాద్ జనాభాతో పోల్చి చూసినప్పుడు వికృతంగానూ అసంబద్ధంగానూ కనబడేంత పెద్ద ఎత్తున వ్యక్తిగత వాహనాల వినియోగం జరుగుతున్నది. మరోవైపు పెరుగుతున్న జనాభాకు తగినట్టుగా రహదారులను, ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేయడం లేదు. మధ్యతరగతి, పేద వర్గాలు వినియోగించే ప్రజారవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడం లేదు సరిగదా, ఉన్న వ్యవస్థను ధ్వంసం చేస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులను, పెరుగుతున్న కాలుష్యాన్ని చూపుతూ ప్రజారవాణా రంగంలో కొత్త మార్పులను తేదలచుకున్నప్పుడు కూడ ప్రజా ప్రయోజనాల కొరకు కాక రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కొరకు, బహుళజాతి సంస్థల లాభాల కొరకు మాత్రమే తెస్తున్నారు. నగరంలోకి తొలి సైకిల్ 1910లో వచ్చిందని, తొలి మోటారు కారు 1924లో వచ్చిందని చరిత్ర చెపుతోంది. 2002 నాటికి రెండు లక్షల కార్లు, పన్నెండు లక్షల ద్విచక్ర వాహనాలు వచ్చి చేరాయి. గడిచిన ఆరు సంవత్సరాలలో ఈ వాహనాల సంఖ్య మరింతగా పెరిగి ఉంటుంది. ఆ నిష్పత్తిలో రహదారులు పెరగలేదు గనుక దశాబ్దాల కింద ఏర్పడిన మౌలిక సౌకర్యాలనే ఈ కొత్త వాహనాలు వినియోగించవలసి వస్తోంది. అందువల్ల పాదచారులకు అవసరమైన ఫుట్‌పాత్‌లను తవ్వేసి, చిరు వ్యాపారుల పొట్టలు కొట్టి రోడ్లను విస్తరిస్తున్నారు. ప్రజారవాణా వ్యవస్థను వదిలేసి వ్యక్తిగత వాహనాల వైపు మళ్లుతున్న మధ్యతరగతిలో ఈ రోడ్ల విధ్వంసకాండ పట్ల సమ్మతి తయారవుతోంది.

ఈ మార్పులన్నిటి ఫలితం మానవ సంబంధాలలో మార్పుల రూపంలో కనిపిస్తోంది. ప్రధానంగా వ్యవసాయ నాగరికతగా, ఇచ్చి పుచ్చుకునే సంబంధాలతో, స్నేహ సౌహార్ద్రాలతో, ఒక ముస్లిం రాజకుమారుడికీ, ఒక గిరిజన యువతికీ మధ్య ప్రేమసంబంధం వారధిగా నిర్మాణమైన హైదరాబాద్ ఇవాళ ఆ వ్యవసాయ, అమాయిక నాగరికతనుంచి చాల దూరం వచ్చేసింది. కాలంలోనూ, స్థలంలోనూ చాల దూరం ప్రయాణం చేసింది. ఇచ్చిపుచ్చుకునే సంబంధాల స్థానంలో సరుకుల సంబంధాలు, ప్రతిదాన్నీ డబ్బుతో, అధికారంతో మాత్రమే కొలిచే సంబంధాలు వచ్చాయి. స్నేహ సౌహార్ద్రాల స్థానంలో ఈర్ష్యా ద్వేషాలు, హింస, అన్యాయం రాజ్యమేలుతున్నాయి. లక్షల రూపాయలు క్షణాల్లో ఖర్చుపెట్టగల విలాస సౌకర్యాలు, విచ్చలవిడిగా ఖర్చు పెట్టగలిగిన పిడికెడు మంది సంపన్నులు ఒకపక్కన ఉండగా, రోజంతా కష్టపడినా వందరూపాయలు కళ్లచూడలేని, రెండు పూటలా తినలేని, కాళ్లు చాపుకుని పడుకునేంత ఆశ్రయంలేని లక్షలాది కుటుంబాలు మరొకపక్కనా ఉన్నాయి. మతాల మధ్య, కులాల మధ్య, భాషల మధ్య, ప్రాంతాల మధ్య, భిన్నాభిప్రాయాల మధ్య ఘర్షణలు తలెత్తడానికి అతి చిన్న కారణాలయినా ఆజ్యంపోసే వాతావరణం నెలకొని ఉంది.

హైదరాబాద్ మారుతున్నది. అతి వేగంగా మారుతున్నది. కాని ఈ మార్పు ఎటు? ఏ వెలుగులకీ ప్రస్థానం? లేదా ఏ చీకట్ల వైపు ఈ పరుగు?

ఉపయోగపడిన పుస్తకాలు :

హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ – ఎ ప్లాన్ ఫర్ సస్టేనబుల్ డెవలప్‌మెంట్ – హైదరాబాద్ 2020 – డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ ఫర్ హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా, 2006.

డా. ఎం.ఎ. నయీం – ది స్ప్లెండర్ ఆఫ్ హైదరాబాద్, జైకో పబ్లిషింగ్ హౌజ్, 1987.

టి. ఉదయవర్లు – నమస్తే హైదరాబాద్, టి.ఎస్.వి. పబ్లికేషన్స్, 1996.

సెన్సస్ ఆఫ్ ఇండియా 1961 – వాల్యూమ్ 11 – ఆంధ్రప్రదేశ్ – పార్ట్ 11 ఎ జనరల్ పాపులేషన్ టేబుల్స్.

సెన్సస్ ఆఫ్ ఇండియా 2001 – సిరీస్ 29 – ఆంధ్రప్రదేశ్ – పేపర్ 2 – రూరల్ – అర్బన్ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ పాపులేషన్.

వీ

తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తూ, గత వైభవాన్ని కోల్పోయి ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతున్న తెలుగు భాష గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు **కె. పుణ్యవతి**

తెలుగు భాష - సంస్కృతి

మన భాష 'దేశ భాషలందు తెలుగులెస్స' అన్న ప్రశంసలను అందుకొంది. మన భాష అజంత భాష. అంటే మన భాషలోని ప్రతిపదం అచ్చుతో అంతమవుతుంది. దీనివలన వినడానికి సొంపుగా ఉంటుంది. అయితే, మన తెలుగు భాష క్రమక్రమంగా తన పూర్వ వైభవాన్ని కోల్పోతోంది. కనమరుగవుతున్న మనభాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకొని, భావితరాలవారికి అందించడం మనందరి కనీసవిధి. ఇందుకోసం యావత్తు తెలుగుజాతి, ప్రభుత్వం సమాయత్తం కావాలి.

నిజానికి భాష, సంస్కృతులు విడదీయరానివి. ఒకటి లేక మరొకటి లేదు. అందువల్లనే ఒక జాతికి, ఆ జాతి వ్యవహరించే భాషకు, ఆ జాతి పరివ్యాప్తమై ఉన్న ప్రాంతానికి సాధారణంగా ఒకే పేరుంటుంది. ఉదాహరణకు అరవలు, అరవ భాష, అరవదేశం; కన్నడిగులు, కన్నడ దేశం. కాని అతి విచిత్రంగా మన భాష తెలుగు, మనం ఆంధ్రులం, మనదేశం ఆంధ్రప్రదేశ్. ఇవి చాలవన్నట్లుగా, పండితులు వ్యవహారంలో మన భాషకు గల పేరు తెనుగు. ఇది ఒక గొప్పతనం లేదా ప్రత్యేకత అనుకుంటే ఇలా తెలుగు – తెనుగు – ఆంధ్రము అనే మూడు పేర్లు మన భాషకు మాత్రమే ఉన్నాయి. ఈ ప్రత్యేకత ఎలా సంభవించిందో ముందు తెలుసుకొని తరువాత మిగతా విషయాలు తెలుసుకుందాం.

ఆంధ్రులు అనే జాతి నిజానికి ఉత్తర భారతదేశానికి అందులోనూ కాశీ చుట్టు పక్కల ప్రాంతాలకు చెందింది. వీరు బౌద్ధాన్ని అనుసరించారు. రాజకీయ పరిణామాల కారణంగా, ఆంధ్రులు, కళింగులు దక్షిణాదికి తరలివచ్చారు. ఇది జరిగింది క్రీస్తుపూర్వం నాలుగు ఐదు శతాబ్దాల్లో. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసింది అశోకుని కళింగ యుద్ధం. వారితో వారి మతం, భాషలు వచ్చాయి. అలా వచ్చినవారు ఇక్కడ అంటే – నేటి ఆంధ్రప్రదేశ్‌లో తీర ప్రాంతాన్ని తమ నివాస ప్రాంతం చేసుకున్నారు. దీనినే శివస్కంధ వర్మ అనే పల్లవరాజు తన మైదానవోలు శాసనంలో 'ఆంధ్ర' ప్రప్రథమంగా పేర్కొన్నాడు. క్రీస్తుపూర్వపు శతాబ్దాల్లో ఈ తీర ప్రాంతాన్ని శాతవాహనులు కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళం తొలి రాజధానిగా, అమరావతి మలి రాజధానిగా పాలించారు. బ్రహ్మాండపురాణం ఆంధ్రదేశపు సరిహద్దులను ఈ కింది విధంగా పేర్కొంది. ఉత్తరాన, నేటి శ్రీకాకుళం జిల్లాలో గల మహేంద్రగిరి నుండి ఒక రేఖను, కరీంనగర్ జిల్లాలోని భీమ కాళేశానికి పొడిగించి, దానిని శ్రీశైలంతో కలిపి, అక్కడి నుండి సముద్రానికి కలిపితే, ఆ హద్దుల మధ్య సముద్రం హద్దుగా గల భూభాగం ఆంధ్ర దేశం. ఈ భూభాగంలోనే బౌద్ధచైత్యాల శిథిలాలు కన్పించడాన్ని బట్టి పై నిర్వచనానికి ప్రామాణికత లభిస్తుంది.

క్రీస్తు శకం నాలుగు ఐదు శతాబ్దాల్లో చాళుక్యులు తెలంగాణ నుండి తీరానికి వచ్చి వేంగిదేశాన్ని పాలించారు. వారి మతం జైనం, వారి భాష తెలుగు. వారి నిజనివాస ప్రాంతం తెలంగాణం. తెలంగాణ వారు గనుక వారు తెనగాణ్యులు. వారి భాష తెలుగు.

తెలంగాణ బ్రాహ్మణులు, తెలగ అనే సామాజిక వర్గపు జనులు, తెలుగు ఇంటిపేరుగా గల వారు నేడు కూడా ఉన్నారు. చాళుక్యుల పాలన క్రీస్తుశకం పదవ శతాబ్దం వరకూ సాగింది. ఆరు, ఏడు వందల సంవత్సరాల సుదీర్ఘకాలంలో తీర ప్రాంతంలోని ఆంధ్రులు, తెలంగాణం నుండి వచ్చిన తెలుగులు సహజీవనం చేయడంతో, ప్రజానీకంలో వారిరువురి భాషలు కలిసిపోయి ఒకే ఒక మిశ్రమ భాషా వ్యవహారం వ్యాప్తిలోకి వచ్చింది. బౌద్ధమత గ్రంథాలు ఆంధ్రలోనూ, జైనమత గ్రంథాలు తెలుగులోనూ ఉండటం వల్ల ఆ రెండు భాషలూ ఆ రెండు మతాలకు ప్రతీకలైనాయి. బౌద్ధ, జైనమతాల ఘర్షణలు తెలిసినవే. దాని నుండి సమాజాన్ని విముక్తం చేయడానికి ఏకైక మార్గం భారతాద్వైతంగా భావించి చాళుక్య ప్రభువు రాజరాజు నన్నయకు భారతాన్ని నాటి ప్రజా వ్యవహార భాషలో రచింపవలసిందిగా కోరాడు. నన్నయ తెలుగు జైనాన్ని, ఆంధ్రము బౌద్ధాన్ని స్ఫురింపజేస్తున్న కారణంగా, తను ఆనాడు వ్యవహారంలో గల ఆ రెంటి మిశ్రమ వ్యవహారానికి 'తెనుగు' అనే పేరుంచి భారత రచన చేశాడు. అంటే – భారత భాష తెనుగు. నేటి మన తెనుగు, మనం తెనుగువారం. మనదేశం తెనుగుదేశం అయితే కాలాంతరంలో ఆంధ్రము, తెలుగు, తెనుగు ఒకదానికొకటి పర్యాయపదాలైనాయి. భాషకు గల పేర్ల పరంగా మన ప్రత్యేకత తెలిస్తోంది.

ఇక మన భాషకు గల ప్రత్యేకతలు తెలుసుకుందాం. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అనే మాట తెలిసిందే. పాశ్చాత్య భాషల్లో ఇటాలియన్ భాష కర్ణపేయంగా ఉంటుంది. అలాంటి లక్షణం గలదు గనుక, (ప్రాచ్య తూర్పు) భాషల్లో మన భాష ఇటాలియన్ భాష వంటిది అని పాశ్చాత్యులు చెప్పడం జరిగింది. ఇక మనమాటే అయిన 'దేశభాషలందు తెలుగు లెస్స' అనేది తెలిసిందే. ఈ మాట కృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యదలో రచింపమంటూ, తెలుగులోనే ఎందుకంటే, ఇది

తెలుగుదేశం, నేను తెలుగువల్లభుడ్ని, తెలుగు కందగల భాష, ఎంతోమంది సామంతులు నీ కొలువుకూటంలో మాట్లాడుతూ ఉంటారు గదా, ఈయనకు తెలియలేదా దేశ భాషలందు తెలుగు ఒపైనది అని అన్నాడని, కృష్ణదేవరాయలు చెప్పడం జరిగింది. రాయలు ఇలా చెప్పడంలో రాజకీయం ఉంది. ఇంతకూ 'దేశభాషలందు తెలుగు లెస్స' అనే పదబంధం శ్రీకృష్ణదేవరాయల స్వాకపోల కల్పితం కాదు. అంతకు సుమారు రెండు వందల సంవత్సరాలకు పూర్వం వినుకొండ వల్లభరాయుడు తన క్రీడాభిరామంలో ఆపదబంధాన్ని ప్రయుక్తం చేశాడు. ఆయనకు ఆ స్ఫూర్తినిచ్చింది కేతన. ఆయనకు స్ఫూర్తినిచ్చింది నన్నయ్య. ఇదీ ఆ పదబంధం వెనుకగల కథాకమామిషు. ఏమైనా తెలుగు భాషలందు తెలుగులెస్స అనేది యదార్థం. కన్నడంలో ఒక మాట ఉంది. అది కన్నడ కస్తూరి, తెనుంగు తేటె, అరమద్యాన్నమే అనేది.

మన భాషకు ఈ ప్రశస్తి ఎలా వచ్చింది? సంస్కృతాన్ని బాగా ఇముడ్చుకునేది అనేది సాధారణంగా చెప్పుకునే మాట. ఆ మాట కొస్తే నిజానికి భారతీయ భాషలన్నీ సంస్కృతాన్ని ఇముడ్చుకున్నవే కదా. చివరకు తమది స్వతంత్ర భాష, సంస్కృత ప్రభావానికి దూరంగా ఉన్నదని చెప్పుకునే అరవల భాషపై కూడా సంస్కృత ప్రభావం లేని స్వతంత్ర భాష కానేకాదు. ప్రాకృతాలను, వైదిక సంస్కృత (ఇది స్వతంత్ర భాష) భాష సాయంతో పండితులు తమ ఉపయోగం కోసం వ్యవస్థీకరించుకున్న భాష. అన్ని ప్రాకృతాలు అందులో ప్రతిఫలిస్తాయి. అందువల్ల అది తల్లిభాషగా దర్శనమిస్తుంది. అంతే! కనుక ఇముడ్చుకోవడం వల్ల మన భాషకు ప్రాశస్త్యం అబ్బలేదు. మిగతా భారతీయ భాషలన్నింటికంటే కడకు సంస్కృతం కంటే కూడా లిపి సంకేతాలు ఎక్కువగా గల భాష మనది.

ఏ భాషలోనైనా ధ్వని సంకేతాలు లిపి సంకేతాల కంటే అధికంగా ఉంటాయి. అంటే ఒక భాషలోని ధ్వనులన్నింటికీ లిపి సంకేతాలుండవు. సాధ్యమైనవన్ని ఎక్కువ లిపి సంకేతాలు కలది మన భాష. చ, జ ల లోని దంత్యతాలవ్య భేదాలకు, సాధారణ రేఫకు శకటరేఫకు విడివిడిగా మనకు లిపి సంకేతాలున్నాయి. అందువల్ల స్పష్టమైన ఉచ్చారణ, దానికి సంబంధించిన బోధన సుకరమవుతోంది. ధ్వనులకు నియమితమైన ఉచ్చారణ మనం మాత్రమే పలుకగలం. ఉత్తరాదిన 'య' కారాన్ని 'జ' కారంగా, 'ఆ' కారాన్ని 'ఒ' కారంగా (కొన్ని ప్రాంతాల్లో) ఉచ్చరిస్తారు. మనకా బాధ లేదు. తమిళులకు, గ, జ, డ, ద, బ లకు సంబంధించిన లిపి సంకేతాలు లేవు. దానివల్ల ఉచ్చారణలో మార్పు కలుగుతుంది. మనకి ఇబ్బంది లేదు. అలాగే 'ష' కారం బదులు వారు శ్రీకారం పలుకుతారు. ఉత్తరాదిలో కూడా కొన్నిచోట్ల అలాగే ఉంటుంది. కాని ఉచ్చారణ విషయంలో సాధ్యమైనంత నిర్దుష్టత్వం గలది మన భాష.

మన భాష అజంత భాష, అంటే మన భాషలోని ప్రతి పదం అచ్చుతో అంతమవుతుంది. దీని వల్ల వినడానికి సొంపుగా ఉంటుంది. ఈ కారణంగానే మన భాష, ఇతర భాషలతో పోల్చి చూసినపుడు సంగీతానికి బాగా అనువుగా భావింపబడింది. హిందుస్థానీ బాణీకంటే కర్ణాటక సంగీత బాణీ శ్రవణప్రాయంగా ఉండటానికి కారణమిదే. కర్ణాటక సంగీత బాణీ అంటే తెలుగుబాణీయే. రాజశేఖరుడు తన కావ్య మీమాంసలో ఈ భాష వ్యవహారాలు మాటకు ముందు దీర్ఘం తీస్తూ పలుకుతారని చెప్పాడు. దీనిని ఆమ్రేడించాడు క్రీడాభిరామికర్త వినుకొండ వల్లభరాయుడు.

వ్యాస శ్రీ మహాభారతం దాదాపుగా అన్ని భారతీయ భాషల లోనికి అనూదితమైంది. కాని మనభాషలో కవిత్రయం వారు తీర్చిదిద్దినట్లుగా మరే భాషలోను రాలేదని విజ్ఞులు అంగీకరించిన మాట. అలాగే భాగవతం పోతనకు పోతనయేసాటి, జగన్నాథ పండితరాయలు, మల్లినాతసూర్తి, విద్యానాథుడు, కాటయవేమయుడు, నారాయణ తీర్థులు చేసిన సాహిత్యమే నిరుపమానం. సిద్ధేంద్ర యోగిది మరో ప్రత్యేక మార్గం.

వేదపఠనంలో ఆంధ్రులకు సాటిరాగల వారు భారతదేశంలో మరెవరూ లేరు. దానికి కారణం మనవారు స్పష్టమైన ఉచ్చారణ. శిల్ప విషయంలో జక్కనకు సాటి మరెవరున్నారు? మన ప్రసిద్ధ దేవాలయాలన్ని మన ప్రాచీన స్థపతుల ప్రావీణ్యానికి నిదర్శనాలు. వేమన పద్యాలు, బ్రహ్మంగారి తత్వాలు, యాగంటి వచనాలు, రామదాసు కీర్తనలు జనజీవనంపై ఎంతో ప్రభావాన్ని చూపాయి.

మన సంప్రదాయాకమైన పెళ్లిళ్లు, ముత్తైదువుల పాటలు, గొబ్బిపాటలు, మంగళారతులు, తలంటిపాటలు, వసంతోత్సవ వేడుకలు, కలుపు పాటలు, ఏతం పాటలు, చెక్కభజనలు, కోలాటాలు, తుమ్మెద పాటలు, గ్రామదేవతల జాతరలు, బుర్రకథలు, హరికథలు, తోలుబొమ్మ లాటలు, చుట్టబొమ్మలు ఇలాంటివెన్నో మన సంస్కృతికి నిదర్శనాలు. ఇందులో నేడు కొన్ని కనుమరుగైపోతున్నాయి. గంగిరెద్దులు, బుడ బుక్కలు, కాటికాపల వాండ్లు, మేదరి గడసాని విన్యాసాలు కాల క్రమంలో కనుమరుగైపోతున్నాయి. ఇవన్నీ ఒకనాటి సమాజానికి సాముదాయ కంగా కాలక్షేప రూపంలో వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించాయి. సాధారణ జీవన విధానానికి పరిపూర్ణతను సిద్ధింపజేశాయి.

తెలుగుజాతి ప్రస్తావన క్రీస్తుపూర్వం 6వ శతాబ్ది నాటి ఐతరేయ బ్రాహ్మణంలో మనకు కనిపిస్తుంది. బుద్ధుని ఆవిర్భావం కూడా క్రీస్తుపూర్వం 6వ శతాబ్దమే. బుద్ధుడు జీవించిన కాలంలోనే తెలుగుదేశానికి ఆయన సందేశం వచ్చిందనేది చరిత్ర.

భాష ముఖ్యోద్దేశం కేవలం భావప్రకటన మాత్రమే కాదు. భావ ప్రకటనకు భాషే అక్కరలేదు. అన్ని ప్రాణులు తమ భావాలను తమదైన భాషలో ప్రకటించుకోవడం జరుగుతుంది. అర్థం చేసుకోగలిగితే కనుసైగ చాలు. అదీ భాషే. భాష ముఖ్యోద్దేశం రసానుభూతి కల్గించడం. ఏ విషయంనైనా స్పష్టమైన రీతిలో, వ్యక్తపరచినట్లయితే దానిని అర్థం చేసుకోవడం జరుగుతుంది. భాష ముందు పుట్టిందా? వ్యాకరణం ముందు పుట్టిందా? వ్యాకరణం తెలియకుండా భాష మాట్లాడలేమా? ప్రతి మనిషికి వ్యాకరణం తెలియాలా? తమ భావాలను అర్థమయ్యే భాషలో పెట్టగలిగే నేర్పు వస్తే వ్యాకరణం తెలియకున్నా ఫర్వాలేదు. భావాలను స్పష్టపరచవచ్చు. భాష మన మస్తిష్కం నుండి బయలుదేరి శరీర అవయవాల ద్వారా వ్యక్తీకరించబడుతుంది.

ఈ విధంగా తెలుగు భాషా, సంస్కృతి సంప్రదాయాలు మానవునికి ఒక క్రమబద్ధమైన జీవనశైలిని అలవర్చుకునేటట్లు చేస్తున్నాయి. వి

పాలకవర్గాల అర్థశాస్త్రాన్ని బోధించేటప్పుడు కూడ విద్యార్థులలో ప్రత్యామ్నాయ ఆలోచనలకు బీజాలు ఎట్లా నాటవచ్చునో వివరిస్తున్నారు **మైఖేల్ మీరొపోల్**

అర్థశాస్త్ర బోధన - అవసరమైన అంశాలు

చాలా విశ్వవిద్యాలయాల అర్థశాస్త్ర శాఖల్లో 'అర్థశాస్త్ర మౌలిక సూత్రాలు' అనే పాఠ్యాంశం ఒకటి ఉంటుంది. 'యూనియన్ ఫర్ రాడికల్, పొలిటికల్ ఎకానమిస్ట్స్' లో సభ్యులమైన మావంటి విప్లవ అర్థ శాస్త్రవేత్తలకు ఈ పాఠ్యాంశం బోధించడం చాలా ముఖ్యమైన విషయం. అమెరికాలో ఉన్న స్థితిగతులు అలా ఎందుకు ఉన్నాయో 'అవగాహన' కలిగించి, సాధారణ పౌరుల మనసులను మసకబార్చడంలో ఈ పాఠ్యాంశం పాత్ర చాలా ఎక్కువ. ఇక్కడ అవగాహన అనే మాటను నేను ఎందుకు ప్రత్యేకంగా సూచించానంటే ఆ పాఠ్యాంశంలో ఉన్న అస్పష్టత, యాంత్రికత విద్యార్థులకు అవగాహన కల్పించవు సరికదా, ఇదంతా తమ మొద్దుబుర్రలకు అందని చిక్కు వ్యవహారమని వాళ్లు అనుకునేలా చేస్తాయి. మొత్తానికి అర్థమయినా, కాకపోయినా కూడా ఈ పాఠ్యాంశం వల్ల జరిగేదేమంటే మనం ఏ వ్యవస్థలో జీవిస్తున్నామో ఆ వ్యవస్థలోని ఘర్షణలను, ప్రతికూల అంశాలను మనకు కనబడకుండా చేయడమే ఆ పాఠ్యాంశాల పని. విప్లవ అర్థశాస్త్రవేత్తలుగా ఆ పాఠాలు బోధించేటపుడు మనం చేయగలపని ఆ మోసాన్ని ఎదుర్కోవడమే. అప్పటికే విద్యార్థులు పదహారు సంవత్సరాలపాటు తప్పుడు విద్య చదువుకుని వచ్చారు గనుక మన ప్రయత్నం ఒక బాల్చీలో నీటి బిందువులానే అనిపించవచ్చు. కానీ మనం గుర్తించవలసింది ఏమంటే ప్రతి అనుమాన విత్తనం నాటవలసిందే. నిజమయిన ప్రశ్నల విత్తనాలను నాటవలసిందే. ప్రతిదాని గురించీ విమర్శనాత్మకంగా ఆలోచించాలనే ధోరణిని, మేధోపరమైన కుతూహలాన్ని, అంటే నిజమైన విద్య విత్తనాన్ని నాటవలసిందే. ఈ విత్తనాలు నాటే పనిలో మనం ఒంటరులం కాదు. ఆ విద్యార్థుల జీవితాల్లో గతంలోనూ భవిష్యత్తులోనూ కూడా ఇటువంటి విత్తనాలు నాటే ఇతర ఉపాధ్యాయులు ఉంటారు. వ్యవస్థలోని అంతర్గత ఘర్షణలు ఒక కల్లోలానికి దారితీసినపుడు మనం నాటిన విత్తనాలన్నీ మొలకెత్తి పుష్పిస్తాయి. అమెరికా చరిత్రలో 1960ల్లో అలా జరిగింది. ఘటనలూ, ధోరణులూ ఒక్కుమ్మడిగా సమూహాలను కదలబార్చేలోగా మనం అతి జాగ్రత్తగా ఒక్కరినీ, ఇద్దరినీ ప్రయత్నిస్తూ, కదిలిస్తూ ఉండవలసిందే. నవ్య సంప్రదాయ అర్థశాస్త్ర పాఠం చెప్పేటపుడు దాని సమర్థకులనూ, దానిలోని అబద్ధాలనూ మొదటినుంచీ ఖండిస్తూపోవడం ద్వారానే నేను నా మేధో వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటాను. సూత్రబద్ధమైన విప్లవపాత్ర పోషిస్తాను. అదే సమయంలో నవ్య సంప్రదాయ పద్ధతిలోని అర్థశాస్త్ర సూత్రాల పాఠ్యాంశాలను బోధించడంలో వెనకడుగు వేయకపోవడం కూడా ముఖ్యమని నేను అనుకుంటాను. ఒక ఆదర్శవంతమైన విద్యావ్యవస్థలో విద్యార్థుల మెదళ్లమీద ఈ చెత్త బరువు మోపనక్కరలేదు. కానీ, ఆ సమయం వచ్చేవరకూ మనం ఆ పాఠ్యాంశాలు చెప్పబోమని భీష్మించుకోవడం భేషజం, మూర్ఖత్వం అవుతుంది. రాజకీయార్థ శాస్త్ర ప్రథమ సూత్రాల పాఠాలు చెప్పడంలో మనను మనం ఒంటరులను చేసుకొని, తప్పుడు అర్థశాస్త్ర సూత్రాలు చదివేందుకు విద్యార్థులను వదిలేయకూడదు. ఇప్పటికే ఆ విద్యార్థులు ఇటువంటి ఎన్నో పాఠ్యాంశాలలో పెట్టుబడిదారీ అనుకూల భావజాలాన్ని తమలో నింపుకుని ఉన్నారు. మరొక సంవత్సరం కూడా వారికి అవే బోధనలను విమర్శలేకుండా చెప్పినట్లయితే వాళ్ల మెదళ్లలో మకిలి మరింత పేరుకుపోతుంది. దానికి బదులుగా ఆ పాఠాలు మనం బోధిస్తూ వాటిని విమర్శించడం మంచి పద్ధతి.

నవ్య సంప్రదాయ సమర్థకులు పాఠ్య పుస్తకంలో చెప్పిన దానికి సమాంతరంగా, ప్రత్యామ్నాయంగా మొదటి నుంచీ నేను ఎలా బోధిస్తున్నానో ఈ వ్యాసం క్లుప్తంగా తెలియజేస్తుంది. నేను బోధించే కళాశాల ప్రధానంగా మధ్యతరగతికి చెందినది. నాలుగు సంవత్సరాల పాటు సాగే కోర్సులో విద్యార్థులలో ఎక్కువమంది తమ బోధనాంశాలలో భాగంగా ఈ అర్థశాస్త్ర సూత్రాలు ఎంచుకుంటారు. అక్కడ మిల్టన్ స్పెన్సర్ రాసిన 'కాంటెంపరరీ ఎకనమిక్స్' అనే ఒక్క పుస్తకం మీద ఆధారపడి మాత్రమే బోధన జరుగుతుంది. నేను కింద ఇచ్చే ఉదాహరణల్లో ఎక్కువ భాగం ఆ పుస్తకం లోనివే. మరి కొంత సమాచారం మాత్రం ఇతర పుస్తకాల్లోంచి కూడా తీసుకున్నాను.

పుస్తకాన్ని ప్రతిఘటించడం

ఒక కళాశాల పాఠ్యాంశాలలో ఉన్న పాఠ్య పుస్తకంతో విభేదిస్తూ చెప్పడం అనేది దానికదిగానే ఒక ప్రత్యేకమైన విలువ. అటువంటి విభేదం వలన విద్యార్థులకు సొంతంగా ఆలోచించడం తెలుస్తుంది. పుస్తకం ఒక రకంగా చెప్పి, మీరు మరొక రకంగా చెపుతున్నందువల్ల విద్యార్థులకు మీ భావాలను ఎదిరించాలా, సమర్థించాలా తెలియని స్థితి వస్తుంది. అంటే వాళ్లకు తమంతట తాము ఆలోచించక తప్పని స్థితి వస్తుంది. మనం చెప్పే దానిమీద మనకు పూర్తి విశ్వాసం ఉన్నట్లయితే మనం విద్యార్థులను ఇందుకు ప్రోత్సహించాలి. అటు సంప్రదాయిక పుస్తకంలో ఉన్న అభిప్రాయాలనూ, ఇటు మనకున్న అభిప్రాయాలనూ మనం నిజాయితీగా విద్యార్థుల ముందుంచాలి.

అసలు బోధన ప్రారంభించడానికి ముందే చేయవలసిన ముఖ్యమైన పని ఒకటి ఉంది. ఈ పాఠ్యపుస్తకం ఒక సంప్రదాయానికి చెందినదనీ, దానిమీద చాలా లోతయిన, నిరంతరాయమైన సవాళ్లు ఉన్నాయనీ విద్యార్థులకు చెప్పాలి. అసలు అర్థశాస్త్రపు పరిధినీ, పద్ధతినీ నిర్వచించడంలోనే మొట్టమొదటి విభేదం ఉన్నదని మొదలుపెట్టాలి. 'సమాజంలో ప్రత్యామ్నాయ ఉపయోగాలు ఉన్న పరిమిత వనరులతో ప్రస్తుత, భవిష్యత్ వినియోగానికి అవసరమయిన వస్తువులనూ, సేవలనూ ఉత్పత్తి చేయడానికి సమాజం ఏ పద్ధతి ఎంచుకుంటుందనే సమస్యను అధ్యయనం చేసే సామాజిక శాస్త్రమే అర్థశాస్త్రం' అని పాఠ్యపుస్తకం చెబుతుంది.

ఈ నిర్వచనానికి నేను 'శుద్ధ అర్థశాస్త్రం' అని పేరు పెట్టాను. అర్థశాస్త్రం గురించిన ఈ భావనను నేను వెంటనే మరొక విశాల భావనతో – రాజకీయార్థిక శాస్త్రం అనే భావనతో – ఎదుర్కొన్నాను. నా ప్రతిఘటన పాఠ్య పుస్తకంలోని నిర్వచనంలో ఒక కీలక పదం దగ్గర మొదలుపెట్టాను. ఆ కీలక పదం 'సమాజం'. సమాజం తీసుకునే అన్ని నిర్ణయాలనూ పరిశోధించడానికి వివరించవలసిన అన్ని అంశాలనూ సూచించాను. పాఠ్య పుస్తకపు ఆర్థిక విశ్లేషణ ఒక సంస్థాగత చట్రం. అది సంప్రదాయం కానీ, అధికారం కానీ, లేదా మార్కెట్ కానీ అప్పటికే ఉన్నాయనీ, వాటిని ప్రశ్నించలేమనీ, ప్రభుత్వ విధానాలు కూడా అంతే స్థిరమైనవనీ చెబుతుంది. కానీ రాజకీయార్థ శాస్త్రం మాత్రం ప్రభుత్వ విధానాలూ, ఇతర సంస్థాగత ఆలోచనలూ అన్నీ కూడా విశ్లేషణలో భాగం కావలసినదే అంటుంది.

ఇక అర్థశాస్త్ర పద్ధతి ఏమిటనేది : అమూర్త సూత్రాల నుంచి తార్కిక చర్చ జరిపి సిద్ధాంతాలు నిర్మించడమే 'శాస్త్రీయ పద్ధతి' అని పుస్తకం ప్రారంభంలోనే పైపైన వివరిస్తారు. దీనికి తోడుగా నేను ఈ పద్ధతిలో అమూర్తీకరణ పాత్ర గురించి క్రమబద్ధమైన విశ్లేషణ జరిపి అర్థశాస్త్రానికీ, రాజకీయ అర్థశాస్త్రానికీ భావనాత్మకంగా ఉన్న విభేదం ఏమిటో చెబుతాను. నల్లబల్ల మీద ఒక పెద్ద చతురస్రం గీసి, అది మొత్తం వాస్తవికత అయితే ఆ మొత్తం వాస్తవికతలోంచి కొన్ని భాగాలను వేరు చేసి, అంటే ఆ చతురస్రంలో ఒక చిన్న వృత్తం గీసి చూసే పద్ధతి అమూర్తీకరణ అనీ అలా చేయడం ద్వారా వాస్తవికతను జాగ్రత్తగా అధ్యయనం చేసి వాటి పరస్పర సంబంధాలను అర్థం చేసుకోవచ్చుననీ చెబుతాను. మన అమూర్తీకరణ సక్రమంగా ఉన్నట్లయితే మొత్తం వాస్తవికత గురించి మనం అర్థవంతమైన విషయాలు నేర్చుకోగలుగుతాము. అయితే, సరిగ్గా అమూర్తీకరించడం అనేది చాలా కష్టతరమైన, సందిగ్ధమైన క్రమం. అర్థశాస్త్ర అధ్యయనంలో సాగిన చాలా వివాదాలకు మూలం ఏ రకమైన అమూర్తీకరణలు సరైనవి, ఏవి కావు అనేదే. విశాలమైన చతురస్రంలోంచి అర్థశాస్త్రమేమో ఒక చిన్న వృత్తపు వాస్తవాన్నే వేరుచేసి చూస్తుంది. కానీ రాజకీయ అర్థశాస్త్రం విశాలమైన వాస్తవపు ముక్కను – శుద్ధ అర్థశాస్త్రం వేరుచేసిన దానితో సహా కలిపి – చూస్తుంది. అంటే రాజకీయ ప్రవర్తన, సామాజిక వైఖరులు వంటి వాటిని కేవలం గుర్తించడం కాదు, వివరించగలగాలి. ఇలా విశ్లేషించడం చాలా క్లిష్టమైనదనీ, అంత కచ్చితమైనది కాదనీ నాకు తెలుసు. కానీ ఆర్థిక శాస్త్ర సిద్ధాంతానికీ, వాస్తవికతకూ ఏమీ సంబంధం లేదని విద్యార్థులు అనుకోకుండా ఉండేందుకు ఇలా చెప్పక తప్పదు. మరొక పక్క శుద్ధ అర్థశాస్త్ర విశ్లేషణ అనేది మాత్రం చాలా సులభంగా ఉన్నట్టు కనబడుతుంది.

ఉత్పత్తి కారకాలు

సాధారణంగా పాఠ్యపుస్తకాలు ఉత్పత్తి కారకాలను పరిచయం చేసేటప్పుడు అవి శాశ్వత 'శక్తులు' అనీ, అన్ని ఆర్థిక వ్యవస్థలలోనూ అవి ఉంటాయన్నట్టుగానూ చెపుతాయి. ఇలా చేయడం ద్వారా ఆర్థిక వాస్తవికతను రాజకీయ వాస్తవికత నుంచి, సామాజిక వాస్తవికత నుంచి వేరు చేసి చూపాలనే కోరిక నెరవేరుతుంది. శ్రమ అనేదాన్ని ఉత్పత్తి లక్ష్యంగా సాగే మానవ ప్రయత్నంగా నిర్వచిస్తారు. భూమి అంటే, భూసారంతో సహా సహజవనరులన్నిటినీ సూచిస్తారు. పెట్టుబడిని మాత్రం 'తదనంతర ఉత్పత్తి కోసం ఉత్పత్తి అయ్యే సాధనం' అని జాగ్రత్తగా నిర్వచిస్తారు. సమీకరించే లేదా నాయకత్వం వహించే ఉత్పత్తి కారకాన్ని నిర్వహణా సామర్థ్యం అని పిలుస్తారు. ప్రత్యామ్నాయ విశ్లేషణగా సాగే రాజకీయార్థిక శాస్త్ర దృక్పథం ఈ ఉత్పత్తి కారకాలలోకి రక్త మాంసాలను ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తుంది. ఉత్పత్తి జరిగేచోట పరస్పర సంబంధంలోకి వచ్చే మనుషుల మధ్య ఎటువంటి అధికార సంబంధాలు పని చేస్తున్నాయో చూడడానికి ప్రయత్నిస్తుంది. నేను ఈ పాఠం చెప్పేటప్పుడు 'మరి డబ్బు సంగతి ఏమిటి?' అని మొదలు పెడతాను. 'చాలా తరచుగా వ్యాపారవేత్తలు డబ్బులను సూచించడానికి పెట్టుబడి అనే మాట వాడుతుంటారు. అంటే వ్యాపారంలో మదుపుపెట్టిన నిధులుగాని, భారీ యంత్రసామాగ్రిని కొనడానికి అవసరమైన డబ్బును గాని వాళ్లు ఇలా సూచిస్తారు. కానీ, డబ్బు దానికదిగా ఉత్పాదకవనరు కాదు గనుక దాన్ని పెట్టుబడితో సమానమైన ఉత్పత్తి కారకంగా చూడలేం' అని పాఠ్యపుస్తకం చెబుతుంది. ఇది చదివి చాలామంది విద్యార్థులు ఆశ్చర్యపోతారు. సాధారణంగా వెంటనే వెలువడే ప్రశ్న మరి డబ్బులేకుండా అసలు ఉత్పత్తి అనేది జరగదు కదా అని. డబ్బు దానంతట అది ఏమీ ఉత్పత్తి చేయలేదనీ, నాగలి నడవడానికి ఇంధనమో, ట్రాక్టరో కావలసిందేననీ అలా ఇతర ఉత్పత్తి క్రమాలలో కూడా డబ్బువల్ల పనులు జరగవని గుర్తించి పుస్తకంలో రాసినదాన్ని ఒప్పుకుంటాం. పుస్తకంలో ఉత్పత్తికి ఉపయోగపడే అతి సాధారణ శక్తులను చూపే దిశలో మాత్రమే ఉత్పత్తి కారకాల విశ్లేషణ సాగిందని అర్థం చేసుకుంటాం. ఆ అర్థంలో చూసినపుడు డబ్బు అనేది పుస్తకం నిర్వచించిన తక్షణ ఉత్పత్తి కారకాలలోకి రాదన్నమాట నిజమే. కాని రాజకీయార్థిక శాస్త్ర దృక్పథం సంస్థాగత నిర్మాణ చట్రాల గురించి నిర్దిష్టంగా మాట్లాడుతుంది గనుక డబ్బు ప్రాధాన్యతను గుర్తిస్తుంది. అర్థశాస్త్రం అంటే 'పరిమిత వనరులను ఎక్కడెక్కడ వాడాలో సమాజం నిర్ణయించుకోవడం' అనే నిర్వచనం ఇది వరకే చూసి ఉన్నాం. ఆ నిర్ణయం ఏయే సంస్థలలో ఎలా వెలువడుతుందీ అని ఆలోచించినపుడు నిర్వాహకుల శక్తి అంతా డబ్బులోనే ఉంది. నిర్వాహకులు ఇతర ఉత్పత్తి కారకాలను సమీకరించే పాత్ర వహిస్తున్నపుడు వాళ్లకు ఆ అధికారాన్ని ఇచ్చేది డబ్బే. ఏ ఉత్పత్తి స్థలంలోనైనా మనుషులు ఉత్పత్తి కారకాలను వినియోగిస్తారు. వారు ఆ పనిని నేరుగా తమ శ్రమ ద్వారానైనా చేయవచ్చు, లేదా తాము నడిపే యంత్రాల ద్వారా, తాము పని చేసే భూమి ద్వారా పరోక్షంగానైనా చేయవచ్చు. మరి ఈ రకంగా ఉత్పత్తి

కారకాలను సమకూర్చే మనుషుల మీద అధికారాన్ని చెలాయించ గలిగినది డబ్బు ఉన్నవాడే. అందువల్ల డబ్బు కూడా ఒక ఉత్పత్తి కారకం కావాలని విద్యార్థులు అనుకుంటారు. ఎందుకంటే మన వ్యవస్థలో పెట్టుబడి అనేది డబ్బు రూపంలో మాత్రమే ఆర్థిక వ్యవస్థను నిర్దేశిస్తుంది. మన వ్యవస్థను పెట్టుబడిదారీ విధానం అనేది అందుకే అని నేను విద్యార్థులకు చెపుతాను. ఈ శుద్ధ అర్థశాస్త్ర వైఖరి పెట్టుబడిని కూడా శాశ్వత ఉత్పత్తి కారకాలతో సమాన ప్రతిపత్తితో చూసి ఆ ఉత్పత్తి కారకాలన్నీ అన్ని ఆర్థిక వ్యవస్థలలోనూ ఉంటాయని చెపుతుంది.

ఈ పాఠ్య పుస్తకం పెట్టుబడిదారీ విధానాన్ని నిర్వచించేటపుడు ఒక రాజకీయ అర్థశాస్త్రవేత్త ఆమోదించగల నిర్వచనాన్నే ఇచ్చిందనేది నిజమే. 'పెట్టుబడిదారీ విధానమంటే భూమి, కార్ఖానాలు, రైల్వే మార్గాలు వగైరా ఉత్పత్తి, పంపిణీ సాధనాల మీద వ్యక్తిగత ఆస్తిహక్కు ఉండే ఆర్థిక నిర్వహణ పద్ధతి. ఆ ఉత్పత్తి సాధనాలను ప్రధానంగా పోటీ పరిస్థితుల కింద లాభం కోసం నడిపే పద్ధతి.'

ఈ నిర్వచనంతో పేచీ లేకపోయినప్పటికీ ఈ నిర్వచనం నుంచి గ్రహించగలిగిన అంశాలు అర్థశాస్త్ర దృక్పథానికీ, రాజకీయ అర్థశాస్త్ర దృక్పథానికీ విభిన్నంగా ఉంటాయి. ఈ నిర్వచనాన్ని, 'పెట్టుబడి కూడా మిగిలిన ఉత్పత్తి కారకాలతో సమానమైన ఉత్పత్తి కారకమే' అనే అభిప్రాయంతో కలగలిపి చూస్తే ఈ నిర్వచనం ఏమి చెబుతుందంటే పెట్టుబడి యాజమాన్యం ఎవరికైనా స్వేచ్ఛగా అందగలిగిన వ్యవస్థే. అంటే, నిజమైన స్వేచ్ఛా వ్యాపార వ్యవస్థే పెట్టుబడిదారీ విధానం అని చెప్పినట్లు అవుతుంది.

కానీ, రాజకీయార్థ శాస్త్ర దృక్పథం నుంచి చూసినపుడు ఉత్పత్తి సాధనాలు సొంతఆస్తి కావడం అంటే అవి వ్యక్తిగత సొంతఆస్తి కావడం కాదు. వ్యక్తిగత సాధనాలు సొంత ఆస్తికావడం కాదు. ఉదాహరణకు ఒక టూత్‌బ్రష్, ఒక సొంత వాహనం, ఒక సొంత ఇల్లు కలిగి ఉండడం ఉత్పత్తి సాధనాలమీద సొంత యాజమాన్యం కాదు. ఇటువంటి ఆస్తి పొందడానికి ఎవరికైనా స్వేచ్ఛ ఉందన్నమాట నిజమే. కానీ, పెట్టుబడిదారీ విధానంలో కీలకమైన అంశం ఏమంటే సంపదను ఉత్పత్తి చేసేది ఆస్తి. ఇక్కడి దాకా చర్చ సాగిన తరువాత నేను మరో ముఖ్యమైన ప్రశ్న వేస్తాను. అది చర్చ నుంచి పక్కకు పోయినట్లు అనిపిస్తుంది కానీ, కాదు. సొంత ఆస్తి ఉండడం అంటే ఇతరుల మీద అధికారం ఉండడం అని చెప్పవచ్చునా?

తరగతి గదిలో ఈ ప్రశ్న మీద చర్చ చాలాసేపు జరుగుతుంది. ఒక నిర్ధారణకు రావడానికి కష్టం అవుతుంది. కొంతమంది విద్యార్థులు ఈ రెండిటి మధ్య ఏ సంబంధమూ లేదంటారు. కొంతమంది అద్దెకున్న వాళ్లకు పెంపుడు జంతువులు ఉండవచ్చునా, లేదా? పిల్లలు ఉండ వచ్చునా, లేదా? సందడిగా విందులు చేసుకోవచ్చునా, లేదా? వగైరా విషయాలపై ఇంటి యజమానులకు అధికారం ఉంటుందని చెప్పారు. అసలు రాజ్యం తన అధికారం వల్ల కాని, పన్నుల విధానం వల్ల కాని ఆస్తిని జప్తు చేసుకోవచ్చు కదా అని కొందరు ప్రశ్నించారు. ఈ చర్చ సాగనిచ్చి నేను ఒక నిర్ధారణ తీశాను. సంపదను ఉత్పత్తి చేసే ఆస్తికి యజమానులు అయినవాళ్లు, సొంతదారులు అయినవాళ్లు సంపదను ఉత్పత్తి చేయడంలో విజయం సాధించాలంటే వాళ్లు శ్రమను, ఇతర ఉత్పత్తి సాధనాలను అదుపు చేయగల అధికారం కలిగి ఉండాలి. ఆ అధికారం లేనట్లయితే వాళ్లు తమ శ్రమ మీద, తమ కుటుంబ శ్రమ మీద మాత్రమే ఆధారపడవలసి వస్తుంది. అంటే, సంపదను ఉత్పత్తి చేసే ఆస్తికి సొంతదారులైన వాళ్లు ఇతర ఉత్పత్తి కారకాలన్నిటి మీద అధికారం చెలాయించడానికి ఒకే ఒక మార్గం ఉంది. అది ఏమంటే, అటువంటి ఆస్తి లేని ప్రజలు అసంఖ్యాకంగా ఉండడమే. ఆ ప్రజలు బతకాలన్నా, మనుగడ సాధించాలన్నా ఇతరులు చెప్పిన పని చేయక తప్పని స్థితిలో ఉండడమే. ఉత్పత్తి సాధనాల మీద సొంత యాజమాన్యం అతి కొద్దిమంది చేతిలో ఉండడం వారికి ఇతరులందరి మీద అధికారాన్ని కట్టబెడుతుంది. ప్రజలు ఆ సొంతదారు దగ్గర పని చేయడానికి వచ్చినప్పుడు వారు తమ శ్రమశక్తినంతా ఆ యజమానుల అదుపాజ్ఞలకు లోబరుస్తారు. ఆ యజమానులకు సొంత ఆస్తి ఎంత ఎక్కువగా ఉంటే అంత ఎక్కువ సంఖ్యలో ప్రజల మీద వారి ప్రభావం ఉంటుంది. ఆ ఆస్తి పరిమాణం ఇంకా పెరిగినట్లయితే చివరకు వాళ్లు రాజ్యం మీద కూడ ప్రభావం వేసి, అది తమ ప్రయోజనాల కొరకు ఆర్థిక వ్యవస్థలో జోక్యం చేసుకొనేటట్లు చేయగలరు.

ఇప్పుడిక మనం మొదటి అంశం దగ్గరకు వద్దాం. పెట్టుబడి అందరికీ స్వేచ్ఛగా అందుబాటులో ఉందా? రాజకీయ అర్థశాస్త్ర దృక్పథం ఏమని వాదిస్తుందంటే, ఇటువంటి వ్యవస్థ మనుగడ సాగించాలంటే సాపేక్షంగా కొద్ది మందికి మాత్రమే పెట్టుబడి అందుబాటులోకి రావాల్సి ఉంటుంది. అలా జరగాలంటే, పెట్టుబడి అందరికీ అందుబాటులోకి రావాలంటే, ప్రమాదకరమైన శ్రామికుల కొరత ఏర్పడుతుంది. వ్యవస్థ కొనసాగడం కష్టం అవుతుంది. అలాగే అపారమైన పెట్టుబడి పరిమితంగా మాత్రమే అందుబాటులో ఉండే స్థితి లేనట్లయితే రాజ్యాన్ని ఎవరు అదుపు చేయాలనే శక్తి కూడా అస్పష్టమైపోతుంది.

రాజ్యం - ఒక పరిచయం


చాలా శుద్ధ అర్థశాస్త్ర విశ్లేషణలలో అచ్చమైన మార్కెట్ సమాజాల లో కూడా ప్రభుత్వ పాత్ర ఏమిటనే విషయంలో క్లుప్తమైన చర్చ ఉంటుంది. స్వేచ్ఛా వాణిజ్య పరిస్థితులలో ప్రభుత్వం కేవలం తనను తాను శాంతి భద్రతల నిర్వహణకు మాత్రం పరిమితం చేసుకోవాలని ఈ పుస్తకాలు చెబుతాయి. అది చెప్పాక ఈ శాంతి భద్రతలు అనబడే దానిలో ముఖ్యమైన అంశం ఏమిటి అని అడుగుతాను. ఒప్పందాలను పాటించడం అని జవాబు చెబుతాను. ఒక మార్కెట్ ఆర్థిక వ్యవస్థ సక్రమంగా పని చేయాలంటే యజమానులకు తమ ఆస్తిమీద భద్రత ఉండాలి. ఉత్పత్తికి సంబంధించిన మార్కెట్లలోగానీ, శ్రమవంటి ఉత్పత్తి కారకాల మార్కెట్లలో గాని అమ్మకందార్లకూ, కొనుగోలుదార్లకూ పరస్పర ఒప్పందాలు భద్రంగా ఉండాలి. బ్యాంకు నుంచి రుణం తీసుకుని ఇల్లు కొనుక్కున్న యజమాని నెల నెలా కట్టవలసిన తనఖా వాయిదా కట్టబోనని నిర్ణయించుకుంటే, ఆ బ్యాంకు ఆ రుణ ఖాతాను ఆపివేసి, ఆ వ్యక్తిని ఆ ఆస్తి నుంచి భౌతికంగా గెంటివేస్తుంది. ఆ వ్యక్తి ప్రతిఘటిస్తే రంగంలోకి దిగి, బలప్రయోగం ద్వారా ఆ వ్యక్తిని వెళ్లగొట్టే అధికారం రాజ్యానికి ఉంది. ఆ వ్యక్తి ఒక తుపాకీ పట్టుకుని తన ఇంటి వరండాలో నిలబడి ప్రతిఘటించాడనుకోండి, రాజ్యం మరింత బలాన్ని ఉపయోగించి అతన్ని చంపి అయినా సరే ఆస్తిని బ్యాంకుకు అప్పచెబుతుంది. ఇదంతా ఆ వ్యక్తి ఒప్పందాన్ని ఉల్లంఘించినందు వల్లనే.

ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా జరిగినట్లుగానే మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో కూడా భద్రత అనేది రాజ్యానికి బలప్రయోగం చేయడానికి ఉన్న శక్తి మీదనే ఆధారపడి ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ నియమాలకు అనుగుణంగా వ్యక్తులు పనిచేసేలా చూడడం కోసం రాజ్యం చంపడానికి సిద్ధపడుతుందా లేదా అనేదే భద్రత. ఈ వాదనలో తరవాతి అంశం రాజ్యపు శాంతి భద్రతల నిర్వహణ బాధ్యతలో అతి ప్రాథమికమైనది సొంత ఆస్తిని పరిరక్షించడమే అనేది గుర్తు పెట్టుకోవడం. ఈ బాధ్యత ఎందుకు ముఖ్యమైనది అవుతుందంటే రాజ్యం మీద వేరు వేరు వైపుల నుంచి వేరు వేరు ఒత్తిడులు ఉండవచ్చు. రాజకీయార్థ శాస్త్ర దృక్పథం ప్రకారం సామాజిక సమతుల్యాన్ని కాపాడాలంటే వ్యక్తిగత హక్కులు మరొకరి ఆస్తి హక్కులతో ఘర్షణ పడినపుడు ఆస్తిని కాపాడడమే రాజ్యపు ప్రాథమిక బాధ్యత అవుతుంది. మరి ఎన్నో పౌరహక్కుల చట్టాలు ఉన్నాయి కదా అని ఉదాహరణలు వస్తాయి. ఆ ఉదాహరణలూ, వ్యతిరేక ఉదాహరణలూ చర్చించుకోవడానికి పూర్తి అవకాశమివ్వాలి. మన న్యాయవ్యవస్థ మానవ హక్కులకన్న ఆస్తి హక్కులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందా, లేదా, అలా ఇవ్వవచ్చునా, చర్చకు వదిలి విద్యార్థులనే తేల్చుకోనివ్వాలి.

చలన వలయం

ఆర్థిక జీవనంలో తప్పనిసరిగా ఉండే చలన వలయం గురించిన చర్చను పరిచయం చేసినపుడు రాజకీయార్థ శాస్త్రానికీ శుద్ధ అర్థశాస్త్రానికీ మధ్య ఉండే తేడా అంతిమంగా స్పష్టమవుతుంది. ఈ చలన వలయాన్ని చాలా అర్థశాస్త్ర పాఠ్యపుస్తకాల్లో ఇస్తారు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని సమగ్ర నిర్మాణానికి అది సులభమైన చిత్రరూపమని చెబుతారు. దానిలో ఒక గృహరంగం ఉంటుంది. ఆ గృహరంగంలో ఉత్పత్తి యజమానులందరూ ఉంటారు. ఒక వ్యాపారరంగం ఉంటుంది. అది మొదట ఖాళీగా ఉంటుంది. గృహరంగంలో నుంచి ఎవరో ఒకరు తమ నిర్వహణా సామర్థ్యాన్ని ఉపయోగించి, వ్యాపారవేత్తగా మారి ఆ రంగంలోకి ప్రవేశిస్తారు. ఈ పాఠ్యపుస్తకాలు ఇచ్చే చిత్రపటాన్ని నేను నల్లబల్ల మీద గీస్తాను. గృహరంగంలో నాలుగు ఉత్పత్తి కారకాలను సూచిస్తాను. ఈ విశ్లేషణ మీద ప్రధానమైన విమర్శ ఏమంటే గృహరంగంలో నుంచి ఎవరో ఒకరు తమ నిర్వహణా సామర్థ్యాన్ని ఉపయోగించేవరకూ వ్యాపార రంగం ఖాళీగా ఉంటుంది. ఈ చిత్రపటం గీసేటప్పటికి మనం డబ్బు గురించి మాట్లాడడం లేదు కాబట్టి ఆ వ్యక్తి ఉత్పత్తి సాధనాలను జతచేసి ఏదోఉత్పత్తి చేశాడనుకోవాలి. ఈ చిత్రపటంలో పైన జరిగే చలనంలో తగినంత అమ్మకం జరిగితే ఆ వ్యక్తికి అన్ని ఉత్పత్తి కారకాలకూ అవసరమైనంత చెల్లించడానికీ, తాను కూడా ప్రతిఫలం పొందడానికీ వీలవుతుంది. మరి అన్ని ఉత్పత్తి కారకాలనూ ఉత్పత్తి వైపు ఆకర్షించాలంటే మొట్టమొదట డబ్బు కావాలి కదా? అది పెట్టుబడి మార్కెట్ నుండి వస్తుందనుకోవాలి. కానీ వాస్తవికతలోకి చూస్తే ఇక్కడ మరొక ప్రత్యామ్నాయం ఉంది. 'ప్రతి ఒక్కరికీ వారికి తగినంత' అని ఒక సూత్రం ఉంది. (ఇక్కడ మిల్టన్ ఫ్రీడమన్ చెప్పిన 'ఎవరికీ ఉచిత భోజనం లేదు' అనే సూత్రాన్ని కూడా ఎదురుగా పెడతాను) కనుక ఆ సూత్రం ప్రకారం ప్రతి ఒక్కరూ డబ్బు పొందలేరని విద్యార్థులకు గుర్తు చేస్తాను. నిజం చెప్పాలంటే


పటం 1
చలన వలయం
శుద్ధ అర్థశాస్త్రం




మన సమాజంలో వ్యాపార రంగంలో విజయం సాధించాలంటే పెద్ద ఎత్తున పెట్టుబడి ఉండాలి. ఇక్కడిదాకా వాదించాక శుద్ధ అర్థశాస్త్రం చేప్పే చలన వలయం (పటం 1) స్థానంలో నేను రాజకీయార్థశాస్త్రం చెప్పే చలన వలయాన్ని (పటం 2) ప్రతిపాదిస్తాను.

ఇక్కడ గృహరంగం, వ్యాపారరంగం అనే తేడా బదులు ఆస్తిఉన్న గృహాలు, ఆస్తిలేని గృహాలు అనే విభజన ఉంటుంది. మొదటి రంగంలోని వారు సంపదను ఉత్పత్తి చేసే ఆస్తి కలిగి ఉంటారు. అది వారి పెట్టుబడి. అది యంత్రాల రూపంలోనో, భూమి రూపంలోనో, ఇతర ఉత్పత్తి కారకాలను ఆదేశించగల ద్రవ్య రూప ఆస్తి రూపంలోనో ఉంటుంది. రెండవ రంగంలోని వారు తమ శ్రమశక్తిని సమకూర్చవలసి ఉంటుంది. తాము పొదుపుచేసిన ద్రవ్యరూప పెట్టుబడిని కూడా సమకూర్చవలసి ఉంటుంది. పెట్టుబడిదారీ సమాజంలో సామాజిక చలనాల మధ్య అసమానత ఉన్నదనే ప్రాతిపదికే ఈ విశ్లేషణకు పునాది. ఇప్పుడు ప్రశ్న ఏమంటే ప్రస్తుత అమెరికా గురించి సాధారణీకరించిన చిత్రాన్ని మొదటి చలనవలయం సరిగా చూపుతున్నదా, రెండవ చలన వలయం సరిగా చూపుతున్నదా, అనేదే. ఈ రెండు దృక్పథాల మధ్య ఏది సరైనదో తేల్చి చెప్పే తీర్పరుల పాత్రను విద్యార్థులే వహించవలసి ఉంటుంది. వారు ఆ పాత్రను నిర్వహించడానికి వీలుగా ఆ పాఠ్యాంశం పొడవునా వాళ్లకు

పటం 2
చలన వలయం
రాజకీయార్థశాస్త్రం




పటం 3
చలన వలయంలో పొదుపు, పెట్టుబడి : శుద్ధ అర్థశాస్త్రం



వాస్తవ స్థితిలోని విషయాలను చెపుతూ ఉండాలి. చిన్న పరిశ్రమలను పెట్టడంలో ఉండే సౌలభ్యం, చిన్న వ్యాపారాల విజయావకాశాలు, అటువంటి చిన్న వ్యాపారులలో అతి ఎక్కువ భాగం ప్రారంభించిన ఏడాదిలోగా మూతబడి పోవడం, మొత్తం ఆర్థిక వ్యవస్థను భారీ వ్యాపార సంస్థలు అదుపాజ్ఞలలో పెట్టుకోవడం, మొత్తం జనాభాలో ఒక్క శాతం కన్న తక్కువ మంది చేతుల్లోనే ఈ కార్పొరేషన్‌లుండడం వంటివన్నీ చెప్పాలి.

చాలా పాఠ్య పుస్తకాలలో 'మార్క్సు – సోవియట్ యూనియన్‌లో ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ' అని ఒక అధ్యాయం ఉంటుంది. ఇలా మార్క్సు పరిచయం అయినపుడు మార్క్సిజానికీ రాజకీయార్థిక శాస్త్ర దృక్పథంలోని చలన వలయానానికి ఉన్న సంబంధం గురించి చెప్పవచ్చు. తద్వారా మార్క్సిజానికీ ఆధునిక అర్థశాస్త్రానికి మధ్య చర్చను పరిచయం చేసి ఇవాళ్టి అర్థశాస్త్రానికి కూడా అది ఎలా వర్తిస్తుందో వివరించవచ్చు. ఈ పాఠ్యాంశాన్ని ఏ స్థాయి వాదనలతో సంక్లిష్టతతో చెప్పదలచు

పటం 4
చలన వలయంలో పొదుపు, పెట్టుబడి : రాజకీయార్థశాస్త్రం



కున్నప్పటికీ ఇలా ఒకదానికి మరొకదాన్ని పోటీపెట్టి చెప్పడం కొనసాగించవచ్చు. జాతీయ ఆదాయాన్ని లెక్కగట్టడం అనేదాన్ని పరిచయం చేసినపుడు ఇక్కడ ఇచ్చిన పటం–3, పటం–4లను వివరించ వచ్చు. కీలకమైన తేడా ఏమంటే రాజకీయార్థికశాస్త్ర దృక్పథం నుంచి చూసినపుడు పెట్టుబడి నిర్ణయాలన్ని ఆస్తిపర వర్గాల చేతులలో ఉండడం కనబడుతుంది. అలాగే సాధారణంగా తక్కువ ఆదాయం వచ్చే వర్గాలు, లేదా ఆస్తిలేని వర్గాలు తమకు అందిన ఆదాయాన్ని, అందులోనూ ఉపాంత ఆదాయాన్నీ ఖర్చుపెట్టడానికే ఎక్కువ ఇష్టపడతారని చూపవచ్చు. రెండు దృక్పథాల మధ్య భేదాలలోని మరొక అంశం కార్పొరేట్ రంగం గురించి వ్యవహరించేటపుడు రాజకీయార్థిక శాస్త్ర వైఖరి చాలా సులభంగా ఉంటుంది. శుద్ధ అర్థశాస్త్ర విశ్లేషణ ప్రకారం కార్పొరేషన్‌ను కూడా సంస్థా నిర్వాహకుడైన 'వ్యక్తి'గానే చూస్తారు. కానీ చట్టపరంగా 'వ్యక్తి'గా ఉండే ఈ మనిషి గృహరంగంలో ఉండడు. కార్పొరేట్ రంగానికి అందజేసిన ఈ పరిమిత బాధ్యత అనే సౌకర్యం పెట్టుబడిలో రాబోయే నష్టాలను తగ్గిస్తుంది. ఈ సౌకర్యాన్ని ప్రభుత్వమే కల్పించింది. అయితే శుద్ధ అర్థశాస్త్రం వేసే పటంలో ఈ సౌకర్యం ప్రస్తావనే ఉండదు. మరొకపక్క రాజకీయార్థశాస్త్రపు పటంలో ప్రభుత్వాన్ని చూపక పోయినప్పటికీ పెద్ద ఎత్తున పెట్టుబడిని, కొందరు మనుషులను వ్యాపార రంగంలో స్థిరంగా ఉన్నట్టుగా చూస్తాం. అంటే కార్పొరేట్ సంస్థలకు ఉండే సౌకర్యానికి మూలమేమిటనేది అంత ముఖ్యం కాదు. అసలు కార్పొరేషన్ అనేది ఉనికిలో ఉందనేది గుర్తిస్తే చాలు.

1. ఈ క్రమంలో మరికొన్ని సంక్లిష్టతలను కూడా చేర్చవచ్చు. ఆదాయాన్ని పునఃపంపిణీ చేయడం, పన్నుల సంస్కరణల వంటి అంశాల గురించి మాట్లాడేటపుడు ప్రభుత్వం అనే భావనను ప్రవేశపెట్టవచ్చు. ఉదాహరణకు పటం – 4 లో చూపిన రాజకీయార్థశాస్త్ర దృక్పథాన్ని ఉపయోగిస్తూ, కార్పొరేషన్‌ల ఆదాయం మీద పన్నులను పెంచితే మొత్తంగా ఆర్థిక వ్యవస్థలో ఆదాయ పంపిణీ మీద ఏ ప్రభావాలు ఉంటాయో చర్చించవచ్చు.
2. పటం–2 ను ఉపయోగించి పనిస్థలంలో లొంగి ఉండవలసి రావడం వల్ల కార్మికుడు పరాయీకరణకు ఎట్లా గురవుతున్నాడో చర్చించవచ్చు. ఈ పటాన్ని చూపుతూనే కిందివర్గాల శ్రామికులకు పైకి ఎదగడంలో ఉన్న అవరోధాలనూ, అసమానతలు నిరంతరాయంగా కొనసాగడాన్నీ వివరించవచ్చు.
3. మిల్టన్ ఫ్రీడ్‌మన్ వంటి అర్థశాస్త్రవేత్తలు కుహనా ప్రగతిశీల పన్నుల విధానాన్ని కూడా అహేతుకమైనదని అంటున్నారు. ఈ విమర్శ ఏకకాలంలో రెండు పనులు చేయడానికి ఉద్దేశించినదని వివరించవచ్చు. ఆ పనులు ఏమంటే ఒక వైపేమో ఆదాయాన్ని పునఃపంపిణీ చేయడానికే పన్నుల విధానం ఉన్నదని అనిపించేలా చేయడం. అదే సమయంలో మరోవైపు వాస్తవికంగా ఆదాయ పునఃపంపిణీ చేయకుండా ఉండడం. ఈ పన్నుల విధానం వలన పెట్టుబడిదారీ విధానానికి ఒక 'న్యాయమైన' వ్యవస్థగా రాజకీయ సాధికారత దొరుకుతుంది. కానీ, ఈ పన్నుల విధానం, పెట్టుబడిదారీ విధానం ఏ ఆర్థిక అసమానతల మీద వికసిస్తుందో ఆ ఆర్థిక అసమానతలను మాత్రం ప్రశ్నించదు.
4. చివరి ఉదాహరణగా రాజ్యంలో ఆర్థిక వ్యవస్థ పాత్ర అనేదాన్ని పరిచయం చేసి దాన్ని కొనసాగించేటపుడు అమెరికాకు చెందిన కార్పొరేషన్‌ల దృష్టి నుంచి అంతర్జాతీయంగా శాంతి భద్రతలను కాపాడడాన్నే మూడో ప్రపంచ దేశాలు, విప్లవకారులు సామ్రాజ్యవాదం అని పిలుస్తారని చెప్పవచ్చు.

ఈ రకంగా పాఠ్యపుస్తకంలో ఉన్న అంశాలకు మొట్టమొదట ప్రత్యామ్నాయాలను సూచిస్తూ ప్రవేశపెట్టిన భావాలే ఆ బోధన పొడవునా విప్లవ దృక్పథానికి పునాదిగా నిలుస్తాయి. అంతకన్న పై స్థాయి పాఠ్యాంశాలకు కూడా అవి ఉపయోగపడతాయి. విద్యార్థుల అధ్యయనం కోసం మనం అదనంగా సూచించే విప్లవ పుస్తకాలు అర్థం చేసుకోడానికి కూడా విద్యార్థులకు ఈ పునాది ఉపయోగపడుతుంది. నవ్య సంప్రదాయవాద అర్థశాస్త్రానికి ఉన్న సవాళ్లు ఏమిటో వాళ్లు అర్థం చేసుకోగలరు. అప్పటికి సాగిన అణచివేతవల్ల, అమెరికాలోని మేధో సంప్రదాయంలో విప్లవ ఆలోచనలు సంపూర్ణంగా 'మినహాయించ' బడినందువల్ల 1960లలో నెలకొన్న విప్లవ వాతావరణంలో ఒక రకమైన మేధో శూన్యంలో న్యూలెఫ్ట్ ఆలోచనలు వికసించాయి. అర్థశాస్త్రంలో, సామాజిక శాస్త్రంలో, మనస్తత్వ శాస్త్రంలో, చరిత్రలో, రాజనీతి శాస్త్రంలో, మానవ శాస్త్రంలో, తత్వశాస్త్రంలో ప్రత్యామ్నాయ దృక్పథాల గురించి, శాస్త్రవేత్తలకూ ఇంజనీర్లకూ ఉండవలసిన సామాజిక బాధ్యతల గురించి మనలాంటి వాళ్లం నిరంతరం బోధిస్తూ ఉంటే అటువంటి మేధోశూన్యం మరోసారి తలెత్తదు. మనం ఇవాళ నాటే అనుమాన బీజాలు అమెరికాను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. మనం సమర్పించే ప్రత్యామ్నాయ ధోరణులు మెరుగైన భవిష్యత్తు కోసం ఉపయోగపడతాయి. మనం నొక్కిచెప్పే ఆశలు ఆ భవిష్యత్తులో భాగమవుతాయి. ఆ భవిష్యత్తులో విద్యార్థులు పరస్పర సంబంధాలను కనిపెడతారు. ఇవాళ మనం ఆశించగలిగింది ఇంత మాత్రమే కావచ్చు. కానీ మనం నిజంగా పరిష్కారంలో భాగం కాదలచుకుంటే మనం చేయవలసిన కనీసమైన పని ఇది.

(మంత్లీ రివ్యూ ప్రెస్ ప్రచురించిన స్టడీస్ ఇన్ సోషలిస్ట్ పెడగాగీ (1978) పుస్తకం నుంచి) వీ

వచ్చే సంచికలో...

- **ఫోకస్ - అక్టోబర్ 2008 : ప్రజారాజ్యం పార్టీ - విభిన్న కోణాలు**
- **వర్తమాన ప్రపంచం - ఆహార సమస్య - ప్రొ. కె.ఆర్. చౌదరి**
- **ప్రత్యామ్నాయ విధానాలతో సామాజిక ప్రక్షాళన అవసరం - కె. రవి**
- **జీవించే హక్కు మాకు వర్తించదా? - పులుగుజ్జు సురేష్**

సింధు నాగరికతకు సంబంధించిన అవశేషాల ఆధారంగా ఆ నాగరికత గురించి వివరిస్తున్నారు

డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్

సింధు నాగరికత విశేషాలు

మనదేశంలోని అతిప్రాచీనమైన లిపి సింధునాగరికతలో కనబడుతుంది. సింధులిపిని గురించి చెప్పుకునే ముందుగా ఈ నాగరికత గురించి కొంత తెలుసుకోవాలి. క్రీ.పూ. 2600 ప్రాంతాల ఉచ్ఛదశకు చేరుకున్న ఈ నాగరికత గురించి 1920ల దాకా ఎవరికీ తెలియకపోవడం ఎంతో ఆశ్చర్యకరం. దాదాపు పదమూడు లక్షల చదరపు కిలోమీటర్ల విశాల ప్రాంతంలో విలసిల్లిన ఈ ప్రాచీన సంస్కారం గురించీ, భాష గురించీ ఎటువంటి సమాచారమూ ఇప్పటివారికి తెలియలేదు. వారికి సమకాలికులైన సుమేరియన్, ఈజిప్ట్ నాగరికుల గురించిన ఎన్నో వివరాలు తెలుస్తున్నాయి కాని సింధు నాగరికతలో ప్రజల ప్రధాన జీవనాధారం ఏమిటో, క్రీ.పూ. 1900 తరువాత ఉన్నట్టుండి వారి పరిస్థితి ఎందుకు, ఎలా క్షీణించసాగిందో ఏమీ తెలియదు. మొహెంజొదడో, హడప్పా, లోథల్, ధోలావీరా, కాలిబంగన్, గన్వేరీవాలా, రాఖీగఢీ మొదలైన లెక్కలేనన్ని ప్రాంతాల్లో తమ నివాసచిహ్నాలను వదిలి వెళ్ళిన ఈ ప్రజలంతా తమని తాము ఏ పేరున పిలుచుకునేవారో కూడా తెలియరావటం లేదు.

ప్రాచీన నాగరికతలుగా మనం అనుకునేవన్నీ రూపుదిద్దుకునే ముందు అక్కడి ప్రాంతాల్లో ప్రజలు కొన్ని వేలఏళ్ళుగా పల్లెల్లో నివసించేవారనేది గుర్తుంచుకోవాలి. నాగరికత అనేది అకస్మాత్తుగా ఊడిపడేది కాదు. ఎంతోకాలంగా ఒకేచోట జనం నివసించడం, వ్యవసాయం, పశువుల పెంపకం మొదలైనవాటి ద్వారా అదనపు ఆహారాన్ని సమకూర్చుకోవడం, సమాజంలో కొందరికైనా కాయకష్టం చేసి పని చెప్పడం వగైరాలన్నీ జరుగుతాయి. ఈ శ్రమవిభజనవల్ల తీరిక సమయం దొరికిన కొన్ని వర్గాలు అచ్చగా ఉదర నిమిత్తం కావనిపించే రకరకాల ఇతర పనులను చేపట్టడం, నైపుణ్యం సంపాదించడం జరిగేది. గ్రామాల్లోలాగా అస్తమానం గొడ్డుగోదా అనుకుంటూ కూర్చోకుండా నగర జీవితానికి అవసరమైన హంగులతో రూపొందినదే నాగరికత అనిపించుకుంటుంది. ఉన్నతవర్గాల అవసరాల నిమిత్తం ఎవరో కొందరు భవనాలకూ, నగరాలకూ రూపకల్పన చేసిన తరువాతనే "రాళ్ళెత్తిన కూలీల" ప్రస్తావన వస్తుంది.

సింధునాగరికత తలెత్తే ముందుకూడా ఎన్నో సామాజిక పరిణామాలు జరిగాయి. క్రీ.పూ.6500 ప్రాంతాల్లోనే నేటి బలూచిస్తాన్‌లోని మెహర్గఢ్ కొండచరియల్లో ప్రజలు నివసించి వ్యవసాయం మొదలుపెట్టిన దాఖలాలున్నాయి. (ఇది జరిగిన 4000 ఏళ్ళకుగాని సింధునాగరికత మొదలవలేదనేది గమనార్హం. సింధునాగరికత అంతమైంది ప్రస్తుతకాలానికి రమారమి 4000 ఏళ్ళ క్రితమే). మరొక వెయ్యేళ్ళకు కుండల తయారీ వగైరాలు మొదలవడం, ప్రజలు సింధ్, పంజాబ్ వంటి సారవంతమైన ప్రాంతాల్లో స్థిరపడడం జరిగాయి. క్రీ.పూ. 4000లో ఈ స్థానిక సంస్కృతికి రూపురేఖలు ఏర్పడసాగాయి. అలంకరణ సామాగ్రివంటి వాటికి అవసరమైన రాళ్ళూ, పూసలూ వగైరాల కోసమని దూరప్రాంతాలతో వాణిజ్య సంబంధాలు ఏర్పడ్డాయి. గ్రామాల్లో బటాణీలూ, నువ్వులూ, ఖర్జూరాలూ, పత్తీ మొదలైన పంటలూ, రకరకాల జంతువుల పెంపకమూ మొదలయాయి. క్రీ.పూ. 3500 తరవాత రావీనది ప్రాంతంలో నాగరికతకు పునాది ఏర్పడింది. ఆ కాలంలో ప్రపంచంలోనే మొట్టమొదటగా లిపి తయారైన దాఖలాలు కనబడతాయి.

మరొక వెయ్యేళ్ళకు మొహెంజొదడో, హడప్పా మొదలైన నగరాలు అద్భుతమైన పద్ధతిలో నిర్మించబడ్డాయి. ఎంతో గొప్ప సాంకేతిక పరిజ్ఞానంతో నిర్దుష్టంగా, తీర్చిదిద్దినట్టుగా వేసిన వీథులూ, రహదారులూ, పొగలూ, వాసనలూ, దొంగల భయమూ వగైరాలన్నిటినీ పరిగణిస్తూ నిర్మించిన గృహాలూ ఆధునిక వాస్తుకళను తలపించేవిగా కనిపిస్తాయి. తాగునీటికీ, మురుగునీటికీ, అందరూ ఉపయోగించగలిగిన స్నానశాలలకూ తగినట్టుగా రూపొందించిన సదుపాయాలు ఉన్నతమైన నిర్మాణ వ్యవస్థను సూచిస్తాయి. నౌకలకు స్థావరాలూ, ధాన్యాగారాలూ, గిడ్డంగులూ, రక్షణ ఏర్పాట్లకై ఇటుకలతో చక్కగా నిర్మించిన గోడలూ అద్భుతంగా అనిపిస్తాయి. వరదలకు తట్టుకోగలిగిన భవనాలూ, కోటలూ, వరదనీటిని మళ్ళించేందుకు సదుపాయాలూ అన్నీ ఉండేవి. ఆ స్థాయిలో జరిగిన ఏర్పాట్లు ఆ కాలపు మరే నాగరికతలోనూ కనబడవు సరికదా, ఈనాటి భారత, పాకిస్తాన్ నగరవ్యవస్థల్లో కూడా అంత మంచి సదుపాయాలు కనబడవంటే సరికదా, ఈనాటి భారత, పాకిస్తాన్ నగరవ్యవస్థల్లో కూడా అంత మంచి సదుపాయాలు కనబడవంటే అతిశయోక్తి కాదు. ఈ వివరాల ఫోటోలన్నీ www.mohenjodaro.com, www.harappa.com అనే వెబ్‌సైట్లలో కనిపిస్తాయి. అవి ప్రతివారూ చూసితీరాల్సిన వివరాలు

నగరవాసుల్లో ఎక్కువమంది చేతిపనులో, వాణిజ్యమో చేపట్టినట్టుగా తెలుస్తోంది. నగరంలో ఒక్కొక్క ప్రాంతంలోనూ ఒకే వృత్తిపనివారు నివసించి ఉండవచ్చు. ఇళ్ళలో చిన్నవీ, పెద్దవీ కనబడుతున్నా వాటన్నిటికీ నీటిపారుదల సౌకర్యాలవంటివి ఒకేరకంగా

ఉండేవి కనక సామాజికంగా కొంత సమానత ఉన్నట్టే అనిపిస్తుంది. అప్పటి సమాజంలో మధ్యతరగతివారు ఎక్కువగా ఉండేవారేమో.

ప్రాచీనకాలం గురించి చాలామందికి సరైన అవగాహన ఉండదు. సింధునాగరికత వంటివాటికి చెందిన ప్రజలు మరీ చెకుముకిరాళ్ళతో నిప్పు చేసుకునేవారని అనుకోకపోయినప్పటికీ వారంతా నిత్యమూ ఏవో హోమాలూ, పూజలూ, చేస్తూ దేవతారాధనలతో కాలం గడిపేవారని కొందరు అనుకోవచ్చు. ఇది ఏ మాత్రమూ నిజంకాదు. అప్పటికీ లక్షలాది ప్రజలతో కిటకిటలాడిన చిన్నా, పెద్ద నగరాలన్నీ వ్యవసాయమూ, ఇతర వృత్తులూ చేసుకునేవారితో కళగా ఉండేవి. తమ ప్రాంతాల గురించే కాక పశ్చిమాసియా దాకా వ్యాపించిన ఇతర నాగరికతలతోనూ , అక్కడి ప్రజలతోనూ వారికి వాణిజ్యపరమైన సంబంధాలుండేవి. సింధునాగరికత తొలి నాగరికతకు ఆలవాలమైన మెసపొటేమియా సరిసర ప్రాంతాలతో ఎటువంటి మార్గాల్లో సంపర్కం పెట్టుకుందో అప్పటి చిత్రాలు ఆధారంగా చూడవచ్చు.

క్రీ.పూ. 3500లో సిధునాగరికతకు సరైన మార్గమేదీ ఏర్పడని దశనుంచి క్రీ.పూ.2000 నాటికల్లా ఆ ప్రాంతానికి చేరుకునేందుకు సముద్ర, భూమార్గాలు ఎన్ని ఏర్పడ్డాయో అప్పటి చిత్రాలు ఆధారంగా మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ వాణిజ్యానికి కేవలం మెసపొటేమియా, సింధునదీ ప్రాంతాల్లోనేకాక పర్షియన్ సింధుశాఖలోని నేటి బాహ్రెయిన్ మొదలైన ప్రాంతాల్లో ఎన్నో సాక్ష్యాలు లభించాయి. క్రీ.పూ.3000 నాటికీ అక్కడి తిల్మున్ మొదలైన ప్రదేశాల్లో ముమ్మరంగావర్తకం సాగేదనడానికి అక్కడ దొరికిన హడప్పా ముద్రికలే ఆధారం. అలాగే ఆ ప్రాంతపు ముద్రికలు కొన్ని గుజరాత్‌లోని లోథల్ అవశేషాల్లో దొరికాయి. ఈ ప్రాంతాలన్నిటి మధ్యా ఎగుమతులూ, దిగుమతులూ జరుగుతూనే ఉండేవి. ఇన్ని వేల సంవత్సరాల తరువాత మనకు దొరికిన ముద్రికలతో అప్పట్లో బంకమట్టి బిళ్ళలమీద గుర్తులు వేసేవారు. ఈ మట్టిబిళ్ళలు బంగీలుగా కట్టిన వస్తువుల మీద అతికి ఉండేవని బిళ్ళల వెనకపక్క కనిపిస్తున్న తాళ్ళ గుర్తులవల్ల తెలుస్తోంది. రవాణా సౌకర్యాలు సరిగ్గా లేని ఆ యుగంలో ఈ వస్తువుల మార్పిడి అంతా పడవల, బళ్ళమీదుగా నింపాదిగా జరిగి ఉండేదేమో. ఈ పడవలు చిన్నవిగా, చదునైన అడుగు భాగంతో ఉండేవని తెలుస్తోంది. వీటిలో కొన్ని తీరాన్ని అంటిపెట్టుకుని ప్రయాణించినప్పటికీ మరికొన్ని పెద్ద పెద్ద సముద్రయానాలు చేసేవని లోథల్‌లో దొరికిన ఆధారాలను బట్టి తెలుస్తోంది. అక్కడి పెద్ద నౌకా స్థావరమూ, లోతుగా తవ్విన కాలువలూ పెద్ద నౌకలకు పనికొచ్చేవిగా కనిపిస్తున్నాయి. ఎడ్లను పూన్చిన బళ్ళు వాడేవారు. మొత్తంమీద ఆ నాగరికతను గురించి తెలియవస్తున్న వివరాలను చూస్తే వారిని ఏ మాత్రమూ తక్కువగా అంచనా వెయ్యలేమనిపిస్తుంది.

చరిత్ర అనగానే సామాన్యంగా రాజులూ, రాజవంశాల ప్రస్తావన మాత్రమే అనిపిస్తుంది. దీనివల్ల అప్పటి సమాజాల్లో 'సామాన్యుడి జీవన మెట్టిది?' అనే శ్రీశ్రీ ప్రశ్నకు సమాధానం దొరకదు. అదృష్టవశాత్తూ సింధు నాగరికత అవశేషాలలో రాజుల గురించిన భోగట్టా ఏమీ లభించ లేదుగాని మామూలు ప్రజల జీవితం గురించిన కొన్ని వివరాలు లభ్యమ వుతున్నాయి. ఈనాటి పాకిస్తాన్, పంజాబ్, గుజరాత్ వగైరా ప్రాంతాల్లో నాలుగున్నర వేల ఏళ్ళ కిందట ప్రజలు ఎలా నివసించారో కొంతవరకూ తెలుస్తోంది.

దాదాపు వెయ్యేళ్లపాటు వెలిగిన ఈ నాగరికత అంతరించి పోవడానికి కారణం వరదలు రావడమో, కరువు కాటకాలో, విదేశీయుల దండయాత్రలో సరిగ్గా తెలియదు. మనకు దక్కినవల్లా తవ్వకాల్లో బైటపడ్డ అవశేషాలే. వాటినిబట్టి చూస్తే అప్పటి నగరవీథులన్నీ చదునుగా, సాఫీగా కనిపిస్తాయి. నగరవ్యవస్థ ఎంతో సక్రమంగా అనిపిస్తుంది. ఇళ్లలో చాలామట్టుకు విడిగా తమతమ స్థలాల్లో నిర్మించబడ్డవిగానే కనిపిస్తాయి. కాల్చిన ఇటుకలతో పైకప్పు చదునుగా ఉండేట్టుగా కట్టిన ఈ ఇళ్లన్నీ దాదాపు ఒకలాంటివే. వీటికి బైటివేపు కిటికీలుండవు. కిటికీలన్నీ ఇంటి లోగిలి కనబడేట్టుగా ఉంటాయి. విడిగా స్నానాలగది ఉంటుంది. ప్రతి ఇంటికీ ఇటుకలతో కట్టిన ఒక మంచినీటి బావీ, మురుగునీరు వీథిలోకి ప్రవహించేందుకు స్నానాలగదినుంచి మట్టితో కట్టిన తూములూ ఉంటాయి. వీథుల పక్కన మూతపెట్టిన మురుగుకాలువలుంటాయి. మురుగునీరంతా నదిలోకో, ఏరులోకో ప్రవహించేది. ఊరి చివర ఉన్న ఇళ్లు కూడా ఈ విస్తృతమైన మురుగునీటి వ్యవస్థలో భాగంగా ఉండేవి. పెద్ద పెద్ద మంచినీటి జలాశయాలుండేవి.

తవ్వకాలు జరిపినప్పుడు 40 అడుగుల నిడివీ, 8 అడుగుల లోతూ కలిగిన పెద్ద స్నానశాల వంటిది ఒకటి బైటపడింది. అది అప్పటివారికి ఒక దేవాలయం వంటిదో, నలుగురూ కలుసుకునే స్థలమోకూడా అయి ఉండవచ్చు. వీలునుబట్టి పెద్దరాళ్ళను తొలిచి, వాటిలో వర్షపునీటిని సేకరించుకుని తాగునీటి అవసరాలకు వాడుకునే వారు. నీటి అవసరాల గురించీ, మురుగునీటిని గురించీ అప్పటివారికి సమగ్రమైన సమాచారమూ, నీటి వ్యవస్థల రూపకల్పనకు తగిన చక్కని సాంకేతిక పరిజ్ఞానమూ ఉండేవనడంలో ఏ మాత్రమూ సందేహంలేదు. నీటి పరిశుభ్రత గురించి వారికి ఇంతగా పట్టింపులుండడం అత్యాశ్చర్యకరంగా అనిపిస్తుంది. ఇదేమీ పల్లెటూరి వ్యవహారం కాదు; నిజమైన నాగరికత. దీన్ని పోలినది ఆనాటి ప్రపంచంలో మరెక్కడా కనబడదు.

చిత్రమేమిటంటే హడప్పా నగరాలేవీ నాటు పద్ధతిలో మొదలై క్రమంగా రూపుదిద్దుకున్నట్టుగా కనబడవు. వాటి తొలి నిర్మాణమే ఎంతో మెరుగైనదిగా కనిపిస్తుంది. అప్పటివారు నిర్మాణ పద్ధతులన్నీ మరెక్కడో నేర్చుకుని ఒక్కసారిగా అద్భుతమైన నగరాలను తయారుచేసినట్టుగా అనిపిస్తుంది. సింధునదికి అనేకసార్లు వరదలు రావడం, ఈ నగరాలు మునిగిపోగా అదే స్థానంలో వాటిని మళ్ళీ నిర్మించడం జరిగింది. కాని ఈ పునర్నిర్మాణం జరిగినప్పుడల్లా అందులోని నైపుణ్యం క్రమంగా తగ్గిపోతూవచ్చింది. కాలం గడుస్తున్నకొద్దీ నగరనిర్మాణంపట్ల ప్రజలకు శ్రద్ధ తగ్గిపోయినట్టుగా తెలుస్తోంది. ఇందుకు కారణమేమిటో సరిగ్గా తెలియదు.

గుజరాత్‌లోని ఢోలావీరా రాళ్ళతో కట్టిన పెద్ద నగరం. దీని చుట్టూ ముడు ప్రాకారాలుండేవి. నగరంలో ఎన్నో విశాలప్రాంతాలూ, కార్మాగారాలూ, దుకాణాలూ ఉండేవని తెలుస్తోంది. నగరం మధ్యలో ఎత్తుగా వేళ్ళాడగట్టిన ప్రకటనవంటి చెక్కపలక మీద పదిహేనంగుళాల పరిమాణంలో చెక్కిన అక్షరాల గుర్తులు నేటికీ కనిపిస్తున్నాయంటే అప్పటి ప్రజల్లో ఎందరో అక్షరాస్యులుండేవారని ఊహించవచ్చు. ఇది ప్రపంచంలోని తొలి సైన్‌బోర్డు అనడంలో సందేహం లేదు.

తాపీ రాజమ్మ



తాపీ రాజమ్మ (78) గారు జూలై 28న హైదరాబాద్‌లో మరణించారు. 1940లలో రాజమ్మ తన పధ్నాల్గవ యేట ఆంధ్ర దేశపు కమ్యూనిస్ట్ ఉద్యమంలోకి అడుగు పెట్టారు. అప్పుడు విజయవాడ కమ్యూనిస్ట్ ఉద్యమానికి కేంద్రంగా ఉండేది. పార్టీ సభ్యులు అక్కడ ఒక కమ్యూన్ నడిపేవారు. ఆ కమ్యూన్ బాధ్యతలు చిన్న వయసులోనే ఆమె నిర్వహించారు. కమ్యూన్ బాధ్యతలేకాక ప్రజా నాట్యమండలిలో ఆమె చురుకైన కార్యకర్తగా ఉన్నారు. ఆమె దేశభక్తి గీతాలు, ఉద్యమ గీతాలు ఆలపిస్తుంటే జనం ఉత్సాహంగా వినేవారు. రాధ, వీరమాచనేని సరోజని, తాపీరాజమ్మల బుర్రకథలు ఆంధ్రదేశంలో ఉద్యమ ప్రచారాన్ని చేశాయి. 1946లో డాక్టర్ అచ్చమాంబ గారు ఏలూరు నుంచి కమ్యూనిస్ట్ పార్టీ తరఫున పోటీ చేసినపుడు ప్రచారానికి వెళ్లిన మహిళా బృందంలో తాపీ రాజమ్మ ఉన్నారు. డాక్టర్ గరికపాటి రాజారావు గారి దర్శకత్వంలో మహిళలను చైతన్యపరిచే కార్యక్రమంలో కళాకారిణిగా తాపీ రాజమ్మ అనేక ప్రదర్శనలు ఇచ్చారు. తాపీ ధర్మారావు కొడుకు మోహనరావుతో ఆమె వివాహం జరిగింది. 1949లో విజయవాడలో మహిళా సంఘ ప్రదర్శన మీద ప్రభుత్వం నిషేధాజ్ఞలు విధించింది. దానిని ధిక్కరించి మహిళా కార్యకర్తలు డాక్టర్ అచ్చమాంబ, మానికొండ సూర్యావతి నాయకత్వంలో పెద్ద ఊరేగింపు తీసారు. మూడు నెలల పసిపాపతో రాజమ్మ గారు జైలుజీవితం అనుభవించారు. దేశభక్తి గేయాలతో ప్రతిధ్వనించిన కాలంలో దానిని పరిపూర్ణంగా శ్వాసించి జీవించిన రాజమ్మ చివరి వరకూ అలాంటి విలువలతోనే జీవించారు. ఆరోగ్యం సహకరించకున్నా అభ్యుదయ సమావేశాలకు వెళ్లడం, రచనలు చేయడం చివరిదాకా మానలేదు. వీ

ఈ అవశేషాల్లో పెద్ద సైన్యాలూ, రాజులూ, యుద్ధవాతావరణమూ కనిపించకపోవడంతో అక్కడివారంతా కొంత ప్రజాస్వామిక పద్ధతిలో శాంతియుతంగా జీవించారని అనుకోవచ్చు. అలాగే గొప్ప గొప్ప సమాధులూ, సిరిసంపదలకు చిహ్నాలూకూడా కనబడవు. ఈజిప్టులాగా పెద్ద ఆలయ వ్యవస్థలూ, అర్చనల ఆర్భాటమూకూడా ఉండేవికావు. బానిసల వ్యవస్థా, బలవంతపు చాకిరీ వగైరాలుకూడా జరిగినట్టుగా లేవు. మరి ఇవేవీ లేకుండా అంత సువిశాలమైన ప్రాంతమంతా కలిసికట్టుగా ఉండేదంటే అందుకు కారణం నదీజలాలను నమ్ముకున్న వారి విశ్వాసాలే అయిఉండవచ్చు. అంతేకాక మెసపొటేమియా తదితర ప్రాంతాలతోవారు విజయవంతంగా సాగించిన వర్తకవాణిజ్యాల పాత్ర కూడా ఉండవచ్చు. ఎందుకంటే ఈనాటి ఫ్రాన్స్ దేశమంత పెద్దపెద్ద ప్రదేశంలోని మారుమూల ప్రాంతాల మధ్యకూడా ఐకమత్యం ఉండేదంటే అందుకు బలమైన కారణాలేవో ఉండే ఉంటాయి.

సాంకేతికంగా చూస్తే అప్పటివారికి రాగి, కంచు, సీసం, తుత్తునాగం మొదలైన లోహాలను పోతపొయ్యడం, వస్తువులను తయారు చెయ్యడం తెలుసు. కట్టడాలకు వాడిన ఇటుకలన్నీ ఖచ్చితంగా 4, 2, 1 నిష్పత్తి పరిమాణంలో తయారయేవి. రకరకాల పూసలూ, రాళ్ళూ ఉపయోగించి చేతి మురుగులూ, కడియాలూ చేసేవారు. వీటిని పర్షియన్ సింధుశాఖ మార్గాన వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. వీటి తయారీకీ, బట్వాడాకూ అవసరమైన ఐకమత్యమూ, సంపర్క సాధనాలూ సింధూనాగరికతకు చెందిన వివిధ ప్రాంతాలను కలిపి ఉంచేవేమో. ఇలా ఎగుమతి చేసిన వస్తువుల మీద వేసిన మట్టిముద్రల మీది గుర్తులన్నీ పంపినవారి వివరాలను తెలియచూసేవి కావచ్చు.

ఈ వ్యాపారపు లావాదేవీల కారణంగా అప్పటివారికి కొలతలూ, బరువులూ, కాలగణనం వగైరాల గురించిన అవగాహన ఉన్నతస్థాయిలో ఉండేది. లోథల్‌లో దొరికిన ఒక అపూర్వమైన దంతపుస్కేలుమీద 2మిల్లిమీటర్లకన్నా తక్కువ కొలతకు చిహ్నాలు కనబడుతున్నాయి. బరువులన్నీ 1, 2, 5 నిష్పత్తిలో తూచబడేవి. సముద్రపు అలలూ, నీటి ఆటుపోట్ల వివరాలూ మొదలైన వివరాల్లో వారి నౌకాశయాలకు అవసరమైన మంచి పరిజ్ఞానం ఉండేది. 2001లో మెహెర్గఢ్‌లో దొరికిన ఇద్దరు ప్రాచీన వ్యక్తుల శరీర అవశేషాల పరిశీలన జరిగింది. దీనివల్ల సింధు నాగరికతలో వైద్యం, దంతవైద్యం గురించిన అవగాహన ఉండేదని స్పష్టమైంది. మంచి నేతపనీ, కుండల తయారీ, చిన్న చిన్న బొమ్మలకు చక్కని రూపకల్పనా జరిగేవి. వీటిలో కొన్నిటికి అవసరమైన లోహాలు స్థానికంగా దొరికేవికావు గనక ఆ లోహాలను దిగుమతి చేసుకునేవారేమో.

అప్పట్లో కొన్ని వాయిద్యాలుండేవి. కొన్ని ముద్రికలమీద కొమ్ముల తో కనబడుతున్న పశుపతినాథుడు అప్పటి దేవత అయి ఉండవచ్చు. అలాగే శీర్షాసనం వేస్తున్న వ్యక్తి బొమ్మను బట్టి యోగాసనాల చరిత్ర ఆనాడే మొదలైనట్టుగా కనబడుతోంది.

ఇటీవలి పరిశోధనల తరవాత అప్పటి ధాన్యపు వంగడాలను చూస్తే వ్యవసాయం కూడా మెసపొటేమియాతో సంబంధం లేకుండా స్వతంత్ర రీతుల్లో మొదలై ఉండవచ్చని భావిస్తున్నారు. పొలం సాగు ఎంతో విజయవంతంగా జరగడం వల్లనే వ్యవసాయేతర కార్యకలాపాలకు పరిమితమైన, ఇతర వృత్తుల్లో నైపుణ్యం సంపాదించిన నగర కార్మికులు వేలకొద్దీ పాల్గొని నాగరికతకు దోహదపడగలిగారని ఊహించవచ్చు. వరదలొచ్చినప్పుడల్లా సారవంతమైన ఒండ్రుమట్టి మేటలు పడడంతో పొలాలను ఏపుగా పెంచడం జరిగి ఉండవచ్చు కాని కేవలం దానిపై ఆధారపడి పెద్ద ఎత్తున వ్యవసాయం చెయ్యడం వీలవదని పరిశీలకుల అభిప్రాయం. పెద్ద పెద్ద ఆనకట్టలవంటివి నిర్మించకుండా అప్పటివారు చిన్నస్థాయిలోనే అక్కడక్కడా తమకు అవరమైన పద్ధతుల్లో నీటిని మళ్ళించి పొలం సాగుచేసి ఉండవచ్చు. ఈ విధంగా ఎక్కువమంది పాల్గొనకుండానే తరతరాలుగా పోగుపడగలిగిన ధాన్యసంపదను వారు సృష్టించుకుని ఉంటారు. మెసపొటోమియా నాగరికతకు అనుకూలించిన భౌగోళిక పరిస్థితులే సింధునాగరికతకు కూడా తోడ్పడి ఉంటాయి. వీ

కార్మిక విద్యా పథకాలు సరిగా రూపొందిస్తే కార్మికులు మరింత బాధ్యతతో, శ్రద్ధతో పని చేయగలుగుతారని అంటున్నారు **ప్రొ. వెలమల సిమ్మన్న**

కార్మిక విద్యకు అవరోధాలు

భారతదేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం 1931లో 'రాయల్ కమిషన్ ఆఫ్ లేబర్' కార్మికవిద్య అవసరాన్ని గుర్తించింది. అయితే దీనికోసం క్రమబద్ధమైన ప్రయత్నాలు మొట్టమొదటిసారిగా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రెండో పంచవర్ష ప్రణాళికలో రూపొందించడమైంది. ఈ ప్రణాళికలో పేర్కొన్న విధంగా కార్మికులు ఉత్పాదన ప్రక్రియలోనూ, దేశ అభివృద్ధిలోనూ పాలుపంచుకోవడానికి దోహదం చేసేందుకు "కార్మికవిద్య" తోడ్పడుతుంది. దీనికోసం రెండో పంచవర్ష ప్రణాళిక ఒక మార్గదర్శక పథకాన్ని రూపొందించి సౌమ్యమైన ఆర్థిక సదుపాయాన్ని పొందుపరిచింది.

1957లో కార్మిక విద్యా పథకం తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీని నియమించింది. ఆ నిపుణుల కమిటీ సిఫారసుల్ని 15వ, భారతకార్మిక సదస్సు పరిశీలించి, ఆమోదించింది. 1958లో సంస్థల చట్టం కింద "కేంద్రీయ కార్మిక విద్యామండలి" నెలకొల్పడం జరిగింది.

కార్మిక విద్యా పథకాన్ని మూడు స్థాయిల్లో అమలు జరపాలి. మొదటి స్థాయిలో కేంద్రీయ కార్మిక విద్యామండలిలో పనిచేసే విద్యాధికారులకు జాతీయ స్థాయిలో శిక్షణ ఇచ్చి ప్రాంతీయ కేంద్రాల్లో శిక్షణ కోసం పంపడం. రెండో స్థాయిలో ఈ విద్యాధికారులు, కొద్దిమంది ప్రత్యేకంగా, పద్ధతి ప్రకారం వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రాంతీయ కేంద్రాల్లోనూ, ఉపప్రాంతీయ కేంద్రాల్లోనూ కార్మిక ఉపాధ్యాయిక శిక్షణ ఇవ్వడం జరగాలి.

మూడోస్థాయిలో అలాశిక్షణ పొందిన కార్మిక ఉపాధ్యాయులు, వారు పనిచేసే ప్రదేశాలు, కర్మాగారాలకు వెళ్ళి సామాన్య కార్మికులకు శిక్షణ ఇవ్వాలి.

పైన చెప్పిన ఈ మూడు స్థాయిల్లోనేకాక "కేంద్రీయ కార్మిక విద్యామండలి" మరికొన్ని కార్యక్రమాల్ని కూడా చేపడుతుంది. ఒకటి నుంచి 15 రోజులకు పరిమితమయ్యే తక్కువ వ్యవధి కోర్సులు నడపడం, వయోజనులకు వృత్తిపర విద్యా తరగతులు నడపడం, కార్మిక సంఘాల, కార్మిక విద్యాకార్యక్రమాల ప్రోత్సాహానికి డబ్బు ఇవ్వడం.

కేంద్రీయ కార్మిక విద్యా మండలి నియమనిబంధనల ప్రకారం స్వయం పరిపాలన సంఘం ముఖ్య విధులు, విధానాల్ని రూపొందించడం, నిధులు కేటాయించడం, కార్యక్రమాల్ని పర్యవేక్షించడం, కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టే కార్మికవిద్యా కార్యక్రమాలు చేపట్టి నిర్వహించే బాధ్యత ఈ మండలిదే. ఇందులో 20 మందికి మించకుండా సభ్యులుంటారు.

కేంద్రప్రభుత్వం నామనిర్దేశం చేసిన అధ్యక్షుడు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు, యాజమాన్యం, కార్మికసంఘ మండలుల ప్రతినిధులు, భారత వయోజన విద్యా ప్రతినిధి విశ్వవిద్యాలయాల ప్రతినిధి, కేంద్రీయ కార్మిక విద్యామండలి ఏడాదికి ఒకసారి సమావేశమయి, వార్షిక నివేదికను ఖాతాల్ని గడచిన ఏడాది రానున్న ఏడాది ఆదాయ వ్యయాల పట్టికల్ని పరిశీలించి ఆమోదిస్తుంది. "కార్మిక విద్యా పథకానికి ముఖ్య లక్ష్యాలున్నాయి. ఈ లక్ష్యాలు కార్మిక విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. ప్రబోధాత్మకమైన సభ్యులు, శిక్షణ పొందిన కార్మిక సంఘ అధికారులు, నాయకుల నిర్వాహణలోని సభ్యులకు, కార్మిక సంఘాల్లో మంచి విశ్వాసం కలిగించి, కార్మిక సంఘాల్ని పటిష్టంగానూ, ప్రభావవంతంగానూ చేయడం జరగాలి. సామాన్య కార్మికుల నుంచి కార్మికనాయకులు ఆవిర్భవించేందుకు తోడ్పడి, కార్మికసంఘాల నిర్వహణలో ప్రజాస్వామ్య ప్రక్రియకు దోహదం చేయాలి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో సంఘటిత కార్మికులు, తమ ఆర్థిక సామాజిక బాధ్యతల్ని నెరవేరుస్తూ, ప్రముఖమైన పాత్ర మహించేలా చేయడం, కార్మికుల్లో తమ ఆర్థిక, పరిసర సమస్యలపై సదవగాహన పెంపొందించి, హక్కులు, బాధ్యతలు గుర్తించి, కార్మికసంఘ సభ్యులుగా, అధికారులుగా, పౌరులుగా, ఫలప్రదంగా తమకర్తవ్యాల్ని నిర్వహించేందుకు తోడ్పడడం జరగాలి. కేంద్రీయ కార్మిక విద్యామండలికి ముఖ్యమైన అనేక విధులువున్నాయి. అన్నిస్థాయిల్లోనూ కార్మిక విద్యా పథకాల్ని నిర్వహించడం. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ప్రాంతీయ మండలులు నెలకొల్పడం, విద్యాధికారులకు, కార్మిక ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం, శిక్షణ సామాగ్రి, పుస్తకాలు, పత్రాలు మొదలైనవి తయారు చేయడం, కార్మికుల్ని సంఘటితం చేసేందుకు అవసరమైన చైతన్యం కలిగించడం జరగాలి.

యజమానులు ప్రత్యేకంగా కార్మిక విద్యాపథకాలు రూపొందించి, చేపట్టి సక్రమంగా నిర్వహించేందుకు ప్రోత్సహిస్తూ అవసరమైన సహాయం అందించాలి.

కార్మిక విద్యా పథకాల్ని సమీక్షిస్తూ, వాటిలోని లోపాలు సవరిస్తూ, మరింత పటిష్ఠం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

పారిశ్రామిక కార్మికులందరికీ శిక్షణ ఇవ్వాలి. కేంద్రీయ కార్మిక విద్యామండలి నివేదికలు చూస్తే కార్మిక విద్యాపథకాలు కార్మికుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వగుణ గణాలు చట్ట బద్ధమైన హక్కుల గూర్చి సదవగాహన పెంపొందిచాయనడంలో సందేహంలేదు. "నేషనల్ కమిషన్ ఆఫ్ లేబర్" కార్మికవిద్యపై నియమించిన అధ్యయనబృందం కార్మిక సంఘ ప్రతినిధులు ఈ పథకం కార్మికుల్లో చైతన్యం తీసుకుని రావడానికి పునాది వేసిందని అభిప్రాయం వెలిబుచ్చారు. "నేషనల్ కమిషన్ ఆఫ్ లేబర్" తమ అంతిమ నివేదికలో కార్మిక విద్యాపథకాలు ఇలా ఉండాలని పేర్కొంది.

కార్మికవిద్య ద్వారా కార్మికులు క్రమశిక్షణ, బాధ్యతలకు నిబద్ధులై ఉండేలా చేయాలి. వారు పరిశ్రమకు తాము పనిచేసే కర్మాగారానికి సంబంధించిన ప్రాథమిక ఆర్థిక, సాంకేతిక విషయాల్ని అర్థం చేసుకొని విజ్ఞతతో ఆసక్తి చూపించేందుకు దోహదం చేయాలి. కార్మికులు తమహక్కుల్ని బాధ్యతల్ని తెలుసుకొనేలా చేయాలి. కార్మిక సంఘాలు వాటి కర్తవ్యాన్ని అర్థంచేసుకొని, నాయకత్వగుణాలు వికాసానికి తోడ్పడి శ్రద్ధగానూ, విశ్వాసంతోనూ, ప్రతిభతోనూ, కార్మిక సంఘ కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయాలి. కార్మికులు న్యాయబద్ధమైన ఆరోగ్యం, శుభ్రత కలిగిన జీవితం గడిపేందుకు తోడ్పడాలి. కార్మికుల్ని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలి.

కార్మిక విద్యా పథకాలు ఆశించినంత ఫలితాలు ఇవ్వలేక పోతున్నాయి. దీనికి అనేక కారణాలు ఉన్నాయి.

1. లక్ష్యాల్లో మార్పు, వాటితో సరితూగేందుకు అవసరమైన మార్పులు ఆచరణలోనూ, నిర్వహణలోనూ వచ్చినట్లు లేదు.
2. యాజమాన్య శిక్షణకు ప్రభుత్వ విద్యాశాఖ, తదితర శాఖలు ఇచ్చిన ప్రాముఖ్యం, కార్మిక విద్యకు, కార్మిక తదితర శాఖలు ఇచ్చినట్లు కనబడదు. నిధుల కేటాయింపులోనూ, కార్మిక విద్యాధికారుల వేతన స్థితిగతులు, మౌలికసదుపాల్లోనూ తేడాలు చాలా ప్రస్ఫుటంగా కన్పిస్తాయి.
3. శిక్షణ పథకాల నిర్ణయ విధానాలు కేంద్ర కార్మిక విద్యామండలిలో కేంద్రీకృతమై వున్నందువల్ల ప్రాంతీయ కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగుల్లో నైతిక నిర్లిప్తత చోటు చేసుకొని ప్రేరణ తగ్గిపోయిందని కొన్ని పరిశీలనలవల్ల వెల్లడయింది.
4. ఆర్థికపరమైన తదితర వనరులకొరత, పరిమితులవల్ల కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించడం దుర్లభమవుతున్నదని చెప్పవచ్చు.
5. కార్మికసంఘాల్లో శిక్షణ, శ్రద్ధ, నైపుణ్యంగల కేడర్ అభివృద్ధి చెందనందువల్ల లక్ష్యాలు మంచివైనా యత్నాల్లో దక్షత లోపిస్తోందనిపిస్తోంది.
6. పాఠ్య ప్రణాళికల రూపకల్పనలోనూ, రచనలోనూ కార్మికులపాత్ర తక్కువగా ఉంటుంది. దీనికారణంగా శిక్షణ ఎంతవరకు ప్రయోజనకరంగా ఉంటుందో సందేహాస్పదం.
7. కార్మిక ఉపాధ్యాయుల ప్రాంతీయ కేంద్రాల్లో శిక్షణ ముగించిన తర్వాత, మూడు నాలుగు జట్లకార్మికులకు తమ వ్యవస్థలో శిక్షణ ఇస్తే తగిన ఫలితం వస్తుంది. అయితే ప్రస్తుతం ఈ పథకాలు అమలు జరుగుతున్న తీరు తెన్నులు పరిశీలిస్తే ఇంతకు ముందు చెప్పినట్టు ప్రణాళికాబద్ధంగా జరగడం కాదని వ్యక్తమవుతుంది.
8. కేంద్ర కార్మిక విద్యామండలి ప్రాంతీయ కేంద్రాల డైరెక్టర్లకూ, విద్యార్థులకూ, లక్ష్యాల్నిదృఢంగా నిర్ణయించి అవి ఎంతవరకూ సాధించారన్నది పర్యవేక్షిస్తుందితప్ప, ఈ శిక్షణా కార్యక్రమాల నాణ్యతను గుర్చి అంతగా పట్టించుకొన్నట్లు కన్పించదు.
9. కొన్ని సంస్థల్లో కార్మిక ఉపాధ్యాయులు కార్మికులకు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా, శిక్షణ నిమిత్తం సంసిద్ధులైన కార్మికులు తక్కువయిపోయారు. ఇందుకుగల అనేక కారణాల్లో యాజమాన్యం నిర్లిప్తత, కార్మిక సంఘాల మధ్యవైరం కారణం. ఈ సందర్భంలో గతంలో జరిగిన ప్రయత్నాలు మిగిల్చిన చేదు అనుభవాలు ముఖ్యంగా చెప్పవచ్చు.
10. కార్మిక విద్యా పథకాల అమల్లో విద్యావేత్తలు, విశ్వవిద్యాలయాలు తదితర విద్యాసంస్థలు తగినంతగా పాలుపంచుకోలేకపోతున్నాయి. సక్రమమైన రీతిలో ఈ పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలు వినియోగించనందువల్ల, కార్మిక విద్యా పథకాలు మరింత సమర్థంతంగా నిర్వహించబడే అవకాశాన్ని చాలావరకు జారవిడుచుకొన్నాయి.

పైన ఉదహరించిన లోపాల్ని సవరిస్తే–

"కార్మిక విద్యా పథకాలు" పటిష్ఠంగానూ, ప్రయోజనాత్మకంగానూ రూపొందిస్తే కార్మికుల్ని బాధ్యతగల పౌరులుగా, విధినిర్వాహణలో శ్రద్ధచూపే పనివారిగా తయారుచేస్తాయి. కార్మికులు క్రమక్రమంగా కార్మికసంఘాల నాయకత్వాన్ని చేపట్టి సమర్థవంతంగా నిర్వహించగలరు.

కార్మికుల స్థితిగతుల్ని మెరుగుపరుస్తూ పరిశ్రమల అభివృద్ధి, దేశ, సమాజ, ఆర్థిక వికాసానికి తోడ్పడగలరనడంలో సందేహంలేదు. వీ

అసహజ మరణాలు నమోదు చేద్దాం!

ఆగస్ట్ 2006 నుంచి వీక్షణంలో అసహజ మరణాల సూచి ప్రారంభించాం. మన చుట్టూ అసహజంగా చనిపోతున్న రైతులు, చేనేత కార్మికులు, వరకట్న మరణాలు, రకరకాల ప్రమాదాలలో చనిపోతున్నవారు, వైద్యం అందక, ప్రకృతి వైపరీత్యాలతో మరణిస్తున్నవారు, హత్యలు ఇలా అనేక సామాజిక రంగాలనుంచి మరణిస్తున్నవారి సంఖ్యను నమోదు చేయడమే ఈ శీర్షిక ఉద్దేశ్యం. ఏయే సామాజిక, రాజకీయార్థిక కారణాలతో చనిపోతున్నారో పరిశోధన చేయాల్సి ఉంది. ఇప్పటికే 15 జిల్లాల నుంచి మాకు ఈ సమాచారం అందుతోంది. ఇంకా **మెదక్, పశ్చిమ గోదావరి, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురం** జిల్లాల నుంచి అసహజంగా చనిపోతున్న వారి సమాచారం అందాల్సి ఉంది. మేము చేస్తున్న ఈ ప్రయత్నంలో మీరూ పాలుపంచుకోవచ్చు. దీనికి పారితోషికంగా వీక్షణం ప్రతిని పంపిస్తాం.

ఆసక్తి గలవారు వివరాలకై సంప్రదించండి : **వై. రామచంద్రం** (సర్క్యులేషన్ మేనేజర్) ఫోన్ నెం. 9949391028

– సంపాదకులు

విశ్వాస తీర్మానం - 'గెలిచిన' యుపిఎ

అణు ఒప్పందం విషయంలో ఏర్పడిన పరిణామాల దరిమిలా, యుపిఎ ప్రభుత్వం విశ్వాస పరీక్షను ఎదుర్కొంది. జూలై 22న జరిగిన విశ్వాస పరీక్షలో యుపిఎ గట్టెక్కింది. 541 సభ్యులున్న పార్లమెంట్‌లో 275 ఓట్లు ప్రభుత్వానికి అనుకూలంగా, 256 ఓట్లు ప్రతికూలంగా వచ్చాయి. పదిమంది సభ్యులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. లెఫ్ట్ కూటమి ప్రభుత్వానికి దూరంకాగా సమాజ్‌వాది పార్టీ, జెఎంఎం, ఇండిపెండెంట్ల అభ్యర్థులు, క్రాస్ ఓటర్ల (బిజెపి - 7, జెడియు - 2, బిజెడి - 2, అకాలీ - 1, టిడిపి - 1, జెడిఎస్ - 1, టిఆర్ఎస్ - 1) సభ్యుల సహాయంతో యు.పి.ఎ. నిలదొక్కుకుంది. ఎం.పి.లను డబ్బుతో కొనజూశారని ముగ్గురు బిజెపి ఎం.పి.లు పార్లమెంట్‌లో నోట్ల కట్టలను చూపిస్తూ పెద్ద గందరగోళం సృష్టించారు. ఒక్కొక్క ఎం.పి. ఓటుకు వంద కోట్ల దాకా ధర పలికినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి.

సోమ్‌నాథ్‌ను బహిష్కరించిన సిపిఎం

యుపిఎ ప్రభుత్వంపై విశ్వాస తీర్మాన పరీక్ష సమయాన స్పీకర్ సోమ్‌నాథ్ చటర్జీని (79) సిపిఎం ఆ పదవికి రాజీనామా చేయాలని సూచించింది. అందుకు సోమ్‌నాథ్ 'నేను స్పీకర్‌ను, పార్టీలకు అతీతుడిని' అని పార్టీ ఆదేశాలను ధిక్కరించారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి, పార్టీనుంచి బహిష్కరించినట్లు జూలై 23న సిపిఎం పార్టీ కార్యవర్గం ప్రకటించింది. స్పీకర్ స్థానంలో ఒకవ్యక్తిని పార్టీ బహిష్కరించడం దేశంలో ఇదే ప్రథమం. పార్టీకంటే ఎవరూ ఎక్కువకాదనీ, సభ్యులు అందరూ పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉండాలనీ, వీటిని ఎవరైనా ధిక్కరిస్తే పార్టీ తప్పకుండా చర్యలు తీసుకుంటుందనీ, సోమ్‌నాథ్‌ను మేం స్పీకర్‌గా చూడటంలేదనీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బిమన్‌బోస్ అన్నారు.

మండుతున్న న్యూస్‌ప్రింట్ ధరలు

భారతీయ వార్తా పత్రికల సంఘం (ఐ.ఎన్.ఎస్.) 'అసాధారణంగా పెరుగుతున్న న్యూస్ ప్రింట్ ధరల భారం నుంచి గట్టెక్కాలంటే వినియోగాన్ని తగ్గించడమొక్కటే మార్గమని' అభిప్రాయపడింది. వీలయినంత త్వరగా న్యూస్‌ప్రింట్ వినియోగాన్ని ఇరవై శాతం మేర తగ్గించాలని ఐ.ఎన్.ఎస్. అధ్యక్షుడు బహుబాలి షా పిలుపునిచ్చారు. ఐ.ఎన్.ఎస్. న్యూస్‌ప్రింట్ చైర్మన్‌తో, పబ్లిషర్లతో ఆయన జూలై 24న చర్చలు జరిపారు. న్యూస్ ప్రింట్ ధరల పెరుగుదల, ఎదురౌతున్న సవాళ్లు పరిష్కార మార్గాలపై విస్తృతంగా చర్చించారు. సరుకు రవాణా ఛార్జీల్లో పెరుగుదల వల్లే న్యూస్‌ప్రింట్ ధరలు ఆకాశాన్నంటాయని పేర్కొన్నారు. 'ఈ ఆరు నెలల్లో న్యూస్‌ప్రింట్ ధరలు యాభై శాతం మేర పెరిగాయని, కలిసికట్టుగా న్యూస్‌ప్రింట్ డిమాండ్‌ను తగ్గించాలని' షా పబ్లిషర్లకు సూచించారు.

బెంగళూర్, అహ్మదాబాద్, సూరత్...

కర్ణాటక రాజధాని బెంగళూర్ నగరంలో జూలై 25న ఏడు చోట్ల తొమ్మిది వరుసపేలుళ్లు జరిగాయి. ఈ పేలుళ్లో ఇద్దరు చనిపోగా పన్నెండుమంది గాయపడ్డారు. మధ్యాహ్నం 1.20 నుంచి 2.30 మధ్య ఈ పేలుళ్లు సంభవించాయి. అదే క్రమంలో జూలై 26న గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లో డెబ్బై నిమిషాల వ్యవధిలో పదుమూడు చోట్ల పదిహేడు పేలుళ్లు జరిగాయి. ఈ పేలుళ్లలో నలభై మంది చనిపోగా, రెండు వందలమందికి గాయాలయ్యాయి. ఈ రెండు రాష్ట్రాలు బి.జె.పి. పాలనలో ఉన్నవే కావడం గమనార్హం. జూలై 29న మహారాష్ట్రలోని సూరత్ నగరంలో ప్రముఖ వాణిజ్య కేంద్రంలో ఆ చుట్టుపక్కల 18చోట్ల నుంచి బాంబులను పోలీసులు వెలికితీసారు. ఈ పేలుళ్ల మా పనే అంటూ ఇండియన్ ముజాహిదీన్ అనే సంస్థ గుజరాత్ పోలీసులకు హెచ్చరికలు పంపింది. ఆగస్ట్ 3న కోలకతాలోని చిట్‌పూర్ ప్రాంతంలో బాంబుపేలుడులో నలుగురు మృతి చెందగా, తొమ్మిదిమంది గాయపడ్డారు. చెత్త ఏరుతుండగా దొరికిన బాంబులవల్ల ఈ ప్రమాదం సంభవించింది.

దైవ దర్శనమా? మృత్యు మార్గమా?

హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలోని నయినాదేవి ఆలయ ఇరుకు దారిలో ఆగస్ట్ 3న ప్రమాదం చోటుచేసుకుంది. రోజూ పదివేల మంది దాకా భక్తులు దర్శనం చేసుకునే ఈ ఆలయానికి శ్రావణ నవరాత్రులు, ఆదివారం కావడంతో ఇరవై ఐదువేల మంది దాకా భక్తులు తరలివచ్చారు. కొండ చరియలు విరిగిపడుతున్నాయన్న వదంతి వ్యాపించడంతో తొక్కిసలాట జరిగింది. ఇరుకు మార్గానికున్న రయిలింగ్ పడిపోయింది. ఈ తొక్కిసలాటలో 146 మంది చనిపోయారు. వీరిలో 30 మంది చిన్నపిల్లలు, 38 మంది మహిళలు ఉన్నారు. 40 మందికి పైగా గాయపడ్డారు.


కాల్పులతో రక్తమోడిన కాశ్మీర్

శ్రీ అమర్‌నాథ్ ఆలయబోర్డ్‌కు వందఎకరాల భూమి కేటాయించడం, తదనంతర పరిణామాలలో ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడం చివరకు జమ్మూ-కాశ్మీర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడంతో దారి తీసిన పరిస్థితులు మరింత జటిలమయ్యాయి. ఇదే తరుణంలో కాశ్మీర్ స్వేచ్ఛా ఆకాంక్షలతో వివిధ సంఘాలు, పౌరుల నిరసన ప్రదర్శనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితులు మతపరమైన ఘర్షణలకు దారితీసాయి. ఆగస్ట్ 12న జమ్మూ-కాశ్మీర్‌లో పలుచోట్ల పోలీసులు జరిపిన కాల్పుల్లో పదిహేను మంది చనిపోయారు. అంతకు ముందు చోటుచేసుకున్న పరిణామాలు కాల్పులకు దారితీయగా ఐదుగురు చనిపోయారు. అక్టోబర్‌లో జమ్మూ-కాశ్మీర్ శాసనసభకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే ఎన్నికలకు ముందే వివిధ వర్గాల వారితో చర్చించాల్సిన అవసరం ఉందని కేంద్రానికి సూచనలు అందుతున్నాయి.

సిపిఎం ఆస్తులపై విచారణ

సి.పి.ఎం. పార్టీ, ఆ పార్టీ నేతల ఆస్తులపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరిస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.జి. బాలకృష్ణన్ ఆగస్ట్ 4న ప్రకటించారు. గత 30 ఏళ్లలో ఆ పార్టీ ఆస్తులు రు. 200 కోట్లకు చేరాయని ఆరోపిస్తూ, వీటిపై సి.బి.ఐ. దర్యాప్తు జరపాలని ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలయింది. అలాగే పదిమంది సి.పి.ఎం. ఎం.పి.లు వారు వెల్లడించిన ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని పిటిషనర్ ఆరోపించారు. వీ

నేపాల్ ప్రధానిగా మావోయిస్ట్ ప్రచండ



రాజరికాన్ని తోసిపుచ్చి ప్రజాస్వామ్య దేశంగా మారిన నేపాల్ ప్రధానమంత్రిగా మావోయిస్ట్‌పార్టీ ఛైర్మన్ ప్రచండ ఎన్నికయ్యారు. దీనికి ముందు నేపాల్ అధ్యక్ష పదవికి మాధేశీలకు చెందిన రామ్‌చరణ్ యాదవ్ ఎన్నికయ్యారు. అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో మావోయిస్ట్‌లు మెజారిటీతో గెలిచినా వారికి, కమ్యూనిస్ట్ పార్టీకి, నేపాలీ కాంగ్రెస్‌కీ, మాధేశీ జనాధికార ఫోరంకి మధ్య ఒప్పందం కుదరక దాదాపు రెండు నెలలపాటు ప్రభుత్వ ఏర్పాటు జరగలేదు. ఇప్పుడు మావోయిస్ట్‌పార్టీ కమ్యూనిస్ట్‌పార్టీ మాధేశీల పార్టీతో ఒడంబడిక కుదుర్చుకుని ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. నేపాలీ కాంగ్రెస్ మాత్రం మిగతా పార్టీలతో చేయి కలపలేదు.

పాకిస్థాన్ అధ్యక్షుడు ముషారఫ్ పదవీ విరమణ

పాకిస్థాన్‌లో అధికారంలో ఉన్న పిపిపి – పిఎంఎల్ (ఎన్) కూటమి



పదవీచ్యుతులైన న్యాయమూర్తులని తిరిగి పదవులలోకి తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా అధ్యక్షుడు ముషారఫ్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టే ఆలోచనలు చేసింది. దీని కోసం ముందుగా పాకిస్థాన్‌లోని ముఖ్యమైన ప్రాంతాల్లోని అసెంబ్లీలలో అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఓడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని గ్రహించిన ముషారఫ్ పదవీ విరమణ చేశారు. ఇకపై పిఎంఎల్ (ఎన్) న్యాయమూర్తులని తిరిగి పదవులలో నియమించడంపై దృష్టి సారిస్తుంది. అధ్యక్ష పదవిలో ఎవరు ఉంటారనే విషయంపై పోటీ మొదలైంది.

రష్యా, జార్జియాల మధ్య యుద్ధం

జార్జియాలో భాగమై రష్యన్లు అధికంగా ఉండే దక్షిణ ఒస్సెటియా గురించి జార్జియా, రష్యాల మధ్య ఒకవారం రోజులపాటు సాగిన యుద్ధంలో జార్జియా సైన్యం పూర్తిగా ఓడిపోయి, దక్షిణ ఒస్సెటియా రష్యన్ల అధీనంలోకి వచ్చింది. 1994 నుండి ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పడానికి రష్యన్ సైనికులు ఉంటున్నారు. అయితే, జార్జియా అంతర్జాతీయ ఒప్పందాలను కాలరాసి దక్షిణ ఒస్సెటియా ప్రజలపై, రష్యన్ సైనికులపై దాడి చేసింది. దీనితో రెండు వేలకు పైగా మరణించారు. చాలామంది నిర్వాసితులయ్యారు. చివరికి ఫ్రెంచ్ అధ్యక్షుడు సార్కోజీ రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చిన తరువాత ఇరువైపులా సైన్యాలు తమ, తమ స్థానాలకి నిష్క్రమించాయి.

ఇరాక్, పాకిస్థాన్‌లో పెరుగుతున్న మత హింస

ఇరాక్‌లోని సున్నీ – షియాల మధ్య కొంతకాలంగా తగ్గుముఖం పట్టిన హింస మళ్లీ చెలరేగింది. తీర్థయాత్ర కోసం కర్బాలా వెళ్తున్న షియాల మీద సున్ని గ్రూపులు చేసిన దాడులలో కొన్ని వందలమంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఆత్మహుతి దాడుల్లో స్త్రీలు మొదటిసారిగా పాలుపంచుకోవడం గమనార్హం. అటు పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రాంతంలో పాకిస్థాన్ సైన్యానికి, తాలిబన్లకు జరుగుతున్న ఘర్షణలు, యుద్ధం చివరికి సున్ని, షియాల మధ్య హింసకి దారితీస్తున్నాయి. 'ఉగ్రవాదం మీద యుద్ధం' పేరుతో ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ సరిహద్దులలోని తెగల మీద జరుగుతున్న దాడి చివరికి ఇటువంటి పరిణామాలకి దారి తీస్తోంది.

టర్కీలో లౌకికవాదం గెలుపు

టర్కీలోని అధికార పార్టీ టర్కీని ఇస్లాం వైపు నడిపించడానికి చేస్తున్న ప్రయత్నాలను టర్కీ సుప్రీం కోర్టు తీవ్రంగా అడ్డుకుంది. తల మీద హిజాబ్ వేసుకునే హక్కు స్త్రీలకి కల్పిస్తూ ప్రభుత్వం చేసిన శాసనం మీద స్పందించిన కోర్టు, ప్రభుత్వాన్ని చాలా తీవ్రంగా విమర్శించి, టర్కీ ఎట్టి పరిస్థితులలోనూ లౌకికవాదాన్ని వీడి, ఇస్లాం రాష్ట్రంగా మారదని స్పష్టం చేసింది. టర్కీ సైన్యం కూడా చాలా గట్టిగా లౌకిక వాదానికి తమ మద్దతును తెలిపింది.

ఇజ్రాయిల్ శాంతి ప్రతిపాదనని తోసిపుచ్చిన పాలస్తీనా

ఇజ్రాయిల్ పాలిస్తీనాకి చేసిన కొత్త శాంతి ప్రతిపాదనల ప్రకారం వెస్ట్ బ్యాంక్‌లోని ఆక్రమించిన భూభాగంలో 7.3 శాతం ఇజ్రాయిల్ ఉంచుకునేటట్టు, దానికి ప్రతిగా నెగేవ్ ఎడారిలో భూమిని పాలస్తీనాకు ఇచ్చేటట్టు ఉంది. ఈ ప్రతిపాదనల ప్రకారం పాలస్తీనాకు సైన్యాన్ని ఉంచుకునే హక్కు కూడా లేదు. అంతేకాక తూర్పు జెరూసలేంని పాలస్తీనాకు ఇవ్వడం గురించి ఏమీలేదు. ఈ ప్రతిపాదనలని పాలస్తీనా అధ్యక్షుడు మొహమూద్ అబ్బాస్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు.

బ్రిటన్‌లో మానవహక్కుల ఉల్లంఘన

ఇటీవల విడుదలైన యు.ఎన్. రిపోర్ట్ ప్రకారం బ్రిటన్‌లో మాట్లాడే హక్కు ఇతర మావన హక్కులకి విఘాతం కలిగించే చట్టాలు చాలా చేయబడ్డాయి. టెర్రరిజం పేరుమీద, ప్రభుత్వ సమాచారాన్ని రక్షించే పేరుమీద చేయబడ్డ చట్టాల మూలాన మానవ హక్కులకి తీవ్ర నష్టం కలుగుతోందనీ, అట్లాగే నిందితులని నేరారోపణ చేయకుండా రిమాండ్‌లో ఉంచే గడువు పెంచడం గురించి యు.ఎన్. రిపోర్ట్ ఆందోళన వ్యక్తం చేసింది. వీ

వీక్షణంకు ఉత్తరాలు రాసేవాళ్లు, మనీఆర్డర్లు పంపేవాళ్లు తమ వివరాలను పూర్తిగా రాయవలసిందిగా కోరుతున్నాం. అలాంటి వివరాలు లేనందువల్ల ఉత్తరాలకు జవాబు రాయడంగాని, మనీ ఆర్డర్ల మేరకు పుస్తకాలు, పత్రికలు పంపడం గాని వీలు కావడం లేదు.

అసహజ మరణాల సూచి

సంకలనం : **రాంకి, వై. రామచంద్రం**

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(21 జూలై 2008 నుండి 20 ఆగస్ట్ వరకు వరకు)

జిల్లా	ఆత్మహత్యలు			హత్యలు				గుర్తు తెలియని	ఆకలి	ప్రమాదాలు			చికిత్స అందక, అనారోగ్యం	పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
	వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు	ఫ్యాక్షన్	కులం	మతం	తగాదాలు			పనిచేసే స్థలంలో	రహదారి	ఇతరాలు		ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)
ఆదిలాబాద్	5	1	23	–	–	–	3	8	–	1	8	28	33	–	–	–	4	4
హైదరాబాద్	–	–	22	–	–	–	27	7	–	–	56	44	–	–	–	–	18	–
కరీంనగర్	6	4	34	–	–	–	4	3	4	6	15	12	32	–	–	–	2	–
ఖమ్మం	1	–	26	–	–	–	3	3	–	14	34	19	85	–	–	–	–	8
మహబూబ్‌నగర్	–																	
రంగారెడ్డి	3	–	20	–	–	–	6	9		3	21	26	13	–	–	–	4	–
నిజామాబాద్	6	–	20	–	–	–	4	–	–	8	16	13	–	–	–	–	–	–
నల్గొండ	3	1	22	–	–	–	2	18	–	–	33	58	7	–	–	–	–	7
వరంగల్	8	–	33	–	–	–	7	2	–	8	30	42	78	–	–	–	9	20
తూర్పు గోదావరి	–	–	25	–	–	–	8	6	–	–	31	40	8	–	–	–	2	3
గుంటూరు	8	–	6	1	–	–	25	9	–	4	26	23	2	–	1	–	–	25
కృష్ణా	3	–	12	–	2	–	15	2	–	2	25	9	4	–	–	–	–	6
విజయనగరం	–	–	11	2	–	–	6	–	–	–	24	31	6	–	–	–	–	–
విశాఖపట్నం	–	–	8	–	–	–	1	5	–	5	19	4	5	–	–	–	–	3
చిత్తూరు	10	–	–	–	–	–	3	3		11	44	4	11	–	–	–	–	3
ప్రకాశం	–	–	9	–	–	–	4	8	–	3	23	6	1	–	–	–	–	7
*ఇతర జిల్లాలు	–																	
మొత్తం	**53**	**6**	**271**	**3**	**2**	**–**	**91**	**83**	**4**	**65**	**405**	**359**	**285**	**–**	**1**	**–**	**39**	**86**

ఈ శీర్షికకు సహకారం అందిస్తున్న వారు :
హైదరాబాద్ – డి. విజయభాస్కర్; రంగారెడ్డి – వి. శంకరయ్య; మహబూబ్‌నగర్ – ఏసురత్నం; ఆదిలాబాద్ – శ్రీమన్నారాయణ మూర్తి; వరంగల్ – కె. శ్యాంరావు; కరీంనగర్ – ఎల్. సంతోష్; మెదక్ – పి. రాజు; నల్గొండ – డి. మహేష్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; ఖమ్మం – సి.ఎచ్. కృష్ణ; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – కె.వి. రమణ; కృష్ణా – బి. రమేష్‌బాబు; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహీమ్ సాహెబ్; గుంటూరు – బి. అంజమ్మ ; ప్రకాశం – ఎన్. రవికుమార్; చిత్తూరు – పలమనేరు బాలాజి; * ఇతర జిల్లాల సమాచారం

వీక్షణంలో వ్యాపార ప్రకటనల గురించి....

వీక్షణం ప్రతి సంచికలోనూ అచ్చవుతున్న ప్రభుత్వ ప్రకటన గురించి, ఇటీవల అచ్చయిన కొన్ని వ్యాపార ప్రకటనల గురించి కొందరు గౌరవనీయ మిత్రులు తమ అభ్యంతరాలను, సందేహాలను వ్యక్తం చేశారు. అటువంటి అభ్యంతరాలే, సందేహాలే మరికొందరు మిత్రులలో, అభిమానులలో కూడ ఉండవచ్చు.

ఏ పత్రిక అయినా అచ్చువేసే వ్యాపార ప్రకటనలతో ఆ పత్రికకు ఏకీభావం ఉండాలనే నియమమేమీలేదు. ఆ వ్యాపార ప్రకటనలను స్వీకరించడమాలేదా అన్నది పత్రిక ఇష్టాయిష్టాలకు సంబంధించిన అంశం కాదు. పత్రికారంగ ఆర్థిక స్థితికి సంబంధించిన విషయం. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం అమ్మకాల ఆదాయం మీద మాత్రమే ఆధారపడి ఏ పత్రికా నిలదొక్కుకోవడం సాధ్యం కాదు. అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం పత్రిక ఉత్పత్తి వ్యయంలో కొంతభాగాన్ని మాత్రమే పూరించగలుగుతుంది. అందువల్లనే పత్రికారంగం సాధారణంగా వ్యాపార ప్రకటనల ద్వారా ఆ లోటును పూరించుకోవడం మాత్రమే గాక లాభాలు కూడ చేసుకుంటుంది. వీక్షణం వంటి ప్రత్యామ్నాయ పత్రికలకు లాభాల సంగతి అలా ఉంచి, కనీస మనుగడకు అవసరమైన ఆర్థిక వనరులయినా కావాలి. అందుకోసం కొన్ని వ్యాపార ప్రకటనలనయినా అంగీకరించకతప్పదు.

ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలన్నిటినీ పెద్ద పత్రికలు, పాలకపార్టీ ఆశ్రిత పత్రికలు, పైరవీకారులు కబ్జా చేస్తున్నారని, ఆ ప్రకటనల విధానంలో పారదర్శకత ఉండాలని, చిన్న పత్రికలకు ప్రాధాన్యత ఉండాలని ఎంతో కాలంగా ఆందోళన జరిగిన ఫలితంగా కొన్ని సంవత్సరాల కింద ప్రభుత్వ ప్రకటనలలో చిన్న పత్రికలకు తప్పనిసరిగా కొంతభాగం కేటాయించాలనే నిబంధనలు అమలులోకి వచ్చాయి. అందువల్ల వీక్షణంకు వస్తున్న ప్రభుత్వ ప్రకటన చిన్న పత్రికల హక్కుగా వస్తున్నదే తప్ప వీక్షణంలో అచ్చయ్యే రచనల మీద ప్రభావం వేయగలిగినది కాదు. నిజానికి ఆ ప్రకటన వల్ల వీక్షణం తన వైఖరిలో ఎప్పుడయినా ఏ మెతకవైఖరినయినా ప్రదర్శించి ఉంటే ఎవరయినా దాన్ని ఎత్తిచూపి సరిదిద్దవచ్చు.

పత్రిక నిర్వహణ కొరకు వ్యాపార ప్రకటనలను స్వీకరించకతప్పని దుస్థితిలో అవి రచనల మీద ప్రభావం వేయకుండా జాగ్రత్త పడడం తప్ప ప్రస్తుతానికి మరేమీ చేయగల అవకాశం లేదు. వ్యాపార ప్రకటనలను ఎంతమాత్రం స్వీకరించబోమని ప్రకటించాలంటే పత్రికకు విస్తారమైన ప్రజాసంఘీభావం ఉండాలి. అది ఆర్థిక స్వావలంబనగా మారగలిగిన స్థితి ఉండాలి. లేకపోతే కొంతకాలం విరాళాలమీదనో, అప్పుల మీదనో నడిపి ఆ తర్వాత పత్రికను ఆపివేయడం మినహా మరోమార్గం లేదు. ఈ అంశాలను పాఠకుల, అభిమానుల దృష్టికి తీసుకురావడం మా బాధ్యతగా భావిస్తున్నాం.

వివరాలకు సంప్రదించవలసిన చిరునామా


వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.

ఫాక్స్, ఫోన్ : 040-66843495, ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com

సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

RNI Regn.No.APTEL/2003/11482 Published 29/08/2008 **PRINTED BOOK**



జారీచేసినవారు: సమాచార, పౌర సంబంధాల శాఖ

R.O.No. 334/Sou/Advt.I/2008-09

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao